సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 359
బుధవారం 20-3-2024



'నా అక్కలూ..చెల్లెళ్లూ...తమ్ముళ్ల కళ్లలో వెలుగులు చూసినపుడే నా నిజమైన పుట్టిన రోజు'



తొలి మహిళా షిప్ సర్వేయర్
భిన్న ఉపాధిని ఎంచుకున్న కేరళవాసి పూజా ఛతోత్‌పై కథనం - ఫ్యామిలీలో



22 వేల దిగువకు నిఫ్టీ..
నెల కనిష్టానికి సూచీలు.. ప్రపంచ ప్రతికూలతల ప్రభావం - బిజినెస్‌లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



వాళ్లే అంతర్ధానమౌతారు
'శక్తి'ని అంతం చేయాలని బయల్దేరిన వాళ్లే నాశనమవుతారంటూ విపక్షాలపై ప్రధాని మోదీ విమర్శలు చేశారు.
వివరాలు 6లో ▸



ముగియనున్న 'హెచ్‌-1బీ' గడువు
2025 సంవత్సరానికిగాను హెచ్‌-1బీ వీసాల ప్రాథమిక నమోదు గడువు 22వ తేదీతో ముగియనుందని యూఎస్‌సీఐఎస్‌ తెలిపింది.
వివరాలు 6లో ▸



కేంద్ర మంత్రి పశుపతి రాజీనామా
బీజేపీ తమను విస్మరించిందంటూ రాష్ట్రీయ లోక్‌జన్‌శక్తి నేత పశుపతి కుమార్‌ పరాస్‌ కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేశారు.
వివరాలు 6లో ▸



కాలుష్య రాజధానిగా ఢిల్లీ
ప్రపంచ వాయు నాణ్యతా నివేదికలో ఢిల్లీ మరోసారి 'అత్యంత కాలుష్యమైన దేశ రాజధాని'గా అప్రతిష్ట మూటగట్టుకుంది.
వివరాలు 6లో ▸

సామాన్యులకే సై

వైఎస్సార్‌సీపీలో నిబద్ధత గల కార్యకర్తలకూ ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లు

రాష్ట్ర చరిత్రలో సరికొత్త ఒరవడికి సీఎం వైఎస్‌ జగన్‌ శ్రీకారం

- జన బలం, ప్రజా సేవే గీటురాయిగా అభ్యర్థుల ఎంపిక
- కార్యకర్తలు, జెడ్పీటీసీ సభ్యులు, మేయర్, జెడ్పీ చైర్‌పర్సన్‌లకు అందలం
- నెల్లూరులో కోటీశ్వరుడు నారాయణపై ఖలీల్‌ అహ్మద్‌ పోటీ
- మైలవరంలో రైతు బిడ్డకు అవకాశం.. ఇక్కడ టీడీపీ టికెట్‌కు కోటీశ్వరులు దేవినేని ఉమా, వసంతకృష్ణ ప్రసాద్‌ల మధ్య బాబు వేలం పాట
- కోటీశ్వరుల బరి నరసాపురం లోక్‌సభ స్థానంలో న్యాయవాది ఉమాబాలకు అవకాశం
- మడకశిరలో ఉపాధి హామీ కూలీ.. శింగనమలలో టిప్పర్‌ డ్రైవర్‌
- సీఎం జగన్‌ సాహసోపేత నిర్ణయంపై దేశ వ్యాప్తంగా హర్షాతిరేకాలు

2లో



1. ఖలీల్‌ అహ్మద్‌ (నెల్లూరు, సాధారణ కార్యకర్త)
2. సర్నాల తిరుపతిరావు (మైలవరం, రైతు)
3. ఈర లక్కప్ప (మడకశిర, ఉపాధి హామీ కూలీ)
4. గూడూరి ఉమాబాల (నరసాపురం ఎంపీ అభ్యర్థి, న్యాయవాది)
5. ఎం.వీరాంజనేయులు (శింగనమల, టిప్పర్‌ డ్రైవర్‌)

ప్రజలతో మమేకమవుతూ 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర


ఇడుపులపాయ నుంచి ఉత్తరాంధ్ర వరకు విరామం లేకుండా సీఎం జగన్‌ బస్సు యాత్ర
27న ఇడుపులపాయ నుంచి ప్రారంభం.. తొలిరోజు ప్రొద్దుటూరులో బహిరంగ సభ
28న నంద్యాల, 29న కర్నూలు లోక్‌సభ నియోజకవర్గాల్లో యాత్ర: సజ్జల
2లో

జనసేనతో 'బాబు' బంతాట

ఆ పార్టీకి కేటాయించిన 21 సీట్లలో అభ్యర్థుల ప్రకటనకూ చంద్రబాబు అడ్డు

బీజేపీకి కేటాయించిన 10 అసెంబ్లీ స్థానాలపై రాని తుది స్పష్టత
రెండు అసెంబ్లీ స్థానాలపై మూడు పార్టీల మధ్య కొనసాగుతున్న చర్చ
తనూ ప్రకటించక, జనసేననూ ప్రకటించనివ్వక బాబు రాజకీయం
చంద్రబాబు తీరుపై మూడు పార్టీల నేతలూ మండిపాటు

సాక్షి, అమరావతి: కోతల మీద కోతలు పెట్టి పొత్తుల్లో జనసేనకు అరకొర సీట్లను మాత్రమే కేటాయించిన చంద్రబాబు, ఇప్పుడు ఆ సీట్లలోనూ పవన్‌కళ్యాణ్‌ స్వేచ్ఛగా అభ్యర్థులను ఎంపిక చేసే అవకాశం ఇవ్వకుండా అడుగడుగునా అడ్డు తగులుతున్నారని ఆ పార్టీలో చర్చ సాగుతోంది. ఇప్పటి దాకా జనసేన అధికారికంగా ప్రకటించిన ఏడు అసెంబ్లీ స్థానాలు కాకుండా, మిగిలిన స్థానాలకు అభ్యర్థుల ఎంపిక పూర్తయినా.. చంద్రబాబు వాటికి గ్రీన్‌ సిగ్నల్‌ ఇవ్వని కారణంగానే పవన్‌కళ్యాణ్‌ ఆయా స్థానాల్లో అభ్యర్థుల పేర్లను ప్రకటించడం లేదని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. పొత్తులో మూడు పార్టీల సీట్ల సర్దుబాటు ప్రక్రియలో రాష్ట్రంలోని మొత్తం 175 అసెంబ్లీ స్థానాల్లో మొదట 24 సీట్లు మాత్రమే జనసేనకు ఇచ్చిన చంద్రబాబు.. తర్వాత అందులోనూ మూడు తగ్గించి 21 సీట్లకు కుదించిన విషయం తెలిసిందే.



బీజేపీకి పది అసెంబ్లీ, ఆరు లోక్‌సభ స్థానాలు కేటాయించారు. మిగిలిన 144 అసెంబ్లీ, 17 లోక్‌సభ స్థానాల్లో టీడీపీ పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సీట్లన్నింటిలో అభ్యర్థులందరినీ

మిగతా 3వ పేజీలో ▶

ఫ్యాక్ట్‌చెక్

'పచ్చ' ముసుగుతో 'కోడ్‌'కూతలా?

- గతేడాది ఇచ్చిన పుస్తకాలపై ఇప్పుడు ఏడుపా!
- కోడ్‌ తర్వాత ఇచ్చే వాటిపైనే ఆంక్షలుంటాయని తెలియదా?
- బాబు మెప్పు కోసం ఎన్నికల సంఘంపైనే నిందలు
- నిబంధనలను పక్కాగా పాటించే ప్రభుత్వం ఇది
- ఏమైతేనేం 47 లక్షలమంది పిల్లలకు పుస్తకాలిచ్చినట్టు రామోజీ అంగీకారం
- ఇకపై విద్యార్థులకు చిక్కీలపై రేపర్‌ తొలగించి పంపిణీ

- వివరాలు 5లో

చంద్రబాబుదే షాక్.. సబ్సిడీలకు బ్రేక్

- ఐదేళ్ల వ్యవధిలో ప్రభుత్వ సబ్సిడీలు పూర్తిగా ఇవ్వని చంద్రబాబు
- జగన్‌ ప్రభుత్వ హయాంలోనే సబ్సిడీ బకాయిల చెల్లింపు
- ఇతర రాష్ట్రాల్లోనూ గృహ వినియోగదారులకు స్థిర చార్జీలు
- సబ్సిడీ కేటగిరీల వినియోగదారులకు అన్ని చార్జీలను చెల్లిస్తున్న ప్రభుత్వం
- వాస్తవాలు దాచి 'ఈనాడు' అడ్డగోలు అబద్ధాలతో బురద కథనం


- వివరాలు 11లో

టీడీపీ తప్పులు పోలీసులపైకి!

- చిలకలూరిపేట సభ నిర్వహణలో విఫలమైన టీడీపీ
- ప్రధాని రావడానికి ముందు నుంచే పని చేయని మైకులు
- అయినా పట్టించుకోని నిర్వాహకులు.. జనం పల్చగా ఉండటంతో వెనక ఉన్న వారిని ముందుకు రప్పించిన నేతలు
- దీంతో వీఐపీ గ్యాలరీల్లోకి చొచ్చుకువచ్చిన జనం
- టీడీపీ నేతలే వాహనాలు అడ్డుపెట్టి ట్రాఫిక్‌ జామ్‌ చేసి వీడియోల రికార్డింగ్‌

- వివరాలు 10లో

కట్టుదిట్టంగా 'కోడ్‌'



- ప్రభుత్వ వెబ్‌సైట్లలో, కార్యాలయాల్లో ప్రజాప్రతినిధుల ఫొటోలు.. ఆడియో, వీడియోలు తొలగించండి
- ప్రభుత్వ ఆస్తులపై రాజకీయపరమైన ప్రకటనలు తీసేయాలి
- పార్టీల ప్రచారాల్లో ప్రభుత్వోద్యోగులు పాల్గొంటే చర్యలు
- ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనల మీద వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించండి
- పెన్షన్ల పంపిణీ, ఉపాధి పనులకు అభ్యంతరం లేదు
- అధికారులకు సీఎస్‌ జవహర్‌రెడ్డి ఆదేశం

- వివరాలు 3లో

కోడ్‌కు విరుద్ధమైన రాజకీయ ప్రచారాన్ని అనుమతించొద్దు



- ప్రభుత్వ వాణిజ్య స్థలాల్లో రాజకీయ హోర్డింగులను ఏర్పాటు చేయకూడదు.. రోడ్డు పక్కనున్న హోర్డింగ్‌లను అన్ని రాజకీయ పార్టీలకు సమానంగా కేటాయించాలి
- ప్రైవేటు భవనాలపై వాల్‌ పెయింట్స్‌కు అనుమతిలేదు, ఉన్నవాటిని చెరిపించేయాలి
- సి విజిల్‌ ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలి
- జిల్లాల ఎన్నికల అధికారులకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మీనా ఆదేశం

3లో

హైదరాబాద్‌లోని చంద్రబాబు నివాసం ముందు ఆందోళన చేస్తున్న టీడీపీ నేత కోట్ల సుజాత మద్దతుదారులు



రగులుతున్న పొత్తు కుంపట్లు

టీడీపీ, జనసేన, బీజేపీ ఎవరికి వారే

మిత్రధర్మాన్ని పాటించని మూడు పార్టీలు.. ఇంకా ఖరారు కాని చిత్తూరు ఎంపీ అభ్యర్థి
కుప్పంలో చేతులెత్తేసిన తెలుగుదేశం కేడర్

స్వ'ప్రజాగళం'తో కూటమి ఉక్కిరిబిక్కిరి
రగులుతున్న టికెట్ల రగడ.. ఉండవల్లిలోని బాబు నివాసం వద్ద కదిరి శ్రేణుల నిరసన
హైదరాబాద్‌లోని ఇంటి వద్ద ఆలూరు కార్యకర్తల హల్‌చల్‌

10లో



ఐదుగురు పోలీసులకు ముఖ్యమంత్రి శౌర్య పతకాలు

255 మందికి సేవా పతకాలు
ఉగాది సందర్భంగా ప్రకటించిన ప్రభుత్వం

రాష్ట్రంలో ఐదుగురు పోలీసు అధికారులకు ప్రభుత్వం ముఖ్యమంత్రి శౌర్య పతకాలను ప్రకటించింది. దాంతో పాటు ఉగాది పండుగను పురస్కరించుకుని రాష్ట్రంలోని పోలీస్, విపత్తుల స్పందన దళం విభాగాల అధికారులు, సిబ్బందికి 255 వివిధ సేవా పతకాలను ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2లో

ఇదం జగత్



కార్యాలయాన్నే అద్దెకిచ్చాం! పార్టీని కాదంటే వినవేం!!



కవాతు చేస్తున్న భారత్, అమెరికా దళాలు

భారత్, యూఎస్‌ రక్షణ బంధం మరింత బలోపేతం

పసిఫిక్‌ సముద్ర జలాల్లో స్వేచ్ఛాయుత వాణిజ్యమే లక్ష్యం
చొరబాట్లు, సముద్రపు దొంగల ఆట కట్టించేందుకు వ్యూహాత్మకంగా..
ఇండియన్‌ యూఎస్‌ అంబాసిడర్‌ ఎరిక్‌ గార్సెట్టి.. విశాఖలో భారత్, యూఎస్‌ త్రివిధ దళాల ఆధ్వర్యంలో టైగర్‌ ట్రయాంఫ్‌ విన్యాసాలు

5లో

పంచ 'న్యాయ్‌'లతో ప్రజల ముందుకు



మంగళవారం ఢిల్లీలో జరిగిన సీడబ్ల్యూసీ భేటీలో సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే, రాహుల్‌ గాంధీ, కేసీ వేణుగోపాల్‌

- ఐదు 'న్యాయ్‌' గ్యారెంటీలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి
- సీడబ్ల్యూసీ భేటీలో కాంగ్రెస్‌ నేతల నిర్ణయం
- దేశం మార్పు కోరుతోంది: ఖర్గే
- మోదీ గ్యారంటీలకు 'ఇండియా షైనింగ్‌' గతేనంటూ విమర్శలు


6లో

ఆ లేఖ వల్ల మీకొచ్చిన నష్టమేంటి?

టీడీపీ ఏ విధంగా ప్రభావితం అవుతుంది
ఊహలు, ఆందోళనల ఆధారంగా పిటిషన్‌ ఎలా దాఖలు చేశారు
నారా లోకేశ్‌పై ప్రశ్నలు సంధించిన హైకోర్టు

సాక్షి, అమరావతి: విజిలెన్స్‌ అండ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ విభాగం బలోపేతానికి కొన్ని అధికారాలు కోరుతూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆ విభాగం ఇన్‌స్పెక్టర్‌ జనరల్‌ కొల్లి రఘురామిరెడ్డి రాసిన లేఖ వల్ల మీకొచ్చిన నష్టం ఏమిటని పిటిషనర్‌ నారా లోకేశ్‌ను హైకోర్టు మంగళవారం ప్రశ్నించింది. ఆ లేఖ వల్ల మీరు ప్రత్యక్షంగా ఎలా ప్రభావితం అవుతున్నారని.. టీడీపీ కూడా ఎలా ప్రభావితం అవుతుందని నిలదీసింది. ఆ లేఖకు ముందు గానీ, ఆ లేఖ తరువాత మిమ్మల్ని గానీ, మీ పార్టీ వాళ్లను గానీ లక్ష్యం చేసుకున్నారా? అని ప్రశ్నించింది. అలాంటి ఉదంతాలు ఉంటే చెప్పాలని స్పష్టం చేసింది. లక్ష్యంగా చేసుకున్నారనేందుకు

మిగతా 10వ పేజీలో ▶





ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

సమస్యలు తీరి సంతోషంగా జీవనం



మాది పేద కుటుంబం. అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం ఇందుకూరుపేటలో గతంలో కూలీ పనులు చేసుకుని జీవించేవాళ్లం. వచ్చిన అరకొర ఆదాయంతో కుటుంబ పోషణ కష్టంగా ఉండేది. వయసు రీత్యా కొంత అనారోగ్యంతో పనులకు వెళ్లలేకపోయాం. గత ప్రభుత్వం ఏ విధంగానూ మాకు సాయం అందించలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరువాత ప్రవేశపెట్టిన నవరత్నాలు పథకాలు కొండంత అండగా నిలిచాయి. వైఎస్సార్ పింఛన్ అందుతోంది. నా భార్యకు కాపు నేస్తం కింద ఏడాదికి రూ.15 వేలు వంతున అందింది. రైతు భరోసా ద్వారా ఇప్పటివరకు ఏటా రూ. 13,500లువంతున, టైలరింగ్ చేసే నా కోడలికి జగనన్న చేదోడు పథకం ద్వారా ఏడాదికి రూ. పదివేలు వంతున, వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రూ.50 వేలు జమయ్యాయి. నా మనవరాలికి అమ్మఒడి పథకం ద్వారా ఏడాదికి రూ. 15వేలు అందింది. జగనన్న ప్రభుత్వంలో మా పేద కుటుంబం కష్టాలు తీరాయి. మా కుటుంబమంతా జగనన్నకు రుణపడి ఉంటుంది.

– రావిపాటి చెల్లారావు, దేవీపట్నం
(కె.వెంకటేశ్వరరావు, విలేకరి, దేవీపట్నం)

కష్టాల నుంచి బయటపడ్డాం



మాది సామాన్య కుటుంబం. పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరులోని నంబర్–1 పాఠశాల సమీపంలో నివసిస్తున్నాం. నా భర్త 2014లో మృతి చెందిన తరువాత నేను టైలరింగ్ చేయడం మొదలుపెట్టాను. అయినా కుటుంబాన్ని పోషించుకోవడం కొంచెం కష్టంగా మారింది. జగనన్న అధికారంలోకి వచ్చాక మేం ఆర్థిక సమస్యల నుంచి బయటపడ్డాం. మా ఇంటికి వలంటీర్ వచ్చి నాతో పింఛనుకు దరఖాస్తు చేయించారు. పింఛన్ మంజూరైంది. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రుణమాఫీ మొత్తం రూ.54,400లు, వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ఏడాదికి రూ. 18,750లు వంతున అందింది. జగనన్న చేదోడు పథకం ద్వారా ఏడాదికి రూ. పదివేలు వంతున వచ్చింది. నా కుమారుడు ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్నాడు. నేను ప్రస్తుతం టైలరింగ్ చేసుకుంటూ జగనన్న పుణ్యంతో ఏటువంటి సమస్యలూ లేకుండా సంతోషంగా జీవిస్తున్నాం. జగనన్న అందిస్తున్న సాయానికి మా కుటుంబం రుణపడి ఉంటుంది.

– షేక్ మీరా బేగం, మొగల్తూరు
(వి.లక్ష్మీ గణేష్, విలేకరి, మొగల్తూరు)

అద్దె ఇంటి బాధ తప్పింది



మాది వ్యవసాయ కుటుంబం. నా భర్త కుటుంబరావుకు నేను తోడుగా ఉండి ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం మైసన్నగూడెంలో వ్యవసాయం చేసేవాళ్లం. అన్ని సీజన్లూ అనుకూలంగా ఉండేవి కాదు. అప్పుడప్పుడు పంట చేతికందకపోతే నష్టాలు చవిచూసేవాళ్లం. అప్పుడు అప్పులు చేయాల్సి వచ్చేది. మమ్మలను గత ప్రభుత్వం ఏమాత్రం ఆదుకోలేదు. కనీసం ఇల్లయినా మంజూరు చేయలేదు. ఇక సొంతిల్లు కలగానే మిగిలిపోతుందని భయపడ్డాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఆ కల తీరింది. మాకు ఇంటి స్థలమే గాకుండా ఇంటి నిర్మాణానికి రూ. 1.80లక్షలు ఆర్థిక సాయం అందించింది. ఇంటినిర్మాణం పూర్తికావచ్చింది. మా అబ్బాయి ఉన్నత చదువులు చదువుతున్నాడు. వాడికి జగనన్న విద్యా దీవెన ద్వారా రూ.90,500లు, వసతి దీవెన ద్వారా రూ.50 వేలు వచ్చింది. నాకు వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.13,909, వైఎస్సార్ సున్నా వడ్డీ ద్వారా రూ.6,255, వైఎస్సార్ రైతు భరోసా ద్వారా ఏడాదికి రూ. 13,500 వంతున వచ్చింది. ఇన్ని విధాలుగా ఆదుకున్న జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– వల్లూరి వాణి, మైసన్నగూడెం
(అచ్యుతరామ్, విలేకరి, జంగారెడ్డిగూడెం రూరల్)

సామాన్యులకే సై

వైఎస్సార్‌సీపీలో నిబద్ధత కలిగిన కార్యకర్తలకూ ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లు

జన బలమే గీటురాయిగా, ప్రజా సేవే ప్రామాణికంగా, నిబద్ధతే పరమావధిగా కింది స్థాయి కార్యకర్తలను అభ్యర్థులుగా ఎంపిక చేయడం ద్వారా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్ ప్రజాస్వామ్యానికి మరోసారి సరైన అర్థం చెప్పారు. రాజకీయాలను ఫక్తు వ్యాపారంగా మార్చేసి.. ఓటుకు నోటు అలవాటు చేసిన 40 ఇయర్స్ ఇండస్ట్రీ, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు యథావిధిగా పార్టీని నమ్ముకున్న వారిని కాదని, కోట్లు కుమ్మరించే బడాబాబులకే రకరకాల ఆఫర్లతో సీట్లు ఇస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు.

సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికల్లో శాసనసభ, లోక్‌సభ అభ్యర్థులుగా పార్టీలో కష్టపడి పని చేస్తున్న మామూలు కార్యకర్తలకు అసాధారణ అవకాశం కల్పించారు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ప్రజా సమస్యలపై సూక్ష్మ స్థాయిలో అవగాహన ఉండి.. వాటి పరిష్కారం కోసం కృషి చేస్తూ.. జనం మన్ననలు పొందుతున్న సామాన్యులకు పరిపాలనలో భాగస్వామ్యం కల్పించడం ద్వారా అన్ని వర్గాల ప్రజలకు మరింత మెరుగ్గా సేవలు అందించాలని నిర్ణయించారు. ఈ క్రమంలో సాధారణ కార్యకర్తలకు వెన్నుదన్నుగా నిలుస్తూ టిక్కెట్లు ఇచ్చి ఆర్థికంగా బలవంతులైన పెత్తందార్లపై పోటీకి దింపుతూ సీఎం జగన్ తీసుకున్న నిర్ణయాన్ని రాజకీయ పరిశీలకులు, సామాజిక వేత్తలు ప్రశంసిస్తున్నారు.

విద్యా వ్యాపారిపై కార్మికుడు పోటీ

నారాయణ విద్యా సంస్థల ద్వారా విద్యా వ్యాపారం చేస్తూ.. 2014–19 మధ్య రాజధాని భూ కుంభకోణం, ఇన్నర్ రింగ్ రోడ్డు స్కాం, పట్టణ పేదలకు పక్కా గృహాలు ఇచ్చే పేరుతో టిడ్కో ఇళ్ల కుంభకోణానికి పాల్పడిన మాజీ మంత్రి నారాయణ రూ.వేలాది కోట్లకు పడగలెత్తారు. రూ.900 కోట్లకుపైగా పార్టీ ఫండ్ ఇచ్చిన నారాయణను నెల్లూరు సిటీ నియోజకవర్గం నుంచి టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు బరిలోకి దించితే.. వైఎస్సార్‌సీపీలో సాధారణ కార్యకర్త ఖలీల్ అహ్మద్‌ను సీఎం జగన్ పోటీకి పెట్టారు. మైనార్టీ కుటుంబానికి చెందిన ఖలీల్ అహ్మద్ బంగారు అభరణాల తయారీ పని చేస్తూ.. వచ్చే కూలీ డబ్బులతో కుటుంబాన్ని పోషించుకుంటూనే పేదల సమస్యలపై పోరాటం చేశారు. అదే మొన్న నెల్లూరు నగర పాలక సంస్థకు జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున కార్పొరేటర్ టికెట్ ఇచ్చేందుకు దోహదపడింది. కార్పొరేటర్‌గా ఎన్నికైన ఖలీల్ అహ్మద్‌ను సీఎం జగన్.. నెల్లూరు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్‌గా చేశారు. సమస్యల పరిష్కారంలో డిప్యూటీ మేయర్‌గా ఖలీల్ అహ్మద్ పనితీరుపై అన్ని వర్గాల ప్రజలు ప్రశంసిస్తుండటంతో ఆయనకు నెల్లూరు సిటీ నియోజవర్గం నుంచి సీఎం జగన్ టికెట్ ఇచ్చారు.

మైలవరంలో రైతు బిడ్డ పోటీ

మైలవరంలో టీడీపీ అభ్యర్థిత్వం కోసం కోటీశ్వరులు మాజీ మంత్రి దేవినేని ఉమా, వసంత కృష్ణప్రసాద్‌ల మధ్య వేలం పాట నిర్వహిస్తున్న చంద్రబాబు.. ఎవరు ఎక్కువ పాడుకుంటే వారికి టికెట్ ఇచ్చేందుకు సిద్ధమైతే.. ఆ స్థానం నుంచి జనబలమే గీటురాయిగా బీసీ వర్గానికి చెందిన రైతు బిడ్డ సర్నాల తిరుపతి రావును వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా సీఎం జగన్ ఎంపిక చేశారు. మైలవరంలో తిరుపతి రావు ప్రజా సమస్యల పరిష్కారానికి చూపుతున్న చొరవను గమనించిన సీఎం జగన్.. మొన్నటి ఎన్నికల్లో జడ్పీటీసీ అభ్యర్థిగా ఎంపిక చేశారు. జెడ్పీటీసీ సభ్యుడిగా అత్యధిక మెజార్టీతో విజయం సాధించిన తిరుపతిరావు.. జనంతో మమేకవుతూ వారి సమస్యలు పరిష్కరిస్తున్నారు. ఇదే ఆయనను మైలవరం నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఎంపిక చేయానికి దారితీసింది.

నరసాపురం ఎంపీ స్థానంలో బీసీ మహిళకు అవకాశం

నరసాపురం లోక్‌సభ స్థానం నుంచి కోటీశ్వరులను రాజకీయ పార్టీలు బరిలోకి దించడం రివాజు. ఆ లోక్‌సభ స్థానం అభ్యర్థిగా గూడురి ఉమాబాలను సీఎం వైఎస్ జగన్ ప్రకటించగానే రాష్ట్రం యావత్తు ఆశ్చర్యపోయింది. బీసీ వర్గంలోని శెట్టి బలిజ సామాజిక వర్గానికి చెందిన కుటుంబం నుంచి వచ్చిన న్యాయవాది ఉమాబాల. వైఎస్సార్‌సీపీలో సాధారణ కార్యకర్తగా చేరిన ఆమె ప్రజా సమస్యల పరిష్కారంలో దూసుకుపోతూ అంచలంచెలుగా ఎదిగారు. జనబలమే గీటురాయిగా ఉమాబాలను నరసాపురం లోక్‌సభ అభ్యర్థిగా సీఎం జగన్ ఎంపిక చేశారు. ఆ స్థానం నుంచి బరిలోకి దించేందుకు వేల కోట్లకు పడగలెత్తిన కోటీశ్వరుల కోసం చంద్రబాబు వెంపర్లాడుతున్నారు.

చిలకలూరిపేటలో నిబద్ధతగల కార్యకర్త పోటీ

గుంటూరుకు చెందిన కావటి మనోహర్‌నాయుడు కాపు సామాజిక వర్గానికి చెందిన కుటుంబం నుంచి వచ్చారు. వైఎస్సార్‌సీపీలో సాధారణ కార్యకర్తగా ప్రజా సమస్యల పరిష్కారానికి రాజీ లేని పోరాటాలు చేస్తుండటాన్ని పసిగట్టిన సీఎం జగన్.. మున్సిపల్ ఎన్నికల్లో గుంటూరు కార్పొరేషన్‌లో కార్పొరేటర్ టికెట్ ఇచ్చారు. అత్యధిక మెజార్టీతో కార్పొరేటర్‌గా ఎన్నికైన మనోహర్ నాయుడు నిబద్ధత, అంకిత భావం చూసి ఆయన్ను గుంటూరు మేయర్‌గా చేశారు. మేయర్‌గా రాణిస్తూ అన్ని వర్గాల ప్రజల నుంచి ప్రశంసలు అందుకుంటుండటంతో చిలకలూరిపేట నియోజకవర్గం అభ్యర్థిగా అవకాశమిచ్చారు. ఈ స్థానం నుంచి 2014–19 మధ్య మంత్రిగా పనిచేసి, అక్రమార్జన ద్వారా వందల కోట్లు కాజేసిన పత్తిపాటి పుల్లారావును టీడీపీ అభ్యర్థిగా టీడీపీ బరిలోకి దించడం గమనార్హం.

ఉపాధి కూలీ.. టిప్పర్ డ్రైవర్‌లకు అవకాశం

■ శ్రీసత్యసాయి జిల్లా గుడిబండ మండలం ఫళారం గ్రామానికి చెందిన ఈర లక్కప్ప బీఏ వరకు చదువుకున్నారు. ఎస్సీ వర్గానికి చెందిన ఇతను అవివాహితుడు. ప్రభుత్వం ఇచ్చిన రెండు గదుల ఇంట్లో తన తల్లితో కలిసి నివసిస్తున్నారు. ఉపాధి హామీ పథకం కింద పనులు చేస్తూ వచ్చే కూలీతో తన తల్లి కడుపు నింపుతున్న ఈర లక్కప్ప.. మండల కేంద్రం గుడిబండకు వివిధ సమస్యలపై వచ్చే ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల వద్ద అర్జీలు రాసి ఇస్తూ.. వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీలో 2015లో చేరిన ఇతని సేవా భావాన్ని గమనించిన సీఎం వైఎస్ జగన్.. మడకశిర నియోజకవర్గం అభ్యర్థిగా ఎంపిక చేశారు. ఉపాధి హామీ కూలీని అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దించుతూ సీఎం వైఎస్ జగన్ తీసుకున్న సాహసోపేత నిర్ణయంపై దేశ వ్యాప్తంగా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

■ అనంతపురం జిల్లా శింగనమల మండలం బండమీదపల్లికి చెందిన మన్నెపాకుల వీరాంజనేయులు ఎస్సీ కుటుంబానికి చెందిన వారు. ఏంఏ వరకు చదువుకున్న ఇతను టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ సాధారణ కార్యకర్త ఈయన కరోనా సమయంలో ప్రజలకు సహాయం చేయడంలో చూపిన నిబద్ధతను గుర్తించిన సీఎం వైఎస్ జగన్.. శింగనమల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఎంపిక చేశారు.

స్థానిక సంస్థల నుంచి చట్టసభలకు..



■ కర్నూలు జిల్లా చిప్పగిరి మండలంలో వైఎస్సార్‌సీపీ సాధారణ కార్యకర్త అయిన బుసినే విరూపాక్షి బీసీ వర్గంలో బోయ సామాజిక వర్గానికి చెందిన రైతు బిడ్డ. నిబద్ధత, నిజాయితీ, సేవా భావాన్ని గమనించి మొన్నటి జెడ్పీటీసీ ఎన్నికల్లో ఆ మండలం నుంచి అభ్యర్థిగా విరూపాక్షిని సీఎం జగన్ బరిలోకి దించారు. అత్యధిక మెజార్టీతో జెడ్పీటీసీగా ఎన్నికైన ఆయన ప్రజా సమస్యల పరిష్కారంలో చూపుతున్న చొరవను గమనించి.. ఆలూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఎంపిక చేశారు.



■ శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురానికి చెందిన పిరియా విజయ రైతు కుటుంబానికి చెందిన మహిళ. బీఏ చదువుకున్న ఆమె వైఎస్సార్‌సీపీలో సాధారణ కార్యకర్తగా రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆమె చూపుతున్న చిత్తశుద్ధిని గమనించిన సీఎం జగన్.. స్థానిక సంస్థల ఎన్నికల్లో జెడ్పీటీసీ టికెట్ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో విజయం సాధించడంతో శ్రీకాకుళం జడ్పీ చైర్‌పర్సన్‌గా చేశారు. ఆ పదవిలో రాణిస్తున్న విజయను ఇప్పుడు ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఎంపిక చేశారు.




■ ప్రకాశం జిల్లాలో వైఎస్సార్‌సీపీ సాధారణ కార్యకర్త అయిన దద్దాల నారాయణ యాదవ్‌కు మొన్న జరిగిన జెడ్పీటీసీ ఎన్నికల్లో సీఎం జగన్ అవకాశం కల్పించారు. జెడ్పీటీసీ సభ్యునిగా ఎన్నికైన నారాయణ యాదవ్ ప్రజా సేవలో చూపుతున్న అంకిత భావాన్ని గమనించి.. కనిగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఎంపిక చేశారు. ఈ నియోజకవర్గంలో కోట్లకు పడగలెత్తిన ముక్కు ఉగ్రనరసింహారెడ్డిని చంద్రబాబు బరిలోకి దించడం గమనార్హం.



■ కర్నూలు నగరానికి చెందిన బీవై రామయ్య బీసీ వర్గంలో బోయ సామాజిక వర్గానికి చెందిన రైతు బిడ్డ. వైఎస్సార్‌సీపీలో సాధారణ కార్యకర్త స్థాయి నుంచి అంచలంచెలుగా ఎదిగారు. ప్రజా సమస్యల పరిష్కారంలో బీవై రామయ్యకు ఉన్న చిత్తశుద్ధిని పసిగట్టిన సీఎం వైఎస్ జగన్.. మొన్న కర్నూలు నగర పాలక సంస్థకు జరిగిన ఎన్నికల్లో కార్పొరేటర్‌గా టికెట్ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో గెలిచిన బీవై రామయ్యను కర్నూలు నగరానికి మేయర్‌గా చేశారు. మేయర్‌గా రాణిస్తూ అన్ని వర్గాల ప్రశంసలు అందుకుంటుండటంతో కర్నూలు లోక్‌సభ అభ్యర్థిగా ఎంపిక చేశారు.



■ అరకు వ్యాలీ నియోజకవర్గానికి చెందిన రేగం మత్స్యలింగం ఉపాధ్యాయుడు. ప్రజా సేవలో ఆయనకున్న అంకిత భావాన్ని గమనించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్.. మొన్నటి జెడ్పీటీసీ ఎన్నికల్లో హుకుంపేట మండలం నుంచి బరిలోకి దించారు. ఆ ఎన్నికల్లో విజయం సాధించి.. ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవచూపుతుండటంతో అరకు వ్యాలీ నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఎంపిక చేశారు.



■ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గానికి చెందిన విప్పర్తి వేణుగోపాల్ ఎస్సీ కుటుంబానికి చెందిన వారు. వైఎస్సార్‌సీపీ సాధారణ కార్యకర్త అయిన ఇతను మొన్నటి జడ్పీ ఎన్నికల్లో జెడ్పీటీసీ సభ్యునిగా ఎన్నికయ్యారు. ఆ పదవిలో మంచి పనితీరు కనబరుస్తున్న వేణుగోపాల్‌ను పి.గన్నవరం నియోజకవర్గం నుంచి పార్టీ అభ్యర్థిగా సీఎం జగన్ అవకాశం కల్పించారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన కాంగ్రెస్ నాయకులు

- సీఎం జగన్ సమక్షంలో చేరిన మద్దిరెడ్డి జగన్, రావూరు లక్ష్మీనారాయణశాస్త్రి
- నెల్లూరుకు చెందిన మలిరెడ్డి కోటారెడ్డి కూడా..



సీఎం జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన మలిరెడ్డి కోటారెడ్డి. చిత్రంలో ఎంపీ ఆదాల



మద్దిరెడ్డి, రావూరులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం జగన్

సాక్షి, అమరావతి: ఏపీసీసీ జనరల్ సెక్రటరీ మద్దిరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, ఏపీసీసీ సెక్రటరీ రావూరు లక్ష్మీనారాయణ శాస్త్రి వైఎస్సార్‌సీపీలో చేరారు. మంగళవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి వైఎస్సార్‌సీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. మద్దిరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి బాపట్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా పనిచేశారు. లక్ష్మీనారాయణశాస్త్రి గుంటూరు జిల్లాలోని కాంగ్రెస్ పార్టీలో వివిధ హోదాల్లో పనిచేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముస్తఫా, గుంటూరు తూర్పు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి షేక్ నూరి ఫాతిమా తదితరులు పాల్గొన్నారు. అలాగే నెల్లూరుకు చెందిన నాయకుడు మలిరెడ్డి కోటారెడ్డి మంగళవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. నెల్లూరు రూరల్, అర్బన్‌తో పాటు జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో పట్టున్న నాయకుడిగా కోటారెడ్డికి గుర్తింపు ఉంది. ఈ కార్యక్రమంలో నెల్లూరు రూరల్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

దూరప్రాంతాలకు కొత్తగా వెయ్యి బస్సులు

ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు



డిపోను పరిశీలిస్తున్న ఎండీ ద్వారకా తిరుమలరావు

గన్నవరం: ప్రయాణికులకు మెరుగైన సేవలందించడంతో పాటు సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు తెలిపారు. కృష్ణాజిల్లా గన్నవరం ఆర్టీసీ బస్టాండ్, డిపోను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రయాణికులు, విద్యార్థులతో మాట్లాడి ఆర్టీసీ సర్వీస్‌ల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం డిపోను పరిశీలించిన ఎండీ, బస్సుల కండీషన్‌పై గ్యారేజ్ సిబ్బంది నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెగ్యులర్ సర్వీస్‌ల ఆదాయంతోపాటు, కమర్షియల్ ఆదాయం పెంచే దిశగా కార్యాచరణ చేపట్టినట్లు తెలిపారు గతంలో 15 ఏళ్లకు ఆర్టీసీ స్థలాలు లీజుకు ఇచ్చినప్పటికీ సరైన స్పందన రాలేదని, ఈ విషయంలో కొన్ని మార్పులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సంస్థ కొత్తగా కొనుగోలు చేసిన వెయ్యి డీజిల్ బస్సులు వస్తుండటం వల్ల దూర ప్రాంత సర్వీస్‌లు పెరిగే అవకాశం ఉందన్నారు. పాత ఎక్స్‌ప్రెస్ బస్సులను పల్లె వెలుగు బస్సులుగా మార్పులు చేసి గ్రామీణ సర్వీస్‌లకు ఉపయోగిస్తామని చెప్పారు. అద్దె బస్సులను కూడా బ్రాండ్ న్యూ కింద కొత్తగా తీసుకున్నామని వివరించారు. ఇటీవల మహాశివరాత్రి, సంక్రాంతి, శబరిమలకు నడిపిన సర్వీస్‌ల వల్ల ఆర్టీసీ ఆదాయం పెరిగిందన్నారు. భక్తుల సౌకర్యార్థం దేవాలయాల సందర్శన ప్రత్యేక సర్వీస్‌లను కూడా పెంచామని చెప్పారు. ఆర్టీసీలో పని చేస్తున్న సిబ్బంది సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యతను ఇస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులకు ప్రతినెల 1వ తేదీనే జీతాలు పడుతున్నాయని, పీఎఫ్ ట్రస్ట్‌ను కూడా బలోపేతం చేసినట్లు పేర్కొన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన తర్వాత సంస్థ అప్పులు కూడా చాలావరకు తీర్చివేసినట్లు తెలిపారు. గన్నవరం బస్టాండ్ ఆవరణలో ఖాళీగా ఉన్న స్థలాలను లీజుకు ఇచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. డిపో మేనేజర్ పి. శివాజీ నేతృత్వంలో సిబ్బంది ఎండీకి ఘన స్వాగతం పలికారు.

ప్రజలతో మమేకమవుతూ సీఎం జగన్
'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర

- బస్సు యాత్ర ద్వారా కార్యకర్తలను ఎన్నికల సంగ్రామానికి సన్నద్ధం చేస్తాం
- ఇడుపులపాయ నుంచి ఉత్తరాంధ్రవరకు విరామం లేకుండా బస్సు యాత్ర
- నిత్యం వివిధ వర్గాల ప్రజలతో ముఖాముఖి.. సాయంత్రం భారీ బహిరంగ సభ
- 27న ఇడుపులపాయ నుంచి ప్రారంభం.. తొలిరోజు ప్రొద్దుటూరులో భారీ బహిరంగ సభ
- 28న నంద్యాల, 29న కర్నూలు లోక్‌సభ నియోజకవర్గాల్లో యాత్ర
- ప్రజా సంకల్ప పాదయాత్ర తరహాలోనే బస్సు యాత్ర • మా బ్రాండ్ సీఎం జగనే
- నోటిఫికేషన్ తరువాత సీఎం జగన్ మలివిడత ప్రచారం
- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి వెల్లడి



మాట్లాడుతున్న సజ్జల. చిత్రంలో తలశిల రఘురాం, పేర్ని నాని, లేళ్ల అప్పిరెడ్డి

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, రాష్ట్ర సీఎం జగన్ నిత్యం వివిధ వర్గాల ప్రజలతో మమేకమవుతూ, కార్యకర్తలను ఎన్నికల సంగ్రామానికి సన్నద్ధులను చేస్తూ 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర సాగుతుందని పార్టీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. సీఎం జగన్ చేపట్టే 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర ఈ నెల 27వ తేదీన వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయలో ప్రారంభమై ఉత్తరాంధ్ర వరకు కొనసాగుతుందని తెలిపారు. 27న ఇడుపుల పాయలోని దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఘాట్ వద్ద సీఎం జగన్ నివాళులర్పిస్తారని, అనంతరం బస్సు యాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు. యాత్రలో ప్రతి రోజూ ఉదయం వివిధ వర్గాల ప్రజలతో ముఖాముఖి (ఇంటరాక్షన్), సాయంత్రం భారీ బహిరంగ సభ కామన్‌గా ఉంటాయని తెలిపారు. ఆయన మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో జరిగే తొలి 3 రోజుల బస్సు యాత్ర షెడ్యూల్‌ను విడుదల చేశారు. తర్వాత జరగబోయే యాత్ర వివరాలు త్వరలో వెల్లడిస్తామని చెప్పారు. సిద్ధం సభలు జరిగిన నాలుగు నియోజకవర్గాలు పోను మిగిలిన నియోజకవర్గాలన్నింటిలో బస్సు యాత్ర జరుగుతుందన్నారు. ప్రజా సంకల్ప పాదయాత్ర తరహాలోనే బస్సు యాత్ర కూడా జరుగుతుందని తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే (సుమారు ఏప్రిల్ 18) వరకు సీఎం విరామం లేకుండా పూర్తిగా యాత్రలోనే ఉంటారని, పండుగలు, సెలవుల్లోనూ యాత్ర కొనసాగుతుందని చెప్పారు. నోటిఫికేషన్ వచ్చిన తరువాత సీఎం జగన్ మలివిడత ఎన్నికల ప్రచారం చేస్తారన్నారు. ఎంత మంది కూటమి కట్టినా తమ బ్రాండ్ సీఎం జగనే అని చెప్పారు. అన్ని రకాల శక్తులు, ప్రత్యర్థులు ఏకమై వస్తున్నారని, వారందరినీ తాము ఒంటరిగానే ఎదుర్కొంటున్నామని తెలిపారు.

కార్యకర్తల్లో చైతన్యం నింపే కార్యక్రమమిది

'మేమంతా సిద్ధం' అంటూ కార్యకర్తలందరినీ ఎన్నికలకు సమాయత్తం చేసేందుకు, వారిలో చైతన్యం నింపేందుకు ఈ బస్సు యాత్ర చేస్తున్నారని తెలిపారు. ప్రతి జిల్లా మేమంతా సిద్ధం అని డిక్లేర్ చేసేలా గతంలో ఎన్నడూ జరగని విధంగా చాలా పెద్ద ఎత్తున మహా సభలు జరుగుతాయన్నారు. పార్టీ పెట్టినప్పటి నుంచీ సీఎం జగన్ అట్టడుగు వర్గాల వైపు నిలబడ్డారని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఐదేళ్లు వారి కోసమే తపన పడ్డారని తెలిపారు. యాత్రలో రోజూ ఉదయం వివిధ వర్గాలతో జరిగే ముఖాముఖిలో ప్రభుత్వం ప్రజలకు మరింతగా సేవ చేసేందుకు అవసరమైన సలహాలు, సూచనలు కూడా తీసుకుంటారని చెప్పారు. మధ్యాహ్నం తర్వాత పార్టీ వారిని కలుస్తారన్నారు. సాయంత్రం మహా సభ జరుగుతుందని తెలిపారు. వీలైనంత వరకూ ఒక లోక్‌సభ నియోజకవర్గంలో 2 అసెంబ్లీ సెగ్మెంట్లలో సభలు పెట్టాలని భావిస్తున్నట్లు చెప్పారు.

సీఎం జగన్ 'మేమంతా సిద్ధం' తొలి 3 రోజుల యాత్ర ఇలా..

27వ తేదీ (తొలి రోజు యాత్ర): ఉదయం ఇడుపులపాయలో మహానేత వైఎస్సార్ ఘాట్ వద్ద వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాళులు. అనంతరం యాత్రకు శ్రీకారం.
సాయంత్రం ప్రొద్దుటూరులో తొలి 'మేమంతా సిద్ధం' భారీ బహిరంగ సభ.

28వ తేదీ (రెండో రోజు): ఉదయం నంద్యాల లేదా ఆళ్లగడ్డలో వివిధ వర్గాల ప్రజలతో ముఖాముఖి.
సాయంత్రం నంద్యాలలో భారీ బహిరంగ సభ.

29వ తేదీ (మూడో రోజు): కర్నూలు పార్లమెంటు నియోజకవర్గంలోకి ప్రవేశిస్తారు. పలు రంగాల ప్రముఖులతో ముఖాముఖి. సాయంత్రం ఎమ్మిగనూరులో భారీ బహిరంగ సభ.

సిద్ధం ప్రతిధ్వనికి కొనసాగింపుగా సీఎం జగన్ బస్సు యాత్ర...

వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర నుంచి అనంతపురం వరకూ నిర్వహించిన 4 సిద్ధం సభలు జరిగిన తీరు నభూతో నభవిష్యతి అని, అక్కడికి వచ్చిన లక్షలాది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు సీఎం జగన్‌కి నీరాజనాలు పట్టారని తెలిపారు. చెప్పిన మాట మీద నిలబడి, విశ్వసనీయతకు మారు పేరుగా ఐదేళ్ల పాలనలో ప్రజలకు 20 ఏళ్ల పాటు జరగనంత అభివృద్ధి, సంక్షేమాన్ని అందించారన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99% అమలు చేసి మేనిఫెస్టోలకే కొత్త అర్థం ఇచ్చి, ఒక రాజకీయ పార్టీ, ఒక నాయకుడు ఇలా ఉండాలి అనే మార్గదర్శకత్వం ఇచ్చారని తెలిపారు. ఇప్పుడు సిద్ధం ప్రతిధ్వనికి కొనసాగింపుగా 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర చేపడుతున్నారన్నారు. సిద్ధం సభలతో జాతీయ స్థాయిలో కూడా అందరి దృష్టి ఏపీ వైపు పడిందన్నారు. దానికి కొనసాగింపుగా క్షేత్ర స్థాయిలో 'మేము సిద్ధం, మా బూత్ సిద్ధం' అని బూత్ స్థాయిలో కూడా చైతన్యవంతులయ్యారన్నారు. మాజీ మంత్రి పేర్ని నాని, సీఎం ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, శాసన మండలిలో విప్ లేళ్ల అప్పిరెడ్డి పాల్గొన్నారు.

ఐదుగురు పోలీసులకు ముఖ్యమంత్రి శౌర్య పతకాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఐదుగురు పోలీసు అధికారులకు ప్రభుత్వం ముఖ్యమంత్రి శౌర్య పతకాలను ప్రకటించింది. దాంతోపాటు ఉగాది పండుగను పురస్కరించుకుని రాష్ట్రంలోని పోలీస్, విపత్తుల స్పందన దళం విభాగాల అధికారులు, సిబ్బందికి 255 వివిధ సేవా పతకాలను ప్రకటిస్తూ ప్రభుత్వం ఈ నెల 15న ఉత్తర్వులు జారీ చేసింది.

ముఖ్యమంత్రి శౌర్య పతకాలు: కె.వాసు (సీఐ, మేడికొండూరు, గుంటూరు జిల్లా), బి.మధుసూదనరావు (ఎస్ఐ, ఎస్ఐబీ, ఇంటెలిజెన్స్ బ్యూరో), కె. వెంకట రమణ(రెవెన్యూ ఇన్స్‌పెక్టర్, ఎస్ఐబీ, ఇంటెలిజెన్స్ బ్యూరో), కె.సంపత్ రావు (ఆర్ఎస్ఐ, ఎస్ఐబీ, ఇంటెలిజెన్స్ బ్యూరో), బి.త్రిమూర్తులు (కానిస్టేబుల్, ఎస్ఐబీ, ఇంటెలిజెన్స్ బ్యూరో), బి.భాస్కర రావు (కానిస్టేబుల్, ఎస్ఐబీ, ఇంటెలిజెన్స్ బ్యూరో).

పోలీసు శాఖలో: ఉత్తమ సేవా పతకాలు 35మందికి, కఠిన సేవా పతకాలు 30మందికి, సేవా పతకాలు 161మందికి

విపత్తుల స్పందన విభాగంలో: ఉత్తమ సేవా పతకాలు నలుగురికి, సేవా పతకాలు 25మందికి.

అసభ్య పోస్టులపై చర్యలు తీసుకోండి

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు

సాక్షి,అమరావతి: ఎన్నికల నియమ నిబంధనలు ఉల్లంఘించి ఈనాడు పత్రికలో రామోజీరావు అర్థంపర్థం లేని విధంగా సీఎం జగన్‌నుద్దేశించి కథనాలు ప్రచురిస్తున్నారని, తక్షణమే అతనిపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడు పూనూరు గౌతమ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ ఎల్లో మీడియాలో రాతలపై రాష్ట్ర ఎన్నికల అధికారికి మంగళవారం ఆయన ఫిర్యాదు చేశారు. జనసేన నేత నాగబాబు కూడా భ్రష్టాచార్స్ పేరుతో సీఎం, మంత్రులు, మాజీ మంత్రులపై సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెడుతున్నారని, అసభ్యకరమైన చిత్రాలు క్రియేట్ చేసి పోస్టు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాక్షసుడని అర్థం వచ్చేలా ఎలా పడితే అలా వర్ణిస్తూ పోస్టులు పెడుతున్నారని చెప్పారు. తక్షణమే వీరిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి ఎ.నారాయణమూర్తి పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌కు ఉద్యోగుల ధన్యవాదాలు

సాక్షి, అమరావతి: అర్హులైన కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించిన సీఎం వైఎస్ జగన్‌కు ఏపీ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లంకా మణికాంత్, ప్రధాన కార్యదర్శి లింగాల కరుణాకర్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. గొల్లపూడిలోని ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ విభాగం డైరెక్టర్ డాక్టర్ కె.పద్మావతిని సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసినట్టు వెల్లడించారు. క్రమబద్ధీకరణ విషయంలో తమకు సహకరించిన డైరెక్టర్, ఇతర ఉన్నతాధికారులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

చంద్రబాబుది నీచ రాజకీయం

ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఖాజావలి



లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): చంద్రబాబుది నీచ రాజకీయమని ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఖాజావలి విమర్శించారు. ముస్లింలు ఆయన్ను నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. గుంటూరులో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఖాజావలి మాట్లాడారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిపై త్వరలో ముస్లిం డిక్లరేషన్ ప్రకటిస్తుందన్నారు. 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న ఇదే కూటమి అప్పుడు ఏం చేసిందో ఆంధ్ర రాష్ట్ర ముస్లింలందరూ మర్చిపోలేదన్నారు. ముస్లింల పట్ల చిత్తశుద్ధి ఉంటే లోక్ సభ, శాసనసభ స్థానాల్లో మరింత అవకాశం కల్పించి మీ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. 2019 ఎన్నికల్లో విడిపోవడం, తిరిగి 2024 ఎన్నికల్లో కలవడం వంటి నీచ రాజకీయాలను చూసి రాష్ట్ర ప్రజలు ఛీదరించుకుంటున్నారన్నారు.

చంద్రబాబు బెయిల్ రద్దు పిటిషన్ విచారణ వాయిదా

ఏప్రిల్ 16న విచారణ: సుప్రీంకోర్టు

సాక్షి, న్యూఢిల్లీ: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు బెయిల్ రద్దు చేయాలంటూ ఏపీ సీఐడీ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఈ పిటిషన్ మంగళవారం కోర్టు సమయం ముగిసే సమయానికి కొద్దిసేపు ముందుగా జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్‌తో కూడిన ధర్మాసనం ముందుకొచ్చింది. ఏపీ సీఐడీ తరఫు సీనియర్ న్యాయవాది రంజిత్‌కుమార్ వాదనలు వినిపించారు.సోమవారం నుంచి వారం రోజులపాటు హోలీ సెలవులు ముగిసిన అనంతరం విచారణ చేస్తామని ధర్మాసనం పేర్కొంది. స్పష్టమైన తేదీ తెలపాలని రంజిత్‌కుమార్ ధర్మాసనానికి విజ్ఞప్తి చేయగా.. ఏప్రిల్ 16న విచారణ చేపడతామని ధర్మాసనం పేర్కొంది.

కట్టుదిట్టంగా 'కోడ్'

ప్రభుత్వ వెబ్‌సైట్లలో ప్రజాప్రతినిధుల ఫొటోలు.. ఆడియో, వీడియోలు తొలగించండి

ప్రభుత్వ యంత్రాంగానికి సీఎస్ జవహర్‌రెడ్డి, ముఖేష్‌కుమార్ మీనా ఆదేశం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో.. ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్)ని కట్టుదిట్టంగా అమలుచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి ప్రభుత్వ యంత్రాంగాన్ని ఆదేశించారు. ప్రభుత్వ వెబ్‌సైట్లన్నింటిలోనూ ప్రజాప్రతినిధులకు సంబంధించిన ఫొటోలు, ఆడియో, వీడియోలు కూడా వెంటనే తొలగించాలని సీఎస్ స్పష్టంచేశారు. అంతేకాక.. రాష్ట్రస్థాయి నుండి గ్రామస్థాయి వరకూ ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజాప్రతినిధులకు సంబంధించిన ఫొటోలను, ఫ్లెక్సీలతోపాటు ప్రభుత్వ ఆస్తుల పైనున్న రాజకీయ ప్రకటనలన్నీ కూడా తొలగించాలని ఆయన ఆదేశించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనాతో కలిసి కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులతో మంగళవారం వెలగపూడి సచివాలయంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై జవహర్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఏమన్నారంటే..

– సాక్షి, అమరావతి

ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి..

ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై ఏ శాఖపైనైనా ఫిర్యాదులు వస్తే సకాలంలో స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వోద్యోగులు పార్టీల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటే వారిపై విచారణ జరిపి ఎన్నికల నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. కోడ్ అమలుకు సంబంధించి కేంద్ర ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలను కట్టుదిట్టంగా అమలుచేసేందుకు అధికారులందరూ చర్యలు తీసుకోవాలి. చాలావరకు కార్యదర్శి స్థాయి అధికారులు ఎన్నికల పరిశీలకులుగా వెళ్లనున్నందున వారంతా కోడ్ మార్గదర్శకాలపై అవగాహన పెంచుకోవాలి. కోడ్‌కు సంబంధించి సీఈఓ ఇచ్చే ప్రత్యేక ఫార్మాట్‌లో కార్యదర్శులందరూ నివేదిక ఇవ్వాలి.



ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై సమీక్షిస్తున్న సీఎస్ జవహర్‌రెడ్డి

పెన్షన్ల పంపిణీ, ఉపాధి పనులకు అభ్యంతరంలేదు : ముఖేష్‌కుమార్ మీనా

ఎన్నికల షెడ్యూల్ వెలువడి కోడ్ అమల్లోకి వచ్చాక కొత్త పథకాలు ప్రకటించడానికి వీల్లేదు.

- బడ్జెట్ ప్రొవిజన్ ఉన్నప్పటికీ కొత్త ప్రాజెక్టులు, పథకాలు, రాయితీలు, గ్రాంట్ల మంజూరు, హామీలు, శంకుస్థాపనలు నిషిద్ధం.
- వర్క్ ఆర్డర్ ఉండి క్షేత్రస్థాయిలో మొదలు కాని పనులను చేపట్టకూడదు. పనులు పూర్తయిన వాటికి నిధుల విడుదలలో ఎలాంటి నిషేధంలేదు.
- కోడ్ అమలులోకి వచ్చాక ప్రజాప్రతినిధులు ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై సమీక్షలు లేదా వీడియో సమావేశాలు నిర్వహించకూడదు.
- అలాగే, వివిధ రకాల పించన్ల పంపిణీకీ ఎలాంటి అభ్యంతరం లేదు.
- ఉపాధి హామీ పథకం కింద రిజిస్టర్డ్ లబ్ధిదారులకు యథావిధిగా ఉపాధి పనులు కల్పించవచ్చు. కోడ్ అమలులోకి రాకముందు ఏవైనా పనులకు సంబంధించి టెండర్లు పిలిచి ఉంటే ఆ ప్రక్రియను కొనసాగించుకోవచ్చు. కానీ, టెండర్లను ఖరారు చేయడానికి వీల్లేదు.
- పీఎం, సీఎం సహాయ నిధి కింద రోగుల చికిత్స నిమిత్తం నిధులు మంజూరు చెయ్యొచ్చు.

అన్ని రకాల ప్రకటనలనూ నిలిపివేయాలి..

ఇక కోడ్ అమలులోకి వచ్చినందున ప్రభుత్వ ఆస్తులపై ఉన్న అన్ని రకాల వాల్ రైటింగులు, పోస్టర్లు, కటౌట్లు, హోర్డింగులు, బ్యానర్లు, జెండాలు వంటివన్నీ వెంటనే తొలగించాలి. అలాగే, వివిధ పబ్లిక్ ఆస్తులు అంటే.. బహిరంగ ప్రదేశాలు, బస్‌స్టాండ్లు, రైల్వేస్టేషన్లు, రైలు..రోడ్డు వంతెనలు, ప్రభుత్వ బస్సులు, విద్యుత్ స్తంభాలు, మున్సిపల్ సమావేశ ప్రదేశాల్లోని అన్ని రకాల రాజకీయ ప్రకటనలు.. వాల్ రైటింగులు, పోస్టర్లు, కటౌట్లు వంటివన్నింటినీ వెంటనే తొలగించాలి. అదే విధంగా.. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రసార మాధ్యమాల్లో ప్రభుత్వ ప్రకటనలను కూడా నిలిపివేయాలి.

మంత్రులెవరూ అధికారిక వాహనాలు వాడరాదు..

ఎన్నికల ప్రకటన వచ్చేసినందున ఇక మంత్రులెవరూ అధికారిక వాహనాలను ఎన్నికల ప్రచారం కోసం వినియోగించరాదు. ఎంపీ లేదా ఎంఎల్ఏ నిధులు లేక ఇతర ప్రభుత్వ పథకాల నిధులతో నిర్వహించే వాటర్ ట్యాంకులు, అంబులెన్సులు వంటి వాటిపై ప్రజాప్రతినిధుల ఫొటోలు కూడా ఉండరాదు. ప్రభుత్వ భవనాలు, కార్యాలయాల్లో ప్రధాని, ముఖ్యమంత్రి సహా మంత్రుల ఫొటోలూ ఉండకూడదు. అలాగే, విద్యుత్, నీటి బిల్లులు, బోర్డింగ్ పాస్‌లు, వ్యాక్సినేషన్ సర్టిఫికెట్లపై కూడా ప్రజాప్రతినిధుల ఫొటోలు, సందేశాలు వంటివి కూడా ఉండకూడదు. ప్రభుత్వోద్యోగులెవరైనా ఏ రాజకీయ పార్టీకైనా అనుకూలంగా వ్యవహరించినా లేదా ఆయా పార్టీలు నిర్వహించే ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నా, గిఫ్టులు, ఇతర ఏ రకమైన లబ్ధిపొందినా అలాంటి వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటాం. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు ప్రవీణ్‌కుమార్, వై. శ్రీలక్ష్మి, కె. విజయానంద్, వర్చువల్‌గా.. ఎం.టి. కృష్ణబాబు, అనంతరాము పాల్గొన్నారు. ముఖ్య కార్యదర్శులు శశిభూషణ్‌కుమార్, హరీశ్‌కుమార్ గుప్తా, ప్రవీణ్‌ప్రకాశ్, సునీత, కాంతిలాల్ దండే, చిరంజీవి చౌదరి, వాణీమోహన్, పలువురు కార్యదర్శులు, కమిషనర్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

కోడ్‌కు విరుద్ధమైన రాజకీయ ప్రచారాన్ని అనుమతించవద్దు

- సరిహద్దు చెక్‌పోస్టుల్లో వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షణ పెంచండి
- జిల్లాల ఎన్నికల అధికారులకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మీనా ఆదేశం

సాక్షి, అమరావతి: ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థలకు చెందిన వాణిజ్య స్థలాల్లో ఎటువంటి రాజకీయ ప్రకటనలు, హోర్డింగులు, పోస్టర్లు, బ్యానర్లను అనుమతించవద్దని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లాల ఎన్నికల అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం జాతీయ, ప్రధాన రహదారుల పక్కనున్న హోర్డింగులను అన్ని రాజకీయ పార్టీలకు సమాన ప్రాతిపదికన కేటాయించాలని, నూతన హోర్డింగులకు అనుమతులను మాత్రం ఇవ్వద్దని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు తీరును అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మీనా మాట్లాడుతూ.. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోనున్న నేపథ్యంలో రాజకీయ ప్రకటనలు, పోస్టర్లు, హోర్డింగులు, బ్యానర్ల ప్రదర్శన విషయంలో జిల్లా ఎన్నికల అధికారులు ఎంతో అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు విరుద్ధంగా ఎటువంటి రాజకీయ ప్రచారాన్ని అనుమతించవద్దని సూచించారు.

సరిహద్దుల్లో లిక్కర్ రవాణాను నియంత్రించాలి

ప్రైవేటు భవనాలపై వాల్ పెయింట్లకు ఎటువంటి అనుమతిలేదని, ఇప్పటికే ఉన్నవాటిని వెంటనే చెరిపించేయాలని ఆదేశించారు. ప్రభుత్వ అనుమతితో ప్రైవేటు భవనాలపై ఇప్పటికే ఉన్న పెద్ద హోర్డింగులు, కటౌట్ల భద్రతను, నిర్మాణ స్థిరత్వాన్ని పరిశీలించాలని, ఏమాత్రం దృఢత్వం లేకపోయినా ప్రకటనలకు అనుమతించ వద్దన్నారు. సరిహద్దు రాష్ట్రాల నుంచి లిక్కర్, ఓటర్లను ప్రభావితం చేసే పలు రకాల వస్తువుల అక్రమ రవాణాను నియంత్రించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ఇందులో భాగంగా సరిహద్దు ప్రాంతాల్లో శాశ్వత ప్రాతిపదికన చెక్ పోస్టులు ఉన్న చోట వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షణను పెంచాలని ఆదేశించారు. రాజకీయ పార్టీలు ఉద్యోగులకు, ఓటర్లకు నగదు, బహుమతులు వంటి తాయిలాలు పంపిణీ చేసే అంశాన్ని తీవ్రంగా పరిగణించాలని, అటు వంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలను నియంత్రించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు.

ఎన్నికల ప్రణాళికలు వెంటనే ఇవ్వాలి

సి విజిల్ ఫిర్యాదులను నిర్ణీత సమయంలో నూరు శాతం పరిష్కరించాలని, ఎలక్ట్రానిక్ సీజర్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను పెద్ద ఎత్తున వినియోగించుకునేలా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలపై ఒత్తిడి పెంచాలని మీనా అన్నారు. ఇంకా కొన్ని జిల్లాల నుంచి జిల్లా ఎన్నికల నిర్వహణ ప్రణాళికలు అందలేదని, వాటిని వెంటనే తమకు అందజేయాలని ఆదేశించారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడేలోపే ఎన్నికల సిబ్బందికి మరోసారి లేదా రెండు సార్లు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించే అంశంపై జిల్లా ఎన్నికల అధికారులు దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో పాటు అదనపు సీఈవోలు పి.కోటేశ్వరరావు, ఎమ్.ఎన్. హరేంధిర ప్రసాద్, డిప్యూటీ సీఈవో కె. విశ్వేశ్వర రావు, సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కాసుల కోసమే కూటమికి మంద కృష్ణ మద్దతు

మాదిగ కార్పొరేషన్ ఛైర్మన్ కనకారావు మండిపాటు



సాక్షి, అమరావతి: కాసుల కోసమే టీడీపీ, బీజేపీ, జనసేన కూటమికి మంద కృష్ణ మాదిగ మద్దతు పలుకుతున్నారని రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మూరి కనకారావు మండిపడ్డారు. మాదిగలను మోసం చేసిన చంద్రబాబుకు మంద కృష్ణ మద్దతు పలకడం సిగ్గుచేటని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తాను పెద్ద మాదిగను అవుతానని 2014 ఎన్నికల్లో మాదిగల ఓట్లు పొంది మోసం చేసిన చంద్రబాబుకు మళ్లీ ఏ ముఖం పెట్టుకుని మంద కృష్ణ మద్దతు ఇస్తున్నాడో సమాధానం చెప్పాలని కనకారావు డిమాండ్ చేశారు. టీడీపీ అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చి రెండు దశాబ్దాలు గడుస్తున్నా చంద్రబాబు పట్టించుకోలేదని తెలిపారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి పదేళ్లు గడిచినా వర్గీకరణ విషయంలో మోసం చేస్తూనే ఉందని పేర్కొన్నారు. ఇప్పుడు అదే టీడీపీ, బీజేపీ, జనసేన కూటమికి మంద కృష్ణ ఎందుకు మద్దతు ఇస్తున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మంద కృష్ణకు మొదటి నుంచి మాదిగల ప్రయోజనాల కంటే వ్యక్తిగత ప్రయోజనాలే ముఖ్యమని అనేక విషయాల్లో స్పష్టమైందని పేర్కొన్నారు. మొదటి నుంచి చంద్రబాబుకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎన్నికల్లో సపోర్టు చేయడమే మంద కృష్ణ అజెండా అని తెలిపారు. చంద్రబాబు పెంపుడు కుక్కగా మంద కృష్ణ మారాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు పాలనలో మాదిగలకు తీవ్ర అన్యాయం చేశారని, మాదిగ యువకులపై అక్రమ కేసులు బనాయించి జైళ్లలో పెట్టారని గుర్తుచేశారు. మాదిగలపై చంద్రబాబు పెట్టిన కేసులు ఎత్తివేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా మంద కృష్ణ మాట్లాడటం బాధాకరమని తెలిపారు. చంద్రబాబు ప్రభుత్వంలో మాదిగలకు ఒక మంత్రి, రెండు కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు ఇస్తే, సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వంలో మాదిగలకు రెండు మంత్రి పదవులు, వాటిలో అత్యంత ప్రాధాన్యత ఉన్న హోంశాఖను అప్పగించారని, ఒక ఎంపీ, ఎమ్మెల్సీలు, ఏడుగురికి రాష్ట్రస్థాయి ఛైర్మన్ పదవులు, మానవహక్కుల కమిషన్ మెంబర్, సమాచార కమిషన్ మెంబర్‌గా అవకాశం కల్పించారని వివరించారు. ఇవేమీ మంద కృష్ణకు కనిపించడం లేదా.. అని కనకారావు ప్రశ్నించారు. ఈ ఎన్నికల్లో టీడీపీ కూటమికి, మంద కృష్ణకు మాదిగలు బుద్ధి చెప్పాలని, వైఎస్సార్ సీపీకి మద్దతు ఇవ్వాలని కనకారావు కోరారు.

అవసరమైతే కాకినాడ ఎంపీగా పోటీచేస్తా

- ప్రస్తుతానికి పిఠాపురం నుంచే పోటీ
- మోదీ, అమిత్‌షా అడిగితే లోక్‌సభకు వెళ్లక తప్పదు
- పిఠాపురం నాయకుల సమావేశంలో పవన్‌కళ్యాణ్ వెల్లడి



సాక్షి, అమరావతి: పిఠాపురం అసెంబ్లీ అభ్యర్థిగా ప్రస్తుతానికి పోటీచేస్తున్నాననీ అవసరమైతే కాకినాడ ఎంపీగా పోటీచేయడానికి సిద్ధమేనని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ అన్నారు.కేంద్ర నాయకత్వం నన్ను రెండు అడిగారు. నువ్వు ఎంపీగా, ఎమ్మెల్యేగా పోటీ చేయాలని అడిగారు, నాకైతే ఎమ్మెల్యేగానే పోటీ చేయాలని ఉంది. భవిష్యత్‌లో మోదీ, అమిత్‌షా అడిగితే ఎంపీగా వెళ్లాల్సి వస్తే కాకినాడ నుంచి పోటీచేస్తానని తెలిపారు. మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులతో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పిఠాపురం నియోజకవర్గాన్ని తాను స్వస్థలంగా చేసుకుంటాననీ, వాడుకుని వెళ్లిపోనని చెప్పారు. ఇక్కడి పార్టీ ఇన్‌చార్జిగా ఉంటూ తన కోసం ఎంతో చేస్తున్న టి.ఉదయ్ కాకినాడ లోక్‌సభ నియోజకవర్గం నుంచి జనసేన అభ్యర్థిగా ప్రకటిస్తున్నట్టు చెప్పారు. 'నోరు తెరిచి నాకు ఓటు ఇవ్వమని అడుగుతున్నా. నన్ను గెలిపించాలి.' అంటూ విజ్ఞప్తి చేశారు. 2009 నుంచి తనను పిఠాపురం నుంచి పోటీ చేయమని కోరారనీ, అయితే అప్పుడు తాను చాలా ఆలోచించానని చెప్పారు. ఈ నియోజకవర్గంలో కొన్ని అంతరాలు, కొన్ని గొడవలు ఉన్నాయనీ, కాపులు పెద్దన్న పాత్ర పోషించాలనీ చెప్పారు.

తాను లేకున్నా గెలిపిస్తారనే...

తాను ఎక్కడైనా పర్యటించాల్సి వస్తే తనను గెలిపించగలిగేది పిఠాపురం ఒక్కటే అని గుర్తించినట్టు చెప్పారు. 'నీ గెలుపు గురించి నువ్వు ఆలోచించాల్సిన పనిలేదు. నిన్ను అసెంబ్లీకి పంపే బాధ్యత మాది.. నువ్వు మటుకు రాష్ట్రమంతా చూడు'. అనే మాట ఎవరూ స్వయంగా చెప్పకపోయినా ఆ భావం మాత్రం తన గుండెను తాకిందని చెప్పారు. తప్పదు అనుకుంటే తప్ప ఎవరితోనూ గొడవ పెట్టుకోననీ తెలిపారు. తనను ఓడించడానికి అవసరమైతే కుటుంబానికి రూ. లక్ష అయినా ఇవ్వడానికి కూడా ప్రత్యర్థి పార్టీలు వెనుకాడవని చెప్పారు. తనకు ప్రత్యర్థిగా ఉన్న వంగా గీత 2009లో తమ ద్వారానే రాజకీయాల్లోకి వచ్చారనీ, భవిష్యత్‌లో ఆమె వైఎస్సార్‌సీపీని వీడి జనసేనలోకి రావాలని కోరుకుంటున్నాననీ, వైఎస్సార్‌సీపీ లోక్‌సభ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సునీల్ కూడా మంచి వాడేగానీ, ఆయన ఎంచుకున్న పార్టీ సరైంది కాదని వ్యాఖ్యానించారు.

40 ఏళ్ల టీడీపీకి నేనే అండగా ఉన్నా...

పదేళ్లుగానే తాను రాజకీయాల్లో కొనసాగుతున్నా... 40 ఏళ్ల టీడీపీకి తానే అండగా నిలవాల్సి వచ్చిందనీ, జనసేనే లేకపోతే ఈ పొత్తు కూడ ఉండేది కాదని వ్యాఖ్యానించారు. పొత్తులకోసం అందరినీ ఒప్పించాననీ, దీని కోసం రెండు చేతులెత్తి దండం పెట్టాననీ చెప్పారు. కాగా ఒకవైపు ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నానని చెపుతూనే అవసరమైతే ఎంపీగా పోటీ చేస్తానని రకరకాలుగా మాట్లాడటం అక్కడివారిని ఆశ్చర్యపరచింది.

జనసేనతో 'బాబు' బంతాట

▶ మొదటి పేజీ తరువాయి

ఇంకా ప్రకటించలేదు. ఓ వైపు టీడీపీ సీట్లను ప్రకటించకుండా పెండింగ్‌లో పెట్టడమే కాకుండా, మరోవైపు జనసేన సీట్లను సైతం ప్రకటించకుండా అడ్డుకుంటుండటం చంద్రబాబు భయానికి నిదర్శనం. ఇంకోవైపు బీజేపీకి కేటాయించిన 10 సీట్ల విషయంలోనూ పూర్తి స్థాయిలో స్పష్టత లేదు. ఇందులో రెండు సీట్ల విషయమై మూడు పార్టీల మధ్య పొంతన కుదరడం లేదని సమాచారం. ఈ సీట్లపై స్పష్టత వచ్చే వరకు ఆగాలని పవన్‌కు చంద్రబాబు సూచించినట్లు తెలుస్తోంది. దీంతో చంద్రబాబు తీరుపై జనసేన నేతలు తీవ్రంగా మండిపడుతున్నారు. ఇంత జరుగుతున్నా పవన్ కళ్యాణ్ ఎందుకు మౌనంగా ఉన్నారో అర్థం కావడం లేదని జనసేనలో చర్చ జరుగుతోంది.

స్పష్టత ఎప్పటికో..

జనసేనకు కేటాయించిన మొత్తం 21 అసెంబ్లీ స్థానాల్లో పార్టీ అధికారికంగా ఏడు స్థానాల్లో మాత్రమే అభ్యర్థుల ప్రకటన చేసింది. అయితే అనధికారికంగా 16 అసెంబ్లీ స్థానాల్లో పోటీపై పవన్ స్పష్టత ఇచ్చినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గత ఫిబ్రవరి 24వ తేదీన చంద్రబాబుతో కలిసి నెల్లిమర్ల, తెనాలి, అనకాపల్లి, రాజానగరం, కాకినాడ రూరల్ నియోజకవర్గ జనసేన అభ్యర్థుల పేర్లను పవన్‌కళ్యాణ్ అధికారికంగా ప్రకటించారు. తర్వాత నిడదవోలు అభ్యర్థిని ప్రకటిస్తూ.. పిఠాపురం నుంచి తానే పోటీ చేయబోతున్నట్టు స్పష్టం చేశారు. భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం, పెందుర్తి, యలమంచిలి, ఉంగుటూరు, రాజోలు, తిరుపతి అభ్యర్థులపై మంగళగిరి పార్టీ కార్యాలయంలో ఇటీవల స్పష్టత ఇచ్చారు. అయితే ఆ స్థానాల అభ్యర్థులను అధికారికంగా ప్రకటించలేదు. ఇప్పటి వరకు 128 సీట్లు ఖరారు చేసిన టీడీపీ.. మిగతా సీట్లపై కసరత్తులో భాగంగానే జనసేన, బీజేపీలతో బంతాట ఆడుకుంటోందని ఆయా పార్టీల్లో జోరుగా చర్చ సాగుతోంది.

కృత్రిమ మేధ (ఏఐ) ప్రోగ్రామ్‌లకు చిన్న సూచన చేస్తే.. మనకు కావాల్సినట్టుగా ఫొటోలను తయారు చేసి పెడుతున్నాయి.. కావాల్సినట్టుగా వీడియోలనూ రూపొందిస్తున్నాయి.. అడిగిన డేటాను నెట్‌లో సెర్చ్ చేసిపెడుతున్నాయి.. అనుమానాలు ఉంటే తీరుస్తున్నాయి.. ఇవన్నీ ఒక ఎత్తయితే.. ఇప్పుడే ఏకంగా వెబ్‌సైట్లను, సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్‌లను కూడా పూర్తిస్థాయిలో తయారు చేసి పెట్టగల 'ఏఐ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్' వచ్చేసింది.

డెవిన్‌కు చెప్తే.. అంతా రెడీ!

ఏఐకి చెప్తే.. వెబ్‌సైట్ రెడీ!

- ప్రపంచంలోనే మొట్టమొదటి కృత్రిమ మేధ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్
- 'డెవిన్'ను రూపొందించిన కాగ్నిషన్ కంపెనీ



'డెవిన్' పేరుతో..

టెక్నాలజీ ప్రపంచంలో ఇటీవల వచ్చిన చాట్ జీపీటీ ఏఐ ప్రోగ్రామ్ ఎంతో కలకలం రేపింది. అది విద్యార్థులకు కావాల్సిన ఆర్టికల్స్ రాసిపెట్టడం నుంచి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లకు అవసరమైన కోడ్‌లనూ సిద్ధం చేసి ఇవ్వడం సంచలనం సృష్టించింది. కానీ ఇప్పుడు అమెరికాకు చెందిన కాగ్నిషన్ అనే స్టార్టప్ కంపెనీ 'ఏఐ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్'ను సృష్టించింది. దానికి 'డెవిన్'అని పేరు పెట్టింది. వెబ్‌సైట్లను, సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్‌లను కూడా పూర్తిస్థాయిలో తయారు చేసి ఇవ్వగలదని ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పలు ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీల ఇంటర్వ్యూలను, వివిధ బెంచ్‌మార్క్ టెస్టులను ఇది విజయవంతంగా పాస్ అయిందని తెలిపింది. ఇలాంటి పూర్తిస్థాయి ఏఐ ప్రోగ్రామ్ ప్రపంచంలోనే ఇదే మొదటిది కావడం గమనార్హం.

కోడ్ నుంచి డిస్ప్లే దాకా..

సాధారణంగా ఒక సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్, వెబ్‌సైట్‌ను రూపొందించడంలో చాలా ప్రక్రియలు ఉంటాయి. కోడ్ రాయడం దగ్గరి నుంచి టెస్టింగ్, డీబగ్గింగ్ చేయడం, చివరికి దాన్ని డిస్ప్లే చేయడం దాకా ఎన్నో క్లిష్టమైన పనులు చేయాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు ఉన్న చాట్ జీపీటీ వంటి ఏఐ ప్రోగ్రామ్‌లు.. కొంతవరకు సాఫ్ట్‌వేర్ కోడ్‌లను రాసిపెట్టగలుగుతున్నాయి కూడా. అయితే తాము అభివృద్ధి చేసిన 'డెవిన్'.. సాఫ్ట్‌వేర్ కోడ్ రాయడంతోపాటు.. టెస్టింగ్, డీబగ్గింగ్, డిస్ప్లే కూడా చేయగలదని 'కాగ్నిషన్' కంపెనీ ప్రకటించింది. ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ చేయగల స్థాయిలో పూర్తిస్థాయిలో పనిచేసే వెబ్‌సైట్‌ను రెడీ చేసి పెడుతుందని వివరించింది. అది కూడా జస్ట్ ఒక చిన్న కమాండ్ ఇస్తే సరిపోతుందని తెలిపింది. ఎప్పటికప్పుడు కొత్త టెక్నాలజీలను నేర్చుకోగలదని వివరించింది.



పెద్ద సంతోషం అనేది ఒకటి ఉందని మీరు కనుక్కున్నప్పుడు,
దానికోసం చిన్న చిన్న సంతోషాలను త్యాగం చేయగలుగుతారు.
– థానిస్సరో భిక్షు (బౌద్ధ ధర్మం)

సాక్షి

బుధవారం, 20 మార్చి 2024

ఎన్నిక అపహాస్యమే అయినా...

అనుకున్నదే అయింది. ఫలితం ముందే నిర్ణయమై, అపహాస్యంగా మారిన రష్యా ఎన్నికల్లో అందరూ ఊహించినట్టే వ్లాదిమిర్ పుతిన్ అయిదో పర్యాయం అధ్యక్షుడయ్యారు. కంటితుడుపుగా సాగిన రిగ్గింగ్ ఎన్నికలన్న విమర్శకుల ఆరోపణలకు తగ్గట్టే ఆయన మునుపెన్నడూ, ఎవరికీ రానన్ని ఓట్లతో అఖండ విజయం సాధించారు. పుతిన్ గెలుపు ముందే నిశ్చయమైనా, సోమవారం అధికారిక వెల్లడింపుతో ఒక తంతు పూర్తయింది. అధికారంలోకి వచ్చిన తొలినాళ్ళలో భిన్నాభిప్రాయాలకూ, రాజకీయ పోటీకీ కాసింత అవకాశమైనా ఇచ్చిన 71 ఏళ్ళ ఈ మాజీ గూఢచారి ఇప్పుడు అందుకు ఏ మాత్రం సిద్ధంగా లేరని తేలిపోయింది. వెరసి, పుతిన్ హయాంలో రష్యాలో పాలన నిరంకుశత్వం నుంచి ఏకఛత్రాధిపత్యం, ఏకవ్యక్తి పాలన దిశగా వెళుతున్నట్టు ప్రపంచానికి ఖరారైంది.

సోవియట్ పతనానంతర కాలంలో ఎన్నడూ లేనట్టు రష్యా ఎన్నికల్లో పుతిన్ అత్యధికంగా 88 శాతం దాకా ఓట్లు సాధించడం స్పష్టమైన సందేశాన్ని ఇస్తోంది. ప్రధానిగా అయితేనేం, అధ్యక్షుడిగా అయితేనేం పాతికేళ్ళుగా పీఠంపై ఉన్న పుతిన్ ఇప్పుడిక రష్యాపై పూర్తిగా పట్టు బిగించారన్న మాట. అధ్యక్షుడిగా కొనసాగేందుకు వీలుగా ఇప్పటికే ఆయన రాజ్యాంగాన్ని మార్చేశారు. తాజా విజయంతో మరో ఆరేళ్ళు ఆ పదవి ఆయనదే. ఇలాగే, వచ్చే 2030లో సైతం పుతిన్ విజయం సాధిస్తే, కొత్త చరిత్ర ఆవిష్కృతమవుతుంది. అదే జరిగితే, 31 ఏళ్ళ పాటు అధికారం చలాయించిన స్టాలిన్ రికార్డును పుతిన్ తిరగరాసినట్టవుతుంది. పైపెచ్చు, పుతిన్ ఈసారి విజయం సాధిస్తూనే... అమెరికా సారథ్యంలోని 'నాటో' కూటమి గనక ఉక్రెయిన్‌లో బలగాలను మోహరిస్తే సహించబోమన్నారు. అదే గనక జరిగితే 'పూర్తిస్థాయిలో మూడో ప్రపంచ యుద్ధమే' అని హెచ్చరించడం గమనార్హం.

నిజానికి, మార్చి 15 – 17 మధ్య జరిగిన తాజా ఎన్నికలు పెద్ద ప్రహసనం. అభ్యర్థులుగా అధికారిక ఆమోదం పొందిన ప్రత్యర్థులు పేరుకు రంగంలో ఉన్నారు. కానీ, బరిలో నిలిచేందుకూ, పోటీలో గెలిచేందుకూ వారు ఇసుమంతైనా ప్రయత్నించలేదు. ఉక్రెయిన్‌తో రష్యా యుద్ధాన్ని వ్యతిరేకిస్తున్న మరో ఇద్దరు పాపులర్ వ్యక్తులు సైతం మొదట బరిలో ఉన్నారు. తీరా పుతిన్ విజయంపై ఎంతో కొంత ప్రభావం చూపగల వారి అభ్యర్థిత్వాన్ని సాంకేతిక కారణాలతో తోసిపుచ్చారు. ఇక గత 2018 ఎన్నికల వేళ పుతిన్‌కు కంటిలో నలుసైన జనాకర్షక ప్రతిపక్ష నాయకుడు అలెక్సీ నావల్నీ గత నెల ఓ ఆర్కిటిక్ జైలులో అంతుచిక్కని రీతిలో మరణించారు. మాస్కో యుద్ధం సందర్భంగా రష్యా కలిపేసుకున్న నాలుగు ఉక్రెయిన్ ప్రావిన్సుల్లోనూ ఓటింగ్ జరిగింది. అయితే, సాయుధ బలగాల కనుసన్నల్లో బలవంతపు ఓటింగ్ వల్ల ఫలితం ఏమిటన్నది అర్థమై పోయింది. ఒకపక్క ఎన్నికలు జరుగుతుండగానే రష్యా భూభాగంపై ఉక్రెయిన్ డ్రోన్ దాడులు కొనసాగాయి. కీవ్, దాని పాశ్చాత్య భాగస్వామ్య పక్షాల నుంచి మాస్కోకు ముప్పు తప్పదని తేల్చాయి.

పుతిన్ అయిదోసారి గెలిచినా, ప్రజాక్షేత్రంలో అసమ్మతి పుష్కలం. ఫక్తు ఫార్సుగా మారిన ఎన్నికల్ని నిరసిస్తూ, కొందరు ఓటర్లు బ్యాలెట్ బాక్సుల్లో రంగు పోశారు. అలాగే, నావల్నీ నివాళికి వేలాది రష్యన్లు హాజరవడం గమనార్హం. అయితే, దేశాన్ని పూర్తిస్థాయి ఏకవ్యక్తి పాలనగా మార్చేసేందుకు పుతిన్‌కు దక్కిన వరం – ఉక్రెయిన్‌తో యుద్ధం. 'ప్రత్యేక సైనిక చర్య'గా స్వల్పకాలిక దాడితో ఉక్రెయిన్‌పై పైచేయి సాధించాలని ఆయన మొదట భావించారు. తీరా అది దీర్ఘకాలిక పోర్రై, నష్టాలకు దారి తీసింది. అయినా, అణచివేత కొనసాగిస్తూ, పాశ్చాత్య ప్రపంచంతో సుదీర్ఘ యుద్ధంలో అంతిమ విజయం మనదేనంటూ రష్యన్లతో పుతిన్ నమ్మబలికారు. సలహాదారుల మాట పెడచెవిన పెట్టి, యుద్ధాన్ని ప్రచారంలో ప్రధానాంశం చేశారు. యుద్ధంపై నిరసన నేరమంటూ, నిరసించే పౌరులంతా 'విదేశీ ఏజెంట్లే' అంటూ చట్టమే చేశారు. ఎవరేమనుకున్నా మళ్ళీ అధ్యక్షుడయ్యారు.

దేశమంతా తన వెంటే ఉందని చాటేందుకు పుతిన్ ఈ ఎన్నికను అవకాశంగా వాడుకున్నారు. అణచివేత మాట అటుంచితే, రష్యాలో ఇప్పటికీ పాపులర్ నేతనని నిరూపించుకున్నారు. ఉక్రెయిన్‌తో పోరులోనూ మొదట కొద్దినెలలు గట్టి ఎదురుదెబ్బలు తగిలినా, అనూహ్యంగా ఇప్పటికీ పట్టు నిలుపుకొన్నారు. కఠినమైన ఆర్థిక ఆంక్షలు ఎదురైనా, దేశ ఆర్థిక వ్యవస్థను అంచనాలను మించేలా నిలబెట్టగలిగారు. పాశ్చాత్య బ్రాండ్లు దేశం విడిచివెళ్ళినా, అదే విధమైన స్థానిక ఉత్పత్తులతో సామాన్యులపై ప్రభావం పడకుండా చూసుకున్నారు. ముడి చమురు కొనుగోళ్ళకు యూరప్ అడ్డం తిరిగినా, భారత్, చైనా, టర్కీలతో ఆదాయం పుష్కలంగా కొనసాగేలా చూసుకున్నారు. రష్యాకు రాజకీయ, ఆర్థిక సుస్థిరత సమకూర్చినప్పటికీ, దేశాన్ని నిరంకుశ పాలనలోకి దింపడమే పెద్ద చిక్కు.

అయితే, ఇష్టమున్నా, కష్టమైనా కనీసం మరో ఆరేళ్ళ పాటు రష్యా సారథి పుతినే. అమెరికా, దాని మిత్రపక్షాలు సహా అందరూ ఆ వాస్తవాన్ని గుర్తించాలి. ఎలాగోలా పుతిన్‌కు నచ్చజెబితే తప్ప ఉక్రెయిన్ యుద్ధానికి ఇప్పుడప్పుడే తెర పడే పరిస్థితి లేదని గమనించాలి. పుతిన్‌తో వైరం పెరిగినకొద్దీ అది తూర్పు ఐరోపాకే కాక మొత్తం ప్రపంచానికే తలనొప్పి అని గ్రహించాలి. పాశ్చాత్యప్రపంచం సైతం తన వైఖరిలోని తప్పులను ఆత్మపరిశీలన చేసుకోవాలి. రష్యాకు మిత్రదేశాలైన భారత్, చైనా లాంటివి ఈ శత్రుత్వ ధోరణి సద్దుమణిగేలా ప్రయత్నించాలి. 2022లో ఉక్రెయిన్‌పై పుతిన్ జరపదలచిన అణ్వస్త్రదాడిని ఆపింది భారత ప్రధాని, ఇతర నేతలేనంటూ వస్తున్న తాజా కథనాలు విస్మరించలేనివి. అమెరికా, రష్యాలు రెంటితోనూ బలమైన బంధమున్న భారత్ శాంతియుత పరిష్కారానికై కృషి చేయాలి. ఎందుకంటే, ఉక్రెయిన్ యుద్ధం మరింత కాలం కొనసాగడం మానవాళికి ఏమాత్రం మేలు కాదు!

ప్రజాస్వామ్యంలో ఏఐ పాత్ర

అభిప్రాయం




జస్‌ప్రీత్ బింద్రా

ప్రపంచంలోని చాలా దేశాల్లో ఈ ఏడాది ఎన్నికలు ముంచుకొస్తున్నాయి. కృత్రిమ మేధ (ఏఐ) తన మొదటి ప్రధాన నైతిక పరీక్షను ఎదుర్కొనే సంవత్సరంగా ఈ 2024 ఉండబోతోంది. ఈ సంవత్సర ప్రారంభంలో బంగ్లాదేశ్, స్లొవేకియాల్లో జరిగిన ఎన్నికల్లో ప్రధాన అభ్యర్థులను దెబ్బగొట్టడానికి 'డీప్ ఫేక్'ను వాడుకున్నారు. అదే సమయంలో, జైలు నుంచే ఇమ్రాన్ ఖాన్ తన ఓటర్లకు పిలుపునివ్వడంలో కూడా జెనరేటివ్ ఏఐ సాయపడింది. ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసే పాత్రకు భిన్నంగా కృత్రిమ మేధను ఎలా ఉపయోగించుకోవచ్చో పాకిస్తాన్ చేసి చూపించింది. ప్రజాస్వామ్యానికి మూల స్తంభమైన ఎన్నికల ప్రక్రియను మెరుగుపరచడానికి కృత్రిమ మేధ చాలా సాయపడగలదు. తక్కువ ఖర్చుతో, అధిక సామర్థ్యంతో అభ్యర్థులు తమ ప్రచారాన్ని నిర్వహించుకోవడంలోనూ ఇది ఎంతగానో ఉపయోగపడగలదు.

గత రెండేళ్లుగా, కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్–ఏఐ)... దాని ద్వారా ఉత్పన్నమైన ఉత్సాహం, అది కలిగించిన అంతరాయాలపై సాంకేతిక కథనాలు ఆధిపత్యం చలాయించాయి. కాపీరైట్, పక్షపాతం, గోప్యత, డీప్‌ఫేక్ (వ్యక్తుల వాస్తవ చిత్రాన్ని మార్చి అప్రతిష్ఠకు పాల్పడటం) వంటి నైతిక సమస్యలు ఎదురు కావడంతో, 2023 చివరి భాగంలో ఈ కథనాలు కొద్దిగా పసలేనివిగా మారిపోయాయి. ఇప్పుడు, చాలా దేశాల్లో ఎన్నికలు ముంచుకొస్తు న్నాయి. ఈ నేపథ్యంలో ప్రజాస్వామ్యానికి సహాయపడినా లేదా దానిని నాశనం చేసినా... కృత్రిమ మేధస్సు తన మొదటి ప్రధాన నైతిక పరీక్షను ఎదుర్కొనే సంవత్సరంగా 2024 ఉండబోతోంది. భారత్, అమెరికా, బ్రిటన్, ఇండోనేషియా, ఇతర ప్రధాన ప్రజాస్వామ్య దేశాలు ఈ సంవత్సరం కీలకమైన ఎన్నికలకు వెళుతున్నాయి. జనరేటివ్ ఏఐ కంటే ముందే డీప్‌ఫేక్‌లు ఉనికిలో ఉన్నప్పటికీ – 'సోరా', 'స్టేబుల్ డిఫ్యూజన్' వంటివి వాటి ఉత్పత్తిని ప్రజాస్వామీకరించాయి. వాటిని సులభంగా, వేగంగా, చౌకగా మార్చేశాయి.

వాట్సాప్, టిక్ టోక్ మొదలైనవి అంతర్జాతీయ పంపిణీని అత్యంత సులభంగా మార్చేయడంతో సోషల్ మీడియాకు సంబంధించి శిఖరస్థాయి దశలో ఉన్నాం. బంగ్లాదేశ్, స్లొవేకియా ఈ సంవత్సరం ప్రారంభంలో ఎన్నికలకు వెళ్లాయి. ఈ సందర్భంగా చాలా డీప్‌ఫేక్‌లు వచ్చాయి. బంగ్లాదేశ్ ప్రతిపక్ష నాయకుడు పాలస్తీనియన్లకు తన మద్దతు విషయంలో సందిగ్ధంగా ఉన్నట్లు చూపటం జరిగింది. ఇది ఆ దేశంలో ఒక వినాశకరమైన వైఖరి. స్లొవేకియా ఎన్నికలలో, ఒక ప్రధాన పోటీదారు ఎన్నికల రిగ్గింగ్ గురించి, మరింత ప్రమాదకరంగా బీరు ధరను పెంచడం గురించి మాట్లాడినట్లు చూపారు. ఇది ఆయన ఓటమికి కారణమైంది. మరోవైపు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ నకిలీ వాయిస్ అమెరికా ప్రైమరీలలో ఓటు వేయవద్దని ప్రజలను కోరింది. 2016 కేంబ్రిడ్జ్ అనలిటికా(డేటా స్కాండల్) వైఫల్యానికి చెందిన జ్ఞాపకాలు ఇంకా తాజాగా ఉన్నాయి. పెద్ద ఎన్నికలు సమీపిస్తున్నందున ఇవి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి.

అయినప్పటికీ, నేను ఇక్కడ భిన్న వైఖరిని తీసుకుంటాను. పాకిస్తాన్ వైపు చూడండి. అక్కడ మాజీ ప్రధాని జైల్లో ఉన్న సమయంలో ఎన్నికలు జరిగాయి. ఆయన పార్టీ గుర్తులు లాక్కుని, వారి అభ్యర్థులను నిర్బంధిస్తామని బెదిరించారు. చివరికి ఇతర పార్టీలు గెలిచినట్లు ప్రకటించినప్పటికీ, భారీ రిగ్గింగ్, అవకతవకలు జరిగినప్పటికీ ఇమ్రాన్ ఖాన్ పార్టీకి కచ్చితమైన మెజారిటీ వచ్చిందని చాలా నివేదికలు పేర్కొన్నాయి. కటకటాల్లో ఉండి కూడా, దేశవ్యాప్తంగా ప్రచారం చేయడానికి జనరేటివ్ ఏఐని ఉపయోగించుకోవడం ద్వారా,



ప్రజాస్వామ్యాన్ని అణచివేశానని తనపై వచ్చిన కథనాన్ని ఇమ్రాన్ ఖాన్ వమ్ముచేయగలిగారు. తన ఓటర్లను బయటకు వచ్చి తన పార్టీకి ఓటు వేయమని ఇమ్రాన్ కోరిన దృశ్యాలను రూపొందించడానికి జనరేటివ్ ఏఐని ఉపయోగించుకున్నారు. ఇది యూట్యూబ్‌తోపాటు ఇతర ఆన్‌లైన్ ఛానెళ్లలో విస్తృతంగా షేర్ అయింది. ప్రజలు ఆయన పిలుపును విని రికార్డు సంఖ్యలో బయటకు వచ్చారు. ఆయన అభ్యర్థులకు ఆశ్చర్యకరమైన విజయాలు అందించారు. ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసే పాత్రకు భిన్నంగా, కృత్రిమ మేధస్సును ఎలా ఉపయోగించుకోవచ్చో పాకిస్తాన్ చేసి చూపించింది.

డీప్‌ఫేక్‌ల విధ్వంసక శక్తిని నేను తిరస్కరించడం లేదు. భారత్‌లో, ఇతర దేశాల్లోని ఎన్నికలలో చర్చను ప్రేరేపించడానికీ, కథనాలను రూపొందించడానికీ వాటిని ఉపయోగిస్తారని నేను భయపడుతున్నాను కూడా. అయినప్పటికీ, ప్రజాస్వామ్యానికి మూల స్తంభమైన ఎన్నికల ప్రక్రియను మెరుగుపరచడానికి కృత్రిమ మేధ చాలా సాయపడగలదు. పాకిస్తాన్ ఉదాహరణ దీనికి సంబంధించి ఒక సృజనాత్మక మార్గం. ఎన్నికల్లో పారదర్శకతను, సమ్మిళితత్వాన్ని, సమర్థతను పెంపొందించడానికి కూడా ఏఐని ఉపయోగించవచ్చు. దాని అధునాతన డేటా విశ్లేషణ సామర్థ్యాలు ఎన్నికల సంబంధిత డేటాను నిజ సమయంలో పర్యవేక్షించగలవు. మోసపూరిత కార్యాచరణను సూచించే ఏవైనా అవకతవకలను ఇట్టే గుర్తించగలవు. ఏఐ అల్గారిథమ్‌లు ఓటరు నమోదులు లేదా బ్యాలెట్ సమర్పణలో అక్రమాలకు సంబంధించిన నమూనాలను గుర్తించగలవు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ సిస్టమ్‌ల భద్రతను కూడా ఏఐ మెరుగుపరుస్తుంది. అదనంగా, ప్రమాదాలను కనిపెట్టే అల్గారిథమ్‌లు... సంభవించగల సైబర్ ప్రమాదాలను గుర్తించడంలో కూడా సహాయపడతాయి.

స్థానిక సమస్యలపై దృష్టి సారించే అభ్యర్థులపై, వారి మాని ఫెస్టోలపై ప్రజల స్థానిక మాండలికాలలో అత్యంత సున్నితమైన వ్యక్తిగత కంటెంట్‌ని రూపొందించడంలో జెనరేటివ్ ఏఐ సహాయ పడుతుంది. తద్వారా ఓటరు అవగాహనను నవీకరించడంలో తోడ్పడుతుంది. ముఖ్యంగా వ్యక్తిగతీకరించిన విధానం విస్తృత వర్గాల్లో రాజకీయ అవగాహనను పెంపొందించగలదు. దీన్ని అధిక సామర్థ్యంతో చాలా తక్కువ ఖర్చుతో చేయడంలో జెనరేటివ్ ఏఐ ఉపయోగపడుతుంది. తద్వారా తక్కువ డబ్బు ఉన్న అభ్యర్థులకు కూడా అధికారం లభించేలా చేస్తుంది.

కృత్రిమ మేధతో నడిచే వ్యవస్థలు వైకల్యాలున్న ఓటర్లకు ప్రాప్యతను కూడా మెరుగుపరుస్తాయి. ఉదాహరణకు, అతిశక్తిమంతమైన వాయిస్ రికగ్నిషన్ సిస్టమ్‌లు దృష్టి లోపం ఉన్న ఓటర్లకు సహాయపడతాయి. రాజకీయ సంభాషణలో సమాజంలోని అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం ఉండేలా చూసేందుకు, జన సమూహాలలో ప్రజల అభిప్రాయాన్ని అంచనా వేయడానికి కూడా కృత్రిమ మేధను అన్వయించవచ్చు. ఎన్నికల నిర్వహణ లాజిస్టిక్స్ వంటివాటిని కూడా అనుకూలపర్చవచ్చు. ఖర్చులు ఆదా చేయవచ్చు. ఇది భారతదేశం వంటి పెద్ద దేశాలకు చాలా ముఖ్యమైనది. ఓటరు నమోదును, ధ్రువీకరణను మరింత సమర్థవంతంగా చేయడంలో కృత్రిమ మేధ సహాయపడుతుంది. అర్హతను ధ్రువీకరించడానికి అవసరమైన డేటాను సరైన సమయంలో విశ్లేషించడం ద్వారా పొడవాటి క్యూలు లేకుండా చేస్తుంది.

చివరగా, కృత్రిమ మేధ అనేది ద్వంద్వ వినియోగ సాంకేతికతను కలిగివున్నది. అపారమైన విధ్వంసక శక్తితో పాటు భారీ ప్రయోజనాలను ఇది కలిగి ఉంది. ఎన్నికలపై దాని ప్రతికూల ప్రభావాన్ని డీప్‌ఫేక్‌ల రూపంలో మనం చూడటానికి ప్రయత్నిస్తున్నప్పుడు, మన ప్రజాస్వామ్యాలను అది ఎలా మెరుగుపరుస్తుందో కూడా చూడాలి. పర్ఫెక్టుగా లేకపోయినా, ఇమ్రాన్ ఖాన్ పార్టీ ఈ సామర్థ్యాన్ని ప్రపంచానికి చూపడంలో విజయం సాధించింది.

వ్యాసకర్త సాంకేతికాంశాల మేధావి
('ది మింట్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సేవ్ లద్దాఖ్



నా వాతావరణ నిరశన దీక్ష 14వ రోజు: లద్దాఖ్ నేల, పర్యావరణం, స్థానిక గిరిజన సంస్కృతుల పరిరక్షణ కోసం మైనస్ 12 డిగ్రీల సెంటీగ్రేడ్ చలిలో 250 మంది ఆకలితో పడుకున్నారు. దక్షిణాన భారీ పరిశ్రమల వల్లా, ఉత్తరాన చైనా ఆక్రమణల వల్ల దిమ్మరులు తమ ప్రధాన పచ్చికబీళ్లను కోల్పోతున్నారు. క్షేత్రస్థాయి వాస్తవాలను చూపడం కోసం పది వేల మంది లద్దాఖీ గొర్రెల కాపరులు, రైతులతో సరిహద్దు మార్చ్ నిర్వహించబోతున్నాం. (సోనమ్ వాంగ్‌చుక్ ఆమరణ దీక్ష చేస్తున్నారు.)
– సోనమ్ వాంగ్‌చుక్, యాక్టివిస్ట్

వాడుకో!



ఎన్నికల ప్రచారం కోసం ఎయిర్ ఫోర్స్ విమానాలను ప్రధాని వాడటం అవినీతికర చర్య. ఈ కారణంగానే 1975 నాటి చారిత్రక అలహాబాద్ హైకోర్టు తీర్పు వల్ల ఇందిరాగాంధీ అనర్హతకు గురయ్యారు. కానీ అదొక భిన్నమైన కాలం. ఇప్పుడు ప్రభుత్వ సొమ్ము, ప్రభుత్వ సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగులందరినీ మోదీ ఎన్నికల ప్రచారం కోసం వాడుకుంటున్నారు.
– ప్రశాంత్ భూషణ్, న్యాయవాది

న్యాయమా?



మీ ఆదాయం ఒక కోటి రూపాయలైతే, మీరు ఇండియాలో సుమారు 40 శాతం పన్నులు చెల్లిస్తారు. పరోక్ష పన్నులు అదనం. వచ్చే ఏడాది మాటవరుసకు మీ ఉద్యోగం పోయిందనుకుందాం. అప్పుడు మీ ఆదాయం సున్నా. మీకు అందే ప్రయోజనాలు కూడా సున్నా. ఇదే మన పన్నుల విధానంలో ఉన్న తప్పు.
– అక్షత్ శ్రీవాస్తవ, విశ్లేషకుడు

లాభం లేకపోగా...



రాహుల్ గాంధీ మాట్లాడిన ప్రతిసారీ అది మోదీకి లాభిస్తుంది. హిందూమతపు కోణంలో 'శక్తి' అంటే ఏమిటో తెలియకుండా దాని గురించి ఎందుకు మాట్లాడటం?
– తవ్లీన్ సింగ్, కాలమిస్ట్

దివ్యౌషధం



పగటిపూట చిన్న కునుకు. పడుకునే ముందు జాజికాయ, పసుపు కలిపిన పాలు; అరికాళ్లకు వెన్నతో మర్దన. మంచి నిద్రకు ప్రతిసారీ పనికొచ్చే ఔషధం ఇది.
– రుజుతా దివేకర్, పోషణ నిపుణురాలు

ఇన్ బాక్స్

బహుముఖ ప్రజ్ఞాశాలి

ప్రముఖ ఇంగ్లీషు నవలా రచయిత, జర్నలిస్టు ఖుశ్వంత్ సింగ్ అవిభక్త భారత్‌లోని లాహోర్ హైకోర్టులో 1939లో న్యాయవాదిగా తన ప్రస్థానం మొదలెట్టారు. దేశ విభజన తర్వాత కొత్త ఢిల్లీ చేరుకున్నారు. 1969లో ఖుశ్వంత్‌ను జర్నలిజం తన వైపు లాక్కుంది. 'టైమ్స్ ఆఫ్ ఇండియా' గ్రూప్ వారి 'ఇల్లస్ట్రేటెడ్ వీక్లీ' ఎడిటర్‌గా చేరి, 65,000 వేల సర్క్యులేషన్‌తో ఉన్న పత్రికను ఆరు లక్షల వరకు తీసుకెళ్ళారు. ఇందిరా గాంధీ కుటుంబానికి అభిమాని కావటంతో 1977లో జనతా ప్రభుత్వం రావటంతో, ఆ పత్రికను వదలాల్సొచ్చింది. తర్వాత న్యూఢిల్లీ మాస పత్రిక, తర్వాత 'హిందుస్తాన్ టైమ్స్', 'నేషనల్ హెరాల్డ్' దిన పత్రికలకు సంపాదకుడిగా పనిచేశారు. భారతీయ భాషల పత్రికల్లోనే కాకుండా 'న్యూయార్క్ టైమ్స్' లాంటి పేరొందిన విదేశీ పత్రికల్లో కూడా ఈయన ఆర్టికల్స్ వెలువడేవి.



ఖుశ్వంత్ సింగ్

దేశ విభజన కాలంలో చెలరేగిన దమన కాండను చూసిన ఆయన... మతానికి అతీతంగా ముస్లిం ప్రేమిక (నూరన్) కోసం, ప్రాణాలు సైతం తెగించి ఆమె ప్రాణాలు కాపాడి సరిహద్దుకు ఆవల వైపు (పాకిస్తాన్)కు పంపించిన సిక్కు యువకుని(జగత్ సింగ్) ప్రేమాయణంను వర్ణిస్తూ రాసిన మొదటి ఫిక్షన్ నవల, 'ట్రైన్ టు పాకిస్తాన్' (1956) అప్పట్లో ఇంగ్లీష్ పాఠక లోకంలో చాలా ప్రసిద్ధి చెందింది. అది మొదలు, 44 నవలలు, వివిధ విషయాలపై వేల వ్యాసాలు రాశారు. 'హిందుస్థాన్ టైమ్స్'లో ప్రతి శనివారం వెలువడే ఆయన శీర్షికల ద్వారా మతం, రాజకీయం, సెక్స్ విషయాలపై నిర్మొహమాటంగా కామెంట్లు రాసేవారు. స్త్రీ పురుషుల లైంగిక ఆకర్షణ ఇతివృత్తంతో 84వ పడిలో రాసిన 'ది కంపెనీ ఆఫ్ విమెన్'(1999) ఆ కాలంలో అత్యధికంగా అమ్ముడు పోయింది! ఇంగ్లీషుతో పాటు పంజాబీ, ఉర్దూలో మంచి పట్టు ఉన్న ఈయన గాలిబ్ గజల్స్‌తో పాటు సిక్కు చరిత్ర విశ్లేషణలు ఇంగ్లీష్ అనువాదం చేశారు. ఆ కాలంలో పలు దేశ విదేశీ నాయకులతో ఇంటర్వ్యూలు జరిపారు. పాకిస్తాన్ ప్రెసిడెంట్ జియా ఉల్ హక్ ఆహ్వానంతో స్టేట్ గెస్ట్‌గా వెళ్లి, భారత్–పాకిస్తాన్ సంబంధాల గురించి ఇంటర్వ్యూ తీసుకున్నారు. 1984లో సిక్కుల స్వర్ణాలయంపై కేంద్రం జరిపిన సైనిక చర్యకు నిరసనగా 'పద్మభూషణ్' అవార్డును ప్రభుత్వానికి ఇచ్చేసినా, 2007లో రాష్ట్రపతి కలాం చేతుల మీదుగా 'పద్మ విభూషణ్'తో భారత ప్రభుత్వం తిరిగి ఆయనను సన్మానించింది.

ఒక చోట ఆయన ఈ సుదీర్ఘ జీవన యానంలో, భగవంతుడు తన కోరికలన్నీ తీర్చాడనీ, చివరి ఒకే ఒక కోరికగా 'రబ్' తనకు ప్రశాంత మృత్యువు ప్రసాదించాలని రాసుకున్నారు.. అలాగే జరిగింది మరి. 2014 మార్చి 20న తన కూతురు మాయా దయాళ్ ఇంట్లో (ఢిల్లీ) ఉదయం బ్రేక్ ఫాస్ట్ చేసుకుని, వాలు కుర్చీలో కూర్చుని రోజుమాదిరి, దిన పత్రికలో క్రాస్ వర్డ్ పూరిస్తున్న 99 ఏళ్ల ఖుశ్వంత్ సింగ్ అసువులు క్రమంగా అనంత వాయువుల్లో కలిశాయి. ఆయన కోరిక మేరకు, చితా భస్మాన్ని, తన సొంత ఊరు 'హద్దాలి' (పాకిస్తాన్)కి చేర్చారు.

– జిల్లా గోవర్ధన్; విశ్రాంత పి.ఎఫ్. కమిషనర్, ముంబై । 98190 86849
(నేడు ఖుశ్వంత్ సింగ్ వర్ధంతి)

అనుకుందొకటీ... అయ్యిందొకటీ!

అభిప్రాయం



డా॥ పి. గౌతమ్ రెడ్డి

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ద్వారా రాష్ట్రంలో సీఎం జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలో అధికారంలో ఉన్న సంక్షేమ ప్రభుత్వాన్ని దెబ్బ కొట్టాలన్న బాబు, పవన్‌ల వ్యూహానికి స్వయంగా మోదీనే చెక్ పెట్టారు. జగన్ మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు చేస్తున్న మంచిని ఆయన గుర్తించబట్టే ఆయన పేరును గానీ, ఆయన ప్రభుత్వాన్ని గానీ ఒక్కసారి కూడా ప్రస్తావించలేదు. ప్రధాని మోదీ ప్రసంగం జరిగిన తీరును నిశితంగా పరిశీలన చేస్తే గతంలో చంద్రబాబు ఆయన పట్ల చేసిన వ్యాఖ్యలను మనసులో పెట్టుకుని ఆచితూచి ప్రసంగించినట్లు కనిపించింది.

తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు ప్రసంగిస్తూ ప్రధాని మోదీ 'విశ్వ గురు' అంటూ ప్రశంసించి ఆకాశానికి ఎత్తినా ఫలితం దక్కలేదు. సరిగ్గా ఐదేళ్లు వెనక్కు పోతే... 'నరేంద్ర మోదీ కరుడుగట్టిన ఉగ్రవాది, ఈ దేశంలో ఉండే అర్హత లేదు' అన్న చంద్రబాబు ఇప్పుడు మోదీ 'దేశానికి దిక్సూచి', 'విశ్వ గురు' అంటూ ఆకాశాని కెత్తడాన్ని ప్రజలు అసహ్యించుకుంటున్నారు. చంద్రబాబు, పవన్ మీ హక్కుల కొరకు, రాష్ట్ర వికాసం కొరకు చాలా కాలం నుండి కృషి చేస్తున్నారు అన్నారే తప్ప... బాబు పాలన దక్షత గురించి గానీ, బాబు రాష్ట్రానికి చేసిన మంచి గురించి గానీ ఒక్కమాట అంటే ఒక్క మాట కూడా చెప్పలేదు. చంద్రబాబు ప్రసంగం మొత్తం మోదీని ప్రశంసించడానికి మాట్లాడితే మోదీ మాత్రం తన ప్రభుత్వం చేసిన గొప్పల గురించి చెప్పుకునేందుకు మాత్రమే పరిమితమయ్యారు. అలాగే ఆయన కాంగ్రెస్, 'ఇండియా' కూటములను మాత్రమే విమర్శించారు. కాంగ్రెస్ పీవీనీ, ఎన్టీ ఆర్‌నూ విస్మరించింది అని ఏపీలో లేని కాంగ్రెస్ గురించి మాట్లాడటం ప్రజలను ఆలోచింప చేస్తోంది. 2019లో చంద్రబాబు నాయుడు మీద చేసిన ఆరోపణలు గుర్తు చేసుకుంటే... 'పోలవరం కో ఏటీఎం కరే' అన్నారు. కానీ చంద్రబాబును 2019లో విమర్శించినంత గానీ, 2014లో జగన్‌ను విమర్శించినంతగా కానీ ఈసారి జగన్ మోహన్ రెడ్డిని మోదీ విమర్శించలేదు. దీంతో తెలుగుదేశం, జనసేనలతో ఆయన ఎలాంటి బంధం కోరుకుంటున్నారో అర్థమవుతోంది.

'చెల్లికి కూడా అన్యాయం చేసిన వాడు జగన్' అని చంద్రబాబు అంటే మోదీ మాత్రం 'జగన్,



షర్మిల ఒక్కటే' అన్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు షర్మిలకు పోకుండా జాగ్రత్త పడాలి అన్నారు. ఒక రకంగా షర్మిలను, కాంగ్రెస్‌ను గుర్తుకు తెచ్చి మోదీ కాంగ్రెస్‌కూ, షర్మిలకూ క్యాంపెయిన్ చేసినట్లు ఉంది. తెలంగాణకు చెందిన పీవీ నరసింహారావుకు భారతరత్న ఇచ్చామన్న మోదీ... ఎన్టీఆర్‌కు ఎందుకు ఇవ్వలేదో చెప్పలేదు.

మోదీ ఇచ్చిన విద్యా సంస్థల గురించి ఏకరవు పెట్టిన చంద్రబాబు... ఆయన ఇవ్వని పెట్రో కెమికల్ కారిడార్, కడప స్టీల్ ప్లాంట్, ప్రత్యేక రాష్ట్ర హోదా, వైజాగ్ ఇండస్ట్రియల్ కారిడార్ వంటి వాటి ప్రస్తావనే చేయలేదు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించమన్న మాటే ప్రధాని మోదీ నోటి నుండి రాలేదు. ఆంధ్రప్రదేశ్ వికాసం కొరకు ఎన్డీయేకు ఓటేయమన్నారు. అమరావతి గురించి ప్రస్తావనే లేదు. పవన్ ప్రస్తావించారు. దీనికి ప్రధాని సమాధానం లేదు. బీజేపీ వ్యూహాత్మకంగా టీడీపీ శిబిరంలోకి వెళ్లి కొన్ని సీట్లు తీసుకుని ఏపీలో తన ఉనికిని కాపాడుకునే ప్రయత్నం చేసినట్లు అర్థమౌతోంది.

అంతెందుకు కనీసం తెలుగుదేశం అన్న పదాన్ని ఉచ్చరించడానికి కూడా మోదీ ఇష్టపడలేదు. చంద్రబాబు గతంలో మోదీ గురించి, ఆయన భార్య గురించి అన్న మాటలు అన్నీ ఆయనకు గుర్తున్నట్లు కనిపించింది.

ఇక మోదీ ప్రసంగం కోసం ఎదురు చూస్తున్నారంటూ జనసేనాని పవన్ కల్యాణ్ చాలా చాలా కవితాత్మకంగా చెప్పడానికి ప్రయత్నం చేసినప్పటికీ మోదీ మాత్రం కనీసం స్పందించలేదు. పవన్, చంద్ర బాబులకు మోదీ ప్రసంగం ఏ మాత్రం సంతృప్తిని ఇవ్వలేకపోయింది. రాజకీయంగా బీజేపీ ఆడుతున్న డబుల్ గేమ్‌కు ప్రధాని ప్రసంగం పరాకాష్ఠగా నిలిచింది. కేవలం తన ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చెబుతూ 'ఇండియా' కూటమి అనైక్యత, కేరళలో రాజకీయ అనిశ్చితి గురించి ప్రస్తావించారే తప్ప ఏపీ సమస్య లేమీ ఎత్తలేదు. అన్నింటికంటే కీలకమైనది... చంద్రబాబు, పవన్ కోరుకునేది ఏదీ కూడా ప్రధాని ప్రస్తావించలేదు.

కేంద్రంలో మళ్లీ అధికారంలోకి రావాలి... ఓటు వేయండి అంటూ పదే పదే చెప్పారు. 25కు 25 ఎంపీలు గెలవాలి అన్నారు. తన విమర్శలు తానే దిగమింగి చంద్రబాబు మోదీని పొగిడినప్పటికీ మోదీ మాత్రం స్పందించలేదు. రాజకీయంగా చూస్తే తెలుగుదేశం పార్టీకీ, పవన్‌కూ ఈ ప్రసంగం చెంపపెట్టు లాంటిదే!

వ్యాసకర్త వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు
మొబైల్: 98481 05455

సంతోషమే బలం

మనిషి జీవిత అంతిమ లక్ష్యం సంతోషంగా ఉండడం. ఆనందం వల్ల సానుకూల దృక్పథం పెరిగి, సమస్యలను సులభంగా పరిష్కరించుకోగలం. సంతోషంగా ఉండేవాళ్లలో ఆత్మవిశ్వాసం అధిక స్థాయిలో ఉంటుంది; కొత్త విషయాలు నేర్చుకోవాలనే ఆసక్తి పెరుగుతుందని అనేక శాస్త్రీయ అధ్యయనాలు పేర్కొంటున్నాయి. మనిషిలో సంతోషానికి సూచిక చిరునవ్వు. ఆ నవ్వు రావాలంటే సంతోషంగా ఉండాలి. నేటి ఆధునిక యుగంలో ఇది మనిషి నుండి రోజురోజుకు దూరమైపోతోంది. దీంతో మనిషి తీవ్ర ఒత్తిడికిలోనై అనేక ఆరోగ్య సమస్యలను కొని తెచ్చుకొంటున్నాడు. ఈ క్రమంలో సంతోషం ప్రాముఖ్యతను గుర్తించిన మొదటి దేశం భూటాన్. 1970 నుంచే 'సంతోష సూచీ'యే నిజమైన ఆరోగ్య సూచి అని ప్రపంచానికి చాటింది . ఇక్కడ 'జాతీయ ఆదాయం' కన్నా 'జాతీయ సంతోషానికి' అధిక ప్రాధాన్యం ఇస్తారు. దీన్ని స్ఫూర్తిగా తీసుకొని 2013 నుంచి ఐక్యరాజ్య సమితి సంతోష ప్రాముఖ్యాన్ని ప్రపంచవ్యాప్తంగా తెలియజేస్తూ, ప్రజల జీవన విధానంలో మార్పు తేవడానికి ప్రతియేటా మార్చి 20వ తేదీన 'అంతర్జాతీయ సంతోష దినోత్సవాన్ని' నిర్వహిస్తోంది. ఈ ఏడాది 'ఆనందం కోసం పునర్నిర్మాణం కావడం, దానికనుగుణమైన సమాజాలను నిర్మించడం' అనే ఇతివృత్తంతో నిర్వహిస్తున్నారు.

దేశ ఆర్థికాభివృద్ధితో పాటు అనేక ఇతర అంశాలు ప్రజల సంతోషంపై ప్రభావం చూపుతాయని ఆర్థికవేత్తలు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ స్థాయిలో 'ఐక్యరాజ్య సమితి సుస్థిరాభివృద్ధి సొల్యూషన్ నెట్ వర్క్' ఆధ్వర్యంలో 'స్థూల జాతీయ ఆనందం' ఆధారంగా 'ప్రపంచ సంతోష సూచి'ని కూడా ప్రతియేటా గణించడం జరుగుతుంది. దీనిలో ఆదాయం, ప్రజల ఆరోగ్య జీవనం, సామాజిక మద్దతు, స్వేచ్ఛ, నమ్మకం, ఔదార్యం, తక్కువ అవినీతి తదితర అంశాలను ప్రధానంగా పరిగణనలోకి తీసుకుంటారు. ప్రపంచ వ్యాప్తంగా 146 దేశాలలో సంతోష సూచిలో ఫిన్లాండ్ మొదటి స్థానంలో నిలిచింది. భారతదేశం 126వ స్థానంతో అతి తక్కువ సంతోషకరమైన దేశాలలో ఒకటిగా ఉంది.

ఈ నేపథ్యంలో ప్రజల ఆర్థిక, సామాజిక జీవితంలో మార్పు తీసుకొస్తూ, ఆనందాన్ని నింపాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైన ఉంది. ప్రజలు సైతం ఆరోగ్యం పట్ల స్పృహతో ప్రకృతికి దగ్గరగా జీవిస్తూ ఆనందమైన జీవితాన్ని గడపాలి.

– సంపతి రమేష్ మహారాజ్, జన విజ్ఞాన వేదిక తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి (నేడు అంతర్జాతీయ సంతోష దినోత్సవం)

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: శు.ఏకాదశి రా.3.57 వరకు, తదుపరి ద్వాదశి, నక్షత్రం: పుష్యమి రా.12.33 వరకు, తదుపరి ఆశ్లేష, వర్జ్యం: ఉ.7.20 నుండి 9.01 వరకు, దుర్ముహూర్తం: ఉ.11.43 నుండి 12.31 వరకు, అమృత ఘడియలు: సా.4.40 నుండి 7.22 వరకు ; రాహుకాలం: ప.12.00 నుండి 1.30 వరకు, యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు, సూర్యోదయం: 6.09, సూర్యాస్తమయం: 6.06.

క్లుప్తంగా...

నేటి నుంచి అనంతుని కల్యాణోత్సవాలు



పద్మనాభం (విశాఖపట్నం): పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో బుధవారం నుంచి 26 వరకు అనంతుని కల్యాణోత్సవాలకు ఆలయాధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 17న పెళ్లి రాట వేశారు. సంత నిర్వహించే పాత స్థలం నుంచి 20వ తేదీ రాత్రి పుట్ట బంగారాన్ని కుంతీ మాధవ స్వామి ఆలయంలోని తీసుకువస్తారు. దీంతో అనంతుని కల్యాణోత్సవాలకు అంకురార్పణ జరగుతుంది. విష్వక్సేన పూజ, పుణ్యాహ వాచనం నిర్వహించి పుట్ట బంగారాన్ని తీసుకువచ్చి కల్యాణోత్సవాలకు అంకురార్పణ చేస్తారు. 21న రాత్రి కుంతీ మాధవ స్వామి ఆలయంలో వెంచేసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత అనంతుని ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా రూపొందించిన వేదిక వద్దకు తీసుకువచ్చి వేద పండితులు కల్యాణం నిర్వహిస్తారు. 22న విశేష హోమం, గ్రామ బలిహరణం, మంగళా శాసనం, గ్రామోత్సవం నిర్వహిస్తారు. 23న రాత్రి విశేష హోమం, గ్రామ బలిహరణం అనంతరం పద్మనాభం జంక్షన్ సమీపంలో ఉన్న అనంతుని పుష్కరిణిలో తెప్పోత్సవం జరుపుతారు. 24న రాత్రి విశేష హోమం, గ్రామ బలిహరణం, మంగళా శాసనం నిర్వహిస్తారు. తదుపరి రాత్రి రథోత్సవం నిర్వహిస్తారు. 25న స్వామిని జిల్లా పరిషత్ బంగ్లా సమీపంలో ఉన్న డోలా మండపానికి వెళతారు. 26న రాత్రి శ్రీ పుష్ప యాగంతో అనంతుని కల్యాణోత్సవాలు నిర్వహిస్తారు.

భారత్, యూఎస్ రక్షణ బంధం మరింత బలోపేతం

- ఇండియన్ యూఎస్ అంబాసిడర్ ఎరిక్ గార్సెట్టి



సాక్షి, విశాఖపట్నం: భారత్, అమెరికా మధ్య రక్షణ విభాగ బంధం మరింత బలోపేతం కానుందని భారత్–యూఎస్ రాయబారి ఎరిక్ గార్సెట్టి స్పష్టం చేశారు. పసిఫిక్ సముద్ర జలాల్లో అన్ని దేశాలూ స్వేచ్ఛాయుత వాణిజ్య కార్యకలాపాలు సాగించేలా చేయడమే తమ లక్ష్యమన్నారు. తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రం విశాఖపట్నంలో భారత్, యూఎస్ త్రివిధ దళాల ఆధ్వర్యంలో టైగర్ ట్రయాంఫ్ యుద్ధ విన్యాసాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా.. ఐఎన్ఎస్ జలాశ్వా యుద్ధ నౌక ఆన్‌బోర్డుపై ఇరుదేశాల ప్రతినిధులు మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎరిక్ మాట్లాడుతూ సాగర జలాల సరిహద్దుల్లో చొరబాట్లు, సముద్రపు దొంగల ఆట కట్టించేందుకు భారత్‌తో కలిసి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. యూఎస్ సెవెన్త్ ఫ్లీట్ రిజర్వ్ వైస్ కమాండర్ రియర్ అడ్మిరల్ జోక్విన్ జె మార్టినెజ్ మాట్లాడుతూ టైగర్ ట్రయాంఫ్ నిర్వహణతో భారత్, యూఎస్ మధ్య ఉన్న బంధాన్ని ప్రపంచానికి చాటిచెబుతున్నామన్నారు. తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ రాజేష్ పెందార్కర్ మాట్లాడుతూ టైగర్ ట్రయాంఫ్ విన్యాసాల్లో భాగంగా హార్బర్ ఫేజ్‌లో విపత్తు, యుద్ధ సమయంలో రెండు దేశాల మధ్య పరస్పర సహకారాన్ని ఎలా అందిపుచ్చుకోవాలనే అంశాలతో పాటు ప్రీసెయిల్ చర్చలు, వృత్తిపరమైన విషయాలపై ఎక్స్‌పర్ట్స్ ఎక్స్ఛేంజీలు జరగనున్నాయని తెలిపారు. విన్యాసాల్లో భాగంగా ఈస్టర్న్ నేవల్ కమాండ్ ప్రధాన కేంద్రంలో కమాండ్ కంట్రోల్ సెంటర్, జాయింట్ రిలీఫ్, మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశామని వివరించారు. 29న కాకినాడలో మెడికల్ రిలీఫ్ క్యాంపుతో పాటు.. జాయింట్ ఎక్సర్‌సైజ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. యూఎస్ఎస్ సోమర్‌సెట్ యుద్ధ నౌక కమాండింగ్ ఆఫీసర్ కెప్టెన్ మిచైల్ బ్రాండ్, ఈస్టర్న్ ఫ్లీట్ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండ్ రియర్ అడ్మిరల్ రాజేష్ ధన్‌కర్, ఐఎన్ఎస్ జలశ్వా కమాండింగ్ అధికారి కెప్టెన్ సందీప్ బిశ్వాల్‌తో పాటు ఇరు దేశాల త్రివిధ దళాల ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో చిరుత మృతి



కూడేరు: అనంతపురం జిల్లా కూడేరు మండలం పి.నాగిరెడ్డిపల్లిలో విద్యుదాఘాతంతో చిరుత మృతి చెందిన ఘటన మంగళవారం వేకువజామున జరిగింది. అటవీ శాఖ అధికారుల కథనం ప్రకారం.. బాలరాజు అనే రైతు పొలంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరకు చిరుత వెళ్లగా తీగలు తగిలి విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే చనిపోయింది. వేణుగోపాల్ అనే రైతు తన పొలంలోకి వెళుతూ మార్గమధ్యంలోని బాలరాజు పొలంలో చిరుత చనిపోయిన విషయాన్ని గమనించారు. వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. జిల్లా అటవీ అధికారి (డీఎఫ్‌ఓ) వినీత్ కుమార్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని చిరుత కళేబరాన్ని పరిశీలించారు. మండల పశువైద్యాధికారి శ్రీనివాసులు చిరుత కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించారు.

‘పచ్చ’ ముసుగుతో ‘కోడ్’కూతలా?

గతేడాది ఇచ్చిన పుస్తకాలపై ఇప్పుడు ఏడుపా!



ఉన్నపళంగా చంద్రబాబును గద్దెనెక్కించేయాలనీ... ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టేయాలనీ... ప్రజలను తప్పుదారి పట్టించి అధికార పక్షంపై ఏవగింపు కలిగించాలన్నది రామోజీ ఆకాంక్ష. అందుకోసం పదేపదే అబద్ధాలను అచ్చేయడం... లేనిపోని అభాండాలకోసం పేజీలకు పేజీలు కేటాయించడం... అడ్డగోలుగా ఆరోపణలతో శునకానందం పొందడం ఈనాడుకు నిత్యకృత్యమైపోయింది. వాస్తవాలు తెలుసుకోకుండా అత్యుత్సాహంతో నిబంధనల్ని సైతం వారికి అనుకూలంగా మలచుకుంటున్నారు. గతేడాది ఇచ్చిన పాఠ్యపుస్తకాలపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రాలున్నాయనీ... ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ‘వీటికెలా ముసుగేస్తారు?’ అంటూ సొంత పైత్యాన్ని వండివార్చింది.

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులకు గత ప్రభుత్వం పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు ఇవ్వడంలో విఫలమైంది. నోటు పుస్తకాలు అస్సలు ఇవ్వలేకపోయింది. అప్పులు చేసి వారంతా పుస్తకాలు కొనుక్కోవాల్సిన పరిస్థితి తీసుకొచ్చింది. పైగా ‘పిల్లల చదువుల బాధ్యత ప్రభుత్వానిది కాద’ంటూ ఓ కొత్త వాదాన్ని తీసుకొచ్చింది. ‘ప్రైవేటు స్కూళ్లున్నాయి.. అక్కడ వసతులు బాగుంటాయి, మీకు ఏది కావాలో నిర్ణయించుకోండి’ అంటూ అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు సెలవిచ్చారు. ప్రజలకోసం ప్రభుత్వాలు ఏం చేయాలో తనకే తెలుసన్నట్టు నిత్యం గొంతు చించుకునే రామోజీకి ఆనాడు బాబు చేసిన వ్యాఖ్యల్లో తప్పిదం కనిపించలేదు. పైగా పూర్తిస్థాయిలో సర్కారు బడుల్లోని పిల్లలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్న సీఎం జగన్ ప్రభుత్వంపై విరుచుకు పడుతూ ప్రభుత్వం విద్యను నిర్లక్ష్యం చేసిందనీ, పిల్లలకు పుస్తకాలు ఇవ్వలేదని బరితెగించి అబద్ధాలు రాసింది. తీరా ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 47 లక్షల మంది విద్యార్థులకు విద్యా కానుక కిట్లను జగన్ చిత్రంతో ఉన్నవి అందించినట్టు ఒప్పుకుంది.

‘కోడ్’ నిబంధనలేంటో తెలుసుకోరా..

బాబు కోసం బరితెగించిన ఎల్లో మీడియా అన్నింటికి ముసుగులు వేస్తున్నారు.. మరి ఈ పుస్తకాల సంగతేంటని ప్రశ్నించింది. ‘ఇవన్నీ ఎన్నికల సంఘం కళ్లకు కనిపించవా’ అని నిలదీసింది. వాస్తవానికి ‘ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చాక’ విద్యుత్, నీటి బిల్లులు, బోర్డింగ్ పాస్‌లు, వ్యాక్సినేషన్ సర్టిఫికెట్లు తదితర వాటిపై ప్రజా ప్రతినిధుల ఫొటోలు, సందేశాలు వంటివి ఉండరాదని ఎన్నికల సంఘంతో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. అంటే ఈ నెల 16న ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన తర్వాత ఇచ్చేవాటిపై ఉండరాదని. కానీ 2023 జూన్ 12న పాఠశాలలు తెరిచిన మొదటి రోజు ఇచ్చిన జగనన్న విద్యాకానుక బ్యాగ్, నోటు పుస్తకాలకు, గతేడాది డిసెంబర్‌లో ఇచ్చిన ట్యాబ్స్‌పై ఉన్న సీఎం జగన్ స్టిక్కర్లకు ఈ నిబంధన వర్తించదని తెలిసినా... పాపం బాబుకు ఎలాగైనా మేలు చేయాలని... వారి మెప్పుపొందాలనీ... అబద్ధపు వార్తను రామోజీ నేతృత్వంలోని ఈనాడు పతాక శీర్షిక చేసింది. కానీ వారికి తెలియని విషయమేంటంటే... ఎన్నికల సంఘం నియమావళిని నూరుశాతం పాటించాలన్న లక్ష్యంతో మార్చి 16వ తేదీ తర్వాత పాఠశాలల్లో విద్యార్థులకు ఇచ్చే చిక్కీలపై సీఎం ఫొటో ముద్రించిన ర్యాపర్‌ను తొలగించి విద్యార్థులకు అందించాలని పాఠశాల విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. ఇవేమీ పట్టించుకోకుండానే ‘ఈనాడు’ ఉపాధ్యాయుల పైనా, విద్యాశాఖ ఉన్నతాధికారులపైనా నిందలు వేస్తూ గాలివార్తను అచ్చేసింది.

అసలు నిబంధన ఏంటంటే..

భారత ఎన్నికల సంఘం ప్రచురించిన ఎన్నికల ప్రవర్తనా నియమావళిలోని పేజీ నంబరు 94లోని నిబంధన 5(1)లో ఏముందంటే.. లబ్ధిదారుల కార్డులు, విద్యుత్ బిల్లులు, నిర్మాణ స్థలం ఫలకాలువంటి వాటిపై రాజకీయ కార్యకర్తల ఫొటోల ప్రదర్శన అంశంలో.. లబ్ధిదారులకు పంపిణీ చేసిన లబ్ధిదారుల కార్డులు, మోడల్ ప్రవర్తనా నియమావళి అమలు సమయంలో ఏర్పాటు చేసే ఫలకాలపై ముఖ్యమంత్రులు, మంత్రులు, ఇతర రాజకీయ కార్యకర్తల ఫొటోలు, సందేశాలు ఉండకూడదు. మోడల్ ప్రవర్తనా నియమావళి అమలుకు ముందు పంపిణీ చేసిన /ప్రతిష్ఠించిన లబ్ధిదారుల కార్డులు, నిర్మాణ ఫలకాలు వంటి వాటిపై ఫొటోలు ఉన్నా తప్పులేదు.

ఈనాడుపై చర్యలు తీసుకోండి

ఈసీకి ఫిర్యాదు చేసిన వైఎస్సార్‌సీపీ కార్యదర్శి అప్పిరెడ్డి



ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ నడుపుతున్న ఈనాడు దినపత్రిక టీడీపీ ప్రయోజనాల కోసం పనిచేస్తోందని... దానిపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి మంగళవారం ఎన్నిక సంఘానికి ఫిర్యాదు చేశారు. ప్రజలకు అవసరమైన వార్తా కథనాలను ప్రచురించేందుకు బదులు చంద్రబాబు అభిప్రాయాలను ప్రచురిస్తోందని పేర్కొన్నారు. కొన్ని నెలలుగా ఈనాడు ప్రధాన సంచికలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేసేందుకు, ప్రజల్లో దానిపై దురభిప్రాయం కలిగించేలా వక్రీకరించి కథనాలు అచ్చు వేస్తోందన్నారు. అందుకు నిదర్శనంగా మంగళవారం ప్రచురించిన ‘‘వీటికెలా ముసుగేస్తారు?’’ కథనాన్ని ఎన్నికల సంఘానికి అందించారు. ఈ కథనంలో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అందించిన బ్యాగులు, పుస్తకాలు, ఆహార పదార్థాలపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బొమ్మలకు ఎలా కవర్ చేయాలో ఈనాడు తన అభిప్రాయాలను వ్యక్తం చేసిందన్నారు. భారత ఎన్నికల సంఘం జారీ చేసిన సూచన ప్రకారం ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన తర్వాత లబ్ధిదారుల కార్డులు, విద్యుత్ బిల్లులు, నిర్మాణ సైట్ ఫలకాలు వంటి వాటిపై నేతల ఫొటోలు ఉండకూడదని చెప్పారు. కోడ్ అమలుకు ముందు పంపిణీ చేసిన వాటికి ఈ నిబంధన వర్తించదని ఆయన వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల పునరుద్ధరణ, పాఠశాలలకు మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా చేపట్టిన నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా అన్ని పుస్తకాలు, బ్యాగులు, ఆహార పదార్థాలను ప్రభుత్వమే పంపిణీ చేసిందని వాటిపై ఏపీ సీఎం వైఎస్ జగన్ ఫొటో ఉందనీ, ఇవన్నీ మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలుకు ముందే అందజేసినవని ఫిర్యాదులో పేర్కొన్నారు. కానీ ఈనాడు పత్రిక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పరువు తీసేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఈ రకమైన వార్తా కథనాల ద్వారా సాధారణ ప్రజలను తప్పుదారి పట్టించేందుకు, భారత ఎన్నికల సంఘం పరువు తీయడానికి ప్రయత్నిస్తోందన్నారు. ఈ తప్పుడు కథనం ప్రచురించిన ఆ దినపత్రిక, దాని ప్రచురణకర్తపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నేటి నుంచి శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు

తిరుమల: తిరుమలలో శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు మార్చి 20 నుంచి 24 వరకు జరుగనున్నాయి. రాత్రి 7–8 గంటల వరకు పుష్కరిణిలో స్వామి, అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. తెప్పోత్సవాల్లో భాగంగా 20న శ్రీ సీతాలక్ష్మణ ఆంజనేయ సమేతంగా శ్రీరామచంద్రమూర్తి తెప్పలపై పుష్కరిణిలో 3 చుట్లు తిరుగుతారు. 21న రుక్మిణీ సమేతంగా శ్రీకృష్ణస్వామిగా, 22న శ్రీ భూ సమేతంగా మలయప్పస్వామిగా మూడుసార్లు పుష్కరిణిలో విహరిస్తారు. శ్రీమలయప్పస్వామివారు 23న ఐదు సార్లు, 24న ఏడు సార్లు తెప్పపై పుష్కరిణిలో విహరిస్తారు. ఈ కారణంగా మార్చి 20, 21వ తేదీల్లో సహస్రదీపాలంకార సేవ, మార్చి 22, 23, 24వ తేదీల్లో ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.



తెప్పోత్సవాలకు ముస్తాబైన పుష్కరిణి

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి, బీజేపీ ఎంపీ ప్రతాప్ రావు పాటిల్ (మహారాష్ట్ర), తెలంగాణ ఆర్ అండ్ బి ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాస రాజు, సినీ నటులు రాజీవ్ కనకాల, కుటుంబ సభ్యులు, మోహన్‌లాల్, ముఖేష్ రిషి, అయ్యప్ప పి.వర్మ, జానపద గాయకుడు గోరటి వెంకన్న ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు.

మొదటి భార్యకు టీడీపీ నేత చిత్రహింసలు

- గుట్టుచప్పుడు కాకుండా రెండో వివాహం
- పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు

కుప్పం రూరల్ (చిత్తూరు జిల్లా): పిల్లలు కలగలేదనే నెపంతో నిత్యం తనను చిత్రహింసలకు గురిచేయడమే కాకుండా తన భర్త రెండో పెళ్లి చేసుకున్నాడని టీడీపీ చోటానేతపై పోలీసులకు భార్య ఫిర్యాదు చేసిన ఘటన చిత్తూరు జిల్లాలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కుప్పం మండలం, వసనాడు గ్రామానికి చెందిన టీడీపీ చోటానేత శివశంకర్‌కు, శాంతిపురం మండలం, ముల్లూరు కృష్ణాపురానికి చెందిన హిమబిందుకు 2016లో వివాహం జరిగింది. రెండేళ్లయినా పిల్లలు కలగకపోవడంతో అత్తింటినుంచి హిమబిందుకు వేధింపులు మొదలయ్యాయి. నిత్యం గొడవలు, కొట్టడం, సూటిపోటి మాటలతో ఇబ్బందులు పెట్టేవారు. ఇదిలా ఉండగా.. ఆరు నెలల క్రితం శివశంకర్ బీహార్‌కు చెందిన మరో యువతిని గుట్టుచప్పుడు కాకుండా వివాహం చేసుకున్నాడు. అప్పటి నుంచి శివశంకర్ రెండో భార్యను బయట పెట్టి చాటుగా కాపురం సాగించేవాడు. ఎలాగైనా రెండో భార్యను ఇంటికి తీసుకురావాలని నిశ్చయించుకున్న శివశంకర్ వారం రోజుల క్రితం రెండో భార్యను ఇంటికి తీసుకొచ్చాడు. ఇదేమని ప్రశ్నించిన మొదటి భార్య హిమబిందును తీవ్రంగా గాయపరిచి అర్ధరాత్రి పుట్టినిల్లు ముల్లూరు కృష్ణాపురానికి తీసుకెళ్లి వదిలేసి వచ్చాడు. గాయాల నుంచి కోలుకున్న హిమబిందు మంగళవారం కుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశారు.



చంద్రబాబుతో శివశంకర్ (ఫైల్)

‘జగన్ కోసం నేను సైతం’

శ్రీకాళహస్తి (తిరుపతి జిల్లా): సీఎం వైఎస్ జగన్ మీద అభిమానంతో వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు నియోజకవర్గానికి చెందిన రామిరెడ్డి అమర్‌నాథ్ రెడ్డి బైక్ ప్రచార యాత్ర చేపట్టారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ముందుకు సాగుతున్నారు. విశాఖపట్టణంలోని ఓ ప్రైవేటు కంపెనీలో విధులు నిర్వహించే అమర్ నాథ్‌రెడ్డి జనవరి 27న భీమిలి సిద్ధం సభ నుంచి ప్రారంభించి 48 రోజుల పాటు 75 నియోజకవర్గాల్లో పూర్తి చేశారు. యాత్రలో భాగంగా ఆయన మంగళవారం శ్రీకాళహస్తికి చేరుకున్నారు. శ్రీకాళహస్తి చేరుకున్న అమర్‌నాథ్ రెడ్డిని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పార్టీ కార్యాలయానికి ఆహ్వానించి ఘనంగా సన్మానించారు.



శ్రీకాళహస్తిలో స్థానిక నేతలతో అమర్‌నాథ్‌రెడ్డి

అడవి ఒడికి పులి కూనలు

- తిరుపతి జూలో ఆశ్రయం పొందుతున్న పులి పిల్లల కోసం నల్లమలలో ఎన్‌క్లోజర్లు
- వేటాడి ఆహారాన్ని సేకరించుకునేలా చర్యలు
- ఇందుకోసం కాకినాడ నుంచి చారల దుప్పులు
- ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోనే తొలిసారి ప్రయోగాత్మకంగా ఏర్పాటు



పులుల ఎన్‌క్లోజర్ (నమూనా చిత్రం)

పెద్దదోర్నాల: తల్లి నుంచి విడిపోయి తిరుపతి జూ పార్క్‌లో ఆశ్రయం పొందుతున్న పులి పిల్లలు అతి త్వరలో నల్లమల అభయారణ్యంలో అడుగిడనున్నాయి. తల్లినుంచి తప్పిపోయి జనారణ్యంలో దొరికిన పులి కూనలకు నల్లమల అభయారణ్యంలోని ఇతర జంతువులను వేటాడటం నేర్పించేందుకు భారీ టైగర్ ఎన్‌క్లోజర్లను అధికారులు సిద్ధం చేస్తున్నారు. సుమారు 14 నెలల క్రితం నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం పెద్ద గుమ్మడాపురంలో నాలుగు ఆడ పులి పిల్లలు తల్లి నుంచి విడిపోయి దిక్కుతోచని స్థితిలో ప్రజల కంటపడిన విషయం విదితమే. తల్లి జాడ లేకపోవటంతో పులి పిల్లలను అటవీ శాఖ సిబ్బంది తిరుపతిలోని వెంకటేశ్వర జూ పార్కుకు తరలించి సంరక్షిస్తున్నారు. ఆరోగ్యం విషమించి ఓ పులిపిల్ల మృతి చెందగా.. మిగిలిన పులి పిల్లలకు రుద్రమ్మ, హరిణి, అనంతగా నామకరణం చేశారు. మూడు పిల్లలు పెరిగి పెద్దవవుతుండటంతో వాటిని అటవీ వాతావరణంలో వదిలి పెట్టేందుకు అటవీ శాఖ నిర్ణయం తీసుకోవటంతో అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

తెలుగు రాష్ట్రాల్లో తొలి ప్రయోగం

తెలుగు రాష్ట్రాల్లోనే తొలిసారిగా పులి పిల్లల సంరక్షణ కేంద్రాన్ని ప్రయోగాత్మకంగా కొర్రప్రోలు రేంజి పరిధిలోని పెద్ద పెంటలో ఏర్పాటు చేశారు. తిరుపతి జూలో పెరుగుతున్న పెద్దపులులు సహజసిద్ధంగా వాటి ఆహారాన్ని అవి వేటాడగలిగేలా చేయటంతోపాటు అనాథలైన, తీవ్ర గాయాల పాలైన పెద్దపులులను ఇక్కడి నర్సరీ ఎన్‌క్లోజర్‌లలో పెట్టి సంరక్షిస్తారు. పులుల సంరక్షణకు అక్కడి వాతావరణం అనుకూలంగా ఉండటంతో 15 హెక్టార్లలో ప్రత్యేకమైన ఎన్‌క్లోజర్లను అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఇక్కడ పులులను సంరక్షించేందుకు ఎల్లవేళలా వెటర్నరీ వైద్యులు ఎన్‌క్లోజర్ల వద్ద అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం తిరుపతి జూ పార్కులో ఉన్న పులి పిల్లలు వేటాడే సహజసిద్ధ గుణాన్ని మరిచిపోయి జూ అధికారులు అందజేసే ఆహారంతోనే జీవిస్తున్నాయి. వాటిని జూ పార్కు నుంచి తరలించి నేరుగా అభయారణ్యంలో వదిలి పెడితే అవి ప్రమాదాల బారినపడే ప్రమాదం ఉందని అధికారులు భావిస్తున్నారు. దీంతో వాటిని ఎన్‌క్లోజర్లలో ఉంచుతారు. స్వతహాగా కొన్ని వన్యప్రాణులను వేటాడి ఆహారాన్ని అవి సేకరించుకోగలిగేలా చూస్తారు. పులి పిల్లలు వేట నేర్చుకోవటం కోసం కాకినాడలోని నాగార్జున ఫెర్టిలైజర్స్ జూ పార్కు నుంచి ప్రత్యేకంగా 37 చారల దుప్పులను నల్లమలకు తరలించి వాటిని ఎన్‌క్లోజర్లలో సంరక్షిస్తున్నారు. కొద్దిరోజుల అనంతరం వీటిని పులుల కోసం ఏర్పాటు చేసిన ఎన్‌క్లోజర్లలో వదలటం ద్వారా పులులకు వేటాడటాన్ని అలవాటు చేస్తారు. అవి వ్యక్తిగతంగా 50 వన్యప్రాణులను వేటాడిన తరువాత వాటి శక్తి యుక్తులను గుర్తించి తదుపరి చర్యలను తీసుకుంటారు.



పెద్దపెంట జింకల ఎన్‌క్లోజర్లలో స్ప్రింకర్ల మధ్య తిరుగుతున్న చారల దుప్పులు

చారల దుప్పుల కోసం ప్రత్యేక ఎన్‌క్లోజర్

కాకినాడ నుంచి ప్రత్యేకంగా రప్పించిన చారల దుప్పుల కోసం కొర్రప్రోలు రేంజి పరిధిలోని పెద్దపెంటలో 20 మీటర్ల పొడవు, వెడల్పుతో ప్రత్యేకంగా ఓ ఎన్‌క్లోజర్‌ను ఏర్పాటు చేశారు. వీటికోసం ఎన్‌క్లోజర్ బయట రూ.2.50 లక్షలతో సోలార్ బోరు అమర్చారు. దానినుంచి ఎన్‌క్లోజర్‌లోకి ప్రత్యేకంగా పైప్‌లైన్‌ను ఏర్పాటు చేసి నీటిని విడుదల చేస్తున్నారు. వీటి అవసరాలను తీర్చేందుకు సాసర్‌పిట్లు, నీటి గుంతలను ఏర్పాటు చేశారు. వేసవిని తట్టుకునేలా ఎన్‌క్లోజర్ చలువ పందిళ్లు వేసి నీటిని వెదజల్లేలా స్ప్రింక్లర్లను ఏర్పాటు చేశారు. వీటి ఆహారం కోసం వినుకొండ, మార్కాపురం ప్రాంతాల నుంచి సుబాబుల్, బుల్ ఫీడ్‌ను రప్పించి ఆహారంగా వేస్తున్నారు. చారల దుప్పులు సంతానోత్పత్తి చేసేలా పెద్దదోర్నాల రేంజి పరిధిలోని తుమ్మలబైలు వద్ద ఒక ఎన్‌క్లోజర్, నెక్కంటి రేంజి పరిధిలో మరో రెండు ఎన్‌క్లోజర్లను సిద్ధం చేస్తున్నారు.

యుద్ధప్రాతిపదికన ఎన్‌క్లోజర్ల ఏర్పాటు



“ యుద్ధ ప్రాతిపదికన టైగర్ ఎన్‌క్లోజర్లను సిద్ధం చేస్తున్నాం. కాకినాడ నుంచి ఇక్కడకు రప్పించిన చారల దుప్పుల కోసం కూడా ఎన్‌క్లోజర్లు ఏర్పాటు చేసి సోలార్ బోర్ ద్వారా నీరు, ఆహారాన్ని అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. పులి పిల్లలకు వేటాడటంలో శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. – ప్రసన్నజ్యోతి, ఫారెస్ట్ రేంజి అధికారి, కొర్రప్రోలు

సముద్ర తీరానికి కొట్టుకొచ్చిన మొసలి

- 50 నుంచి 60 కేజీల బరువు
- బంధించిన ఫారెస్ట్ ఆఫీసర్లు
- గుంటూరు హెడ్ ఆఫీస్‌కు తరలింపు



కొత్తపట్నం: సముద్ర తీరానికి కొట్టుకొచ్చిన ఓ మొసలి మత్స్యకారులను ముప్పతిప్పలు పెట్టింది. అటవీ శాఖ, మత్స్యశాఖ అధికారులు దానిని అతికష్టం మీద బంధించారు. ఈ ఘటన ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం రాజుపాలెం గ్రామ పరిధి పట్టపుపాలెం తీరంలో మంగళవారం చోటుచేసుకుంది. సముద్ర తీరంలో అలల తాకిడికి ఒక మొసలి ఒడ్డుకు వస్తూ..మళ్లీ లోపలికి వెళ్తూ ఉంది. అది గమనించిన మత్స్యకారులు జిల్లా మత్స్యకార సహకార సంఘ అధ్యక్షుడు వాయల శ్రీనుకు సమాచారం అందించారు. ఆయన మత్స్యశాఖ జేడీ ఆవుల చంద్రశేఖర్‌రెడ్డికి.. జేడీ ద్వారా జిల్లా ఫారెస్టు అధికారి జి.శ్రీనివాసరావుకు సమాచారం అందింది. అటవీ, మత్స్యశాఖ అధికారులు వచ్చి అతికష్టం మీద మత్స్యకారుల సాయంతో మొసలిని బంధించారు. జిల్లా అటవీ శాఖాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ మొసలి బరువు సుమారు 50 నుంచి 60 కేజీలు ఉంటుందని.. ఇవి ఎక్కువగా మల్లవరం, రామతీర్థం, గుండ్లకమ్మ, పాలేరు రిజర్వాయర్లలో ఉంటాయని తెలిపారు. రిజర్వాయర్ల నుంచి సముద్రానికి నీరు వెళ్లే కాలువల ద్వారా ఇవి సముద్రంలోకి వెళ్తుంటాయన్నారు. మొసలిని మంగళగిరి హెడ్ ఆఫీస్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట సబ్ డీఎఫ్ పి.శ్రీనివాసరావు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పి.నరసింహారావు ఉన్నారు.

వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి

- రిటైర్డ్ జడ్జి జస్టిస్ శేషశయనారెడ్డి
- స్వగ్రామంలో స్థానిక వలంటీర్లకు సత్కారం

బనగానపల్లె రూరల్: రాష్ట్రంలో వలంటీర్ల సేవలు వెలకట్టలేనివని, వారి సేవలు ప్రతి ఒక్కరూ గుర్తించాలని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.శేషశయనారెడ్డి, ఆయన సతీమణి రిటైర్డ్ జిల్లా జడ్జి ప్రవీణ అన్నారు. మంగళవారం నంద్యాల జిల్లా బనగానపల్లె మండలం టంగుటూరు గ్రామంలోని స్వగృహంలో స్థానిక 20 మంది వలంటీర్లను గ్రామ పెద్దలతో కలసి జస్టిస్ శేషశయనారెడ్డి దంపతులు సత్కరించారు. ఈ సందర్భంగా శేషశయనారెడ్డి మాట్లాడుతూ.. అంకితభావంతో వలంటీర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ముఖ్యంగా కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలు బయట తిరిగేందుకు భయపడ్డారని, ఆ సమయంలో వలంటీర్లు ఎంతో ధైర్యంగా ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించారని గుర్తు చేశారు. గతంలో ప్రభుత్వ పథకాల గురించి తెలియక ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఇబ్బంది పడేవారన్నారు. సీఎం వైఎస్ జగన్ ఏర్పాటు చేసిన వలంటీర్ల వ్యవస్థతో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు చేరుతున్నాయన్నారు. అర్హత కలిగిన వారిని గుర్తించి స్వయంగా వలంటీర్లే దరఖాస్తు చేయించి పథకాలు మంజూరు చేయిస్తున్నారన్నారు. ఇంతటి మంచి పనులు చేస్తున్న వలంటీర్ల సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించి అభినందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రిటైర్డ్ జిల్లా జడ్జి, అనంతపురం జెఎన్‌టీయూ, ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ కళాశాల అంబుడ్స్‌మన్ బి.ప్రవీణ మాట్లాడుతూ.. వలంటీర్లు తమకు కేటాయించిన 50 కుటుంబాల కష్టనష్టాలు తెలుసుకోవడం, ఆ కుటుంబాల్లో ఓ సభ్యునిగా సేవలు అందించడం అభినందించదగ్గ విషయమన్నారు.



వలంటీర్‌ను సన్మానిస్తున్న విశ్రాంత న్యాయమూర్తి శేషశయనారెడ్డి దంపతులు

రోబో తోటమాలి!

తెగుళ్లు సోకిన మొక్కల ఏరివేత ● నెదర్లాండ్స్‌లో విస్తరిస్తున్న వాడకం

తులిప్ తోటల్లో చీడ పీడలను గుర్తిస్తున్న ఏఐ రోబో



కృత్రిమ మేధ ఇందుగలదు, అందులేదనే సందేహానికి తావులేకుండా విస్తరిస్తోంది. అన్ని రంగాల్లోనూ ఏఐ వాడకం ఇంతింతై... అన్నట్టుగా క్రమంగా పెరిగిపోతోంది. వ్యవసాయంలో కూడా ఇప్పటికే కృత్రిమ మేధను పలు రకాలుగా ఉపయోగిస్తున్నారు. నెదర్లాండ్స్‌లో తులిప్స్ రైతులు ఈ విషయంలో ఇంకో అడుగు ముందుకేశారు. తెగుళ్ల బారిన పడ్డ పూల ఏరివేతకు హైటెక్ బాట పట్టారు. వాటిని ఎప్పటికప్పుడు గుర్తించి ఏరేసేందుకు ఏఐ సాయంతో రూపొందిన రోబోను ఉపయోగిస్తున్నారు. ఖరీదు చాలా ఎక్కువే అయినా ఈ రోబో మనుషులకు ఏమాత్రంతీసిపోకుండా పని పూర్తి చేస్తూ మన్ననలు అందుకుంటోంది. దాంతో నెదర్లాండ్స్ అంతటా తులిప్ తోటల్లో ఈ రోబోల వాడకం నానాటికీ పెరిగిపోతోంది.

అందాల తులిప్ పూలకు నెదర్లాండ్స్ పెట్టింది పేరు. అంతేగాక ప్రపంచంలోకెల్లా అతి పెద్ద తులిప్స్ ఉత్పత్తిదారు కూడా. సీజన్లో విరగబూసి అందాలు వెదజల్లే అక్కడి తులిప్ తోటలను చూసేందుకు ప్రపంచం నలుమూలల నుంచీ పర్యాటకులు బారులు తీరతారు. ఇలా తులిప్స్ సాగు ఉత్పత్తిపరంగానే గాక పర్యాటకంగా కూడా నెదర్లాండ్స్ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. అయితే వాటి సాగు ఖరీదైన వ్యవహారం. పూలను, మొక్కలను కంటికి రెప్పలా కాపాడుకోవాలి. చీడపీడల బారిన పడకుండా నిరంతరం పర్యవేక్షిస్తుండాలి. వైరస్‌లు, తెగుళ్ల బారిన పడ్డ పూలు, మొక్కలను ఎప్పటికప్పుడు కనిపెట్టి ఏరివేయడం చాలా కీలకం. లేదంటే మొక్కలు బలహీనపడిపోతాయి. పూలు కూడా చిన్నగా, బలహీనంగా పూస్తాయి. పైగా వైరస్ తోటంతా విస్తరించి మొత్తానికే చేటు తప్పదు. ఇప్పటిదాకా మనుషులే రాత్రింబవళ్లు తోటల్లో కలియదిరుగుతూ ఒక్కో మొక్కనూ, పువ్వునూ పట్టి చూస్తూ పాడైన వాటిని గుర్తించి ఏరేసేవారు. ఇందుకు ప్రత్యేక నైపుణ్యం అవసరం. వారిని సిక్‌నెస్ స్పాటర్స్‌గా పిలిచేవారు. కానీ ఏఐ సాయంతో తయారు చేసిన రోబో ఇప్పుడు వారికి దీటుగా ఈ పని చేసి పెడుతోంది. తులిప్ తోటలను తెగుళ్ల బారినుంచి కాపాడే హైటెక్ ఆయుధంగా మారుతోంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 45కు పైగా ఏఐ రోబోలు తులిప్ తోటలను కాపు కాస్తున్నాయి. చీడపీడలు, రోగాల బారినుంచి వాటిని కాపాడే పనిలో తలమునకలుగా ఉన్నాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఇలా పని చేస్తుంది...

- ఏఐ రోబో తులిప్ తోటల్లో ఒక్కో సాలు గుండా గంటకు కిలోమీటర్ వేగంతో నింపాదిగా కదులుతుంది.
- ఒక్కో మొక్కనూ, ఒక్కో పూవునూ, దాని తాలూకు రెమ్మలను అణువణువూ పరీక్షిస్తుంది. ఫ్రంట్ కెమెరాతో వేలాది ఫొటోలు తీస్తుంది.
- తనలో స్టోరై ఉన్న సమాచారం సాయంతో ఆ ఫొటోలను కూలంకషంగా విశ్లేషిస్తుంది. తద్వారా సదరు మొక్క, పూవు పాడైందీ, బాగున్నదీ నిర్ధయిస్తుంది.
- పాడైనవాటిని ఎప్పటికప్పుడు ఏరేస్తూ ముందుకు సాగుతుంది.
- ఈ రోబోలను తయారు చేసింది హెచ్2ఎల్ రోబోటిక్స్ లిమిటెడ్‌కు చెందిన ఎరిక్ డీ జోంగ్ కంపెనీ.
- తెగుళ్ల బారిన పడ్డ మొక్కలు, పూలను పక్కగా గుర్తించేందుకు కావాల్సిన సమాచారమంతటినీ రోబోకు ఫీడ్ చేసినట్టు కంపెనీ వివరించింది.
- ఈ సమాచారాన్ని తులిప్స్ సాగు చేసే రైతులు, సిక్‌నెస్ స్పాటర్ల నుంచి కంపెనీ సేకరించింది.

కచ్చితత్వంతో కూడిన సాగు...

అలెన్ విసర్ అనే ఆసామి తన తులిప్ తోటలో రెండేళ్లుగా ఏఐ రోబోను వాడుతున్నాడు. ఆయన కుటుంబం మూడు తరాలుగా తులిప్స్‌సాగు చేస్తోంది. ''ఈ రోబో ఖరీదు 2 లక్షల డాలర్లు! అంత డబ్బుతో ఓ ఖరీదైన స్పోర్ట్స్ కారే కొనుక్కోవచ్చు'' అన్నాడాయన. అయితే, 'స్పోర్ట్స్ కారు పాడైన తులిప్‌లను ఏరిపడేయదు కదా!' అంటూ చమత్కరించాడు. ''ఈ రోబో ఖరీదైనదే. కానీ నిపుణులైన సిక్‌నెస్ స్పాటర్లు నానాటికీ తగ్గిపోతున్న సమయంలో సరిగ్గా చేతికి అందివచ్చింది'' అని చెప్పాడు. దీన్ని 'కచ్చితత్వంతో కూడిన సాగు'గా అభివర్ణించాడు!

కొసమెరుపు

నెదర్లాండ్స్ ఉత్తర కోస్తా తీరంలో ప్రఖ్యాత డబ్ల్యూఏఎం పెన్సింగ్స్ తులిప్ తోటలోని ఏఐ రోబోకు అక్కడే జీవితాంతం సిక్‌నెస్ స్పాటర్‌గా పని చేసి రిటైరైన థియో వాన్‌డర్ వూర్ట్ పేరు పెట్టారు. దీని పనితీరు ఆయన్ను కూడా మెప్పించడం విశేషం. ''తోటల్లో తిరిగి మా నడుములు పడిపోయేవి! మా పనిని ఈ రోబో అలవోకగా చేసేస్తోంది. పాడైన మొక్కలు, పూలను మాకు ఏ మాత్రమూ తీసిపోని విధంగా గుర్తించి ఏరేస్తోంది'' అంటూ కితాబిచ్చాడాయన!

హెచ్-1బీ రిజిస్ట్రేషన్‌కు ఆఖరు తేదీ మార్చి 22

వాషింగ్టన్: 2025వ సంవత్సరానికి గాను హెచ్-1బీ వీసాల ప్రాథమిక నమోదుకు గడువు మార్చి 22వ తేదీతో ముగియనుందని యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) తెలిపింది. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో యూఎస్‌సీఐఎస్ వెబ్‌సైట్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని, సంబంధిత ఫీజును చెల్లించాలని సూచించింది. ఇందుకు అవసరమైన ఐ-907, ఐ-129 వంటి ముఖ్యమైన దరఖాస్తులను కూడా ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చని వివరించింది. అదేవిధంగా, హెచ్-1బీ క్యాప్ పిటిషన్లకు ఏప్రిల్ ఒకటి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తామని పేర్కొంది. నాన్ క్యాప్ దరఖాస్తులు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండే తేదీలను తర్వాత ప్రకటిస్తామని తెలిపింది. భారతీయ ఐటీ నిపుణులు ఎక్కువగా దరఖాస్తు చేసుకునే నాన్ ఇమిగ్రాంట్ వీసా హెచ్-1బీ. అమెరికా కంపెనీలు భారత్, చైనా వంటి దేశాల నుంచి వేలాది మంది విదేశీ ఐటీ నిపుణులను ఈ వీసాపైనే నియమించుకుంటాయి.

కాలుష్య రాజధానిగా ఢిల్లీ

- ప్రపంచంలోనే అత్యధిక కాలుష్య మెట్రోప్రాంతంగా బిహార్‌లోని బెగుసరాయ్‌కు టాప్ ర్యాంక్
- ప్రపంచ వాయు నాణ్యతా నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: 'అత్యంత కాలుష్య దేశ రాజధాని' అప్రతిష్ట కిరీటాన్ని ఢిల్లీ మరోసారి తన నెత్తిన పెట్టుకుంది. స్విట్జర్లాండ్‌కు చెందిన ఐక్యూఎయిర్ సంస్థ ప్రపంచ వాయు నాణ్యతా నివేదిక-2023లో పలు అంశాలను ప్రస్తావించింది. నివేదికలో వెల్లడైన వివరాల ప్రకారం.. ప్రపంచంలోనే అత్యంత కాలుష్యంతో నిండిన మెట్రోపాలిటన్ ప్రాంతంగా బిహార్‌లోని బెగుసరాయ్ నిలిచింది. ఘనపు మీటర్‌కు 54.4 మైక్రోగ్రామ్‌ల చొప్పున వార్షిక సూక్ష్మధూళికణాల(పీఎం 2.5) గాఢత ఉన్న దేశాల జాబితాలో భారత్ మూడో స్థానంలో నిలిచింది. 79.9 మైక్రోగ్రామ్‌లతో బంగ్లాదేశ్ తొలిస్థానంలో, 73.7 మైక్రోగ్రామ్‌లతో పాకిస్తాన్ రెండోస్థానంలో నిలిచింది. గత ఏడాది ఘనపు మీటర్‌కు కేవలం 53.4 మైక్రోగ్రామ్‌ల వార్షిక సూక్ష్మధూళి కణాల(పీఎం 2.5)గాఢతతో భారత్ ఎనిమిదో స్థానంలో ఉండగా ఇటీవలికాలంలో దేశంలో కాలుష్యం విపరీతంగా కమ్ముకుని భారత స్థానం దారుణంగా మూడో స్థానానికి ఎగబాకడం ఆందోళనకరం. ఇక బిహార్‌లోని బెగుసరాయ్ గత ఏడాది కాలుష్యప్రాంతాల జాబితాలోనే లేదు. కానీ ఈ ఏడాది ఘనపు మీటర్‌కు 118.9 మైక్రోగ్రామ్‌ల పీఎం2.5 గాఢతతో ప్రపంచంలోనే అతి కాలుష్య మెట్రోపాలిటన్ పట్టణంగా అప్రతిష్టను మూటగట్టుకుంది. ఆ తర్వాతి స్థానాలో గువాహటి, ఢిల్లీ, పంజాబ్‌లోని ముల్లాన్‌పూర్ నిలిచాయి.

నాలుగుసార్లు టాప్ ర్యాంక్

ఢిల్లీ పీఎం2.5 గాఢత గత ఏడాది 89.1 మైక్రోగ్రాములు ఉంటే ఈసారి మరికాస్త పెరిగి 92.7 మైక్రోగ్రాములకు చేరుకుంది. దీంతో విపరీతమై కాలుష్యం కారణంగా 2018 ఏడాది నుంచి చూస్తే నాలుగుసార్లు మోస్ట్ పొల్యూటెడ్ క్యాపిటల్ సిటీ కిరీటాన్ని ఢిల్లీకే కట్టబెట్టారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాల ప్రకారం ఒక ఘనపు మీటర్‌కు 5 మైక్రోగ్రాములకు మించి సూక్ష్మధూళి కణాలు ఉండకూడదు. కానీ భారత్‌లోని 136 కోట్ల ప్రజలు అధిక వాయుకాలుష్యం బారిన పడ్డారని తాజా నివేదిక ఘోషిస్తోంది. దేశ జనాభాలో 96 శాతం మంది అంటే 133 కోట్ల మంది డబ్ల్యూహెచ్‌వో పరిమితికి ఏడు రెట్లు మించి కాలుష్యమయ వాతావరణంలో జీవిస్తున్నారు. భారత్‌లోని 66 శాతం నగరాలు సగటున ఘనపు మీటర్‌కు 35 మైక్రోగ్రామ్‌ల ధూళికణాలున్న వాయుకాలుష్యం బారిన పడ్డాయి.

విభిన్న మార్గాల్లో, విస్తృతస్థాయి డేటా

ప్రపంచవ్యాప్తంగా 134 దేశాల్లో ఏర్పాటుచేసిన 30,000 వాయునాణ్యతా ప్రమాణాల స్టేషన్లు, సెన్సార్లు సేకరించిన డేటాను క్రోడీకరించి ఈ నివేదికను తయారుచేసినట్లు ఐక్యూఎయిర్ తెలిపింది. అధ్యయన సంస్థలు, ప్రభుత్వ విభాగాలు, విశ్వవిద్యాలయాలు, విద్యా సంస్థలు, ప్రభుత్వేతర లాభాపేక్షలేని సంస్థలు, ప్రైవేటు కంపెనీలు, పౌర శాస్త్రవేత్తల నుంచి తీసుకున్న డేటాను ఈ నివేదిక కోసం వినియోగించినట్లు సంస్థ పేర్కొంది.

ఆసియా '100'లో 83 భారత్‌లోనే

ప్రపంచవ్యాప్తంగా కాలుష్యానికి కేరాఫ్ అడ్రస్‌గా భారత్ పేరుమోస్తోంది. ఆసియాలో అత్యంత కాలుష్యమయ 100 నగరాల జాబితా ప్రకటించగా అందులో 83 నగరాలు భారత్‌లో ఉండటం దారుణ పరిస్థితికి దర్పణం పడుతోంది. కొన్ని నగరాల్లో కాలుష్యం డబ్ల్యూహెచ్‌వో పరిమితిని పది రెట్లు దాటేయడం గమనార్హం. కాలుష్యానికి సంబంధించి ప్రపంచవ్యాప్తంగా 7,800 నగరాలను పరిశీలిస్తే అందులో డబ్ల్యూహెచ్‌వో పరిమితికి లోబడి కేవలం 9 శాతం నగరాలు ఉండటం చూస్తే పరిస్థితి చేయిదాటిపోయిందని అర్థమవుతోంది. ' ఫిన్లాండ్, ఎస్తోనియా, ప్యూర్టోరికో, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, బెర్ముడా, గ్రెనెడా, ఐస్‌ల్యాండ్, మారిషస్, ఫ్రెంచ్ పాలినేసియా దేశాల్లో మాత్రం వాయు నాణ్యత బాగుంది.

అసమ్మతిపై హాంకాంగ్ ఉక్కుపాదం

హాంకాంగ్: హాంకాంగ్‌లో పౌర హక్కులకు మరింతగా కత్తెర పడింది. అసమ్మతిని ఉక్కుపాదంతో అణచివేసేందుకు వీలు కల్పించే జాతీయ భద్రతా చట్టానికి హాంకాంగ్ పార్లమెంటు మంగళవారం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. హాంకాంగ్‌ను చెప్పుచేతల్లో ఉచుకున్న చైనా స్వతంత్ర పాలన కోసం అక్కడ తలెత్తుతున్న ఆందోళనలను ఎప్పటికప్పుడు అణచివేస్తూ వస్తోంది. ప్రజాస్వామిక పాలన కోసం 2019లో జరిగిన ఆందోళనలపై అయితే ఉక్కుపాదమే మోపింది. తాజా చట్టం ఆమోదంలో చట్టసభలో మెజారిటీ వర్గమైన చైనా విధేయులు కీలకపాత్ర పోషించారు. దీనిప్రకారం ఆందోళనకారులపై దేశద్రోహం, బయటి శక్తులతో కుమ్మక్కు, సాయుధ తిరుగుబాటు, గూఢచర్యం, దేశ రహస్యాల వెల్లడి వంటి అభియోగాలు మోపవచ్చు. జీవిత ఖైదు సహా పలు కఠిన శిక్షలు విధించవచ్చు. అభ్యంతకర సాహిత్యంతో పట్టుబడ్డా కఠిన జైలు శిక్షలు ఖాయం. ఈ చట్టంతో హాంకాంగ్‌లో పౌర హక్కులు మరింతగా కుంచించుకుపోతాయన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. 2020లో కూడా హాంకాంగ్‌లో ఇలాంటి చట్టాన్ని చైనా అమల్లోకి తెచ్చింది.



మంగళవారం కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ భేటీలో సోనియా గాంధీ, పార్టీ చీఫ్ ఖర్గే

పంచ 'న్యాయ్'లతో ప్రజల ముందుకు

- సీడబ్ల్యూసీ భేటీలో కాంగ్రెస్ నేతల నిర్ణయం
- దేశం మార్పు కోరుతోంది: ఖర్గే

సాక్షి, న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల్లో రైతులు, మహిళలు, యువత, శ్రామికుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ ఇచ్చిన ఐదు ప్రధాన గ్యారంటీలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) నిర్ణయించింది. భాగీదారి న్యాయ్, కిసాన్ న్యాయ్, నారీ న్యాయ్, శ్రామిక్ న్యాయ్, యువ న్యాయ్ దేశ ప్రజలకు న్యాయం దక్కేలా చేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. యువత, మహిళలు, కార్మికులు, కర్షకులు, అణగారిన వర్గాల కోసం రూపొందించిన ఈ ఐదు 'న్యాయ్' హామీలను దేశవ్యాప్తంగా ప్రతి ఇంటి చెంతకు చేర్చాలని పార్టీ పిలుపునిచ్చింది. కర్ణాటక, తెలంగాణ ఎన్నికల్లో హామీలను ఇచ్చి, అమలు చేసిన మాదిరే దేశవ్యాప్తంగా కాంగ్రెస్ తన హామీలను అమలు చేస్తుందన్న నమ్మకాన్ని ప్రజల్లో కల్పించాలని నిర్ణయించింది. పి.చిదంబరం నేతృత్వంలోని కమిటీ ఇచ్చిన మేనిఫెస్టోకు ఆమోదం తెలిపిన సీడబ్ల్యూసీ, మరో మూడు, నాలుగు రోజుల్లో పూర్తి మేనిఫెస్టోను అధికారికంగా ప్రజల ముందుంచే బాధ్యతను పార్టీ చీఫ్ ఖర్గేకు కట్టబెట్టింది. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి పార్టీ మేనిఫెస్టోపై చర్చించి, ఆమోదించేందుకు సీడబ్ల్యూసీ మంగళవారం ఢిల్లీలోని పార్టీ కార్యాలయంలో భేటీ అయింది. ఈ సమావేశానికి పార్టీ మాజీ చీఫ్‌లు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో పాటు అంబికా సోనీ, ప్రియాంక గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. 'దేశం మార్పును కోరుకుంటోంది. 2004 సార్వత్రిక ఎన్నికలకు ముందు ఎన్‌డీఏ కూటమి ఇచ్చిన 'భారత్ వెలిగిపోతోంది' నినాదానికి ఏ గతి పట్టిందో, ప్రస్తుతం బీజేపీ ప్రభుత్వం ఇస్తున్న గ్యారంటీలకు అదే గతి పడుతుంది' అని ఖర్గే వ్యాఖ్యానించారు.

అర్థంలేని వాదనలొద్దు

అరుణాచల్ ముమ్మాటికీ భారత్‌లో అంతర్భాగమే: కేంద్రం

న్యూఢిల్లీ: అరుణాచల్‌ప్రదేశ్ చైనాలో భాగమన్న ఆ దేశ వ్యాఖ్యలపై భారత్ ఆగ్రహం వ్యక్తంచేసింది. ''అర్థం లేని వాదనలు ఆపండి. అరుణాచల్ ముమ్మాటికీ భారత్‌లో అంతర్భాగం' అని మరోమారు స్పష్టంచేసింది. అరుణాచల్‌లో ప్రధాని మోదీ పర్యటనపై చైనా వ్యక్తంచేసిన అభ్యంతరాలను భారత్ తోసిపుచ్చడంతో చైనా మళ్లీ అదే వాదన మొదలెట్టింది. దీంతో మంగళవారం భారత విదేశాంగ శాఖ స్పందించింది. ' నిరాధార ఆరోపణలు చేసినంత మాత్రాన అవి నిజాలైపోవు. అరుణాచల్ ఎల్లప్పుడూ భారత్‌లో విడదీయలేని భాగం. దేశంలో అంతర్భాగం. భారత ప్రభుత్వం అక్కడ చేపట్టే అభివృద్ధి పనుల వల్ల అక్కడి వారు ప్రయోజనం పొందుతూనే ఉంటారు' అని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ వ్యాఖ్యానించారు. అరుణాచల్ అంశాన్ని చైనా తెరమీదకు తేవడం ఈ నెలలో ఇది రెండోసారి. అరుణాచల్‌ను తమదిగా పేర్కొంటూ చైనా ఆ రాష్ట్రానికి 'జాంగ్నాన్' అని పేరు పెట్టుకుంది. చైనాతో సరిహద్దు వెంబడి, ఫార్వర్డ్ పోస్టుల వెంట బలగాల మొహరింపునకు వీలుగా సొరంగ మార్గాన్ని ఇటీవల ప్రధాని మోదీ ప్రారంభించడంతో భారత్‌పై మరోసారి అక్కసు వెళ్లగక్కింది.

వాళ్లే అంతర్ధానమౌతారు

విపక్షాలపై మరోమారు మోదీ విమర్శలు



సేలం(తమిళనాడు)/పాలక్కడ్(కేరళ): పక్షాల 'ఇండియా' కూటమిపై ప్రధాని మోదీ విమర్శల జడి కొనసాగుతోంది. 'శక్తి'ని అంతం చేయాలని బయల్దేరిన వాళ్లే నాశనమవుతారని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. కొద్దిరోజులుగా దక్షిణభారత రాష్ట్రాల్లో సుడిగాలి పర్యటనలు చేస్తున్న మోదీ మంగళవారం సైతం తమిళనాడు, కేరళలో పర్యటించి ప్రచారసభల్లో పాల్గొన్నారు. సేలంలో జరిగిన సభలో మోదీ ప్రసంగించారు. ' తమిళనాడులో కాంగ్రెస్, డీఎంకేలు ఒక నాణానికి రెండు పార్శ్వాలు. అవినీతి, వారసత్వ రాజకీయాలతో అంటకాగాయి. ఇతర మతాలపై పల్లెత్తు మాట అయినా మాట్లాడటానికి జంకే కూటమి పార్టీలు హిందూ మతాన్ని దూషించటానికి ఒక్క క్షణం కూడా ముందూ వెనకా ఆలోచించవు. ఎన్నికల ప్రచారం ముంబైలో మొదలెట్టిన మొదటిరోజే వారి వైఖరి బట్టబయలైంది. 'శక్తి'ని నాశనం చేస్తామని ముంబైలో శివాజీపార్క్ సభావేదికగా ప్రకటించారు. హిందూత్వంలో శక్తికి ఉన్న ప్రాధాన్యత, విశిష్టత తమిళనాడులో ప్రతి ఒక్కరికీ తెలుసు. కంచి కామాక్షి అమ్మవారు, 'శక్తిపీఠం ' మదుర మీనాక్షి అమ్మవారు, సమయపురం మారియమ్మన్... ఇలా అంతా శక్తి స్వరూపిణిలే. శక్తి అంటే మాతృ శక్తి, నారీ శక్తి' అంటూ సభకు వచ్చిన మహిళలనుద్దేశిస్తూ మోదీ అన్నారు. 'ఈ శక్తినే విపక్షాలు అంతం చేస్తాయట. కూటమి నేతలు పదేపదే హిందువుల విశ్వాసాలను కించపరుస్తున్నారు. శక్తిని అంతం చేయాలని చూసిన వాళ్లు నాశనమైన వృత్తాంతాలు మన ఇతిహాసాల్లో ఎన్నో ఉన్నాయి. ఇలాంటి ఘటనను ఏప్రిల్ 19న తమిళనాడు ప్రజలు పునరావృతం చేస్తారు' అని అన్నారు. తమిళనాడులో అదే తేదీన 39 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ ఉన్న సంగతి తెల్సిందే. '' జాతీయ కవి సుబ్రమణ్య భారతి చెప్పినట్లుగానే నేనూ భరతమాతను శక్తి స్వరూపిణిగానే ఆరాధిస్తా. దేశ నారీశక్తిని ఆరాధిస్తా. నేను శక్తి ఉపాసకుడిని. శక్తిని అంతం చేస్తామన్న వాళ్లను తమిళనాడు ఓటర్లు శిక్షిస్తారు. కోట్లాది తమిళులు ఇస్తున్న గ్యారెంటీ ఇది'' అని మోదీ అన్నారు.

పాలక్కడ్‌లో భారీ రోడ్‌షో

కేరళలో క్షేత్రస్థాయిలో పార్టీని మరింతగా బలోపేతం చేయడమే లక్ష్యంగా మోదీ మంగళవారం కేరళలో పర్యటించారు. లోక్‌సభ ఎన్నికల బరిలో నిల్చిన పార్టీ అభ్యర్థులకు మద్దతుగా పాలక్కడ్‌లో రోడ్‌షోలో మోదీ పాల్గొన్నారు.

పవార్ పేరుతో పోటీ చేయొచ్చు: సుప్రీం

న్యూఢిల్లీ: దేశంలో త్వరలో జరగనున్న లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో శరద్ పవార్ వర్గం 'నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ-శరద్‌చంద్ర పవార్'పేరుతో పోటీ చేసేందుకు సుప్రీం కోర్టు అనుమతించింది. ఎన్నికల గుర్తుగా 'బాకా ఊదుతున్న వ్యక్తి'ని వాడుకోవచ్చని తెలిపింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు శరద్ పవార్ వర్గాన్ని 'నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ- శరద్‌చంద్ర పవార్'గా గుర్తించాలంటూ ఫిబ్రవరి 19వ తేదీన సుప్రీంకోర్టు ఎన్నికల కమిషన్(ఈసీ)ని ఆదేశించిన విషయం తెలిసిందే. ఈసీ కేటాయించిన 'గడియారం'గుర్తును ఎన్సీపీ అజిత్ పవార్ వర్గం వాడకుండా అడ్డుకోవాలంటూ శరద్ పవార్ వర్గం వేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల ధర్మాసనం మంగళవారం ఈ మేరకు ఆదేశాలిచ్చింది.

సీఏఏ అభ్యంతరాలపై సమాధానమివ్వండి

కేంద్రానికి సుప్రీం 3 వారాల గడువు

న్యూఢిల్లీ: పౌరసత్వ(సవరణ)చట్టం-2019 చట్టం అమలుపై స్టే ఇవ్వాలంటూ దాఖలైన పిటిషన్లపై మంగళవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సారథ్యంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ జరిపింది. చట్టం అమలుపై స్టే ఇచ్చేందుకు నిరాకరించిన ధర్మాసనం..పిటిషనర్ల వాదనలపై మూడు వారాల్లోగా సమాధానం ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది.

రూ.3,852 కోట్ల బాండ్ కష్టం!

కోర్టుకు తెలిపిన ట్రంప్ లాయర్లు

న్యూయార్క్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌కు కోర్టు కష్టాలు మరింత ఎక్కువయ్యాయి. స్థిరాస్తుల విలువను ఎక్కువ చేసి చూపి బ్యాంక్ రుణాలు, ఇన్సూరెన్స్‌లను పొందారన్న సివిల్ మోసం కేసులో న్యూయార్క్ సివిల్ కోర్టు విధించిన 46.4 కోట్ల డాలర్ల బాండ్ సమర్పణ గడువు దగ్గర పడుతుండటంతో ట్రంప్‌కు ఆందోళన మొదలైంది. దాదాపు రూ.3,852 కోట్ల(46.4 కోట్ల డాలర్ల) విలువైన బాండ్‌ను ట్రంప్ తరఫున కోర్టుకు సమర్పించేందుకు ఏ ఒక్క బీమా సంస్థ ముందుకురాకపోవడమే ఇందుకు అసలు కారణం. మార్చి 25వ తేదీకల్లా ట్రంప్ ఈ బాండ్ సమర్పించకపోతే ఆయన స్థిరాస్తులను కోర్టు జప్తుచేయడం మొదలుపెడుతుంది. 2.6 బిలియన్ డాలర్ల ఆస్తిపాస్తులతో కుబేరుడై ఉండి ట్రంప్ ఇప్పటికిప్పుడు 46.4 కోట్లడాలర్ల బాండ్ సమర్పించలేని పరిస్థితి దాపురించిందని ఆయన తరఫు లాయర్ కోర్టుకు విన్నవించారు. ట్రంప్ వద్ద 40 కోట్ల డాలర్ల విలువైన చరాస్తులన్నా వాటిని ఇప్పటికిప్పుడు నగదు రూపంలోకి మార్చడం కుదరడం లేదన్నారు. ''విజయవంతమైన వ్యాపారవేత్త అయినా నా లాంటి వాడికి సైతం ఇంతటి బాండ్ ఇవ్వాలంటే కష్టమే. అసలు అంత మొత్తానికి బాండ్ అనేది ఇన్సూరెన్స్ కంపెనీలు కూడా ఎప్పుడూ వినలేదట' అని ట్రంప్ ఒక ప్రకటనలో వ్యాఖ్యానించారు.

'పతంజలి' సంస్థపై సుప్రీం ఆగ్రహం

బాబా రాందేవ్ హాజరుకు ఆదేశం

న్యూఢిల్లీ: యోగా గురువు, పతంజలి ఆయుర్వేద సంస్థ వ్యవస్థాపకుల్లో ఒకరైన రాందేవ్, ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఆచార్య బాలకృష్ణ వ్యక్తిగతంగా హాజరు కావాల్సిందిగా సుప్రీంకోర్టు ఆదేశించింది. సంస్థ ఉత్పత్తుల ప్రకటనలు, వాటి ఔషధ ప్రభావానికి సంబంధించి కోర్టు ధిక్కారం కింద జారీ చేసిన నోటీసులకు వారు స్పందించకపోవడాన్ని అత్యున్నత న్యాయస్థానం తీవ్రంగా పరిగణించింది. ధిక్కరణ నోటీసులకు ఎందుకు స్పందించలేదో బుధవారం కల్లా తెలపాలని పేర్కొంది. తదుపరి విచారణ సమయంలో వారిద్దరూ స్వయంగా హాజరు కావాలని జస్టిస్ హిమా కోహ్లీ, జస్టిస్ అహ్సనుద్దీన్ అమానుల్లాల ధర్మాసనం మంగళవారం స్పష్టం చేసింది. కోవిడ్ వ్యాక్సినేషన్‌తో పాటు ఆధునిక వైద్య విధానాలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ పతంజలి సంస్థపై ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. దీనిపై గతేడాది నవంబర్‌లో విచారణ జరిపిన న్యాయస్థానం ఆ సంస్థను మందలించింది. సంస్థ ఉత్పత్తులు వివిధ రకాల వ్యాధులను నయం చేస్తాయంటూ అసత్య, తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఇవ్వరాదని గత ఏడాది నవంబర్‌లో విచారణ సందర్భంగా ఆదేశించింది. ఈ మేరకు ఆ సంస్థ న్యాయస్థానానికి హామీ ఇచ్చింది.

ఎలక్షన్ బీట్

కేంద్ర మంత్రి పశుపతి పారస్ రాజీనామా



న్యూఢిల్లీ: రాష్ట్రీయ లోక్‌శక్తి పార్టీ(ఎల్‌జేపీ) నేత పశుపతి కుమార్ పారస్ కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేశారు. లోక్‌సభ ఎన్నికలకు సీట్ల పంపిణీలో తమ పార్టీని విస్మరించి బీజేపీ తనకు అన్యాయం చేసిందని ఆరోపించారు. దివంగత రామ్ విలాస్ పాశ్వాన్ కుమారుడు చిరాగ్ పాశ్వాన్‌కి చెందిన ఎల్‌జేపీ (రామ్ విలాస్)కి బిహార్‌లో ఐదు సీట్లు కేటాయిస్తూ బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ సోమవారం నిర్ణయం తీసుకోవడంపై పారస్ అసంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన ఢిల్లీలో మీడియాకు తన రాజీనామా విషయం ప్రకటించారు. కారణాలను మాత్రం వివరించలేదు. ప్రధాని మోదీ మంత్రివర్గంలో మిత్రపక్షానికి చెందిన మంత్రి పారస్ ఒక్కరే కావడం గమనార్హం. ప్రస్తుతం పరాస్ హాజీపూర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో ఇదే స్థానం నుంచి పోటీ చేయనున్నట్లు చిరాగ్ ప్రకటించారు.

తమిళనాట పీఎంకేతో బీజేపీ పొత్తు

విల్లుపురం: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తమిళనాడులో కలిసి పోటీ చేసేందుకు బీజేపీ, పట్టాలి మక్కల్ కట్చి(పీఎంకే)నిర్ణయించుకున్నాయి. పీఎంకేకు తమిళనాడులోని 10 స్థానాలను కేటాయించేందుకు అంగీకారం కుదిరింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, పీఎంకే వ్యవస్థాపకుడు రాందాస్ విల్లుపురంలో ఈ మేరకు ఒప్పందంపై సంతకాలు చేశారు. ఉత్తర ప్రాంత జిల్లాల్లోని వన్నియార్ కులస్తుల్లో పీఎంకేకి మంచి పలుకుబడి ఉంది. గత పదేళ్లుగా ఎన్‌డీఏ భాగస్వామిగా కొనసాగుతోంది. 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో రెండు పార్టీలు కలిసి పోటీ చేశాయి.

మళ్లీ ఎన్డీఏ గూటికి అకాలీ?

న్యూఢిల్లీ/చండీగఢ్: పంజాబ్‌లో శిరోమణి అకాలీదళ్ మళ్లీ ఎన్డీఏ గూటికి చేరే అవకాశం కన్పిస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో కలిసి పోటీ చేసేలా చర్చలు జరుగుతున్నట్టు ఇరు పార్టీల నేతలూ మంగళవారం ధ్రువీకరించారు. మార్చి 22న అకాలీదళ్ కోర్ కమిటీ భేటీ తర్వాత దీనిపై స్పష్టత రావచ్చని బీజేపీ అధికార ప్రతినిధి ఎస్ఎస్ చన్నీ తెలిపారు. రైతు చట్టాలు తదితరాలపై భేదాభిప్రాయాల నేపథ్యంలో అకాలీదళ్ 2020లో బీజేపీతో తెగదెంపులు చేసుకుని ఎన్డీఏ కూటమిని వీడటం తెలిసిందే.

అమిత్ షాతో రాజ్ ఠాక్రే భేటీ

న్యూఢిల్లీ: మహారాష్ట్ర నవ నిర్మాణ సేన చీఫ్ రాజ్ ఠాక్రే మంగళవారం ఢిల్లీలో హోం మంత్రి అమిత్ షాతో సమావేశమయ్యారు. ఈ భేటీపై ఎంఎన్ఎస్ సీనియర్ నేత బాలా నంద్‌గావోంకర్ ముంబైలో మాట్లాడుతూ..లోక్‌సభ ఎన్నికలపై ఇద్దరు నేతల మధ్య సానుకూలంగా చర్చలు జరిగాయన్నారు. ఒకట్రెండు రోజుల్లో వివరాలు వెల్లడిస్తామని చెప్పారు.

జేఎంఎంకు గట్టి ఎదురుదెబ్బ



రాంచీ: లోక్‌సభ ఎన్నికల వేళ జార్ఖండ్ ముక్తిమోర్చా (జేఎంఎం)కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఎన్నికైన, మాజీ సీఎం హేమంత్ సోరెన్ వదిన సీతా సోరెన్ పార్టీని వీడి, బీజేపీలో చేరారు. మంగళవారం ఢిల్లీలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే, ఆ పార్టీ జార్ఖండ్ ఎన్నికల ఇన్‌చార్జి లక్ష్మీకాంత్ బాజ్‌పాయ్‌ల సమక్షంలో ఆమె కాషాయ కండువా కప్పుకున్నారు. జార్ఖండ్ ఎమ్మెల్యే పదవికి సైతం ఆమె రాజీనామా చేసినట్లు ఆమె కార్యాలయం తెలిపింది. జేఎంఎంలో తనను ఒంటరిగా మార్చారని, నిర్లక్ష్యం చేస్తున్నారని ఆమె ఆరోపించారు.

సాక్షి విజయవాడ సిటీ

ఎన్టీఆర్ జిల్లా

బుధవారం । 20 । మార్చి । 2024



బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

గంపలగూడెం: నెమలిలోని వేణుగోపాల స్వామి ఆలయంలో ఈనెల 23 నుంచి నిర్వహించనున్న వార్షిక బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు.



ఆర్టీసీ సేవలపై ఎండీ ఆరా

గన్నవరం: ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు మంగళవారం గన్నవరం ఆర్టీసీ బస్టాండ్‌ను, డిపోను తనిఖీ చేశారు. ప్రయాణికులు, విద్యార్థులతో మాట్లాడారు.

బాధ్యతల స్వీకరణ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా ఫారెస్ట్ సెటిల్‌మెంట్ అధికారిగా టీఈఎం రాజు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ఢిల్లీరావును మర్యాద పూర్వకంగా కలిశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (బుధ)	సహరి (గురు)
విజయవాడ	6.23	4.53
జగ్గయ్యపేట	6.25	5.03
మచిలీపట్నం	6.22	4.52
గుడివాడ	6.23	4.53

న్యూస్‌రీల్

వైద్య సేవలపై సమీక్ష



లబ్బీపేట(విజయవాడతూర్పు): జిల్లాలో వివిధ వైద్య కార్యక్రమాల ద్వారా అందుతున్న సేవలపై గ్రామీణ, పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో మంగళవారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఆ నిబంధనలకు లోబడి, తగిన జాగ్రత్తలతో కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అదే విధంగా ఆరోగ్య సురక్ష శిబిరాలు, కుటుంబ డాక్టర్ కార్యక్రమం నిర్వహణలో తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ హెల్త్ మిషన్ లో భాగంగా ఆరోగ్య సిబ్బంది హెల్త్ గుర్తింపు సంఖ్య, ఆరోగ్య సంస్థలు గుర్తింపు సంఖ్యలు, మాతాశిశు సంరక్షణ సేవలు మెరుగుపరచడంలో తీసుకోవాల్సిన చర్యలను తెలిపారు. డెప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఇంధుమతి, డీఎంఓ డాక్టర్ మోతీబాబు తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ వర్సిటీ బాల్ బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక



విజయవాడస్పోర్ట్స్: అఖిల భాతర అంతర విశ్వవిద్యాలయాల బాల్ బ్యాడ్మింటన్ మహిళల పోటీలకు ప్రాతినిధ్యం వహించే డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం జట్టును ఎంపిక చేసినట్లు విశ్వవిద్యాలయ క్రీడా విభాగం కార్యదర్శి డాక్టర్ ఇ.త్రిమూర్తి తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఎంపిక పోటీల్లో అత్యుత్తమ క్రీడా నైపుణ్యం ప్రదర్శించిన ఎం.శివజోత్స్న, జి.నీలోత్పల, కె.సుగమ్య, టి.గ్రీష్మ, ఎస్ఎస్ శ్రీస్వప్నతి, పి.సిరిచందన, ఎస్.చరితరెడ్డి, కేవీ గాయత్రి, ఎ.జ్యోతిమణిమాల, జి.సిరి జట్టుకు ఎంపికైనట్లు చెప్పారు. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు చెన్నైలోని పీఎస్ఎన్ఏ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో జరిగే పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందన్నారు. జట్టుకు ఎంపికై న జట్టును వర్సిటీ వీసీ డాక్టర్ కె.బాబ్జి, రిజిస్ట్రార్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు అభినందించారు.

25న ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఫాల్గుణ పౌర్ణమిని పురస్కరించుకుని దుర్గా మల్లేశ్వర స్వామి కొలువై ఉన్న ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ 25వ తేదీ సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ వైదిక కమిటీ పేర్కొంది. 25వ తేదీ తెల్లవారుజామున 5.55 గంటలకు దుర్గగుడి ఘాట్‌రోడ్డులోని కామధేను అమ్మవారి ఆలయం నుంచి గిరి ప్రదక్షిణ ప్రారంభమవుతుందని చెప్పారు. దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై కొలువుదీరగా, ఊరేగింపును ఆలయ ఈవో పూజా కార్యక్రమాలను నిర్వహించి ప్రారంభిస్తారు. ఘాట్‌రోడ్డు నుంచి కుమ్మరిపాలెం, నాలుగు స్తంభాల సెంటర్, విద్యాధరపురం, సితారా, కబేళా, పాలప్రాజెక్టు, చిట్టినగర్, కొత్తపేట నెహ్రూబొమ్మ సెంటర్, బ్రాహ్మణ వీధి మీదగా అమ్మవారి ఊరేగింపు ఆలయానికి చేరుకుంటుంది. గిరి ప్రదక్షిణలో అమ్మవారి భక్తులు, సేవకులు, ఉభయదాతలు విశేషంగా పాల్గొనాలని ఆలయ అధికారులు కోరుతున్నారు.

28న సంకట హర చతుర్థి

సంకట హర చతుర్థిని పురస్కరించుకుని 28వ తేదీ గురువారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు, హోమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని చిన్న రాజగోపురం వద్ద లక్ష్మీ గణపతి ఏక శిలా మూర్తి వద్ద స్వామి వారికి పంచామృత అభిషేకాలు, హోమాలను నిర్వహిస్తారు. హోమం, పూజల్లో పాల్గొనే భక్తులు దేవస్థాన ఆర్జిత సేవా టికెట్ల కౌంటర్లలో టికెట్లు పొందవచ్చు.

పౌరుల కోసం స్మార్ట్ సైన్యం

ఒక్కో పనికి.. ఒక్కో యాప్



- సరికొత్త యాప్‌లతో ఓటర్లకు సమస్త సమాచారం
- ఓటు నమోదు, మార్పులు, చేర్పులకు అవకాశం
- అందుబాటులో అభ్యర్థుల బయోడేటా
- వివాదాలు, పైరవీలను చిత్రీకరించి ఈసీకి ఫిర్యాదు చేసే సౌలభ్యం

విజయవాడస్పోర్ట్స్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాజకీయ సమీకరణ, ప్రజల భాగస్వామ్యానికి కీలకంగా ఉండే యాప్‌లను కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీఐ) అందుబాటులోకి తెచ్చింది. సజావుగా, పారదర్శకంగా ఎన్నికలను నిర్వహించేందుకు, ప్రజాస్వామ్య పరిరక్షణ, జవాబుదారీతనం కోసం అధికారిక యాప్‌లను రూపొందించింది. ఓటును ట్రాక్, మార్పులు, చేర్పులు చేసుకునే అవకాశంతో పాటు పోటీల్లో ఉన్న రాజకీయ పార్టీల అభ్యర్థుల పూర్తి బయోడేటాను ప్రజలు తెలుసుకునే అవకాశాన్ని ఈ-యాప్‌ల ద్వారా ఈసీ కల్పించింది. ప్రజాస్వామ్యానికి పునాదిగా ఉండే ఓటరు సౌలభ్యం కోసం మరెన్నో సులభతరమైన ఆప్షన్లను యాప్‌లో పొందుపర్చారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో వేగవంతమైన ఇంటర్నెట్ అందుబాటులోకి రావడంతో 60 శాతానికి పైగా ప్రజల చేతిల్లో స్మార్ట్ ఫోన్ కనిపిస్తున్న విషయం తెలిసిందే. ఈ తరుణంలోనే 2024 సార్వత్రిక ఎన్నిలకు సంబంధించి మల్టీపుల్ ఆప్షన్లతో యాప్‌లను ఈసీ సిద్ధం చేసింది.

అభ్యర్థుల చిట్టా: కేవైసీ యాప్



ఈ యాప్‌ను కేంద్ర ఎన్నికల సంఘం స్వతహాగా అభివృద్ధి చేసింది. దీనిలో పోటీల్లో ఉన్న రాజకీయ పార్టీ అభ్యర్థుల వివరాలన్నీ ఉంటాయి. పోటీ చేసే అభ్యర్థుల నేర చరిత్రను పౌరులు తెలుసుకునేందుకు దోహదపడుతుంది. అభ్యర్థులపై ఉన్న క్రిమినల్ కేసులను బహిర్గతం చేస్తుంది. అభ్యర్థులపై వచ్చిన నేర ఆరోపణలను తెలియజేస్తుంది. నామినేషన్ల జాబితాను, ఎన్నికల విధానాన్ని ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. ఏఏ నియోజవర్గానికి ఏఏ అభ్యర్థి పోటీ చేస్తున్నారో ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు.

నిఘాస్త్రం: సీ విజిల్ యాప్



ఎన్నికల ప్రవర్తన నియమావళి(మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్-ఎంసీసీ) ఉల్లంఘించే వారిపై పౌర అస్త్రాన్ని ఈ యాప్ ద్వారా ఈసీ ప్రయోగించనుంది. కోడ్ ఉల్లంఘనలకు పాల్పడే వారి వివరాలను ఈ యాప్‌లో పొందుపర్చేందుకు ప్రజలకు వీలు కల్పించింది. ప్రజలు ఈ యాప్‌ను తెరిచి ఉల్లంఘన రకాన్ని ఫొటో, వీడియో తీసి ఎన్నికల సంఘానికి పంపొచ్చు. లొకేషన్, సమయంతో సహా పారదర్శకమైన ఫిర్యాదును ఎన్నికల సంఘం స్వీకరిస్తోంది. ఎన్నికలకు సంబంధించిన వివాదాలు, పైరవీలు సైతం ఫొటో, వీడియో తీసి ఈసీఐకి పంపొచ్చు. ఇచ్చిన ఫిర్యాదు పురోగతిని ట్రాక్ చేసుకునే అవకాశం ఈ యాప్‌లో ఉంది.

సమగ్ర సమాచారం: ఓటరు హెల్ప్‌లైన్ యాప్



ఓటరు సంబంధిత సేవలను యాక్సెస్ చేసేందుకు విప్లవాత్మక మార్పులను ఈ యాప్‌లో పొందుపర్చారు. ఎన్నికలకు సంబంధించిన సేవలను పొందేందుకు ప్రజలకు అనుసంధానకర్తగా ఈ యాప్ ద్వారా ఈసీఐ వ్యవహరిస్తుంది. దీనిలో కొత్తగా ఓటును నమోదు చేసుకోవచ్చు. ఓటును సవరించుకోవచ్చు. డిజిటల్ ఓటరు స్లిప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఓటర్ల జాబితాలోని జనాభా, ఇతరుల పేర్ల వివరాలను తెలుసుకోవచ్చు.ఎన్నికలకు సంబంధించిన తాజా సంక్షిప్త సమాచారాన్ని తెలుసుకోవచ్చు. ఫిర్యాదులూ చేయొచ్చు.

ఎన్నికల ప్రక్రియలో ప్రత్యక్ష్యంగా పాల్గొనలేని వికలాంగులకు ఈ యాప్ అత్యంత సులువైన సాధనం. వికలాంగులు వారి ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఈ యాప్‌లో నమోదు చేసుకోవచ్చు. ఎన్నికల సేవలను అభ్యర్థించడానికి దోహదపడుతుంది. ఇందులో వాయిస్ టైపింగ్ టూల్, యాక్సెసిబిలిటీ ఫీచర్లు, పోలింగ్ స్టేషన్‌ల సమాచారం ఉంటుంది. ఈ యాప్ ద్వారా ఫిర్యాదులు కూడా చేయొచ్చు.

ఓట్ ఫ్రం హోమ్: సాక్ష్యం యాప్



అన్నీ ఒక్కచోటే లభ్యం..

ఆండ్రాయిడ్ యూజర్లకు గూగుల్ ప్లే స్టోర్‌లో, ఐవోఎస్ యూజర్లకు యాప్ స్టోర్‌లో ఈ యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. అక్కడ నుంచి యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుని ప్రత్యేక వ్యక్తిగత ఖాతాను సృష్టించుకోవాలి. పేరు, పిన్‌కోడ్, చిరునామా, ఫోన్ నంబర్ వివరాలను అందించాలి. ఆ తర్వాత యాప్ పనిచేస్తుంది. ఏ యాప్‌లో ఏ వివరాలు ఉన్నాయో సరిచూసుకొని, వాటిల్లో లభ్యమయ్యే సమాచారంతో పాటు సేవలను వినియోగించుకోవచ్చు.



సద్వినియోగం చేసుకోండి..



పారదర్శక ఎన్నికల కోసం ప్రజలను భాగస్వామ్యం చేస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఈ యాప్‌లను రూపొందించింది. ఓటు ఎంత విలువైందో ఈ యాప్‌ల ద్వారా తెలుసుకోవచ్చు. ప్రజలు ఈ యాప్‌ల నుంచి చేసే అభ్యర్థన, ఫిర్యాదులను ఎన్నికల సంఘం నిత్యం ట్రాక్ చేస్తూ ఉంటుంది. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు అందరూ సహకరించాలి. ప్రజలు సైతం ఈ యాప్‌ల ద్వారా నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించేందుకు తమ వంతు పాత్ర పోషించాలి. నిబంధనలకు విరుద్ధంగా ఏం జరిగినా ఈయాప్‌లలో ఫిర్యాదు చేయొచ్చు. ప్రతి పౌరుడు వీటిని సద్వినియోగం చేసుకోవాలి.

– కోమాకుల శివాజీ,
సీఐ, సైబర్ క్రైం, విజయవాడ

రెండో రోజు 652 మంది గైర్హాజరు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జిల్లాలో జరుగుతున్న పదో తరగతి పరీక్షలకు సంబంధించి రెండో రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మంగళవారం సెకండ్ లాంగ్వేజ్ పరీక్షను అధికారులు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 178 పరీక్ష కేంద్రాల్లో 28,705 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉంది. అయితే అందులో 28,053 మంది హాజరయ్యారు. 652 మంది గైర్హాజరైనట్లు అధికారులు ప్రకటించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు. కృష్ణలంకలోని నగరపాలకసంస్థ హైస్కూల్‌లో జరుగుతున్న పరీక్ష కేంద్రాన్ని ఏపీ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ పరిశీలించారు. జిల్లా పరిశీలకుడు శ్రీనివాసరావు నిర్మలా హైస్కూల్‌లోని పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు వీఎంఆర్ఆర్ పాఠశాల, కేఎస్ఆర్ జిల్లా పరిషత్ హైస్కూల్ తదితర పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

పోలీసు సిబ్బందికి ఉగాది సేవా పురస్కారాలు

విజయవాడస్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న పలువురికి ఉగాది సేవా పురస్కారాలు వరించాయి. రాష్ట్ర హోం శాఖ తాజాగా ప్రకటించిన ఉత్తమ సేవ, విశిష్ట సేవ పురస్కారాల జాబితాలో జిల్లాలోని పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది చోటు దక్కించుకున్నారు. తెలుగు నూతన సంవత్సరాది వేడుకల్లో ఈ పురస్కారాలను అందుకోనున్నారు. ఉత్తమ సేవా పతకానికి మాచవరం సీఐ బి.గుణరాము, సేవా పతకానికి టాస్క్‌ఫోర్స్ సీఐ కె.శ్రీధర్‌కుమార్, విద్యుత్‌శాఖ విజిలెన్స్ సీఐ డి.గంగాభవాని, ట్రాఫిక్ ఏఎస్ఐ ఎస్.వి.ఎన్.డి.మల్లేశ్వరరావు, ఏఆర్ హెచ్‌సీ జె.బసవరాజు, సీసీఎస్ ఏఎస్ఐ సి.హెచ్.సత్యనారాయణ, ఏఆర్ హెచ్‌సీ ఎన్.మధుబాబు, ఎస్‌బీ హెచ్‌సీ ఎన్.వి.వెంకటేశ్వరరావు, దిశ హెచ్‌సీ టి.కిషోర్‌బాబు, ఆర్‌పీ హెచ్‌సీ సి.హెచ్.బ్రహ్మయ్య, ఫైర్ సర్వీస్ ఉత్తమ సేవా పతకానికి లీడింగ్ ఫైర్‌మెన్ జి.బాబుప్రసాద్, ఫైర్ సర్వీస్ సేవా పతకానికి టి.ఉదయ్‌కుమార్, జి.శివయ్య ఎంపికయ్యారు.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం

- సమన్వయశాఖల అధికారులతో కమాండ్ కంట్రోల్ రూం
- ఫిర్యాదులకు నాణ్యమైన పరిష్కారం
- ఓటు లేకపోతే దరఖాస్తు చేసుకోవచ్చు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, సీపీ టి.కె. రాణా



మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు, చిత్రంలో సీపీ టి.కె. రాణా, జేసీ సంపత్ కుమార్

సాక్షిప్రతినిధి, విజయవాడ: జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తామని.. నిబంధనలను ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు స్పష్టం చేశారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి పూర్తి సన్నద్ధతతో ఉన్నట్లు ఆయన తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ వీసీ హాల్‌లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, ఎన్నికల నిర్వహణకు చేసిన ఏర్పాట్లపై ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా, జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి. సంపత్ కుమార్‌తో కలిసి కలెక్టర్ మీడియా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ రాజకీయ పార్టీలు, పోటీ చేయనున్న అభ్యర్థులు నిబంధనలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఎంసీసీ(మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) అమలుకు సంబంధించి 30 మంది ప్రత్యేక అధికారులతో బృందాలు పనిచేస్తున్నాయన్నారు. 42 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు నియోజకవర్గానికి మూడు చొప్పున పనిచేస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాలు, ప్రైవేటు స్థలాల్లో స్పెషల్ డ్రైవ్ చేపట్టి అనధికారిక బ్యానర్లు, పోస్టర్లు, వాల్ రైటింగ్‌లను తొలగించి వైట్ వాష్ చేశామన్నారు. 1,102 విగ్రహాలకు ముసుగులు కప్పినట్లు వివరించారు.

స్వచ్ఛ ఓటర్ల జాబితా..

సమష్టి భాగస్వామ్యంతో స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపకల్పన చేశామని కలెక్టర్ తెలిపారు. ఈసీఐ మార్గదర్శకాల ప్రకారం ఈ నెల 16వ తేదీ వరకు వచ్చిన దరఖాస్తులకు సంబంధించి తొలగింపు, మార్పులు చేర్పులను ఈ నెల 26వ తేదీలోపు పరిష్కరించేందుకు అవకాశముందని చెప్పారు. అదే విధంగా ఏప్రిల్ 18న నోటిఫికేషన్ విడుదల కానున్నందున అప్పటి వరకు చేర్పులు, బదిలీలకు వచ్చిన దరఖాస్తులను పరిష్కరించనున్నట్లు తెలిపారు. అర్హులెవరైనా ఉంటే వెంటనే ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ ఏడాది మార్చి 16 నాటికి జిల్లాలో 16,83,000 మంది ఓటర్లు ఉన్నారని.. వీరిలో 37,760 మంది యువ ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. 85 ప్లస్ ఓటర్లు 8,519 మంది, 14,838 మంది పీడబ్ల్యూడీ ఓటర్లు ఉన్నట్లు వివరించారు. ఈపీ రేషియో 710, జెండర్ రేషియో 1,049గా ఉందన్నారు.

బ్యాంక్ లావాదేవీలపై నిఘా..

అనుమానిత బ్యాంకు లావాదేవీలపై నిఘా ఏర్పాటు చేశామని కలెక్టర్ చెప్పారు. రూ.50 వేల నగదును వెంట తీసుకెళ్లవచ్చన్నారు. అంతకు మించితే తగిన ఆధారాలు చూపాల్సి ఉంటుందని తెలిపారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు సభలు, సమావేశాలకు అనుమతి విధానం, సువిధ యాప్‌ల గురించి వివరించారు. సోషల్ మీడియా వేదికల్లో రెచ్చగొట్టే, గొడవలకు కారణమయ్యే పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకొంటామన్నారు.

అందుబాటులో కంట్రోల్ రూం..

రెవెన్యూ, పోలీస్, ఎక్సైజ్ తదితర విభాగాలతో 0866-2570051తో కలెక్టరేట్‌లో ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూం పనిచేస్తోందని.. అదే విధంగా 9154970454 వాట్సాప్ నంబర్ కూడా అందుబాటులో ఉన్నట్లు కలెక్టర్ వివరించారు. కంట్రోల్ రూం, 1950 కాల్ సెంటర్, ఎన్‌జీఎస్‌పీ, సీ విజిల్ తదితరాలకు వచ్చిన ఫిర్యాదులను కూడా ఎప్పటికప్పుడు పరిశీలించనున్నట్లు తెలిపారు. ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా, కేబుల్ నెట్‌వర్క్ తదితరాల్లో ప్రకటనలకు మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) నుంచి అనుమతి అవసరమని వివరించారు. ప్రింట్ మీడియాలో ప్రకటనలకు ముందస్తు అనుమతి అవసరం లేదన్నారు. అయితే ఎన్నికల వ్యయ వివరాల నమోదుకు ఎంసీఎంసీకి వివరాలు అందజేయాల్సి ఉంటుందన్నారు. ఎన్నికలను ప్రజాస్వామ్య స్ఫూర్తితో నిర్వహించడంలో మీడియా పాత్ర కీలకమని పేర్కొంటూ పెయిడ్ ఆర్టికల్స్‌పై గట్టి పర్యవేక్షణ ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు.

రూ. 10 కోట్లకు పైగా విలువైన వస్తువులు సీజ్



చెక్ పోస్టు వద్ద సిబ్బందితో కలెక్టర్ ఢిల్లీరావు, సీపీ రాణా, జేసీ సంపత్

జిల్లాలో నిష్పక్షపాత, శాంతియుత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించేందుకు పోలీసు శాఖ అవసరమైన చర్యలు తీసుకుంటుందని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ పేర్కొన్నారు. పోలీసు శాఖ ద్వారా 2023, డిసెంబర్ 26 నుంచి 2024, మార్చి 18 వరకు 35,992 లీటర్ల మద్యం, 165.76 కిలోల గంజాయి, 33.97 కిలోల విలువైన లోహాలు, రూ. 4.19 కోట్ల నగదు తదితరాలను సీజ్ చేశామని చెప్పారు. 2023, మార్చి 16 నుంచి ఈ ఏడాది మార్చి 18 వరకు సెబ్ ద్వారా 37,841 లీటర్ల మద్యం, 5.5 కిలోల గంజాయిని సీజ్ చేశామన్నారు. సీజ్ చేసిన నగదు, మద్యం, విలువైన లోహాలు తదితరాల విలువ రాష్ట్రంలోనే అత్యధికంగా రూ. 10 కోట్లకు పైనే ఉందని వివరించారు. జిల్లాలో ఇప్పటి వరకు 443 ఆయుధాలకు గాను 361 డిపాజిట్ చేశామన్నారు. ఇప్పటి వరకు 3,215 బైండోవర్ కేసులు నమోదు చేశామని తెలిపారు. వివిధ శాఖల సమన్వయంతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. 12 అంతర్రాష్ట్ర బోర్డర్ చెక్‌పోస్టులు పనిచేస్తున్నాయని.. అదేవిధంగా గూడవల్లి, ఇబ్రహీంపట్నం, వారధి తదితర చోట్ల కూడా చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. అన్ని పోలింగ్ స్టేషన్లను సందర్శించామన్నారు. హోంగార్డు స్థాయి నుంచి పోలీస్ అధికారి వరకు ఎన్నికలకు సిద్ధం చేశామన్నారు.

ఏకేఎఫ్ఐ జాతీయ పోటీల్లో రాష్ట్ర జట్టుకు కాంస్యం



జాతీయ స్థాయిలో కాంస్య పతకాన్ని సాధించిన రాష్ట్ర కబడ్డీ జట్టు

విజయవాడస్పోర్ట్స్: అమెచ్యూర్ కబడ్డీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఏకేఎఫ్ఐ) 33వ జాతీయ సబ్ జూనియర్ బాలుర కబడ్డీ పోటీల్లో రాష్ట్ర జట్టు క్రీడా నైపుణ్యం ప్రదర్శించి కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. బిహార్‌లోని మోతీహరిలో ఈ నెల 16వ తేదీన ప్రారంభమైన ఈ పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ పోటీల్లో పూల్-హెచ్‌లో చోటు దక్కించుకున్న రాష్ట్ర జట్టు ఆది నుంచి ఆధిపత్యం ప్రదర్శించింది. లీగ్ పోటీల్లో పూల్ విన్నర్‌గా నిలవడంతో పాటు ప్రీ క్వార్టర్స్‌లో అసోం జట్టుపై 25 పాయింట్లు, క్వార్టర్స్‌లో పంజాబ్ జట్టుపై రెండు పాయింట్లు ఆధిక్యాన్ని సాధించింది. హోరాహోరీగా జరిగిన సెమీ ఫైనల్స్‌లో హరియాణా జట్టుపై ఓడి మూడో స్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్‌ను సాధించింది. అన్ని మ్యాచ్‌లలో ప్రకాశం జిల్లా క్రీడాకారుడు, రైడర్ అవినాష్‌రెడ్డి సత్తా చాటాడు. జాతీయ స్థాయి పతకం సాధించిన జట్టును ఆంధ్రప్రదేశ్ కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్ అభినందించారు.

హనుమాన్ జంక్షన్‌లో రోడ్డు పనుల పరిశీలన

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్ ప్రధాన రహదారుల అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఏపీ ఆర్టీసీ చైర్మన్ కనుమూరి సుబ్బరాజు అన్నారు. స్థానిక విజయవాడ రోడ్డులో జరుగుతున్న రహదారి అభివృద్ధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. నిబంధనలకు అనుగుణంగా నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ రహదారి నిర్మించాలని ఆయన సూచించారు. నాణ్యతపై రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. ఎక్కడా ఆలస్యానికి తావులేకుండా కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేయాలని ఆయన సూచించారు.

కట్టుదిట్టంగా ఎన్నికల నియమావళి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్నికలను నిష్పక్షపాతంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు ఎన్నికల ప్రవర్తన నియమావళిని తూ.చ. తప్పక పాటించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్.ఢిల్లీరావు రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఢిల్లీరావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికల నిర్వహణలో అధికారుల పాత్ర ఎంతవుందో.. రాజకీయ పార్టీల నుంచి కూడా అంతే సహకారం అవసరమని పేర్కొన్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో రాజకీయ పార్టీలకు సంబంధించిన గుర్తులు, రాజకీయ పార్టీల నేపథ్యం ఉన్న వ్యక్తులకు సంబంధించిన ఫొటోలను, ఫ్లెక్సీలను అన్ని కార్యాలయాలు, ప్రైవేటు, పబ్లిక్ ప్రదేశాలలో పూర్తిగా ఎన్నికల నిబంధనల మేరకు తొలగించాలన్నారు. ఎన్నికల విధి నిర్వహణలో రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు ప్రతి అంశాన్ని సూక్ష్మ దృష్టితో పరిశీలిస్తూ చిత్తశుద్ధితో, బాధ్యతాయుతంగా నిర్వహిస్తామన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో అన్ని సదుపాయాలతో పాటు ఎన్నికల విధుల నిర్వహణకు ఎటువంటి కొరత లేకుండా సిబ్బందిని సంసిద్ధం చేశామన్నారు. జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, వారి తరపు ఐటీ సహాయకులకు ఎన్నికల నిబంధనలకు సంబంధించిన అన్ని రకాల అంశాలపై అవగాహన, శిక్షణ కార్యక్రమాలను పూర్తి చేశామన్నారు.

ముమ్మరంగా బ్యానర్ల తొలగింపు

తక్షణ చర్యల్లో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో గుర్తించిన ఫొటోలను, పోస్టర్లను, ఫ్లెక్సీ/బ్యానర్లను తొలగించడానికి చర్యలు చేపట్టామని కలెక్టర్ చెప్పారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు అన్ని రాజకీయ పార్టీలు, పోటీలోనున్న అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించకూడదన్నారు. సభలు, సమావేశాలు, వాహనాలు అన్నింటికీ ముందస్తు అనుమతి పొందాలని అన్నారు. ఎన్నికల నేపథ్యంలో ప్రతి అభ్యర్థి, రాజకీయ పార్టీ ప్రతినిధి, ప్రశాంత వాతావరణానికి భంగం కలగకుండా ప్రవర్తించాలన్నారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్, డీఆర్ఓ వి. శ్రీనివాస రావు, సెక్షన్ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

చిలకలపూడి(మచిలీపట్నం): వచ్చే విద్యాసంవత్సరానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల్లో ఐదో తరగతిలో ప్రవేశం, 6, 7, 8 తరగతుల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు దరఖాస్తులు కోరుతున్నట్లు ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయం (మైనార్టీ బాలురు) జిల్లా కో–ఆర్డినేటర్ పి.వి.ఎస్.రాజేంద్రప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 25వ తేదీన జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో జరుగుతుందని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 87126 25035 సెల్ నంబరులో సంప్రదించాలని సూచించారు.

చెక్ పోస్ట్‌ల వద్ద అప్రమత్తంగా ఉండండి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, సీపీ టి.కె.రాణా



చెక్‌పోస్ట్‌ల వద్ద విధుల్లో ఉన్న సిబ్బందికి ఆదేశాలిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, సీపీ టి.కె.రాణా

విజయవాడస్పోర్ట్స్: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ఎన్టీఆర్ జిల్లా సరిహద్దులోని చెక్ పోస్ట్‌ల సిబ్బందిని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, పోలీస్ కమిషనర్ టి.కె.రాణా ఆదేశించారు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల సరిహద్దులోని గూడవల్లి చెక్ పోస్ట్, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల సరిహద్దులోని పవర్‌గ్రిడ్ చెక్‌పోస్ట్, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల సరిహద్దులోని, కృష్ణా వారధి, ప్రకాశం బ్యారేజీ చెక్ పోస్ట్‌లను కలెక్టర్, పోలీస్ కమిషనర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా చెక్‌పోస్ట్‌ల వద్ద వాహనాల రాకపోకలు, తనిఖీలను కొద్దిసేపు నిశితంగా పరిశీలించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున చెక్ పోస్టు సిబ్బంది ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. అక్రమ నగదు, మద్యం, సారా, గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణాలను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. రోజూ 24 గంటలూ నిరంతరం వాహన తనిఖీలు ముమ్మరం చేస్తున్నామన్నారు. నగదు, మద్యం పట్టుబడితే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని చెక్ పోస్టు సిబ్బందిని ఆదేశించారు. నిర్లక్ష్యం వహించకుండా అప్పగించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్, డీసీపీ అధి రాజ్‌సింగ్ రాణా పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

పెనమలూరు: సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని మానవసేవా సంస్థ అధ్యక్షుడు వంగర సురేష్‌కుమార్ మంగళవారం తెలిపారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం, ఎన్టీఆర్, కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన డిగ్రీ చదివిన నిరుద్యోగ యువతకు ఉచితంగా ఈ కోర్సుల్లో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ఈ నెల 23వ తేదీ నుంచి శిక్షణ తరుగతులు ప్రారంభిస్తామని వివరించారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 70935 29750 ఫోన్ నంబరులో సంప్రదించాలని కోరారు.

పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట నిఘా



విజయవాడస్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లాలోని పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పోలీస్ కమిషనర్ టి.కె. రాణా తెలిపారు. విజయవాడ సూర్యారావుపేటలోని సీవీఆర్ఎంసీ ఉన్నత పాఠశాల, కర్నాటి రామ్మోహన్ రావు ఉన్నత పాఠశాల, మాచవరంలోని బోయపాటి శివరామయ్య ఉన్నత పాఠశాల, చైతన్య స్కూల్‌లలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను సీపీ రాణా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా పరీక్షలు నిర్వహించేందుకు పటిష్ట నిఘా ఏర్పాటు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా 178 పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని పేర్కొన్నారు. పరీక్షలు సజావుగా జరగడానికి పోలీస్ శాఖ నుంచి అన్ని చర్యలూ తీసుకున్నామని తెలిపారు. ఐపీఎస్ స్థాయి అధికారులు పరీక్ష కేంద్రాలను ఆకస్మిక తనిఖీలు చేస్తున్నారని వివరించారు. ప్రత్యేక మొబైల్ పెట్రోలింగ్ బృందాలను ఏర్పాటు చేశామని, పరీక్షలు జరుగు సమయంలో ఫ్లయింగ్ స్క్వాడ్లు నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని పేర్కొన్నారు.

చెల్లని చెక్కుతో మోసం చేసిన భార్యాభర్తలపై కేసు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): నగదు అప్పుగా తీసుకుని చెల్లని చెక్కు ఇచ్చి మోసం చేసిన కేసులో భార్యాభర్తలపై ఎస్ఎన్ పురం పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. సీఐ వెంకట నారాయణ కథనం మేరకు.. తోట నాగరాజు కార్ ట్రావెల్స్ నిర్వహిస్తూ కుటుంబ సభ్యులతో సత్యనారాయణపురం, కరెంట్ సబ్ స్టేషన్ ఎదురుగా నివసిస్తున్నాడు. ఎనిమిదేళ్లుగా రియల్ ఎస్టేట్ వ్యాపారి కలిదిండి రవి కుమార్ కుటుంబంతో పరిచయం ఉంది. ఈ క్రమంలో 2022 నవంబర్‌లో నాగరాజును రవికుమార్, అతని భార్య శారద కలసి కుటుంబ అవసరాల నిమిత్తం డబ్బు అవసరమని, నెలలో తిరిగి ఇచ్చేస్తామని రూ.1.50 లక్షలు అప్పుగా తీసుకున్నారు. ఆ మొత్తానికి చెక్కు రాసి ఇచ్చారు. గడవు తీరినా డబ్బులు అడిగితే రేపు, మాపు అంటూ కాలయాపన చేయడంతో రవికుమార్, శారద ఇచ్చిన చెక్కును నాగరాజు బ్యాంకులో డిపాజిట్ చేశాడు. అయితే సంతకాలు సరిపోలేదంటూ బ్యాంక్ అధికారులు తిప్పిపంపారు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించిన నాగరాజు డబ్బులు ఇవ్వాలంటూ వత్తిడి చేయగా రవికుమార్, శారద దుర్భాషలాడారు. డబ్బులు ఇచ్చేది లేదని, ఏమి చేసుకుంటావో చేసుకో అంటూ తేల్చిచెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సత్యనారాయణపురం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

అనుమానంతో భార్యపై కత్తితో దాడి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): భార్యపై అనుమానం పెంచుకున్న ఓ భర్త ఆమెపై కత్తితో దాడికి పాల్పడిన ఘటన అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. దేవీనగర్ మధ్యకట్ట సమీపంలోని విజయ దుర్గనగర్‌కు చెందిన అంబళ్ల లక్ష్మి(35), సింహాచలం దంపతులు నివసిస్తున్నారు. 17 ఏళ్ల క్రితం వివాహమైన వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్యాభర్తలిద్దరూ తాపీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మద్యానికి బానిసైన సింహాచలం తరచూ తాగివచ్చి భార్య, పిల్లలను కొడుతూ, తిడుతూ ఉంటాడు. లక్ష్మి తాపీ పనికి వెళ్తున్నా ఎవరి కోసం పనికి వెళ్తున్నావంటూ అనుమానించి వేధింపులకు గురిచేస్తుండేవాడు. మంగళవారం పనికి వెళ్తున్న ఆమెను ఇంటివద్దే ఉండాలంటూ గొడవపడి పక్కనే ఉన్న కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో లక్ష్మి పొత్తికడుపులో గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని బాధితురాలిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

క్లుప్తంగా

దుర్గగుడి మాస్టర్ ప్లాన్ పనుల పరిశీలన



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఈఓ రామారావు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడి అభివృద్ధిలో భాగంగా చేపట్టిన మాస్టర్ ప్లాన్ పనులను ఆలయ ఈఓ కె.ఎస్.రామారావు మంగళవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న యాగశాల, పూజా మండపాల పనులతో పాటు మల్లేశ్వర స్వామి ఆలయంలో చేపట్టిన చిన్న చిన్న పనులను పరిశీలించారు. మల్లేశ్వర స్వామి ఆలయం వద్ద పనులను త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్ సిబ్బందిని ఆదేశించారు. మల్లేశ్వర స్వామి ఆలయం పనులు పూర్తయిన వెంటనే నవగ్రహ మండపం నిర్మాణం చేపట్టాలని సూచించారు. అనంతరం మహా మండపం ఎదుట జరుగుతున్న ప్రసాదం పోటు, అన్నదాన భవన నిర్మాణ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది దసరా నాటికి భవన నిర్మాణానికి అవసరమైన పునాదులు పూర్తి కావడంతో పాటు మొదటి అంతస్తు శ్లాబ్ వేసేలా చూడాలని ఆదేశించారు. దుర్గగుడి ఈఈలు కోటేశ్వరరావు, ఎల్.రమాదేవి, పలువురు ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

కలకలం రేపిన మహిళ మృతదేహం

ఇబ్రహీంపట్నం(మైలవరం): మండలంలోని దాములూరు గ్రామంలో గుర్తుతెలియని మహిళ మృతదేహం కలకలం సృష్టించింది. స్థానిక డొంకరోడ్డు పొలాల్లో మంగళవారం అనుమానాస్పద స్థితిలో మహిళ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ ఎం.సత్యనారాయణ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలు పరిసర గ్రామాలకు చెందిన మహిళ కాదని నిర్ధారించారు. ఆమె వయసు 40 నుంచి 45 ఏళ్ల మధ్య ఉంటుందని భావిస్తున్నారు. క్లూస్ టీమ్ సభ్యులు ఘటనా స్థలంలో చెప్పులు, వాటర్ బాటిల్ తదితర ఆధారాలు సేకరించారు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, ఇతర ప్రాంతానికి చెందిన మహిళ ఇక్కడకు వచ్చి ఆత్మహత్య చేసుకుందా? ఎవరైనా హత్యచేసి ఇక్కడ పడేసి వెళ్లారా? అన్న కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

మామిడి రైతులు జాగ్రత్తలు పాటించాలి



మామిడి కాయలకు రక్షణగా తొడిగిన సంచులు

విజయవాడరూరల్: ద్రోణి ప్రభావంతో ఎన్టీఆర్ జిల్లాలో బుధవారం అక్కడక్కడా పిడుగులతో కూడిన మోస్తారు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించిన నేపథ్యంలో మామిడి రైతులు పండు ఈగ ఉధృతిపై జాగ్రత్తగా ఉండాలని విజయవాడ రూరల్ మండల ఉద్యాన శాఖ అధికారి పెద్దిరెడ్డి పరమేశ్వరరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో సూచించారు. వర్షం కురిసి వెలిసిన తర్వాత మామిడి తోటల్లో పండు ఈగ ఉధృతి ఉంటుందని హెచ్చరించారు. పండు ఈగలు పక్వానికి వచ్చిన మామిడి కాయల పై చర్మాన్ని తొలిచి గుడ్లను లోపల కండలోనికి చొప్పిస్తాయని పేర్కొన్నారు. ఆ గుడ్లు పొదిగిన పిమ్మట లార్వాలు పండ్లలోపల గుజ్జును తినడం వల్ల ఆ ప్రాంతం కుళ్లిపోయి కాయపై నల్లమచ్చలు ఏర్పడతాయని వివరించారు. పండు ఈగ ప్రభావంతో మామిడి దిగుబడుల్లో 70 నుంచి 80 శాతం వరకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. తోటల్లో పండు ఈగ ఆశించిన కాయలను ఏరి లోతైన గుంతల్లో పాతిపెట్టడం లేదా చెత్తతో తగలబెట్టడం చేయాలని, చెట్ల కింద కలుపు మొక్కలు లేకుండా శుభ్రంగా ఉంచడం వల్ల పండు ఈగ ఉధృతి తగ్గుతుందని సూచించారు. పండు ఈగ ఉచ్చులను ఉపయోగించాలని, మగ ఈగలను ఆకర్షించే ఫిరమోన్ ట్రాప్స్ ఎకరానికి ఐదు నుంచి ఆరు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. మామిడి కాయలు 100 గ్రాములు అంత కన్నా తక్కువ బరువు ఉన్నప్పుడే సంచులను తొడగడం వల్ల కూడా పండు ఈగ దాడి నుంచి కాయలను రక్షించుకోవచ్చని సూచించారు. పండు ఈగ ఉధృతి అధికంగా ఉన్నప్పుడు కోతకు 30 రోజుల ముందుగా పండు ఈగ బైట్‌ను తయారు చేసుకొని 100 గ్రాములు పాత బెల్లం లీటరు నీటిలో కలిపి దాన్ని రెండు మిల్లీలీటర్ల మలాథియన్, డెల్టా మెత్రిన్ రెండు మిల్లీలీటర్ల కలిపి చెట్ల మొదలు, ఆకుల పైన పిచికారీ చేయాలని సూచించారు.

వ్యాన్, ట్రాక్టర్ ఢీ.. ఒకరి మృతి

మరో ఇద్దరికి గాయాలు



వ్యాన్ డ్రైవర్ స్వరాజ్‌కుమార్ మృతదేహం



మూలపాడు వద్ద జరిగిన ప్రమాదంలో డివైడర్ పైకి దూసుకెళ్లిన వ్యాన్, పక్కన ట్రాక్టర్

ఇబ్రహీంపట్నం(మైలవరం): రోడ్డు దాటుతున్న ట్రాక్టర్‌ను వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్ మృతి చెందగా, ట్రాక్టర్ డ్రైవర్‌తో పాటు మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని మూలపాడు గ్రామం వద్ద 65వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం ఈ ప్రమాదం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మూలపాడు గ్రామానికి చెందిన చింతల మురళీ పొలంలో వ్యవసాయ పనుల కోసం ట్రాక్టర్‌తో ఇంటి నుంచి బయలుదేరాడు. హైవే మధ్యలో ట్రాక్టర్ యూటర్న్ తీసుకుంటున్న సమయంలో హైదరాబాద్ వైపు నుంచి వేగంగా దూసుకొచ్చిన వ్యాన్ ఢీకొట్టింది. వ్యాన్ అంతటితో ఆగకుండా డివైడర్‌పైకి దూసుకెళ్లి మధ్యలో ఉన్న స్తంభాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన వ్యాన్ డ్రైవర్ స్వరాజ్ కుమార్(32) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాక్టర్ డ్రైవర్ మురళీతో పాటు కాలినడకన రోడ్డు దాటుతున్న మాతంగి చిన్నబ్బాయి తీవ్రంగా గాయపడ్డారు. స్వరాజ్‌కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గాయపడిన వారు ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ప్రమాదంపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ అనూష తెలిపారు.

నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణ



మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు చిత్రంలో ఎస్పీ నయీం అస్మి, డీఆర్వో చంద్రశేఖరరావు

పోలీస్, ఎక్సైజ్ అధికారులతో కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ నయీం అస్మి

చిలకలపూడి(మచిలీపట్నం): సాధారణ ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు, శాంతి భద్రతలు కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని కృష్ణా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. ఎస్పీ అద్నాన్ నయీం అస్మితో కలిసి కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో పోలీస్, ఎక్సైజ్ అధికారులతో ఆయన మంగళవారం సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల ప్రకటన వెలువడిన వెంటనే ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిందన్నారు. లైసెన్స్ పొందిన వారి వద్ద నుంచి ఆయుధాలు స్వాధీనం చేసుకుని, కొత్తగా ఆయుధాల లైసెన్స్‌లు జారీపై నిషేధం విధించాలని ఆదేశించారు. ఈ అంశంపై సమీక్షించేందుకు జిల్లా స్థాయి స్క్రీనింగ్ కమిటీని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

సమయాలు కచ్చితంగా పాటించాలి..

ఎక్సైజ్‌శాఖకు సంబంధించి లిక్కర్ లైసెన్సుల జారీని నిషేధించాలని కలెక్టర్ అన్నారు. మద్యం ఉత్పత్తి, సెంట్రల్ స్టాక్ పర్యవేక్షించి రోజువారీ నివేదికలు సమర్పించాలని సూచించారు. మద్యం దుకాణాలు ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు, బార్ అండ్ రెస్టారెంట్లు ఉదయం 11 నుంచి రాత్రి 11 గంటల వరకు మాత్రమే పని చేయాలని స్పష్టంచేశారు.

ఆయుధాలు స్వాధీనం..

ఎస్పీ నయీ అస్మి మాట్లాడుతూ.. జిల్లాలో 153 మంది ఆయుధాల లైసెన్స్ కలిగిన వారు ఉన్నారని తెలిపారు. ఇప్పటి వరకు 132 ఆయుధాలను పోలీస్ శాఖ స్వాధీనం చేసుకుందని పేర్కొన్నారు. బ్యాంకుల వద్ద, టోల్‌గేట్ల వద్ద ఉన్న ఆయుధాలకు మాత్రమే మినహాయింపు ఉంటుందన్నారు. మిగిలిన ఆయుధాలను వెంటనే స్వాధీనం చేసుకోవడానికి చర్యలు తీసుకోవాలని డివిజనల్ పోలీస్ అధికారులను ఆయన ఆదేశించారు. డీఆర్వో కె.చంద్రశేఖరరావు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ దుర్గాకిశోర్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల విభాగాల పరిశీలన

సార్వత్రిక ఎన్నికల నిర్వహణ కోసం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన పలు విభాగాలను కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ మంగళవారం పరిశీలించారు. కలెక్టరేట్ ఆవరణలోని డీఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పరిష్కార కేంద్రాన్ని సందర్శించి, ఎన్నికలకు సంబంధించి అందిన ఫిర్యాదులు, వాటి పరిష్కార తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ విభాగంలో 24/7 కంట్రోల్ రూమ్ నంబర్ 08672–252533, టోల్ ఫ్రీ నెంబర్ 1950కు ఫోన్ చేసి ఫిర్యాదులు చెప్పేలా ఏర్పాట్లు చేశామన్నారు. నేషనల్ గ్రీవెన్స్ సర్వీస్ పోర్టల్, కంప్లయింట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, సీ–విజిల్ యాప్‌ల ద్వారా వచ్చిన ఫిర్యాదులు ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఏ విధంగా పరిష్కారం చేయాలో వివరాలను కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. ఫిర్యాదులు వచ్చినప్పుడు హాట్ కాపీ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రతి ఫిర్యాదుకు సంబంధించి పరిష్కరించిన ఫైల్‌ను భద్రపరచాలని నోడల్ అధికారి జె.జ్యోతికి సూచించారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎంసీఎంసీ విభాగాన్ని పరిశీలించారు. టీవీలు, వార్తపత్రికలు, సామాజిక మాధ్యమాల్లో రాజకీయ ప్రచార ప్రకటనలు, చెల్లింపులు ఎలా గమనిస్తున్నారన్న వివరాలను బాధ్యులను అడిగి తెలుసుకున్నారు. సోషల్ మీడియాలో వచ్చే కథనాలను కూడా ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. మీడియా నోడల్ అధికారి ఎం.వెంకటేశ్వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వంచన గద్దె నైజం

- 10 ఏళ్లలో తూర్పు ప్రజలకు ఎమ్మెల్యే గద్దె చేసిందేమీ లేదు
- అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారంటున్న ప్రజానీకం
- దళితులు, ముస్లింలు, పోలీస్ కాలనీ, భ్రమరాంబపురం, ఎన్టీఆర్ కాలనీ ఇలా అందరినీ వంచన
- వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెబుతామంటున్న తూర్పు ప్రజలు


కృష్ణలంక 22వ డివిజన్‌లో సీఎం వైఎస్ జగన్, అవినాష్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న ప్రజలు(ఫైల్)

లబ్బీపేట(విజయవాడతూర్పు): వంచన ఆయన నైజం.. తీపి మాటలతో ప్రజలకు హామీలిస్తూ ఫొటోలకు ఫోజులిచ్చి మరుసటి రోజు పత్రికల్లో వేయించుకుంటారే కానీ, అనంతరం ఆ సమస్యను పట్టించుకోరని తూర్పు నియోజకవర్గ ప్రజలు అంటున్నారు. ఇలా తమ సమస్యలను గాలికొదిలేశారని ప్రజలు వాపోతున్నారు. ఆయన ఎమ్మెల్యేగా ఉంటూ 10 ఏళ్లలో ఏమి చేశారో ఒక్కటి కూడా చెప్పుకోలేరు. ప్రజల వద్దకు వచ్చినప్పుడు మంచిగా మాట్లాడటం, కార్యాలయానికి వెళితే చీదరించుకుంటారని నియోజకవర్గ ప్రజలే అంటున్నారు. గత టీడీపీ పాలనలో ఎవరికీ ఒక సెంటు ఇళ్ల స్థలం ఇవ్వలేదు. ఇళ్లు ఇవ్వలేదు. నేడు యువ నాయకులు దేవినేని అవినాష్ ఎమ్మెల్యే కాకున్నా ముఖ్యమంత్రి సహకారంతో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు జైజైలు పలుతున్నారు. గద్దె లాంటి మోసకారికి తగిన బుద్ధి చెబుతామంటున్నారు తూర్పు ప్రజలు.

దళితులకు వంచన

తూర్పు నియోజకవర్గ పరిధిలోని గిరిపురం, న్యూగిరిపురం, బాడవపేట, నెహ్రూనగర్, ఉడ్‌పేట, ఫకీరుగూడెం, జార్జిపేట, ఇస్రాయేల్‌పేట, పిటింగెల్‌పేట వంటి 14 కాలనీల శ్మశానం విషయంలో తమను మోసం చేశారని దళితులు తెలిపారు. ఇదిగో అదిగో అంటూ గద్దె కాలయాపన చేశారని, తాము ధర్నా చేస్తే అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారని చెప్పారు. అరెస్ట్ అయిన వారిలో దళిత మహిళా కార్పొరేటర్ కూడా ఉన్నారు. జన్మభూమి సభల్లో శ్మశానం గురించి ప్రశ్నించకుండా వందలాది మంది పోలీసులతో తమను అడ్డుకున్నారని చెప్పారు.

ముస్లింలకు మోసం

తూర్పు నియోజకవర్గంలో దాదాపు 30 వేల మంది ముస్లింలు ఉన్నారు. వారికోసం షాదీఖానా నిర్మించాలని కోరగా అదిగో ఇదిగో అంటూ కాలం వెళ్లబుచ్చారు. లబ్బీపేట బందరు కాల్వ ఒడ్డున అనువైన స్థలం ఉందని తాము చెప్పినా పట్టించుకోలేదని ముస్లింలు చెప్పారు. ఎన్నికలు మరో ఆరు నెలల్లో వస్తున్నాయనగా 15 రోజులకోసారి వచ్చి కొలతలు పేరుతో ఒకసారి, సర్వే పేరుతో మరోసారి, ముస్లిం నేతలతో చర్చలంటూ ఇంకోసారి ఫొటోలు తీసి పేపర్‌లలో రాయించుకోవడం మినహా చేసిందేమీ లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చివరికి సమస్య పరిష్కరించకుండానే వారిని నయవంచన చేశారు. దీంతో ముస్లింలు చీదరించుకుంటున్నారు.

పోలీసు కాలనీని పట్టించుకోలేదు..

రాష్ట్రంలో 2014లో చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ స్థలాలపై ల్యాండ్ సీలింగ్ విధించారు. ఆ సమయంలో ఇరిగేషన్ నుంచి రిజర్వ్ పోలీసులు కొనుగోలు చేసిన పోలీస్ కాలనీ స్థలం కూడా సీలింగ్‌లోకి వెళ్లింది. అన్ని ఆధారాలతో కాలనీ వాసులు ఎమ్మెల్యే వద్దకు వెళ్లి వివరించారు. అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేశారే కానీ సమస్యను పట్టించుకోలేదు. వాళ్లు ఎన్నిసార్లు ఆయన చుట్టూ తిరిగినా పనికాలేదు.

ఎన్టీఆర్ కాలనీవాసులది అదే ఇబ్బంది

ఎన్టీఆర్ కాలనీ వాసుల్లో టీడీపీ సానుభూతి పరులే ఎక్కువగా ఉన్నారు. దీంతో తమ కాలనీలో రోడ్డు వేయాలని పలుమార్లు ఎమ్మెల్యే గదె చుట్టూ తిరిగారు. ఎన్నిసార్లు తిరిగినా అదిగో ఇదిగో అన్నాడే కానీ పట్టించుకోలేదు. అనంతరం వారికి మొఖం చాటేశారు. దీంతో ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఇదేమీ తీరంటూ కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ చేయలేదు

కృష్ణలంక భ్రమరాంబపురంలో ఇళ్ల స్థలాలు క్రమబద్ధీకరణ చేయాలంటూ మహిళలు పలుమార్లు గద్దె రామ్మోహన్ చుట్టూ తిరిగారు. ఎప్పుడు అడిగినా చూద్దాం చేద్దాం అన్నాడే కానీ అసలు పట్టించుకోలేదని ప్రజలు వాపోయారు. కార్యాలయానికి వెళితే సమాధానం కూడా చెప్పేవారు కాదని మహిళలు అంటున్నారు. 6 వేల మంది జనాభా సమస్యను గాలికొదిలేశారని ప్రజలు తెలిపారు.

దశాబ్దాల సమస్యలకు పరిష్కారం

విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జిగా దేవినేని అవినాష్ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. అంతేకాదు వాటిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సాధించారు. గద్దె విస్మరించిన పనులన్నింటినీ అవినాష్ పూర్తి చేశాడు.

- లబ్బీపేటలో రూ.2 కోట్లతో షాదీఖానా పనులు జరుగుతున్నాయి.
- పోలీస్‌కాలనీ స్థలం ల్యాండ్ సీలింగ్ నుంచి తొలగించేలా చేశారు.
- దళితుల శ్మశాన వాటికను రూ.కోటితో అభివృద్ధి చేసి అందుబాటులోకి తెచ్చారు.
- భ్రమరాంబపురంలో 1200 పట్టాలతో పాటు, తూర్పులోని బాడవపేట, ఉడ్‌పేట, పటమటలాంటి ప్రాంతాల్లో ఇళ్ల పట్టాలు క్రమబద్ధీకరించేలా ప్రభుత్వంతో ఆదేశాలు జారీ చేయించారు.
- ఎన్టీఆర్ కాలనీలో రూ.4.50 కోట్లతో రోడ్లు వేయించారు.
- తూర్పులో రూ.650 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు.
- రూ.వేల కోట్లతో సంక్షేమ పథకాలు అందించారు.
- 32,211 మందికి కొత్తగా ఇళ్ల స్థలాలు అందించారు.

2వ డివిజన్‌లో ఇఫ్తార్ విందు



గుణదల(విజయవాడతూర్పు): పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలందరూ కలిసికట్టుగా చేసుకొనే ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీక అని తూర్పు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ అన్నారు. నియోజకవర్గంలోని 2వ డివిజన్ హిళాల్ మోస్క్యూ మసీదు నందు మంగళవారం రాత్రి జరిగిన ఇఫ్తార్ విందుకు అవినాష్ ముఖ్య అతిథిగా పాల్గొని ముస్లిం మత పెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్లు మీర్ హుస్సేన్, ఎండీ. మోయిన్, మసీదు కమిటీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు చినబాబు, రిజ్వాన్, చందా కిరణ్, కసపర్తి బాబు పాల్గొన్నారు.

బెదిరించిన ఘటనపై కేసు

పెనమలూరు: స్థల యజమానురాలిని బెదిరించిన ఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి బ్రహ్మంగారి గుడి వద్ద నివాసం ఉంటున్న పి.శేషుమణికి కొంత స్థలం ఉంది. తిరువూరు ప్రభుత్వ కాలేజీ అధ్యాపకుడిగా పని చేస్తున్న కె.మాధవరావు స్థలం తీసుకుని గ్రూప్ హౌస్ నిర్మాణం చేపట్టాడు. ఆ స్థలానికి పక్కనే శేషుమణి స్థలం కూడా ఉండటంతో దారి కోసం తీసుకున్నాడు. దీనికి గాను గ్రూప్‌హౌస్‌లో ఒక ప్లాటు, రూ.18 లక్షలు ఇచ్చే విధంగా హామీ పత్రం రాసి రూ.6 లక్షలు చెల్లించాడు. ఆ తర్వాత గ్రూప్ హౌస్ నిర్మాణం పూర్తి చేయలేదు. ఇంకా ఇవ్వాల్సిన సొమ్ము చెల్లించలేదు. దీంతో బిల్డర్ మాధవరావును అడుగగా అతను, అతని సోదరుడు వాసుదేవరావు కలిసి అసభ్యంగా మాట్లాడి దౌర్జన్యం చేశారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

పేదల సంక్షేమమే సీఎం వైఎస్ జగన్ ధ్యేయం

వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్


చిరు వ్యాపారితో ఆప్యాయంగా మాట్లాడుతున్న దేవినేని అవినాష్, డెప్యూటీ మేయర్ దుర్గ

కృష్ణలంక(విజయవాడతూర్పు): పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. రాణిగారితోట, 18వ డివిజన్‌లోని సంగుల పేరయ్య వీధి, మిరియాల వారి వీధిలలో మంగళవారం ఆయన గడప గడపకు మీ అవినాష్ అన్న హామీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్ల పది నెలల వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులు వివరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మీ అవినాష్ అన్న హామీ పేరుతో ముద్రించిన మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేసి 2024లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలన్నింటిని నెరవేరుస్తామని భరోసానిచ్చారు. ప్రతి ఇంటి వద్ద మహిళలు హారతులతో స్వాగతం పలికారు.

ఇది పేదల ప్రభుత్వం..

ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన హామీల్లో 95శాతానికి పైగా నెరవేర్చిన దమ్మున్న నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఈ ప్రాంతంలో రూ.35 కోట్లు వెచ్చించి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంతో పాటు పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. ఇది పేదల ప్రభుత్వమని చెప్పారు. గత 10 ఏళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్న గద్దె రామ్మోహన్ ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయకుండా పూర్తిగా విస్మరించారన్నారు. ఆయన చేయలేని అభివృద్ధిని నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉండి ఈ ఐదేళ్లలో తాను చేసి చూపించానన్నారు. గత 15 రోజులుగా ఈ డివిజన్‌లో ప్రతి ఇంటికీ వెళ్తుంటే ప్రతి ఒక్కరూ తాము పొందిన లబ్ధిని సంతోషంగా చెబుతూ కృతజ్ఞతలు తెలుపుతుంటే చాలా గర్వంగా ఉందన్నారు. మరలా జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. స్వర్గీయ వైఎస్సార్ పేదల సంక్షేమం కోసం ఒక్క అడుగు ముందుకేస్తే ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి 10 అడుగులు ముందుకేసి దమ్మున్న ముఖ్యమంత్రిగా నిలిచారన్నారు. త్వరలో జరిగే సాధారణ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా మీ ముందుకు వస్తున్నానని, తనను ఆదరించి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, స్థానిక కార్పొరేటర్, ఫ్లోర్‌లీడర్ వెంకట సత్యనారాయణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



దేశ వ్యాప్తంగా ఎన్నికల నియామవళి అమలులోకి రావడంతో అన్ని విభాగాల అధికారులు వారి వారి విధుల్లో నిమగ్నమయ్యారు. విజయవాడ అజిత్ సింగ్‌నగర్‌లోని బొండా ఉమాకు చెందిన టీడీపీ కార్యాలయంలో బ్యానర్, పోస్టర్లను తొలగించేందుకు మంగళవారం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఆ కార్యాలయానికి వచ్చారు. దీంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సిబ్బందిపై బెదిరింపులకు పాల్పడ్డారు. ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించేది లేదంటూ వాగ్వాదానికి దిగారు. ఇది గమనించిన నగర వాసులు ఆదర్శంగా నిలవాల్సిన ప్రజాప్రతినిధులే గొడవకు దిగడంతో విస్మయం వ్యక్తం చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

నలందలో ఉత్సాహంగా ఎగ్జిబిట్ - 2024


విజేతకు బహుమతి అందజేస్తున్న ప్రిన్సిపాల్ అనురాధ, అధ్యాపకులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యార్థులు చదువుతో పాటు ఎంప్లాయిబిలిటీ స్కిల్స్, టెక్నాలజీని ఎప్పటికప్పుడు అప్‌గ్రేడ్ చేసుకోవాలని ఎఫ్ట్రానిక్స్ సంస్థ హెచ్‌ఆర్‌డీ మేనేజర్ స్ఫూర్తి తెలిపారు. నలంద డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎగ్జిబిట్ 2024 కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎగ్జిబిట్‌కు వివిధ కళాశాలల నుంచి 200 మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న స్ఫూర్తి మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్, లాజికల్ థింకింగ్, ఆలోచనా విధానాన్ని మెరుగుపరుచుకోవడం వంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. పరిశోధనలపై దృష్టి సారించి రీసెర్చ్ స్కాలర్స్‌గా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రతి వ్యక్తి జీవితంలో సక్సెస్ సాధించడానికి కష్టపడి పనిచేయడమే ఉత్తమమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పీపీటీ, క్విజ్, మ్యాథ్స్ మోడల్, సుడోకు, ఫ్రీ ఫైర్, ట్రెజర్ హంట్, ఫ్యాషన్ వాక్ వంటి పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నలంద ప్రిన్సిపాల్ ఎం.అనురాధ, మ్యాథ్స్ హెచ్‌ఓడీ వి.లక్ష్మి, స్టాటిస్టిక్స్ హెచ్‌ఓడీ పి.రవికుమార్, బి.శేష పవన్, పి.అనీల తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం

మధురానగర్(విజయవాడసెంట్రల్): హార్ట్ ఎటాక్ వచ్చినప్పుడు మనిషిని ఎలా రక్షించాలో ప్రతి ఒక్కరికీ కనీస పరిజ్ఞానం ఉండాలని రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధి రాధిక అన్నారు. మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యాన మంగళవారం సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీపీఆర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమన్నారు. సీపీఆర్ అంటే హృదయ శ్వాస కోసం పునరుజ్జీవన చర్య అని తెలిపారు. సీపీఆర్‌ను ఎలా చేయాలో వాసవ్య మహిళ మండలి ప్రతినిధి కంకణాల విజయతో కలిసి ప్రయోగాత్మకంగా వివరించారు.

రెడ్ క్రాస్ ప్రతినిధులకు ధన్యవాదాలు

ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ కో ఆర్డినేటర్ కొల్లేటి రమేష్ మాట్లాడుతూ.. సీపీఆర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని, దీనిని ప్రతి ఒక్కరూ తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రస్తుత సమాజంలో దీని అవసరం ఎంతో ఉందని కనీస పరిజ్ఞానం తెలిసి ఉండాలని తెలిపారు. సీపీఆర్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ సమరం, జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు రాధికలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

నూతన పెన్షన్ విధానం రద్దు చేయాలి


నిరసన తెలుపుతున్న ఎంప్లాయిస్ సంఘ్ నేతలు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ విజయవాడ డివిజన్ ఆధ్వర్యంలో మంగళవారం డీఆర్ఎం కార్యాలయం మీదుగా రైల్వే స్టేషన్ వరకు నిరసన ర్యాలీ ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న సంఘ్ ఏజీఎస్ ఎడ్ల నాగేంద్రబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరితో కార్మిక చట్టాలను అణచివేస్తుందని విమర్శించారు. నూతన పెన్షన్ విధానంతో రైల్వే కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆరోపించారు. ఈ నూతన విధానంతో పదవీ విరమణ చేసిన వారికి పెన్షన్ రూ.3 వేల నుంచి రూ.4 వేలు మాత్రమే వస్తుందన్నారు. దీంతో వారి కుటుంబం ఎలా మనుగడ సాగిస్తాయని ప్రశ్నించారు. ఇప్పటికైనా రైల్వే కార్మికుల న్యాయమైన డిమాండ్ పాత పెన్షన్‌ను కేంద్రం వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఎంప్లాయిస్ సంఘ్ డివిజన్ అధ్యక్షుడు రాఘవేంద్రరావు మాట్లాడుతూ.. రైల్వేలో ఖాళీగా ఉన్న పోస్టులు వెంటనే భర్తీ చేయాలని, కొత్తగా ప్రవేశపెడుతున్న రైళ్ల కనుగుణంగా ఖాళీలను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘ్ డెప్యూటీ సెక్రటరీ రాజబాబు, సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యులు అల్లం రమేష్, శ్రీను, సీఅండ్‌డబ్ల్యూ బ్రాంచ్ సెక్రటరీ కర్నూలు సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ ప్రభుత్వాన్ని ఆదరించండి



10వ డివిజన్ ఆర్ఆర్ గార్డెన్స్‌లో పర్యటిస్తున్న దేవినేని క్రాంతి, నాయకులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తీసుకు రావాలని ఆ పార్టీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ సోదరి దేవినేని క్రాంతి కోరారు. ఆమె గడప గడపకు మీ అవినాష్ అన్న హామీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం 10వ డివిజన్ ఆర్ఆర్ గార్డెన్స్ ప్రాంతంలో పర్యటించగా, అవినాష్ సతీమణి దేవినేని సుధీర 4వ డివిజన్ శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. అంతేకాకుండా నియోజకవర్గంలో అందరికీ అందుబాటులో ఉండే నాయకులు దేవినేని అవినాష్ అని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు ముసునూరు సుబ్బారావు, 10వ డివిజన్ ఇన్‌చార్జి కరుటూరి హరీష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొనారు.

ముమ్మరంగా శానిటేషన్ డ్రైవ్

పెనమలూరు: తాడిగడపలో మంగళవారం శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్ జరిగింది. సచివాలయం-1 పరిధిలో తాడిగడప మున్సిపల్ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు విస్తృతంగా పర్యటించారు. డ్రెయినేజీల్లో క్రమం తప్పకుండా పూడిక తీయాలని కమిషనర్ ఆదేశించారు. చెత్త కుండీల్లో ప్రతి రోజు చెత్త తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తాడిగడపలో శానిటేషన్ పూర్తి స్థాయిలో అమలు చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

రేపు సిద్ధార్థలో ఇన్‌కెండో-2కే24


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీన్ రాజేష్, అధ్యాపకులు, విద్యార్థులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): కామర్స్ చదివే విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఈ నెల 21వ తేదీ గురువారం సిద్ధార్థ ఆడిటోరియంలో తమ కళాశాల కామర్స్ విద్యార్థుల విభాగం ఆధ్వర్యంలో ఇన్‌కెండో-2కే24 పేరుతో పోటీలను నిర్వహిస్తున్నట్లు పీబీ సిద్ధార్థ కళాశాల డీన్ రాజేష్ సి.జంపాల తెలిపారు. కళాశాల ఆవరణలోని సెమినార్ హాలులో ఇన్‌కెండో-2కే24 కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను రాజేష్, కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, ప్రిన్సిపాల్ ఎం.రమేష్, కామర్స్ విభాగాధిపతి నారాయణరావుతో పాటుగా అధ్యాపకులు, విద్యార్థులు కలిసి మంగళవారం ఆవిష్కరించారు. రాజేష్ మాట్లాడుతూ విద్యార్థులకు క్విజ్, ఫ్లోర్ క్రాసింగ్, దలాల్ స్ట్రీట్, యాడ్-మాడ్, ఫైనాన్షియల్ అనలిస్ట్, డ్యాన్స్ టూ ట్రిబ్యూట్, మైండ్ ఇట్, ఐపీఎల్, మిస్టర్ అండ్ మిస్ ఇన్‌కెండో-2024 పేరుతో ఫ్యాషన్ షో నిర్వహిస్తున్నామన్నారు. కామర్స్ విభాగాధిపతి కోనా నారాయణరావు మాట్లాడుతూ.. గురువారం ఉదయం 9 గంటల నుంచి సిద్ధార్థ ఆడిటోరియంలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమానికి అతిథిగా ఆదాయపు పన్ను శాఖ డెప్యూటీ కమిషనర్ డాక్టర్ టి.సవీష్ వర్మ పాల్గొంటారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వివిధ కళాశాలల్లో కామర్స్ చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపుతారన్నారు. పోటీల్లో విజేతలకు గురువారం సాయంత్రం బహుమతి ప్రదానోత్సవం జరుగుతుందని చెప్పారు.

డాక్టర్ వెంకటేష్‌కు జీడీఏ ఏపీ సంఘం అభినందనలు


డాక్టర్ వెంకటేష్‌ను అభినందిస్తున్న జీడీఏ ఏపీ సంఘ సభ్యులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఇటీవల వైద్య విద్య అదనపు సంచాలకులుగా(అడిషనల్ డీఎంఈ)గా పదోన్నతి పొందిన ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డి.వెంకటేష్‌కు మంగళవారం గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ఆంధ్ర ప్రదేశ్(జీడీఏ ఏపీ) సిద్ధార్థ వైద్య కళాశాల శాఖ ప్రతినిధులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జనరల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ ఇంజేటి బాబ్జి శ్యామ్‌కుమార్, డాక్టర్ సంపత్‌లు మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రికి వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన సేవలు అందించేలా వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసేలా కృషి చేస్తున్న డాక్టర్ వెంకటేష్‌కు పదోన్నతి రావడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం వైద్య విద్య అదనపు సంచాలకులుగా పదోన్నతి పొందడంతో పాటు, ఆయనకు ఉన్న అనుభవంతో రోగులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. అందుకోసం తమ సంఘ సభ్యులు సైతం రోగులకు నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని వారు పేర్కొన్నారు. అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ దుర్గారాణి, కోశాధికారి డాక్టర్ రత్నబాబు, డాక్టర్ నూరుల్లా, డాక్టర్ అంకిత పాల్గొన్నారు.

మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

పెనమలూరు: మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప కార్మికనగర్ 1కు చెందిన మహిళకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆమె కుటుంబ అవసరాల కోసం రూ.30 వేలకు బంగారు నగలు తాకట్టుపెట్టింది. ఈ విషయం ఇంటి ఎదురుగా ఉండే నాగరాజుకు చెప్పింది. దీంతో నాగరాజు సొమ్ము చెల్లించి బంగారం విడిపించి తన వద్ద ఉంచుకున్నాడు. మహిళ తన వద్ద డబ్బు ఉన్నప్పుడు బంగారు తీసుకుంటానని నాగరాజుకు చెప్పింది. అప్పటి నుంచి నాగరాజు ప్రవర్తనలో మార్పు వచ్చింది. ఫోన్ చేసి మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించసాగాడు. నాగరాజు ఫోన్ నంబర్‌ను బ్లాక్ చేయడంతో ఇంటికి వచ్చి బెదిరించాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. నాగరాజుపై కేసు నమోదు చేశారు.

పేరంటాలమ్మ హుండీ ఆదాయం రూ.13.13 లక్షలు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీవెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలోని హుండీలను 73 రోజులకుగానూ లెక్కించగా రూ.13,13,870 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ లోకేశ్వరి తెలిపారు. దేవదాయ శాఖాధికారి జీవీ కృష్ణారావు పర్యవేక్షణలో మంగళవారం లెక్కించారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం మొగల్రాజపురం సెక్షన్, ఎంజీ ఇండోర్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 6 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా మధుగార్డెన్ ఏరియా, ఏఎస్ రామారావు రోడ్డు, శాంతినగర్, జమ్మిచెట్టు సెంటర్, ఉడ్‌పేట, బాడవపేట, వాటర్ ట్యాంక్ రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

నేటి నుంచి రామలింగేశ్వర నగర్‌లో పాదయాత్ర

ఆటోనగర్(విజయవాడతూర్పు): రామలింగేశ్వరనగర్‌లో బుధవారం నుంచి 10 రోజుల పాటు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ తెలిపారు. స్థానిక వంగవీటి మోహన్‌రంగా విగ్రహం నుంచి ఉదయం 7.30 గంటల నుంచి 15వ డివిజన్‌లో పాదయాత్ర నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

ఆంజనేయుడికి పంచామృత అభిషేకాలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భీమన వారి పేటలోని శ్రీ విజయదుర్గా రామలింగేశ్వర పంచముఖ ఆంజనేయ స్వామివారి దేవస్థానంలో స్వామివారికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున స్వామివారికి పంచామృత అభిషేకాలు, విశేష అలంకరణ అనంతరం తమలపాకులతో అర్చన జరిగింది. స్వామివారికి ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి పూజా కార్యక్రమాలను నిర్వహించగా, పలువురు ఉభయదాతలు, భక్తులు తమ నామగోత్రాలతో పూజలు జరిపించుకున్నారు. సాయంత్రం స్వామివారికి పంచహారతుల సేవ నిర్వహించారు.

వాటర్ కూలర్ల ఏర్పాటు



రామవరప్పాడు: వైఎస్సార్ సీపీ గన్నవరం నియోజకవర్గ అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్ అందజేసిన వాటర్ కూలర్లను నిడమానూరు సీడబ్ల్యూసీ గోడౌన్ సెంటర్‌లో మంగళవారం సర్పంచ్ శీలం రంగారావు, జెడ్పీటీసీ సభ్యుడు సువర్ణరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకుని వంశీమోహన్ ప్రజలు, ప్రయాణికుల దాహార్తిని తీర్చడానికి ఈ కూలర్లు అందజేశారని తెలిపారు. ఈ కూలర్ల ఏర్పాటుతో గోడౌన్‌లోని కార్మికులతో పాటు ప్రయాణికులకు చల్లటి తాగునీరు అందుతుందన్నారు. అనంతరం సర్పంచ్ రంగారావు ఆధ్వర్యంలో గోడౌన్‌లో పని చేసే కార్మికులందరికీ టవల్స్‌ను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో గన్నవరం నియోజకవర్గ ఎలక్షన్స్ ఇన్‌చార్జి ఆర్.వెంకటేశ్వరరావు, పరిమి విష్ణు, బొగ్గవరపు రాజేంద్రప్రసాద్, మండల సోషల్ మీడియా కన్వీనర్ పెనుమాక రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వీఎంసీ అధికారులను అడ్డుకున్న బీజేపీ నాయకులు

విజయవాడస్పోర్ట్స్: ఎన్నికల ప్రవర్తన నియామవళి అమలులో భాగంగా బీజేపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఆ పార్టీ ఫ్లెక్సీలను తొలగించేందుకు వెళ్లిన విజయవాడ మున్సిపల్ అధికారులను బీజేపీ నాయకులు అడ్డుకున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉందని, నిబంధనల ప్రకారం ఫ్లెక్సీలను కచ్చితంగా తొలగించాల్సి ఉందని అధికారులు వివరించినా.. అధికారులతో ఆ పార్టీ నాయకులు దురుసుగా ప్రవర్తించారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గేటు లోపలకు వెళ్లేందుకు ప్రయత్నించిన అధికారులను అడ్డుకుని వాగ్వాదానికి దిగారు.

బీఆర్టీఎస్ రోడ్డులో నాకాబందీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): సాధారణ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికల బృందంలో భాగమైన స్టాటిక్ సర్విలెన్స్ టీమ్ మంగళవారం విజయవాడ బీఆర్టీఎస్ రోడ్డులో నాకాబందీ నిర్వహించారు. అధికారి ఎస్.సుకీర్తి నేతృత్వంలో స్టాటిక్ సర్విలెన్స్ టీమ్ వాహనాలను తనిఖీలు చేశారు. అన్ని వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు.

స్వ'ప్రజాగళం'తో కూటమి ఉక్కిరిబిక్కిరి

రగులుతున్న టికెట్ల రగడ.. రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు

ఉండవల్లిలోని బాబు నివాసం వద్ద కదిరి శ్రేణుల నిరసన

హైదరాబాద్‌లోని ఇంటి వద్దా ఆలూరు కార్యకర్తల హల్‌చల్


విశాఖలో వంశీకృష్ణ చిత్రపటాన్ని దహనం చేస్తున్న జనసైనికులు

సాక్షి, అమరావతి/దాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ)/పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)/సీతంపేట(విశాఖ ఉత్తర): తెలుగుదేశం పార్టీలో సీట్ల మంటలు ఆరడంలేదు. రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలతో ఆ పార్టీ అట్టుడుకుతోంది. నియోజకవర్గాల్లోనే కాకుండా చంద్రబాబు ఇళ్ల వద్దకు కూడా వచ్చి టీడీపీ కార్యకర్తలు ఆందోళనలు చేస్తున్నారు. మంగళవారం ఉండవల్లి, హైదరాబాద్‌లలోని చంద్రబాబు ఇళ్ల వద్ద తెలుగు తమ్ముళ్లు నిరసన గళం విప్పారు కర్నూలు జిల్లా ఆలూరు సీటును కోట్ల సుజాతమ్మకు ఇవ్వాలని డిమాండ్‌చేస్తూ ఆమె మద్దతుదారులు హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని చంద్రబాబు ఇంటి వద్ద ఆందోళన చేశారు. ఆలూరు సీటును బయట వ్యక్తులకు ఇస్తే అంగీకరించేది లేదని హెచ్చరించారు. బాబును కలిసి తమ ఆవేదనను తెలుపుతామని లోపలకు పంపాలని గొడవ చేశారు. పోలీసులు ఎవరినీ లోపలకు అనుమతించ లేదు. దీంతో వారు సుజాతమ్మకే ఆలూరు సీటు ఇవ్వాలంటూ నినాదాలు చేశారు. మరోవైపు ఉండవల్లి నివాసం వద్ద కూడా కదిరి నియోజకవర్గ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. మాజీ ఎమ్మెల్యే చాంద్ బాషాకు సీటు ఇవ్వకపోవడం అన్యాయమని, ఐదేళ్లు ఆయన నియోజకవర్గంలోనే ఉండి పని చేశారని, ఇప్పుడు వేరే వారికి సీటు ఎలా ఇస్తారని నిలదీశారు. కదిరి అసెంబ్లీ సీటు ఇవ్వలేనప్పుడు హిందూపురం ఎంపీ స్థానమైనా కేటాయించాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు ఇంట్లో లేకపోవడంతో కనీసం లోకేశ్‌ను కలవడానికి అవకాశం ఇవ్వాలని కోరారు. కొందరిని లోపలకు పంపించారు. ఆయన వారితో సరిగా మాట్లాడకుండానే తిప్పి పంపించివేశారు.

లోకేశ్‌ను కలిసిన కోడెల శివరామ్

ఉమ్మడి గుంటూరు జిల్లా నేత కోడెల శివరామ్ ఉండవల్లిలో మంగళవారం టీడీపీ నేత లోకేశ్‌ను కలిశారు. ఆయనకు ఈ ఎన్నికల్లో సీటు నిరాకరించడంతో కొద్దిరోజులుగా స్తబ్దుగా ఉన్నారు. ఆయన్ను బుజ్జగించేందుకు పిలిచిన లోకేశ్ అధికారంలోకి వస్తే మంచి ప్రాధాన్యం ఇస్తామని సముదాయించారు. అయితే శివరామ్ నుంచి సానుకూల స్పందన రాలేదని సమాచారం.

- విశాఖ దక్షిణ నియోజకవర్గం జనసేన పార్టీలో అసంతృప్తి సెగలు కక్కుతోంది. నేనే విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎన్డీఏ కూటమి అభ్యర్థిని అంటున్న వంశీకృష్ణ శ్రీనివాస్‌పై పలువురు జనసైనికులు, వీరమహిళలు మండిపడుతున్నారు. మంగళవారం నియోజకవర్గ పరిధిలో వంశీకృష్ణ శ్రీనివాస్ చిత్రపటాన్ని దహనం చేశారు. వంశీ వద్దంటూ నల్లబెలూన్లు ఎగరవేసి నిరసన తెలిపారు. కార్పొరేటర్ మహ్మద్ సాధిక్‌కుగానీ, డాక్టర్ మూగి శ్రీనివాసరావులలో ఎవరికి టికెట్ ఇచ్చినా తమ సహకారం ఉంటుందని స్పష్టం చేశారు.
- పాడేరు అసెంబ్లీ స్థానం బీజేపీకేనని అధిష్టానం తేల్చిచెప్పడంతో మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఈనెల 13న తన అనుచరులతో తన నివాసం వద్ద అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈనెల 15న తన అనుచరులతో పాడేరు పట్టణంలో ర్యాలీ నిర్వహించి, బలప్రదర్శన చేశారు. ఈ నేపథ్యంలో టీడీపీలోని ఆశావహులంతా ఒక్కటై తమలో ఎవరికి టికెట్ ఇచ్చినా సమ్మతమేనని, బీజేపీకి మాత్రం సీటు వదలొద్దని డిమాండ్ చేస్తున్నారు. దీనిపై బాబును కలవాలని విజయవాడ వెళ్లి అధినేత దర్శనభాగ్యం కోసం ఐదు రోజులుగా అక్కడే ఎదురుచూస్తున్నారు. ఇంకా సీటుపై సందిగ్ధం వీడకపోవడంతో కింది స్థాయి కార్యకర్తలు, నాయకులు వైఎస్సార్‌సీపీ వెంట నడిచేందుకు సిద్ధమవుతున్నారు.
- విశాఖ ఉత్తర నియోజకవర్గంలో జనసేన బలప్రదర్శన చేస్తోంది. బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు కంటే తానే బలమైన అభ్యర్థినంటూ సీటు దక్కించుకోవడానికి జనసేన ఉత్తర నియోజకవర్గం ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్ పావులు కదుపుతున్నారు. ఇటీవల ఆ పార్టీ ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. పొత్తులో భాగంగా ఈ సీటును బీజేపీకి కేటాయించినట్లు తెలుస్తోంది. నియోజకవర్గంలో బీజేపీకి గత ఎన్నికల్లో నోటా కంటే తక్కువే ఓట్లు వచ్చాయని, తనకు మెరుగైన ఓట్లు వచ్చాయని ఉషాకిరణ్ వాదిస్తున్నారు. సీటు విషయం పునరాలోచించాలని పార్టీకి లేఖ రాశారు.

చంద్రబాబు ఓ అనైతిక నేత

మంత్రి అంబటి రాంబాబు



సత్తెనపల్లి: ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడుపై కృత్రిమ మేధస్సు ద్వారా రాష్ట్ర ప్రభుత్వం, వైఎస్సార్‌సీపీ దుష్ప్రచారం చేస్తోందని చంద్రబాబు చేస్తున్న ఆరోపణ సరికాదని, ఈ ప్రభుత్వానికి అలాంటి అవసరంలేదని మంత్రి అంబటి రాంబాబు స్పష్టంచేశారు. చంద్రబాబు ఓ అనైతిక నేత అని విమర్శించారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నడవలేక దారి వంకరన్న చందంగా ప్రజాగళం సభకు జనంరాక, అట్టర్‌ఫ్లాప్ కావడంతో వారి వైఫల్యాలను ఎదుటివారిపై నెట్టేస్తున్నారని మండిపడ్డారు. వారు నిర్వహించిన రెండు సభలకు వచ్చినంత జనం కంటే ఎక్కువగా తమ ఒక్క సిద్ధం సభకు వచ్చారన్నారు. ప్రజాగళంలో మైక్ కూడా పనిచేయకపోవడం వారికి అపశకునమేనన్నారు. భద్రతా వైఫల్యాలంటూ ప్రభుత్వంపై నెపం నెట్టే ఆరోపణలు సరికాదన్నారు. జెండా సభ, ప్రజాగళం కార్యక్రమాలు విజయవంతం కాక చంద్రబాబు అభద్రతాభావంలో ఉన్నాడని అంబటి విమర్శించారు.

బాబు వస్తే ముస్లిం రిజర్వేషన్లు రద్దే..

ఇక తెలంగాణ ఎన్నికల సభలో ముస్లింల రిజర్వేషన్లు రద్దుచేస్తామని అమిత్ షా ప్రకటించలేదా అని అంబటి ప్రశ్నించారు. ముస్లిం మైనారిటీ సోదరులు జాగ్రత్తగా ఉండాలని, పొరపాటున చంద్రబాబు కూటమి అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తారని ఆయన హెచ్చరించారు. రానున్నది మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని తేల్చిచెప్పారు.

సత్వరమే కేసులు పరిష్కరించాలి

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్



నందిగామ: కేసులు సత్వర పరిష్కారానికి అందరూ కృషి చేయాలని రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ సూచించారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ పట్టణంలో రూ.4.40 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన కోర్టు భవనాలను మంగళవారం పలువురు హైకోర్టు న్యాయమూర్తులతో కలిసి ప్రధాన న్యాయమూర్తి ప్రారంభించారు. ముందుగా కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం స్థానిక శ్రీకరం కళ్యాణ మండపంలో జరిగిన సమావేశంలో ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ.. న్యాయవాదులు నిత్యం కోర్టుకు రావడంతో పాటు కేసులు సత్వరం పరిష్కారం అయ్యేలా సహకరించాలన్నారు. ముఖ్యంగా సీనియర్ న్యాయవాదులు కూడా నిత్యం కోర్టుకు రావాలని సూచించారు. నందిగామ లాంటి చిన్న పట్టణంలో అన్ని వసతులతో కూడిన కోర్టును నిర్మించుకోవడం సంతోషకరమని, కక్షిదారులకు కూడా సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు. హైకోర్టు న్యాయమూర్తులు ఏవి శేషసాయి, వీఆర్‌కే కృపాసాగర్, వి.శ్రీనివాస్, వి.గోపాల కృష్ణారావు, ఎం.కిరణ్మయి, ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక తదితరులు పాల్గొన్నారు.

రఘురామ పిల్‌పై విచారణ వాయిదా

- జూన్ చివరి వారంలో విచారణ జరుపుతామన్న ధర్మాసనం
- ఈ వ్యాజ్యంపై మీడియాతో మాట్లాడొద్దని ఆదేశం

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలకు దురుద్దేశాలను ఆపాదించడంతోపాటు ఆ పథకాల వల్ల పలువురికి లబ్ధి చేకూర్చేలా ప్రభుత్వ నిర్ణయాలు, విధానాలు ఉన్నాయని.. వాటిపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ నరసాపురం ఎంపీ కె.రఘురామకృష్ణరాజు దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ వాయిదా పడింది. జూన్ చివరి వారంలో దీనిపై విచారణ జరుపుతామని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ మండవ కిరణ్మయితో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. సీబీఐ దర్యాప్తు కోరుతూ రఘురామకృష్ణరాజు దాఖలు చేసిన పిల్ మంగళవారం మరోసారి విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు స్పందిస్తూ.. ఎన్నికల నేపథ్యంలో రాజకీయ ప్రయోజనాల నిమిత్తం ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశామని ప్రభుత్వం ఆరోపిస్తున్న నేపథ్యంలో తమ వ్యాజ్యంపై ఎన్నికలు పూర్తయిన తరువాతనే విచారణ జరపాలని, ఈ అభ్యర్థనతో ఓ అఫిడవిట్ కూడా దాఖలు చేశామని చెప్పారు. దీంతో ధర్మాసనం ఆ అఫిడవిట్‌ను పరిశీలించింది. దీనిపై ప్రభుత్వ స్పందన కోరింది.

'దురుద్దేశాలున్నాయి కాబట్టే వాస్తవాలను దాచిపెట్టారు'

ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ.. రాజకీయ దురుద్దేశాలతోనే ఈ వ్యాజ్యం దాఖలు చేశారని, అందువల్ల దీని విచారణార్హతపై ఇప్పుడు తేల్చాల్సిన అవసరం ఉందన్నారు. దురుద్దేశాలతో ఈ వ్యాజ్యం దాఖలు చేశారు కాబట్టే.. ఆయన తనపై ఉన్న కేసుల గురించి ఈ వ్యాజ్యంలో ప్రస్తావించలేదని తెలిపారు. వాస్తవాలను దాచిపెట్టి పిల్ వేయడం హైకోర్టు నిబంధనలకు విరుద్ధమన్నారు. ఈ వ్యాజ్యం విచారణార్హతను తేల్చేందుకు ఎన్నికలు పూర్తయ్యే వరకు వేచి చూడాల్సిన అవసరం లేదని, ఇప్పుడు విచారణ జరిపితే వాదనలు వినిపించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఇదే సమయంలో భారతి సిమెంట్, భారతి పాలిమర్స్ తరఫు సీనియర్ న్యాయవాది ఎస్.రవి వాదనలు వినిపిస్తూ.. తమకు రాజకీయాలతో సంబంధం లేదన్నారు. ఈ వ్యాజ్యానికి అసలు విచారణార్హతే లేదని తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం ఎన్నికల తరువాత విచారణ జరపాలంటూ రఘురామకృష్ణరాజు దాఖలు చేసిన అఫిడవిట్‌ను పరిగణనలోకి తీసుకుంటున్నట్లు తెలిపింది. రఘురామకృష్ణరాజు వ్యాజ్యంపై జూన్ చివరి వారంలో విచారణ జరుపుతామని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సమయంలో ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది చింతల సుమన్ స్పందిస్తూ.. ఈ వ్యాజ్యం ఎప్పుడు విచారణకు వచ్చినా దాని గురించి రఘురామకృష్ణరాజు మీడియా ముందు మాట్లాడుతూ రచ్చ రచ్చ చేస్తున్నారని తెలిపారు. ఈ వ్యాజ్యం గురించి, అందులోని అంశాల గురించి మీడియాతో మాట్లాడకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం ఇరుపక్షాలు ఈ వ్యాజ్యం గురించి మీడియా ముందు మాట్లాడొద్దని ఆదేశాలు జారీ చేసింది.

రగులుతున్న పొత్తు కుంపట్లు

టీడీపీ, జనసేన, బీజేపీ ఎవరికి వారే..

సాక్షి, చిత్తూరు/సాక్షి, రాజమహేంద్రవరం/సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం/సాక్షిప్రతినిధి, కాకినాడ/సాక్షి, భీమవరం/సాక్షి ప్రతినిధి, ఏలూరు: టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య క్షేత్రస్థాయిలో పొత్తు పొసగడం లేదు. కార్యకర్తలు, నేతలు ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా ఉంటున్నారు. ఒకరిపై ఒకరు కత్తులు నూరుకుంటున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు సొంత జిల్లా కేంద్రమైన చిత్తూరు పార్లమెంట్ అభ్యర్థి ప్రకటనా ఇంకా కాలేదు. ఇప్పటివరకు ప్రకటించిన అసెంబ్లీ సీట్లలోనూ మూడు పార్టీలూ ఏకతాటిపైకి రావడం లేదు. బాబు పోటీ చేస్తున్న కుప్పం నియోజకవర్గంలో టీడీపీ క్యాడర్ చేతులెత్తేసింది. ఇక్కడ టీడీపీ తీరుతో విసిగి జనసేనలో చేరిన నేతలు ఇప్పుడు ఇరుపార్టీల మధ్య పొత్తు కుదరడం, బాబే మళ్లీ పోటీ చేస్తుండడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. టీడీపీకి దూరంగా ఉంటున్నారు. బీజేపీ నాయకులూ అంటీముట్టనట్టు వ్యవహరిస్తున్నారు. పూతలపట్టు, నగరి, పుంగనూరు, జీడీ నెల్లూరు, పలమనేరుల్లోనూ టీడీపీ అభ్యర్థులకు మిత్రపక్షాల నుంచి సహకారం లేదు. చిత్తూరు టీడీపీ అభ్యర్థి గురజాల జగన్‌మోహన్‌నాయుడు పట్టుకోసం పార్టీ నాయకులపై స్పై ఆపరేషన్ చేస్తున్నట్టు సీనియర్ నేతలు విమర్శిస్తున్నారు. చిత్తూరు ఎంపీ అభ్యర్థిని బాబు ఇంకా తేల్చలేదు. ఐఆర్ఎస్ అధికారి ప్రసాద్‌రావుతోపాటు ఒకరిద్దరి పేర్లు వినిపిస్తున్నాయి.


కొండబాబు


వెంకటరమణ చౌదరి

వెంకటరమణా.. ఎంపీ సీటూ గోవిందా!

రాజానగరం అభ్యర్థిత్వం చేజారిన బొడ్డు వెంకటరమణ చౌదరికి మళ్లీ భంగపాటు తప్పేలా లేదు. అప్పట్లో రాజమహేంద్రవరం ఎంపీ స్థానం ఆశ చూపిన అధిష్టానం ఇప్పుడు మొండి చేయి ఇచ్చేలా కనిపిస్తోంది. పొత్తులో భాగంగా ఎంపీగా పురంధరేశ్వరి బరిలో దిగనున్నట్టు ప్రచారం జరుగుతోంది.

వీడని బీజేపీ 'సీటు'ముడి

శ్రీకాకుళం జిల్లాలో పొత్తులో భాగంగా బీజేపీకి కేటాయించే సీటుపై ఇంకా క్లారిటీ లేకపోవడంతో ఆ పార్టీ నేతలు ఆందోళన చెందుతున్నారు. పాతపట్నం, ఎచ్చెర్లలో ఒక నియోజకవర్గం బీజేపీకి కేటాయించవచ్చని తెలుస్తోంది. బీజేపీ ఈ రెండింటిలో ఏదడిగినా ఇచ్చేందుకు బాబు సిద్ధంగా ఉన్నట్టు సమాచారం. దీంతో ఆ రెండు నియోజకవర్గాల్లో టీడీపీ ఆశావహులు ఆందోళన చెందుతున్నారు.

'కొండ'ఎక్కిన సీటు ఆశలు

తెలుగుదేశం పార్టీలో కాకినాడ సిటీ సీటు పంచాయితీ ఎటూ తేలడం లేదు. చంద్రబాబు పిలుపు కోసం ఎదురుచూస్తున్న మాజీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు(కొండబాబు) ఆశలు కొండెక్కాయనే ప్రచారం జరుగుతోంది. అన్న సత్యనారాయణ రూపంలో కొండబాబుకు ఇంటిపోరు ఎదురుకావడంతోపాటు పార్టీలోనూ వ్యతిరేకత ఉండడంతో బాబు పునరాలోచనలో పడ్డారని సమాచారం. కొండబాబు స్థానంలో అతని అన్న సత్యనారాయణ పెద్ద కోడలు సుస్మిత పేరును ఐవీఆర్ఎస్ సర్వేలో చేర్చారని చర్చ జరుగుతోంది.

పశ్చిమలో పోరు

పశ్చిమగోదావరి జిల్లాలో కూటమిలో సెగ రగులుతోంది. జనసేన పార్టీ నాయకుడు బొమ్మిడి నాయకర్, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు వర్గాలు ఎడముఖంపెడముఖంగా ఉండడంతో శ్రేణులు గందరగోళంలో పడ్డాయి. ఉండి టికెట్ ఆశించి భంగపడిన టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే వేటుకూరి శివరామరాజు స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉంటానని ప్రకటించడం శ్రేణుల్లో చీలిక తెచ్చింది. తణుకు టికెట్‌పై గంపెడాశలు పెట్టుకున్న జనసేన నేత విడివాడ రామచంద్రరావు పార్టీకి దూరంగా ఉన్నారు. భీమవరంలో టీడీపీ మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు)కు జనసేన టికెట్ ఇవ్వడంపై ఆ పార్టీలో నిరసన వ్యక్తమవుతోంది.

- ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లావ్యాప్తంగా 15 అసెంబ్లీ నియోజకవర్గాలు , రెండు పార్లమెంట్ స్థానాలు ఉంటే ఒక్కస్థానాన్నీ ఎన్డీఏ కూటమి మహిళలకు కేటాయించలేదు. అధికార వైఎస్సార్‌సీపీ గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి ముగ్గురు మహిళలకు అవకాశం ఇచ్చింది. పోలవరం, గోపాలపురం అసెంబ్లీ స్థానాలతో పాటు, నరసాపురం ఎంపీ స్థానాన్ని మహిళలకు కేటాయించింది.

ఆ లేఖ వల్ల మీకొచ్చిన నష్టమేంటి?

▶ మొదటి పేజీ తరువాయి

ఆధారాలుంటే చూపాలంది. కేవలం ఊహలు, ఆందోళనల ఆధారంగా పిటిషన్ దాఖలు చేయడానికి వీల్లేదంది. ఇలా దాఖలు చేసే పిటిషన్‌కు విచారణార్హత లేదని తేల్చి చెప్పింది. ఇదే సమయంలో రఘురామిరెడ్డి లేఖ మాత్రమే రాశారని, దానిపై ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకోవాల్సి ఉందని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాదులు మహేశ్వరరెడ్డి, సుమన్ హైకోర్టుకు నివేదించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో విధానపరమైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉండదని వారు వివరించారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు లోకేశ్ వ్యాజ్యంపై విచారణను జూన్‌కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

లోకేశ్ పిటిషన్ ఇదీ

రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టే సంస్థలకు కళ్లెం వేసి, ప్రభుత్వాదాయాన్ని పెంచి తద్వారా సంక్షేమ పథకాలను మరింతగా ప్రజలకు చేరువ చేసే దిశగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని పూర్తిస్థాయిలో బలోపేతం చేసేందుకు కొన్ని అధికారాలను కోరుతూ ఆ విభాగం ఇన్‌స్పెక్టర్ జనరల్ కె.రఘురామిరెడ్డి గత నెల 5న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి రాసిన లేఖను సవాల్ చేస్తూ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై మంగళవారం జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు విచారణ జరిపారు. విచారణ మొదలు కాగానే న్యాయమూర్తి పిటిషనర్ లోకేశ్‌కు పలు ప్రశ్నలు సంధించారు. ఈ సమయంలో లోకేశ్ తరఫు సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు స్పందిస్తూ.. విజిలెన్స్ ఐజీ అపరిమిత అధికారాలు కోరుతూ లేఖ రాశారన్నారు. పిటిషనర్‌తోపాటు ఆయన పార్టీని లక్ష్యంగా చేసుకునే ఆ లేఖ రాశారని తెలిపారు. ఆ లేఖ వల్ల పార్టీ ప్రభావితం అవుతుంది కాబట్టే ఆ పార్టీ తరఫున లోకేశ్ పిటిషన్ దాఖలు చేశారని వివరించారు.

'కౌంటర్లు దాఖలు చేస్తాం'

ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాదులు వేలూరి మహేశ్వరరెడ్డి, చింతల సుమన్ వాదనలు వినిపిస్తూ.. విజిలెన్స్ ఐజీ రాసిన లేఖ న్యాయశాఖకు చేరిందని, ఆ లేఖపై ప్రభుత్వమే విధానపరమైన నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని అభిప్రాయపడిందని తెలిపారు. లేఖపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉందని, అందువల్ల విధానపరమైన నిర్ణయాలు తీసుకునే అవకాశం లేదని వివరించారు. లోకేశ్ వ్యాజ్యానికి విచారణార్హతే లేదన్నారు. ఉన్నం జోక్యం చేసుకుంటూ.. విధానపరమైన నిర్ణయం ఇప్పుడు తీసుకోబోమన్న వివరాలను రికార్డ్ చేయాలని కోరారు. అందుకు న్యాయమూర్తి అంగీకరించారు. తదుపరి విచారణను జూన్‌కి వాయిదా వేశారు. కాగా.. ప్రభుత్వ న్యాయవాది సుమన్ స్పందిస్తూ.. ఈ లోపు వ్యాజ్యం విచారణార్హతపై పూర్తి వివరాలతో ప్రభుత్వం తరఫున కౌంటర్ దాఖలు చేస్తామని చెప్పారు. అందుకు న్యాయమూర్తి అంగీకరించారు.

పోలీసులపైకి టీడీపీ తప్పులు

చిలకలూరిపేట సభ నిర్వహణలో విఫలమైన తెలుగుదేశం పార్టీ

- ప్రధాని పాల్గొనే సభకు ఏర్పాట్లు చేయలేక బోర్లాపడ్డ నేతలు
- సాంకేతిక సమస్యలతో తిప్పలు పెట్టిన మైక్ సిస్టమ్
- ప్రధాని రావడానికి ముందు నుంచే పని చేయని మైకులు
- అప్పుడే సరిచేసి ఉంటే సమస్యే ఉండేది కాదు
- జనం పల్చగా ఉండటంతో వెనక ఉన్నవారిని ముందుకు రప్పించిన నేతలు
- దీంతో వీఐపీ గ్యాలరీల్లోకి చొచ్చుకువచ్చిన జనం
- వాటర్ ప్యాకెట్లు ఇవ్వాలని పోలీసులు చెప్పినా బాటిల్స్ ఇచ్చిన నేతలు
- టీడీపీ నేతలు వాహనాలు అడ్డుపెట్టి ట్రాఫిక్ జామ్ చేసిన వీడియోలు
- వేదిక పర్యవేక్షణ మొత్తం ఢిల్లీ నుంచి వచ్చిన ఎస్పీజీదే
- బొకే అనుమతించాల్సిందీ ఎస్పీజీనే
- శాలువా, బొకే తెచ్చుకోకుండా పోలీసులు అనుమతించలేదని ఆరోపణ
- ఇలా అన్నీ వారి నిర్వాకాలే.. టీడీపీ ఆరోపణలు మాత్రం పోలీసుల మీద..


వాహనాలను అడ్డంగా పెట్టి ట్రాఫిక్ జామ్ చేసిన టీడీపీ నేతలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఏదో చేయబోతే మరేదో అయిందన్న తీరుగా తెలుగుదేశం, బీజేపీ, జనసేన కూటమి చిలకలూరిపేట సభ జరిగింది. మూడు పార్టీలు కూటమి కట్టాక జరుగుతున్న తొలి సభను, అదీ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాల్గొంటున్న సభకు ఏర్పాట్లు సక్రమంగా చేయలేక, సభను సక్రమంగా నిర్వహించలేక, బోర్లాపడి, ఆ తప్పులను టీడీపీ నేతలు పోలీసులపైకి నెడుతున్నారు. అంతటితో ఆగక, సంబంధం లేనిదే అయినా ఎన్నికల సంఘానికీ ఫిర్యాదు చేశారు. అదీ కొందరు పోలీసు అధికారులను లక్ష్యంగా చేసుకొని ఫిర్యాదు చేయడం విడ్డూరంగా ఉందని పోలీసులు, విశ్లేషకులు అంటున్నారు. స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్పీజీ) చేతిలో ఉన్న అంశాలను కూడా పోలీసుల మీదకు రుద్దడాన్ని అధికారులు తప్పుపడుతున్నారు.

ఈ నెల 17న పల్నాడు జిల్లా చిలకలూరిపేట శివారు బొప్పూడి వద్ద ప్రజాగళం పేరుతో ఈ బహిరంగ సభ జరిగింది. ఇందులో ప్రధాని మాట్లాడుతుండగా మూడు సార్లు మైక్ మూగబోయింది. పోలీసులు మైక్ ఆపుతున్నారంటూ వేదిక మీద నుంచే నేతలు ఆరోపించారు. సాధారణంగా ప్రధాని పాల్గొనే కార్యక్రమాల్లో మైక్ ఏర్పాట్లు కేంద్ర ప్రభుత్వ సంస్థ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) చూస్తుంది. ఎన్నికల కోడ్ రావడంతో మైక్ ఏర్పాట్లను నిర్వాహకులే చూసుకున్నారు. ప్రభుత్వానికి, పోలీసులకు ఎటువంటి సంబంధం లేదు. మైక్ సిస్టమ్ కూడా ఎప్పుడూ లేనివిధంగా మీడియా గ్యాలరీలో పెట్టారు. మైక్ సిస్టమ్‌కు మొదటి నుంచి సాంకేతిక, రిమోట్ సమస్యలు ఉన్నట్లు కార్యక్రమం మొత్తాన్ని చూసిన ఎవరికైనా అర్థమవుతుంది. జనం తొక్కిడి కారణంగా కేబుల్ కట్ అయి ఉంటే పునరుద్ధరణ సాధ్యం అయ్యేదే కాదు. మధ్యాహ్నం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగే సమయంలోనే మైక్ పలుమార్లు ఆగిపోయింది. ఆ సమయంలో గ్యాలరీలో ప్రజలే లేరు. ప్రధాని హెలీకాప్టర్ వచ్చే సమయంలో కూడా మైకులు సరిగ్గా పనిచేయడంలేదు చూడండంటూ నిర్వాహకులు చెప్పడం వీడియోల్లో స్పష్టంగా కనపడుతోంది. అప్పుడే సాంకేతిక సమస్యల్ని పరిష్కరించి ఉంటే ప్రధాని ప్రసంగించే సమయంలో మైక్ సమస్యే ఉండేది కాదు. 4.15 గంటల సమయంలో టీడీపీ నాయకుడు ప్రత్తిపాటి పుల్లారావు ఎడమ వైపు గ్యాలరీ నిండిపోయినందున మిగతా వారిని కుడివైపు గ్యాలరీలలోకి పంపాలంటూ అనౌన్స్ చేశారు. ప్రధాని వచ్చే సమయానికి జనం పల్చగా ఉండటంతో వెనుక ఉన్న వారందరినీ ముందుకు రప్పించారు. అప్పటివరకూ వీఐపీ పాసులు ఉన్న వారు మాత్రమే కుడివైపు గ్యాలరీలోకి వచ్చి కూర్చొగా, పుల్లారావు చెప్పిన తర్వాత సాధారణ కార్యకర్తలు కూడా వీఐపీ గ్యాలరీలలోకి చొచ్చుకువచ్చారు. సభకు వచ్చే వారికి వాటర్ ప్యాకెట్లు మాత్రమే ఇవ్వాలని పోలీసులు, ఎస్పీజీ స్పష్టంగా చెప్పినా నిర్వాహకులు పట్టించుకోలేదు. వారికి అర లీటర్ వాటర్ బాటిల్స్ అందజేశారు. దీంతో కొంతమంది ఆకతాయిలు వేదిక ముందు ఉన్న డి–సర్కిల్‌లోకి వాటర్ బాటిళ్లు విసిరారు. ఇవన్నీ నిర్వాహకుల నిర్వాకాలే.

శాలువా, బొకే తెచ్చుకోకుండా..

వేదిక పైన చంద్రబాబు ప్రధాని మోదీని సన్మానిస్తారని చెప్పి అవమానించిన ఘటనపై కూడా నిర్వాహకుల వైఫల్యాన్ని పోలీసుల పైకి నెట్టేసే ప్రయత్నం చేస్తున్నారు. బొకేలు తేకుండా పోలీసులు అడ్డుకున్నారంటూ టీడీపీ నేతలు ఆరోపించారు. వాస్తవానికి హెలీప్యాడ్, డయాస్ అన్నీ ఢిల్లీ నుంచి వచ్చిన ఎస్పీజీ చేతుల్లో ఉంటుంది. హెలీప్యాడ్ వద్ద స్వాగతం చెప్పడానికి ఎవరు రావాలి, వీడ్కోలుకు ఎవరు రావాలి, వేదికపై ఎవరు ఉండాలనే విషయం కూడా ఎస్పీజీనే చూసుకుంటుంది. పోలీసులకు ఏమాత్రం సంబంధం లేదు. పాసులు కూడా ఎస్పీజీనే ఇస్తుంది. ఓ శాలువా, బొకే ముందుగా తెచ్చుకొంటే వాటిని ఎస్పీజీ ముందుగా తనిఖీ చేసి, అనుమతిస్తుంది.

12 మంది ఐపీఎస్‌లు, వేల మంది పోలీసులతో బందోబస్తు

సభ ఏర్పాట్ల కోసం సుమారు 3,960 మంది పోలీసులను ఉపయోగించారు. ఏడీజీ నుంచి, ఐజీ, ఎస్పీల వరకూ 12 మంది ఐపీఎస్ అధికారులు బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షించారు. తనిఖీల కోసం 20 డాగ్ స్క్వాడ్‌లను వాడారు. ప్రధాన మంత్రి కార్యక్రమం పూర్తయ్యేసరికి చీకటి పడినప్పటికీ, హెలికాప్టర్ కూడా చీకట్లో సురక్షితంగా టేకాఫ్ తీసుకొని, ఆయన క్షేమంగా వెళ్లేలా పోలీసులు చర్యలు తీసుకున్నారు. సభలో చిన్నపాటి తొక్కిసలాటగానీ, లాఠీఛార్జిగానీ జరగలేదు. ఒక్కరు కూడా గాయపడలేదు. జనం ఎక్కువగా వచ్చారన్న బిల్డప్ కోసం టీడీపీ నేతల సూచనలతో మైక్, లైటింగ్ టవర్స్‌పైకి ఎక్కిన వారిని దించాలని ప్రధాని కోరినప్పుడు వారిని క్షేమంగా దింపింది కూడా పోలీసులే. ఇవన్నీ వీడియోల్లో కనపడుతూనే ఉన్నాయి. అయినా టీడీపీ నేతలు పోలీసులను, ప్రత్యేకించి కొందరిని ఉద్దేశపూర్వకంగా టార్గెట్ చేస్తున్నారని విశ్లేషకులు చెబుతున్నారు. అనంతపురం జిల్లాకు చెందిన మాధవరెడ్డిని హెలీప్యాడ్ వద్ద నియమించడం ఏమిటని వారు టీడీపీ వారు ప్రశ్నిస్తున్నారు. అయితే ఇటీవల ప్రధాన మంత్రి సత్యసాయి జిల్లా పర్యటన ఏర్పాట్లు చూసిన అనుభవం ఉన్నందున ఆయన్ని ఇక్కడ నియమించారు. దీనికితోడు మాధవరెడ్డి ఇటీవలి వరకు మూడేళ్లకు పైగా ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే విజిలెన్స్ ఎస్పీగా పనిచేశారు. ప్రకాశం జిల్లా ఎస్పీకి ట్రాఫిక్ పర్యవేక్షణ బాధ్యత అప్పగించారు. టీడీపీ నేతలు ఉద్దేశపూర్వకంగా ఒక సామాజిక వర్గానికి చెందిన నలుగురు ఎస్పీలపైనే ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడం వెనుక కుట్రకోణం ఉందన్న వాదన వినిపిస్తోంది.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు తెచ్చిన వినాయకుని ప్రతిమను అనుమతించలేదా? ఈ విషయం తెలిసి కూడా పోలీసులపై నిస్సిగ్గుగా ఆరోపణలు చేస్తున్నారు.

ట్రాఫిక్ జామ్ వాళ్లు చేసిందే

ట్రాఫిక్ జామ్‌కు సంబంధించి కూడా బాపట్ల జిల్లా మేదరమెట్ల నుంచి గుంటూరు వరకూ ట్రాఫిక్ కంట్రోల్ చేయడం కోసం రెండు వేల మంది పోలీసులను ఉపయోగించారు. మామూలు సమయంలోనే చిలకలూరిపేట సెంటర్‌లో ట్రాఫిక్ జామ్ అవుతుంటుంది. ఆదివారం సభకు చిలకలూరిపేట, బొప్పూడి నుంచి వచ్చే వాహనాలు అన్నీ నాలుగున్నర తర్వాతే బయలుదేరాయి. దీంతో చిలకలూరిపేట వద్ద కొద్దిసేపు ట్రాఫిక్ జామ్ అయ్యింది. మరోవైపు భారీ సంఖ్యలో ప్రజలు వాహనాల్లో వస్తున్నట్లుగా చూపించడం కోసం టీడీపీ నేతలే వాహనాలు అడ్డం పెట్టి ట్రాఫిక్ ఆపి డ్రోన్‌షాట్స్ తీశారు. దీనివల్ల వాహనాలు నిలిచిపోయాయి. సభ పూర్తయిన తర్వాత అవే వాహనాలు గంటలోనే తిరిగి వెళ్లిపోయాయి. పోలీసులు పట్టించుకోకపోతే ఇలా గంటలోనే ట్రాఫిక్ మొత్తం క్లియర్ అయ్యేది కాదు.

చంద్రబాబుదే షాక్.. సబ్సిడీలకు బ్రేక్

వాస్తవాలు దాచి అడ్డగోలు అబద్ధాలతో ఈనాడు బురద కథనం

చంద్రబాబు చేసిన తప్పులను, పాపాలను ఏ రోజూ అచ్చేయని రామోజీకి గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వంలో ఒప్పులు సైతం తప్పులుగానే కనిపిస్తున్నాయి. తానేం రాసినా ఈ రాష్ట్ర ప్రజానీకం నమ్మేస్తుందనే వెర్రి భ్రమల్లోంచి ఈ గురివింద బయట పడడం లేదు. వాస్తవాలను అచ్చేయడానికి ఈ పెద్దమనిషికి చేతులు రావడం లేదు. రోజూ అభూతకల్పనలతో పత్రిక స్థాయిని ఎంతగా దిగజార్చుకోవాలో అంతగా దిగజారుస్తూ పాత్రికేయ విలువలకు వలువలూడదీస్తున్నారు. రికార్డు పరంగా ఉన్న నిజాలను సైతం అబద్ధాలుగా వక్రభాష్యాలతో అచ్చేస్తూ పత్రికను టీడీపీ కరపత్రికగా మార్చే బరితెగింపు రామోజీకి మాత్రమే సాధ్యమైంది. విద్యుత్ చార్జీల విషయంలో ఐదేళ్ల వ్యవధిలో ఏ రోజూ ప్రభుత్వ సబ్సిడీలు ఇవ్వని చంద్రబాబు రామోజీ దృష్టిలో గొప్ప పాలకుడు. రైతులకు ఉచిత విద్యుత్ అందిస్తున్న వైఎస్ జగన్ మాత్రం నచ్చని పాలకుడు. బొక్కబోర్లా పడిన టీడీపీని ఎలాగైనా నిలబెట్టాలని తెగ ఆరాట పడిపోతున్నారు. ఇందులో భాగంగా తాజాగా 'ఐదేళ్లు షాక్.. ఎన్నికలని బ్రేక్' శీర్షికతో ఈనాడులో అచ్చేసిన కథనంలో నిజానిజాలు ఇలా ఉన్నాయి.

- సాక్షి అమరావతి


ఐదేళ్లు షాక్.. ఎన్నికలని బ్రేక్!

ఆరోపణ: 2021-22లో వినియోగించిన విద్యుత్తుకు ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో రూ.3,082.99 కోట్ల భారం

వాస్తవం 2021-22లో వినియోగించిన విద్యుత్తుకు వాస్తవ, ఆమోదిత విద్యుత్తు కొనుగోలు ఖర్చులోని వ్యత్యాసాన్ని వసూలు చేస్తోంది. ఆ వసూలు భారం లేనిదే. ప్రతి యూనిట్‌కు కేవలం రూ.0.6455 పైసలు మాత్రమే వసూలు చేస్తోంది. ఇందులోనూ ప్రభుత్వ ప్రమేయం లేదు. పైగా ప్రభుత్వం సబ్సిడీ చెల్లించే కేటగిరీల వినియోగదారులకు ఆ భారాన్ని ప్రభుత్వమే భరిస్తోంది.

ఆరోపణ: 2014-19 మధ్య ట్రూ-అప్ కింద ఇప్పటికే రూ.1,455.37 కోట్లు వసూలు

వాస్తవం 2014-15 నుంచి 2018-19 వరకు ఆమోదించిన దానికి వాస్తవ పంపిణీ ఖర్చు (నిర్వహణ వ్యయం, తరుగుదల, మూలధన ప్రతిఫలం తదితరాలు)లో ఏర్పడ్డ వ్యత్యాసం రూపేణా రూ.2,910.74 కోట్లు ట్రూ-అప్ చార్జీలను వసూలు చేసుకునేందుకు ఏపీఈఆర్సీ ఉత్తర్వుల మేరకు డిస్కంలు వసూలు చేస్తున్నాయి. ఇప్పటి వరకూ ఒక్కో యూనిట్‌కు రూ.0.07 పైసలు చొప్పున అనుమతించిన దానిలో సగం మాత్రమే డిస్కంలు వసూలు చేశాయి. అదీ ఆమోదిత, వాస్తవ పంపిణీ ఖర్చు (నిర్వహణ వ్యయం, తరుగుదల, మూలధన ప్రతిఫలం తదితరాలు) వ్యత్యాసాన్ని మండలి ఉత్తర్వుల మేరకు వసూలు చేస్తున్నాయి. నిజానికి ఈ చార్జీలు టీడీపీ హయాంలోనే సర్దుబాటు చేయాల్సి ఉంది. 2014-15 నుంచి 2018-19 వరకు ఐదేళ్లకు టీడీపీ ప్రభుత్వ సబ్సిడీ రూ.17,487 కోట్లు మంజూరు చేయగా, అందులో రూ.10,923 కోట్లు మాత్రమే చెల్లించింది. రూ.6,564 కోట్లు చెల్లించలేదు. ఆ పాపమే ట్రూ-అప్‌గా ప్రజలపై పడింది. 2019-20 నుంచి 2023-24 వరకూ నాలుగేళ్లలోనే సబ్సిడీ రూ.2,0375 కోట్లు మంజూరు చేసి, రూ.20,479 కోట్లను ప్రస్తుత వైఎస్ జగన్ ప్రభుత్వం చెల్లించింది.

ఆరోపణ: చార్జీల పెంపు.. శ్లాబుల్లో మార్పులు చేసి ఏటా రూ.1,400 కోట్ల భారాన్ని 2022 ఏప్రిల్ నుంచి ప్రభుత్వం వేసింది.

వాస్తవం 2022 ఏప్రిల్ నుంచి శ్లాబులు, యూనిట్ రేట్లను పెరుగుతున్న సరఫరా వ్యయానికి అనుగుణంగా పెంచింది. అదీగాక గృహ వినియోగ కేటగిరీ సరఫరా వ్యయం రూ.7.79 కాగా, బిల్లింగ్ రేటు రూ.5.13 మాత్రమే ఉంది. అంటే గృహ వినియోగదారులకు సరఫరా వ్యయంతో పోలిస్తే తక్కువ ధరే వసూలు చేస్తోంది. అప్పుడు భారం ఎవరిపై పడినట్లు డ్రామోజీ?

ఆరోపణ: జగన్ ప్రభుత్వం నెలకు 500 యూనిట్లు వినియోగించే వినియోగదారులపై యూనిట్‌కు 90 పైసలు పెంచింది

వాస్తవం ఏటా విద్యుత్తు చార్జీల టారిఫ్‌పై ప్రతిపాదనలను ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ)కి పంపిణీ సంస్థలు సమర్పిస్తాయి. ఏపీఈఆర్సీ బహిరంగ విచారణ నిర్వహించి, ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వచ్చేలా కొత్త టారిఫ్ ప్రకటిస్తుంది. అంటే వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి నెల రోజుల ముందే టారిఫ్ అమలులోకి వచ్చింది. అలాంటప్పుడు ఆ చార్జీలను కొత్త ప్రభుత్వం ఎలా నిర్ణయిస్తుంది ? ఎలా పెంచుతుంది? ఈ మాత్రం ఇంగిత జ్ఞానం లేకుండా వార్తలెలా రాస్తున్నారు డ్రామోజీ? చంద్రబాబు హయాంలోనే పెంచిన చార్జీలను జగన్ ప్రభుత్వంపై రుద్దడానికి ఇంత కన్నా మార్గం కనిపించలేదా? నాలుగేళ్లుగా ఈ చార్జీలు కొనసాగుతున్నాయంటే 500 యూనిట్ల పైన వినియోగించే వారంటే కచ్చితంగా పేదలు కాదని రామోజీకి తెలియదా?

ఆరోపణ: 2023 ఏప్రిల్ నుంచి ప్రతినెలా విద్యుత్తు కొనుగోలుకు అదనంగా చేసిన ఖర్చును ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో వసూలు చేస్తోంది.

వాస్తవం 2023-24కు సంబంధించి విద్యుత్తు కొనుగోలు ట్రూ-అప్ (విద్యుత్తు కొనుగోలు వ్యయం, సర్దుబాటు)కు ఏపీఈఆర్సీ రెగ్యులేషన్-2 ప్రకారం ఏప్రిల్ నెల వినియోగానికి ఎఫ్‌పీపీసీఏ మొత్తాన్ని జూన్‌లో వసూలు చేయాలి. అదీ యూనిట్‌కు గరిష్టంగా రూ.0.40 పైసలు వరకు మాత్రమే వినియోగదారుల నుంచి వసూలు చేసుకునేందుకు అనుమతించింది. ఇందులో వ్యవసాయ, ఇతర సబ్సిడీ వినియోగదారులు చెల్లించాల్సిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తోంది.

ఆరోపణ : గృహ, ఎల్‌టీ వాణిజ్య వినియోగదారులపై స్థిర చార్జీల భారం

వాస్తవం గృహ వినియోగ కేటగిరీలో అంతకు ముందు విధిస్తున్న కనీస వినియోగ చార్జీలను ఈ ప్రభుత్వం రద్దు చేసింది. నిజానికి గృహ కేటగిరీలో స్థిరచార్జీలు ఇతర రాష్ట్రాల్లోనూ ఉన్నాయి. కర్ణాటకలో కిలోవాట్‌కు రూ.110 తీసుకుంటున్నారు. మహారాష్ట్రలో సింగిల్ ఫేజ్‌కు రూ.110, త్రీ ఫేజ్‌కు రూ.385 వసూలు చేస్తున్నారు. కేరళలో సింగిల్ ఫేజ్‌కు రూ.40 నుంచి రూ.260 వరకూ, త్రీఫేజ్‌కు రూ.100 నుంచి రూ.200 వరకూ విధిస్తున్నారు. 2021-22 ఆర్థిక సంవత్సరానికి ముందు ఒక్కో సర్వీసుకు నెలవారీ కనీస చార్జీల మొత్తం రూ.25గా ఉండేది. ఆ తర్వాత 2021 ఏప్రిల్‌లో ఆ కనీస చార్జీని ఒక్కో కిలోవాట్‌కు రూ.10లుగా నిర్ణయిస్తూ రాష్ట్ర విద్యుత్తు నియంత్రణా మండలి ఆదేశాలు జారీ చేసింది. ఈ స్థిర చార్జీలను డిస్కంకు విద్యుత్తు ప్రసార, పంపిణీ వ్యవస్థ (పీజీసీఐఎల్, ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్)కు అయ్యే వ్యయం, విద్యుదుత్పత్తి సంస్థలకు చెల్లించాల్సిన స్థిర వ్యయంలో కొంత భాగాన్ని రికవరీ చేసుకోవడం కోసం విధిస్తున్నారు. ఇది గృహేతర కేటగిరీల్లో ముందు నుంచి వసూలు చేస్తున్నదే. వాస్తవానికి సుమారు 67 శాతం సర్వీసులు ఒక కిలోవాట్, అంతకంటే తక్కువ లోడ్ పరిధిలోనే ఉంటాయి. అందువల్ల ఒక్కో సర్వీసుపైన విద్యుత్తు సంస్థలు దాదాపు రూ.15 నష్టాన్ని భరిస్తున్నాయి. ఇందులో ప్రజలపై భారం వేసిందేముంది? ప్రభుత్వం తీసుకున్నదేముంది?



మేలు చేయడం మోసమా?

- ఏటా విద్యుదుత్పత్తికి సంబంధించిన చార్జీలు పెరుగుతుండటంతో వాటికి అనుగుణంగా విద్యుత్తు కొనుగోలు చార్జీలూ పెరుగుతున్నాయి. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోనికి తీసుకునే వినియోగించిన విద్యుత్తుకు అనుగుణంగా చార్జీలపై ఏపీఈఆర్సీ నిర్ణయం తీసుకుంటుంది. ఇందులో ప్రభుత్వానికిగానీ, విద్యుత్తు సంస్థలకుగానీ ఎలాంటి ప్రమేయమూ ఉండదు. జాతీయ టారిఫ్ విధానం ప్రకారం గతంలో ఉన్న టారిఫ్ శ్లాబులను స్థిరీకరణ చేయడం ద్వారా శ్లాబ్‌లలో మార్పులు జరిగాయి. కేటగిరీ వారీగా చూస్తే టారిఫ్ ధరలు పెరగడం లేదు. పైగా వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ సామాన్య ప్రజలపై ఎలాంటి భారం పడకూడదని ప్రయత్నిస్తోంది. ప్రభుత్వ సూచనలతో విద్యుత్తు సంస్థల పరిధిలో సామాన్యులు మోయలేనంతగా చార్జీలను వసూలు చేయడం లేదు. వినియోగించిన విద్యుత్తుకు అనుగుణంగానే వసూలు చేస్తోంది.
- ఏటా విద్యుదుత్పత్తికి సంబంధించిన వ్యయం పెరుగుతుండడంతో వాటికి అనుగుణంగానే కొనుగోలు చార్జీలూ పెరుగుతున్నాయి. అలా పెరిగినా ఆ భారం పేదలపై పడకూడదని ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు 200 యూనిట్ల వరకు (గతంలో 100 యూనిట్లుగా ఉండేది), బాగా వెనుకబడిన తరగతుల వినియోగదారులకు 100 యూనిట్ల వరకు, క్షౌరశాలలకు 150యూనిట్ల వరకు, రజక వినియోగదారులకు 150 యూనిట్ల వరకు, చేనేత వృత్తి వినియోగదారులకు 100 యూనిట్ల వరకు, దోబీఘాట్లకు ఉచిత విద్యుత్తును ప్రభుత్వం రాయితీ ద్వారా అందిస్తోంది. ఇది ప్రణాళికతో చేస్తున్న మేలేగానీ మోసం ఎలా అవుతుంది రామోజీ?
- డిస్కంలు మరో రూ.7,200 కోట్లు ట్రూ-అప్ చార్జీలను వసూలు చేసుకోవడానికి అనుమతించాలని కోరితే ఎన్నికల నేపథ్యంలో ఆ ప్రతిపాదనను ఏపీఈఆర్సీ పక్కన పెట్టిందని ఈనాడు అర్థంలేని ఆరోపణ చేసింది. రాజ్యాంగబద్ధంగా స్వతంత్ర ప్రతిపత్తిలో న్యాయమూర్తి హోదా కలిగిన అత్యున్నత వ్యక్తి నేతృత్వంలో నడిచే ఏపీఈఆర్సీ ఓ రాజకీయ పార్టీకిగానీ, లేదా రాష్ట్ర ప్రభుత్వానికిగానీ జవాబుదారీ కాదనే విషయం రామోజీకి తెలియదా. అలాంటి ఏపీఈఆర్సీ వ్యక్తిగత ప్రయోజనాల కోసం నిర్ణయాలు తీసుకుందని ఎలా అంటారు. పైగా రూ.7,200 కోట్ల భారం ప్రజలపై వేయడానికి అంగీకరించకపోవడం మంచి విషయం కాదంటారా?
- రాష్ట్రంలోని దాదాపు రెండు కోట్ల మంది వినియోగదారులకు వారి కుటుంబాలకు ఊరట కలిగిస్తూ.. ఎలాంటి చార్జీల భారం లేకుండా 2024-25 టారిఫ్ ఆర్డర్‌ను ఏపీఈఆర్సీ ఆమోదించింది. మూడు డిస్కంలకు ప్రభుత్వం నుంచి అవసరమైన సబ్సిడీ రూ.13,589.18 కోట్ల భారాన్ని భరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చింది. గతేడాది కంటే ఇది రూ.3,453.96 కోట్లు అధికం. 2020-21 నుంచి రైల్వే ట్రాక్షన్‌కు టారిఫ్‌లో పెంపుదల లేనందున, వాస్తవ సేవా ఖర్చు, ద్రవ్యోల్బణాన్ని ప్రతిబింబించేలా ఇంధన చార్జీలు యూనిట్‌కు రూ.5.50 నుంచి రూ.6.50కి అంటే కేవలం రూ.1 పెంచడానికి కమిషన్ ఆమోదించింది. విద్యుత్తు వాహన చార్జింగ్ స్టేషన్లకు, డిస్కంలు అందించే విద్యుత్తు రేటును సేవా ఖర్చు (కాస్ట్ ఆఫ్ సర్వీస్) స్థాయికి పెంచాలని డిస్కంలు చేసిన ప్రతిపాదనను కమిషన్ ఆమోదించలేదు. విద్యుత్తు వాహనాల వాడకాన్ని ప్రోత్సహించేందుకు వాటి టారిఫ్‌ను యథాతథంగా డిమాండ్ చార్జీలు లేకుండా, ప్రస్తుతం ఉన్న యూనిట్‌కు రూ.6.70గానే నిర్దేశించారు. మరి రాయితీ ఉపసంహరణ ద్వారా రూ.251 కోట్ల భారం త్వరలో అమలవుతుందని పచ్చి అబద్ధాలు ఎలా అచ్చేస్తారు డ్రామోజీ?

క్లుప్తంగా...

మీరు చెప్పకపోయినా నా ఓటు ఫ్యాన్‌కే

ఎమ్మిగనూరులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బుట్టా రేణుకతో వృద్ధురాలు


తన ఓటు ఫ్యాన్ గుర్తుకేనని చేయి పైకెత్తి చెబుతున్న వృద్ధురాలు హుస్సేనమ్మ

ఎమ్మిగనూరు టౌన్: 'మీరు చెప్పినా... చెప్పకపోయినా ఠంచన్‌గా ఒకటో తేదీన రూ.3వేలు పింఛను ఇస్తున్న జగన్‌బాబుకే నా ఓటు' అని కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన ఓ వృద్ధురాలు ఆనందంగా చెప్పారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక మంగళవారం ఎమ్మిగనూరులోని 22వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ క్రమంలో రోడ్డుపై వెళ్తున్న వృద్ధురాలు ముక్కిడి హుస్సేనమ్మను చూసి తనకు ఓటు వేయాలని అభ్యర్థించారు. దీనికి హుస్సేనమ్మ స్పందిస్తూ... 'మీరు చెప్పినా... చెప్పకపోయినా... నేను ఓటు వేసేది ఫ్యాన్ గుర్తుకే...' అంటూ చేయి పైకెత్తి చూపిస్తూ సీఎం వైఎస్ జగన్‌పై తన అభిమానాన్ని చాటుకున్నారు.

టీడీపీ మేనిఫెస్టో కాపీల పంపిణీ నిలిపివేత

చెన్నై నుంచి మంగళగిరి పోస్టాఫీసుకు చేరుకున్న కాపీలు


పోస్టాఫీసులో టీడీపీ మేనిఫెస్టో కాపీలు

మంగళగిరి: ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి పోస్టాఫీసుల ద్వారా మేనిఫెస్టో ప్రచార కాపీలు పంపిణీ చేయాలని చూసిన టీడీపీ ఎత్తుగడకు ఎదురుదెబ్బ తగిలింది. టీడీపీ మేనిఫెస్టో కాపీలు మంగళగిరి పోస్టాఫీసుకు చేరుకున్నాయని తెలుసుకున్న అధికారులు వాటి పంపిణీని నిలిపి వేయించారు. టీడీపీ మేనిఫెస్టో పేరిట కొద్ది రోజులుగా మంగళగిరి నియోజకవర్గంలో ప్రచార కాపీలను పంపిణీ చేస్తున్నది. చెన్నైలో ముద్రించిన లక్షా80 వేల కాపీలు మంగళవారం చెన్నై నుంచి మంగళగిరి పోస్టాఫీసుకు చేరుకున్నాయి. సమాచారం అందుకున్న మంగళగిరి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జేసీ రాజకుమారి వెంటనే టీడీపీ ప్రచార కాపీలు పంపిణీ చేయవద్దని పోస్టల్ అధికారులను ఆదేశించారు.

గీతాంజలి కుటుంబానికి అండగా నిలబడతాం

వ్యాపారవేత్త సురేంద్రనాథ్‌రెడ్డి


గీతాంజలి భర్త, పిల్లలతో సురేంద్రనాథ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి

తెనాలి: టీడీపీ, జనసేన సోషల్ మీడియా వేధింపుల కారణంగా ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన తెనాలికి చెందిన గొల్తి గీతాంజలి కుటుంబాన్ని బెంగళూరులో స్థిరపడిన కర్నూలుకు చెందిన వ్యాపారవేత్త బి.సురేంద్రనాథ్‌రెడ్డి పరామర్శించారు. దక్షిణ మధ్య రైల్వే సంప్రదింపుల కమిటీ సభ్యుడు కె.ప్రశాంత్‌రెడ్డితో కలిసి మంగళవారం ఆయన స్థానిక ఇస్లాంపేటలోని గీతాంజలి నివాసానికి వచ్చి ఆమె భర్త బాలచంద్రతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పిల్లలు రిషిత, రిషికను పలకరించారు. కృష్ణా జిల్లాలోని ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యం గీతాంజలి పిల్లలిద్దరినీ పూర్తి ఖర్చులు భరించి చదివించేందుకు ఆసక్తిగా ఉందని బాలచంద్రకు చెప్పారు. పాఠశాలకు వెళ్లి అక్కడి పరిస్థితులను గమనించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. యూకేకు చెందిన ప్రదీప్ చింతాతో కలిసి గీతాంజలి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. 'గీతాంజలి తన కుటుంబానికి జరిగిన మంచిని సంతోషంగా చెప్పుకుంది. ఎవరినీ ఏమీ అనలేదు. ఆమెను అన్ని మాటలు అనాల్సిన అవసరంలేదు. ఒక మనిషి చావును చూడాల్సిన అవసరం లేదని' వ్యాఖ్యానించారు.

ఢిల్లీకి ఏపీ కూటమి సీట్ల పంచాయితీ

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో బీజేపీ, టీడీపీ మధ్య సీట్ల పంచాయితీ ఢిల్లీకి చేరింది. రాష్ట్రంలో టీడీపీ అధినేత చంద్రబాబు తీరుపై బీజేపీ రాష్ట్ర నేతలు ఇప్పటికే పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డాకు లేఖ ద్వారా ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. తాజాగా.. ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి, మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజు మంగళవారం ఢిల్లీలో జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) బీఎల్ సంతోష్, సంయుక్త ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) శివప్రకాశ్‌లను కలిశారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను వివరించారు. ఆరు ఎంపీ, 10మంది ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితాను అందజేశారు. పార్టీ కోసం పనిచేసిన వారికే సీట్లు దక్కుతాయని పురందేశ్వరికి బీజేపీ పెద్దలు స్పష్టం చేసినట్లు తెలిసింది. అభ్యర్థుల ఎంపిక విషయంలో పొత్తులో ఉన్న పార్టీల ఒత్తిళ్లకు తలొగ్గవద్దని గట్టిగా చెప్పినట్లు తెలిసింది.

జనమంతా జగన్ వైపే

- కుప్పం సహా అన్ని చోట్లా వైఎస్సార్‌సీపీ విజయం ఖాయం
- 2014లో హామీల పేరుతో మోసం చేసిన చంద్రబాబుకు మరోసారి ఓటమి తథ్యం
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి


పుంగనూరులో నిర్వహించిన ర్యాలీలో ప్రసంగిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుంగనూరు (చిత్తూరు జిల్లా): రాష్ట్ర ప్రజలంతా సీఎం వైఎస్ జగన్ వైపే ఉన్నారని.. చంద్రబాబు పాలనలో నిర్లక్ష్యానికి గురైన కుప్పం నియోజకవర్గం కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో అభివృద్ధి పథంలో పయనించిందని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం చిత్తూరు జిల్లా నల్లగుట్లపల్లె, ఏతూరు, పెంచుపల్లి గ్రామాల్లో మంత్రి పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ... 14 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు నాయుడు తన సొంత నియోజకవర్గానికి కూడా ఏమీ చేయలేదన్నారు. సీఎం వైఎస్ జగన్ కుప్పానికి నీళ్లు తరలించడం ద్వారా గతంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని గుర్తు చేశారు. కుప్పం అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కుప్పాన్ని రెవెన్యూ డివిజన్, మున్సిపాలిటీ చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కుప్పం నియోజకవర్గ ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందిస్తూ.. వైఎస్ జగన్ ప్రభుత్వం భరోసా కల్పించిందన్నారు. అందుకే స్థానిక సంస్థ ఎన్నికల్లో కుప్పం ప్రజలు వైఎస్సార్‌సీపీకి అండగా నిలిచారని గుర్తుచేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కూడా కుప్పం సహా జిల్లాలోని అన్ని స్థానాలను వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంటుందని మంత్రి పెద్దిరెడ్డి ధీమా వ్యక్తంచేశారు. ఎన్ని పార్టీలు కలిసి వచ్చినా తమకు నష్టం లేదన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పరిపాలన సాగించిన సీఎం జగన్ వైపే ప్రజలున్నారని చెప్పారు. 2014 ఎన్నికల్లో 600కు పైగా హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి.. ఒక్కటీ నేరవేర్చలేదనే విషయాన్ని ప్రజలు ఇంకా మర్చిపోలేదన్నారు. ఈసారి కూడా చంద్రబాబుకు తగిన గుణపాఠం నేర్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు అశోక్‌కుమార్, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డియాదవ్, బోయకొండ ఆలయ చైర్మన్ నాగరాజారెడ్డి పాల్గొన్నారు.

రెడ్‌బుక్‌లో ఆదిమూలం పేరు లేదా?

- ఆ పేజీ చించేసి సత్యవేడు టికెట్ ఇచ్చారా?
- టీడీపీ శ్రేణులను ఇబ్బంది పెట్టిన వ్యక్తికి టికెట్టా?
- లోకేశ్‌పై ధ్వజమెత్తిన సత్యవేడు నియోజకవర్గ టీడీపీ నేతలు


వరలక్ష్మి యాదవ్

సాక్షి, తిరుపతి: టీడీపీ, జనసేన పొత్తు ఆ రెండు పార్టీల అధినేతలకు చుక్కలు చూపిస్తోంది. అభ్యర్థుల ప్రకటనతో రాజుకున్న రచ్చ అంతకంతకూ పెరుగుతోందే తప్ప చల్లారడంలేదు. తిరుపతి, సత్యవేడుల్లో టీడీపీ, జనసేన శ్రేణులు ఆందోళనలు చేయడంతో పాటు ప్రెస్‌మీట్లు పెట్టి తమ అధినేతలకు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ టికెట్ దక్కకపోవడంతో టీడీపీలో చేరిన కోనేటి ఆదిమూలంను సత్యవేడు అభ్యర్థిగా ఖరారు చేయడాన్ని ఆ పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి. రోజూ ధర్నాలు చేస్తూ అధిష్టానం నిర్ణయాన్ని తప్పుబడుతున్నారు. అందులో భాగంగా సత్యవేడు నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు వరలక్ష్మి యాదవ్ నారా లోకేశ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ శ్రేణులతో కలిసి ఆమె మంగళవారం ధర్నా చేశారు. 'లోకేశ్ గారూ.. మీరు సత్యవేడు నియోజకవర్గంలో పర్యటించినప్పుడు ఒక మాట అన్నారు. వైఎస్సార్‌సీపీ వారి పేర్లు రెడ్‌బుక్‌లో రాసుకుంటున్నాను అని.. ఆ రెడ్‌బుక్‌లో ఆదిమూలం పేరు ఉందా? లేదా? ఉంటే ఆ పేజీని చించేసి టికెట్ ఇచ్చారా? ఆ ఎమ్మెల్యే చేయని అరాచకాలు లేవు. టీడీపీ వాళ్లను ఇబ్బంది పెట్టారు. ఆదిమూలం కనీసం వైఎస్సార్‌సీపీ సభ్యత్వానికైనా రాజీనామా చేశారా? అటువంటి వ్యక్తికి టికెట్ ఎలా ఇస్తారు? మాకు ఇదేం దౌర్భాగ్యం' అంటూ వరలక్ష్మి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

జనసేన అభ్యర్థిగా నేనే పోటీ చేస్తాను: సుగుణమ్మ



పొత్తులో భాగంగా తిరుపతి అసెంబ్లీ సీటును జనసేనకు కేటాయించారని.. అయితే స్థానికులకు కాకుండా చిత్తూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుని ఇక్కడ అభ్యర్థిగా పెట్టడం సమంజసం కాదని టీడీపీ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతిలో మంగళవారం టీడీపీ నేతలతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. కూటమిలోని మూడు పార్టీలు తిరుపతి అభ్యర్థి విషయంపై పునరాలోచించాలని డిమాండ్ చేశారు. జనసేన తరఫున తాను పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని వెల్లడించారు. తన అభ్యర్థిత్వాన్ని మరోసారి పరిశీలించాలని ఆమె కోరారు.

కాపులకు కూడా తగిన హామీలివ్వండి

పవన్ కళ్యాణ్‌కు మాజీ ఎంపీ హరిరామజోగయ్య మరో లేఖ



పాలకొల్లు సెంట్రల్: రాష్ట్ర జనాభాలో 52శాతం ఉన్న బీసీలకు 'జయహో బీసీ' అంటూ చంద్రబాబుతో కలిసి పవన్ కళ్యాణ్ డిక్లరేషన్ ప్రకటించారని, అదే విధంగా రాష్ట్ర జనాభాలో 25 శాతం ఉన్న కాపుల ఆర్థిక, సామాజిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని తగిన హామీలు ఇవ్వాలని రాజకీయ విశ్లేషకుడు, మాజీ ఎంపీ చేగొండి హరిరామజోగయ్య పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం పవన్ కళ్యాణ్‌కు మరో లేఖ రాశారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో ఈ లేఖను మీడియాకు విడుదల చేశారు. బీసీ డిక్లరేషన్ ద్వారా చంద్రబాబు పది హామీలను ఇవ్వగా.. 11వ హామీగా బీసీలకు రాజ్యాధికారం దక్కేవిధంగా కృషి చేస్తానని పవన్ చెప్పారని గుర్తు చేశారు. బీసీలకు ప్రకటించిన మాదిరిగానే కాపు, బలిజ, తెలగ, ఒంటరి సామాజిక వర్గాలకు కూడా అన్ని హామీలు ప్రకటించాలని, త్వరలో ఈ కూటమి ప్రకటించే ఉమ్మడి మేనిఫెస్టోలో ఆ హామీలు పొందుపరచాలని కోరారు. బీసీలతో సమానంగా కాపులకు ఇచ్చే హామీలను మేనిఫెస్టోలో ప్రకటించడం సబబుగా ఉంటుందని పేర్కొన్నారు.

టీడీపీ, జనసేన నుంచి భారీగా వైఎస్సార్‌సీపీలో చేరికలు


రేలంగిలో జనసేన, టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో కారుమూరి


టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన రావులపర్రు వాసులతో వాసుబాబు

ఇరగవరం/ఉంగుటూరు: 'మూడు కండువాలతో వస్తారు.. మిమ్మల్ని మాయ చేయడానికి చూస్తారు.. వారిని నమ్మకండి..' అని ప్రజలకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు సూచించారు. పశ్చిమ గోదావరి జిల్లా ఇరగవరం మండలం రేలంగి గ్రామానికి చెందిన 500మందికి పైగా టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి మంత్రి కారుమూరి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ అందిస్తున్న ప్రజారంజక పాలన నచ్చి అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని చెప్పారు. కోవిడ్ సమయంలో తాను ఇక్కడే ఉండి ప్రజలకు సేవ చేశానని, కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ ఎక్కడ ఉన్నాడని కారుమూరి ప్రశ్నించారు. 'ఎవరో అడిగితే.. నాకు ఓటేసి గెలిపించండి.. మళ్లీ కరోనా వస్తే ఇక్కడే ఉండి సేవ చేస్తా అన్నాడంట..' అంత తింగరోడు ఆరిమిల్లి రాధాకృష్ణ అని మంత్రి ఎద్దేవా చేశారు.

రావులపర్రు బీసీ యువకులు వైఎస్సార్‌సీపీలో చేరిక

ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం రావులపర్రు గ్రామానికి చెందిన 60మందికి పైగా బీసీ యువకులు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరందరూ వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు గాది వెంకటరమణ ఆధ్వర్యాన ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు సమక్షంలో పార్టీలో చేరారు.

పోస్టర్ల తొలగింపుపై టీడీపీ ఎమ్మెల్యే వాగ్వాదం

- ప్రైవేటు ఆస్తులపై మీ పెత్తనం ఏంటంటూ ఎమ్మెల్యే నిమ్మల వాదన
- నిబంధనల ప్రకారమే నడుచుకుంటామని స్పష్టం చేసిన ఆర్వో


ఆర్వోతో వాగ్వాదానికి దిగిన ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు

పాలకొల్లు (సెంట్రల్): పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు టీడీపీ ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు ఎన్నికల అధికారులతో వాగ్వాదానికి దిగారు. స్థానిక మునిసిపల్ కార్యాలయంలో మంగళవారం వివిధ రాజకీయ పార్టీలతో ఏర్పాటు చేసిన సమావేశానికి మధ్యలో వచ్చిన ఎమ్మెల్యే.. ప్రైవేటు ఆస్తులపై మీరు పెత్తనం చేయకూడదంటూ రిటర్నింగ్ అధికారి బీఎస్ నారాయణరెడ్డితో వాగ్వాదానికి దిగారు. యజమాని అనుమతితో ఇంటిపై పోస్టర్లు ఉంటే మీకు ఇబ్బందేమిటని ప్రశ్నించారు. 'నేను లెటర్ పెట్టే వరకూ మీరు పోస్టర్లు తొలగించకూడదు. మీ ఇష్టం వచ్చినట్టు పెయింట్ వేస్తామంటే ఎలా' అంటూ నిలదీశారు. 'మీ రూల్స్ మీరు చూసుకోండి. నా రూల్ నేను చూసుకుంటా' అంటూ ఆర్వోతో వాదనకు దిగారు. ఆర్వో నారాయణరెడ్డి స్పందిస్తూ ఎన్నికల నిబంధనలకు అనుగుణంగానే తాము నడుచుకుంటామని స్పష్టం చేశారు.

ఆర్వో ఎదుట గ్రామ కార్యదర్శుల ఆవేదన

ఈసీ నిబంధనల ప్రకారం గ్రామాల్లో అతికించిన వాల్‌పోస్టర్లు, బ్యానర్లు తొలగిస్తుంటే టీడీపీ వారు తమపై దాడులకు దిగుతున్నారని పాలకొల్లు మండలానికి చెందిన గ్రామ కార్యదర్శులు ఆర్వో బీఎస్ నారాయణరెడ్డి ఎదుట ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు ఆర్వోకు ఫిర్యాదు చేశారు. తాము పోస్టర్లు తొలగించిన ఓ గ్రామంలో టీడీపీ నేతలు ప్రచారం చేస్తూ మళ్లీ పోస్టర్లు అతికించారని చెప్పారు. వారిని ప్రశ్నిస్తే.. తమను దారుణంగా దూషిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానని ఆర్వో చెప్పారు.

క్లుప్తంగా...

కోడ్ ఉల్లంఘించిన టీడీపీ నేతలు

టీడీపీ అభ్యర్థి థామస్ ప్రచారాన్ని అడ్డుకున్న అధికారులు



టీడీపీ అభ్యర్థి థామస్ ప్రచారాన్నిఅడ్డుకుంటున్న ఎన్నికల అధికారి పద్మసునంద

కార్వేటినగరం(చిత్తూరు జిల్లా): ఎన్నికల కమిషన్ ఆదేశాలను బేఖాతరు చేస్తూ టీడీపీ నేతలు ప్రచారానికి తెరలేపారు. కోడ్ ఉల్లంఘిస్తూ ఎటువంటి అనుమతులు లేకుండా బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ ప్రచార కార్యక్రమం చేపట్టారు. గంగాధర నెల్లూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి థామస్ వింజం పంచాయతీలో తన అనుచరులతో ప్రచారం చేస్తుండడంతో గంగాధర నెల్లూరు ఎన్నికల అధికారి పద్మ సునంద వారి ప్రచారాన్ని అడ్డుకున్నారు. దీంతో థామస్ పార్టీ నాయకులతో కలిసి రిటర్నింగ్ కార్యాలయానికి చేరుకున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు ఎటువంటి అనుమతులు లేకుండా ప్రచారాలు, బహిరంగ సభలు నిర్వహించకూడదని రిటర్నింగ్ అధికారి రవి వారిని హెచ్చరించారు. దీంతో చేసేదిలేక నేతలు అక్కడ నుంచి చల్లగా జారుకున్నారు.

గ్రూప్–1 మెయిన్స్ అప్పీల్‌పై నేడు విచారణ

సాక్షి, అమరావతి: గ్రూప్–1 మెయిన్స్ పరీక్షను రద్దు చేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) దాఖలు చేసిన అప్పీల్‌పై విచారణ బుధవారం నాటికి వాయిదా పడింది. వాస్తవానికి ఈ అప్పీల్‌పై మంగళవారం విచారణ జరగాల్సి ఉంది. అప్పీల్‌ను విచారించే ధర్మాసనంలోని న్యాయమూర్తుల్లో ఒకరైన జస్టిస్ గుహనాథన్ నరేందర్ సెలవు పెట్టారు. దీంతో ఈ అప్పీల్ గురించి న్యాయమూర్తులు జస్టిస్ రవినాథ్ తిల్హరీ, జస్టిస్ నూనె హరినాథ్‌తో కూడిన ధర్మాసనం ముందు ఏపీపీఎస్సీ తరపు న్యాయవాది ప్రస్తావించారు. అత్యవసర విచారణకు అభ్యర్థించారు. ఈ అభ్యర్థనపై ధర్మాసనం ఈ అప్పీల్ వ్యవహారాన్ని రెగ్యులర్ బెంచ్ (జస్టిస్ నరేందర్, జస్టిస్ విజయ్ ధర్మాసనం) ముందే తేల్చుకోవాలని స్పష్టం చేసింది. ఇదిలావుంటే.. ఏపీపీఎస్సీ అప్పీల్‌పై జస్టిస్ నరేందర్ ధర్మాసనం బుధవారం విచారణ జరపనుంది. కేసుల విచారణ జాబితాలో ఈ అప్పీల్ 6వ కేసుగా ఉంది.

ఎన్నికల్లో బీసీ అభ్యర్థులను బలపరచాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు




సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

తిరుపతి కల్చరల్: సామాజిక న్యాయం లక్ష్యంగా పోటీ చేస్తున్న బీసీ,ఎస్సీ,ఎస్టీ, మైనారిటీ అభ్యర్థుల్ని బలపరిచి తద్వారా బహుజనుల హక్కుల సాధనకు బీసీలందరూ కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు పిలుపునిచ్చారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా అత్యధిక శాతం ఉన్న వెనుకబడిన వర్గాల హక్కుల సాధనలో పాలకులు నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారన్నారు. దేశంలో బీసీల కుల గణన చేపట్టాలని, జనాభా ప్రాతిపదికన వారికి అన్ని రంగాల్లో అవకాశాలు కల్పించాలని ఏళ్ల తరబడి పోరాటం చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. కొన్ని పార్టీలు మాయమాటలతో బీసీలను మభ్యపెడుతూ దగా చేస్తున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో భావ సారూప్యత కలిగిన బీసీ అభ్యర్థులను బీసీ సంక్షేమ సంఘం బలపరుస్తోందని తెలిపారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ ఆచారి, ఉపాధ్యక్షుడు మధు ఆచారి, గణేష్, మహేష్ యాదవ్, వినోద్ గౌడ్, పాలకల సుబ్రహ్మణ్యం, జి.ద్వారక శ్రీను పాల్గొన్నారు.

పట్టుదలతోనే లక్ష్యసాధన

లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ



బాపట్లటౌన్: విద్యార్థి దశ నుంచే నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటూ పట్టుదలతో పోరాడితేనే జీవితంలో విజయం సాధిస్తారని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ సూచించారు. బాపట్ల వ్యవసాయ కళాశాలలో మంగళవారం కళాశాల పూర్వ విద్యార్థి కన్నెగంటి పాపారావు రచించిన 'విత్తనంలో విశ్వం' పుస్తకావిష్కరణ జరిగింది. డాక్టర్ జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ వ్యవసాయ విద్యను అభ్యసించినప్పటికీ, ప్రభుత్వ ఉద్యోగాన్ని కాదని స్వయంగా వ్యవసాయాన్ని చేపట్టి వరలక్ష్మి అనే బిటి కాటన్ పత్తి వంగడాన్ని సృష్టించి పత్తి రైతుల జీవితాలకు కొత్త వెలుగును ప్రసాదించి కన్నెగంటి పాపారావు చరితార్థులయ్యారని ప్రశంసించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో విప్లవాత్మక విజయాలు సాధించిన పాపారావు జీవిత చరిత్ర వ్యవసాయ విద్యార్థులకు ఒక మార్గదర్శి వంటిదన్నారు.



రెప్పవాలదే..!

ప్రపంచ వ్యాప్తంగా నిద్రలేమి సమస్య

- 40 శాతం మంది నిద్ర సమస్యలతో సతమతం
- డిజిటల్ స్క్రీన్‌ల వినియోగంతోనే దీర్ఘకాలిక నిద్రలేమి
- 61 శాతం మంది భారతీయుల్లో 6 గంటల కంటే తక్కువ నిద్ర
- 'రెస్‌మెడ్' సర్వేలో వెల్లడి

సాక్షి, అమరావతి: మానవాళి నిద్రకు దూరమవుతోంది. రాత్రిళ్లు కంటి నిండా కునుకు లేకుండానే తెల్లారుతోంది. సగటు 7 గంటల నిద్ర అనేది ఇకపై చెప్పుకోవడానికి తప్ప.. ఆస్వాదించడానికి అవకాశం లేకుండాపోతోంది. ప్రముఖ వైద్య పరికరాల సంస్థ 'రెస్‌మెడ్' నిర్వహించిన తాజా సర్వేలో దీర్ఘకాలంగా నిద్రలేమితో బాధపడుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతున్నట్టు తేలింది. అంతర్జాతీయంగా 40 శాతం మంది ప్రజలు నిద్ర సమస్యతో నలిగిపోతున్నారు. వారంలో కనీసం మూడు రోజుల కూడా మంచి నిద్రను పొందలేని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఇలాంటి వ్యక్తుల్లో పగటిపూట నిద్రపోవడం, ఉదయాన్నే వివిధ ప్రతికూల ప్రభావాలతో పాటు ప్రతి చిన్న విషయానికీ ఎక్కువగా చిరాకుపడటం కనిపిస్తోంది.

వ్యక్తి నిద్రించాల్సిన సమయం ఇలా..

వయస్సు	గంటలు
0-3 నెలలు	14-17
4-11 నెలలు	12-16
1-2 ఏళ్లు	11-14
3-5 ఏళ్లు	10-13
6-12 ఏళ్లు	9-12
13-18 ఏళ్లు	8-10
18-64 ఏళ్లు	7-9
65 ఏళ్లు పైబడి	7-8

సామాజిక మాధ్యమాల్లో మునిగితే అంతే..

రెస్‌మెడ్ గ్లోబల్ స్లీప్ సర్వేలో ఆస్ట్రేలియా, బ్రెజిల్, చైనా, ఫ్రాన్స్, జర్మనీ, హాంకాంగ్, భారత్, ఐర్లాండ్, జపాన్, కొరియా, మెక్సికో, న్యూజిలాండ్, సింగపూర్, తైవాన్, థాయ్‌లాండ్, యూకే, యూఎస్‌ఏలో ప్రజల నిద్ర అలవాట్లను ట్రాక్ చేసింది. ఇందులో స్వల్పంగా 13 శాతం మంది మాత్రమే రాత్రిళ్లు ఆరోగ్యకర నిద్రను అనుభవిస్తున్నట్టు తేలింది. జపానీయులు (57శాతం) ప్రతి వారం రాత్రిళ్లు సరైన నిద్రలేక ఇబ్బంది పడుతున్న దేశాల జాబితాలో అగ్రస్థానంలో నిలిచారు. ముఖ్యంగా నిద్రకు ముందు ఎక్కువ మంది సామాజిక మాధ్యమాల్లో మునిగితేలుతుండటం దుష్ప్రభావాలను పెంచుతోంది. మరికొంతమంది అర్ధరాత్రి వరకు టీవీలు చూడటం, ఇతర డిజిటల్ పరికరాలను వినియోగిస్తుండటంతో నిద్ర దూరమైపోతోందని నివేదిక స్పష్టం చేస్తోంది. వ్యక్తిగత ఆందోళనలు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, ఊబకాయం వంటి ప్రధాన కారణాలతో చాలా మంది రాత్రిళ్లు కంటిపై కునుకు వేయట్లేదు. ప్రతి 10 మందిలో ముగ్గురు నిద్ర మధ్యలో మేల్కొనకుండా ఉండలేకపోతున్నారని నివేదిక పేర్కొంది. యూకేలో 44 శాతం, ఫ్రాన్స్‌లో 42 శాతం మంది ప్రజల్లో నిద్రకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. భారతదేశంలో 42 శాతం, థాయ్‌లాండ్‌లో 41 శాతం కొంత వరకు రాత్రిళ్లు నిద్ర హాయిగానే ఉన్నట్టు తేలింది. రుతుక్రమం ఆగిన స్త్రీలలో నిద్రలేమి సమస్య అధికంగా ఉంది. ఐర్లాండ్, ఆస్ట్రేలియాలో ఎక్కువ శాతం మహిళలు కలత నిద్రతో ప్రభావితం అవుతున్నారు. నిద్రలో శ్వాసకు అంతరాయాలు(స్లీప్ అప్నియా) పెద్ద రుగ్మతగా పరిణమించింది.

భారత్‌లో అత్యధిక మందికి 6 గంటలు కంటే తక్కువ నిద్ర

భారత్‌లోనూ అంతర్జాతీయ సర్వేలతో పాటు స్థానిక సర్వేల్లోనూ నిద్రలేమి భయపెడుతోంది. గతంలో రోజుకు ఏడు గంటలు కూడా నిరంతరాయంగా నిద్రపోవడంలో భారతీయలు తీవ్ర సమస్యలు ఎదుర్కొన్నారు. అయితే తాజా సర్వేలో.. 61 శాతం మంది భారతీయులు గడిచిన 12 నెలల్లో రాత్రిపూట 6 గంటల కంటే తక్కువగా నిద్రపోగా, 38 శాతం మంది 4 నుంచి 6 గంటల మధ్య మాత్రమే నిద్రించడం గమనార్హం. వారిలో దాదాపు 23 శాతం మంది 4 గంటల కూడా నిద్రపోలేదు. అంటే రోజూ 6 గంటల కంటే తక్కువగా నిద్రపోయే ప్రజలు 2002లో 50 శాతం నుంచి ఇప్పుడు 55 శాతానికి పెరగడం అత్యంత ఆందోళన కలిగిస్తోంది. దీంతో భారత్‌లో 2024లో నిద్రలేమి సమస్య 61 శాతానికి పెరిగింది. 72 శాతం మంది నిద్రలో ఒకటి, రెండు సార్లు వాష్‌రూమ్‌ని ఉపయోగించడం కోసం మేల్కొంటున్నట్టు తేలింది. చాలా మంది నిద్రపోవడానికి ఆలస్యంగా వెళ్తుండటం కూడా వారి ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోంది. కోవిడ్ బారిన పడిన వారిలో నిద్ర నాణ్యత లోపించినట్టు సర్వేలు చెబుతున్నాయి. నిద్రలేమిని అధిగమించేందుకు రోజూ నడక, గంటపాటు క్రమం తప్పకుండా వ్యాయామం, రాత్రిపూట తేలికపాటి భోజనం తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. భోజనానికి నిద్రకు మధ్య 3 గంటల సమయాన్ని పాటించడంతో పాటు నిద్రకు మూడు గంటలకు ముందు టీ, కాఫీలకు దూరంగా ఉండాలని, నిద్ర కోసం పుస్తకం చదవడం, ధ్యానం చేయడం అలవాటు చేసుకోవాలని వారంటున్నారు.

వివిధ సేవల్లో ఉన్నవారికి పోస్టల్ బ్యాలెట్ అవకాశం

ఏపీలో 33 విభాగాల్లో సేవలందించే వారికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు

సాక్షి, అమరావతి: వివిధ సేవల్లో ఉంటూ పోలింగ్ రోజు ఓటు వేయలేని వారికి పోస్టల్ బ్యాలెట్ అవకాశాన్ని కేంద్ర ఎన్నికల సంఘం కల్పించింది. రాష్ట్రంలో లోక్‌సభతో పాటు అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో వివిధ సేవల్లో నిమగ్నమయ్యే విభాగాలను నోటిఫై చేసింది. ఆయా విభాగాల్లో సేవలందించే వారికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే సౌకర్యం కల్పించింది. ఇందు కోసం ప్రత్యేకంగా నోడల్ అధికారిని నియమించడంతో పాటు పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి 12 డి ఫామ్ అందుబాటులో ఉంచాల్సిందిగా కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం జారీ చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొంది. నోడల్ అధికారి సంబంధిత ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం గురించి తెలియజేయాలి. ఇందుకు అనుగుణంగా రాష్ట్రాలు వెంటనే గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసి ఆ పత్రాన్ని కేంద్ర ఎన్నికల సంఘానికి పంపించాల్సిందిగా నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌లో 33 విభాగాల్లో సేవలందించే వారికి పోస్టల్ బ్యాలెట్ అవకాశం ఇచ్చింది.

ఆంధ్రప్రదేశ్‌లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశం కల్పించే విభాగాలు ఇవి..

1. మెట్రో
2. రైల్వే రవాణా (ప్రయాణికులు, సరుకు రవాణా)సేవలు
3. పోలింగ్ రోజు కార్యకలాపాలను కవర్ చేయడానికి కమిషన్ ఆమోదంతో అధికార లేఖలు జారీ పొందిన మీడియా వ్యక్తులు
4. విద్యుత్ శాఖ
5. బీఎస్ఎన్ఎల్
6. పోస్టల్–టెలిగ్రామ్
7. దూరదర్శన్
8. ఆలిండియా రేడియో
9. రాష్ట్ర మిల్క్ యూనియన్, మిల్క్ కోఆపరేటివ్ సొసైటీలు
10. ఆరోగ్య శాఖ
11. ఫుడ్ కార్పొరేషన్ డిపార్ట్‌మెంట్
12. విమానయానం
13. రోడ్డు రవాణా సంస్థ
14. అగ్నిమాపక సేవలు
15. ట్రాఫిక్ పోలీస్
16. అంబులెన్స్ సేవలు
17. షిప్పింగ్
18. ఫైర్ ఫోర్స్
19. జైళ్లు
20. ఎక్సైజ్
21. వాటర్ అథారిటీ
22. ట్రెజరీ సర్వీస్
23. సమాచార, ప్రజా సంబంధాల శాఖ
24. అటవీ
25. పోలీసు
26. పౌర రక్షణ–హోంగార్డులు
27. ఆహార పౌర సరఫరాలు –వినియోగదారుల వ్యవహారాలు
28. ఎనర్జీ
29. ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా
30. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో
31. డిపార్ట్‌మెంట్ ఆఫ్ పీడబ్ల్యూడి
32. నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్స్
33. విపత్తు నిర్వహణ

మైనార్టీల ద్రోహి చంద్రబాబు

ముస్లిం జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మునీర్ అహ్మద్



లబ్బీపేట(విజయవాడ తూర్పు): మైనార్టీలకు తీవ్ర అన్యాయం చేసిన ద్రోహి చంద్రబాబు అని ముస్లిం జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మునీర్ అహ్మద్ విమర్శించారు. ఆయన జత కట్టిన మతతత్వ ఎన్‌డీఏ కూటమిని రాష్ట్రంలో ఓడిద్దామని ముస్లింలకు పిలుపునిచ్చారు. ఆయన మంగళవారం విజయవాడ లబ్బీపేటలోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 2014లో ఏర్పడిన టీడీపీ ప్రభుత్వంలో ఒక్క మైనార్టీ మంత్రి కూడా లేకుండా చంద్రబాబు పాలన సాగించారని చెప్పారు. ప్రజా సంఘాల ఒత్తిడిని తట్టుకోలేక, చివరి ఆరు నెలలు ఒకరికి మంత్రి పదవి ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. మతతత్వ పార్టీ బీజేపీ అని, నియంత మోదీని గద్దె దించాలని కొన్నాళ్లు కాంగ్రెస్ జపం చేసిన చంద్రబాబు.. నేడు మళ్లీ యూటర్న్ తీసుకుని, మైనార్టీల హక్కులను కాలరాస్తూ ఎన్‌డీఏ కూటమిలో చేరి తన స్వార్థపూరిత రాజకీయ బుద్ధిని ప్రదర్శిస్తున్నాడని మండిపడ్డారు. రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మైనార్టీలకు పెద్దపీట వేస్తున్నారన్నారు. గత శాసన సభలో ఐదుగురు ఎమ్మెల్యేలకు అవకాశం కల్పించగా, నలుగురు గెలుపొందారని చెప్పారు. ఒకరిని మంత్రిని చేసిన విషయం తెలిసిందేనన్నారు. ఇప్పుడు మరింత ప్రోత్సహిస్తూ ఏకంగా ఏడు నియోజకవర్గాల్లో సీట్లు కేటాయించి తన అభిమానాన్ని చాటుకున్నారని కొనియాడారు.

తెలంగాణ

ఎస్‌ఐగా నమ్మించి.. పెళ్లి చూపుల్లో దొరికిపోయి..

వెలుగుచూసిన నకిలీ ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ వ్యవహారం

- ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ కంటిపరీక్షలో మాళవిక అనర్హత
- కుటుంబసభ్యులు, గ్రామస్తులకు తెలియొద్దని ఎస్‌ఐ అవతారం
- యూనిఫామ్‌లోనే రీల్స్.. పోస్టింగులు



రైల్వేస్టేషన్ విధుల్లో ఉన్నట్టు మాళవిక దిగిన ఫొటో (ఫైల్)

సికింద్రాబాద్/నార్కట్‌పల్లి: ఎస్‌ఐ కావాలనేది చిన్ననాటి కల. కానీ కంటీ పరీక్షలో అనర్హత కారణంగా ఎస్‌ఐగా ఎంపిక కాలేకపోయింది. తల్లిదండ్రులు, గ్రామస్తులను నమ్మించడానికి నకిలీ ఎస్‌ఐగా అవతారం ఎత్తింది. యూనిఫామ్‌లోనే దైవ దర్శనాలకు వెళ్లేది. రీల్స్ చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టేది. పెళ్లిచూపులకూ ఏకంగా పోలీస్ డ్రస్‌లోనే వచ్చింది. అబ్బాయి తరపు వారు ఆరా తీయడంతో అసలు విషయం వెలుగుచూసింది. సికింద్రాబాద్ రూరల్ డీఎస్పీ కే.శ్రీనివాస్‌రావు కథనం ప్రకారం..నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లికి చెందిన మాళవిక నిజాం కళాశాలలో డిగ్రీ పూర్తి చేసింది. 2019లో ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ రాతపరీక్షలో అర్హత సాధించింది. అయితే కంటి పరీక్షలో అనర్హత కారణంగా ఎస్‌ఐ పోస్టుకు ఎంపిక కాలేదు.ఈ అవమాన భారాన్ని తట్టుకోలేక నకిలీ ఎస్‌ఐ అవతారం ఎత్తాలని నిర్ణయించుకుంది. దీనికి అవసరమైన డ్రెస్, నేమ్ బోర్డు, ఐడీ కార్డు తయారు చేయించింది. నార్కట్‌పల్లి నుంచి యూనిఫామ్‌లోనే ప్రతిరోజు వెళ్లి రాత్రికి ఇంటికి వచ్చేది. యూనిఫామ్ ధరించి రైలు ప్రయాణాలు చేస్తూ దైవ దర్శనాలకు వెళ్లేది. మధ్యమధ్యలో నిందితులను తాను అదుపులోకి తీసుకున్నట్టు, రైల్వేస్టేషన్లలో విధుల్లో ఉన్నట్టు ఫొటోలు తీసుకుంది. శంకర్‌పల్లి ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐగా పనిచేస్తున్నట్టు ఏడాది కాలంగా కుటుంబ సభ్యులతోపాటు పలువురిని నమ్మించింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టా తదితర సోషల్ మీడియా యాప్‌లలో యూనిఫామ్‌తో విధుల్లో ఉన్నట్టు పలు పోస్టులు చేసింది.

ఆరా తీస్తే.. అసలు విషయం తెలిసింది

కొద్దిరోజుల క్రితం నల్లగొండ జిల్లా నుంచే మాళవికకు పెళ్లి సంబంధం వచ్చింది. పెళ్లిచూపులకు కూడా ఆమె ఎస్‌ఐ డ్రస్‌లోనే హాజరైంది. విధుల్లో బిజీ ఉండి నేరుగా వచ్చినట్టు అబ్బాయి తరపు బంధువులను నమ్మించింది. అబ్బాయి తరపువారు ఉద్యోగం గురించి ఆరా తీశారు. సికింద్రాబాద్‌కు వచ్చి ఆర్‌పీఎఫ్ పోలీసులను వాకబు చేశారు. దీంతో అసలు విషయం వెలుగుచూసింది. జీఆర్‌పీ సికింద్రాబాద్ రూరల్ డీఎస్పీ కే.శ్రీనివాస్‌రావు నేతృత్వంలో దర్యాప్తు చేసిన సికింద్రాబాద్ లైన్ ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీనివాస్, నల్లగొండ జీఆర్‌పీ ఎస్‌ఐ సలకమ్మలు నార్కట్‌పల్లిలో మాళవికను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితురాలి నుంచి యూనిఫామ్, ఆర్‌పీఎఫ్ లోగో, స్టార్లు, బెల్టు, నకిలీ ఐడీ కార్డు స్వాధీనం చేసుకున్నారు.



ఒత్తిడి తగ్గాలి.. నైపుణ్యం పెరగాలి

క్లాసులు మొదలయ్యే ముందే విద్యార్థులకు కౌన్సెలింగ్

ప్రతి కాలేజీలో కౌన్సెలింగ్ నిపుణుల నియామకం

ఇంటర్ విద్యకు భిన్నంగా ఇంజనీరింగ్ ప్రాక్టికల్ నాలెడ్జ్‌పై పరిజ్ఞానం అవసరం

ఏర్పాట్లు చేయాలని వర్సిటీలకు ఏఐసీటీఈ ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ క్లాసులు మొదలయ్యే ముందే విద్యార్థులను మానసికంగా సిద్ధం చేయాలని దేశంలోని అన్ని ఇంజనీరింగ్ కాలేజీలను అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) ఆదేశించింది. ప్రభుత్వ, ప్రైవేటు యూనివర్సిటీలు దీని కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించింది. ఇందుకు సంబంధించి కొన్ని మార్గదర్శకాలను విశ్వవిద్యాలయాలకు విడుదల చేసింది. దేశంలోని ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, గుర్తింపు పొందిన ఇంజనీరింగ్ కాలేజీలు దీన్ని విధిగా పాటించాలని సూచించింది. మారిన బోధనా ప్రణాళికను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఏఐసీటీఈ గత రెండేళ్లుగా జరిపిన అధ్యయనంలో వెల్లడైంది. ఐఐటీల్లో విద్యార్థుల ఆత్మహత్యలను కూడా కౌన్సిల్ పరిగణనలోనికి తీసుకుంది. జాతీయ విద్యావిధానంలో వస్తున్న మార్పులపై విద్యార్థులకు తొలి దశలోనే అవగాహన కల్పించకపోవడమే మానసిక ఒత్తిడికి కారణమని భావిస్తోంది. ప్రాక్టికల్ నాలెడ్జ్‌తో కూడిన విద్యా విధానం అందుబాటులోకి తెచ్చేందుకు అన్ని విశ్వవిద్యాలయాలు ముందుకొచ్చాయి. ఇంజనీరింగ్ రెండో ఏడాది నుంచే పారిశ్రామిక సంస్థల భాగస్వామ్యంతో నైపుణ్య అభివృద్ధిని అందించేందుకు పాఠ్య ప్రణాళికలో మార్పు చేశారు. ఇంజనీరింగ్ విద్యార్థులు ఒక్కసారిగా మూస విధానం నుంచి స్వతహాగా ఆలోచించే విద్యావిధానంలో అడుగుపెడుతున్నారు. ఇది కూడా మానసిక ఒత్తిడికి కారణమవుతోందని ఏఐసీటీఈ అధ్యయనంలో తేలింది.

బ్యాక్‌లాగ్స్‌తో పెరుగుతున్న ఒత్తిడి...

అఖిల భారత సాంకేతిక విద్యా మండలి నిబంధనల ప్రకారం ప్రతి ఇంజనీరింగ్ కాలేజీలో మానసిక నిపుణులను నియమించాలి. ఇంటర్మీడియట్ విద్య వరకూ విద్యార్థులు బట్టీ పద్ధతిలో చదువుతున్నారు. ఇంజనీరింగ్ విద్య ఇందుకు భిన్నంగా ఉంటోంది. ఏదో ఒక ప్రశ్నకు సమాధానం రాబట్టే పద్ధతి ఉండదు. కంప్యూటర్ సైన్స్‌లో గణితం భాష ఒక్కసారిగా మారిపోతోంది. రెండో ఏడాదికి వచ్చేసరికి అనేక కంప్యూటర్ లాంగ్వేజ్‌లను విద్యార్థి నేర్చుకోవడమే కాకుండా, దాని ఆధారంగా ప్రయోగాత్మకంగా ఫలితాలు సాధించాల్సి ఉంటుంది. సివిల్, మెకానికల్‌లోనూ బేసిక్ ఇంటర్ విద్య స్థానంలో ఆధునిక సాంకేతికతపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉంటుంది. విద్యార్థి వ్యక్తిగతంగా స్కిల్ పెంచుకుంటే తప్ప ఈ పరిస్థితుల్లో ముందుకెళ్లడం కష్టం. ఈ కారణంగా ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో విద్యార్థులకు బ్యాక్‌లాగ్స్ ఎక్కువగా ఉంటున్నాయి. ఇదే విద్యార్థి మానసిక ఒత్తిడికి కారణమవుతోంది. నిపుణులు విద్యార్థి మానసిక స్థితిని కౌన్సిలింగ్ ద్వారా మెరుగుపరచాలని మండలి సూచిస్తోంది.

నైపుణ్య కొరత కూడా కారణమే..

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి కొత్త కంప్యూటర్ కోర్సుల్లో విద్యార్థులు ఎక్కువ శాతం ప్రతిభ కనబర్చడం లేదని మండలి భావిస్తోంది. ప్రతి ఏటా మార్కెట్లోకి వస్తున్న విద్యార్థుల్లో కేవలం 8 శాతం మాత్రమే అవసరమైన నైపుణ్యం కలిగిఉంటున్నారని పారిశ్రామిక వర్గాలు అంటున్నాయి. ఈ అంతరాన్ని పూడ్చడానికి రెండో ఏడాది నుంచే సంబంధిత రంగాల్లో ప్రాక్టికల్ నాలెడ్జ్ వచ్చేలా ప్రాజెక్టులు పూర్తి చేయాలనే నిబంధన విధించారు. ఇది కూడా నామమాత్రంగా జరగడం వల్ల విద్యార్థులు ఉపాధి పొందే విషయంలో, ఉద్యోగంలో రాణించే విషయంలో మానసిక ఒత్తిడికి గురవుతున్నారని నిపుణులు అంటున్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఆరు నెలలకోసారి విద్యార్థి మానసిక ధోరణిని పరిశీలించాలని ఏఐసీటీఈ సూచించింది.

ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోలు మృతి

మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లాలో ఘటన


సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మావోయిస్టు పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు గడ్చిరోలి జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్న నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్నికల నేపథ్యంలో భద్రత బలగాలు తనిఖీలు ముమ్మరం చేశాయి. మావోయిస్టులు తెలంగాణ నుంచి ప్రాణహిత నది దాటి మహారాష్ట్రలోకి అడుగు పెడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు కూంబింగ్ చేపట్టారు. మంగళవారం తెల్లవారుజామున అహెరి తాలూకా కొలమార్క కొండలకు ఐదు కిలోమీటర్ల దూరంలో రేపనపల్లి శివారు అడవుల్లో గాలిస్తుండగా, ఎదురుపడిన మావోయిస్టు బృందం వీరిపై కాల్పులు జరిపింది. దీంతో భద్రత బలగాలు ఎదురుకాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో మంచిర్యాల కుమురం భీం (కేబీఎం) కమిటీ సభ్యుడు, డివిజనల్ కమిటీ మెంబర్ (డీవీసీఎం), మంగి–ఇంద్రవెల్లి ఏరియా కమిటీ కార్యదర్శిగా ఉన్న వర్గీశ్ కోయ అలియాస్ మంగులు, డీవీసీఎం, సిర్పూర్–చెన్నూరు ఏరియా కమిటీ కార్యదర్శి మంగ్తూ, ప్లాటూన్ సభ్యులు కుర్సాంగ్ రాజు, కుడిమెత వెంకటేశ్ చనిపోయినట్టు గుర్తించారు. ఘటనా స్థలంలో ఒక ఏకే–47, ఒక కార్బైన్, రెండు దేశీ పిస్తోళ్లు, విప్లవ సాహిత్యం స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. మృతులు నలుగురిపై మహారాష్ట్ర ప్రభుత్వం గతంలో రూ.36 లక్షల రివార్డు ప్రకటించింది.

ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు మావోలు మృతి

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతెవాడ జిల్లాలో మంగళవారం ఉదయం జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. జిల్లా ఎస్పీ గౌరవ్‌రాయ్ తెలిపిన వివరాల ప్రకారం... దంతెవాడ – బీజాపూర్ జిల్లాల సరిహద్దు ప్రాంతం, కిరండోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పురంగేల్, గంపూర్ గ్రామాల సమీప అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారంతో బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో పురంగేల్ అటవీ ప్రాంతంలో ఇరువర్గాల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు (ఒక పురుషుడు, ఒక మహిళ) మృతి చెందారు. వీరి వివరాలు తెలియాల్సి ఉంది. ఘటనా ప్రాంతం నుంచి రెండు తుపాకులు, మందుగుండు సామగ్రి, నిత్యావసర వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎదురుకాల్పుల్లో 20 నుంచి 25 మంది మావోయిస్టులు పాల్గొన్నట్లు తెలుస్తుండగా.. తప్పించుకున్న వారి కోసం అదనపు బలగాలను రప్పించి కూంబింగ్ ముమ్మరం చేశారు.

తెలంగాణ గవర్నర్‌గా సీపీ రాధాకృష్ణన్

నేడు ప్రమాణ స్వీకారం



సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌గా జార్ఖండ్ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ రాజీనామాను ఆమోదించిన రాష్ట్రపతి.. కొత్త గవర్నర్ నియామకం జరిగే వరకూ తెలంగాణ గవర్నర్‌గా, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా రాధాకృష్ణన్‌కు అదనపు బాధ్యతలను అప్పగించారు. ఈ మేరకు రాష్ట్రపతి కార్యాలయం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాధాకృష్ణన్ బుధవారం ఉదయం 11.15 గంటలకు రాజ్‌భవన్‌లోని దర్బార్ హాల్‌లో పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు.

బీజేపీలో చురుగ్గా పనిచేసిన రాధాకృష్ణన్

తమిళనాడుకు చెందిన రాధాకృష్ణన్ సుదీర్ఘ కాలం పాటు బీజేపీలో క్రియాశీలకంగా పని చేశారు. 1974లో భారతీయ జన సంఘ్ రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యుడిగా ఆయన రాజకీయ ప్రస్థానం మొదలైంది. 1996లో తమిళనాడు బీజేపీ కార్యదర్శిగా పని చేశారు. 1998–1999లో రెండుసార్లు కోయంబత్తూరు లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. 1998–2003 మధ్య పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్‌గా వ్యవహరించారు. 2004–2007 మధ్య రాష్ట్ర అధ్యక్షుడి గానూ సేవలందించారు. ఆ సమయంలోనే దేశంలోని నదుల అనుసంధానం, ఉగ్రవాదం నిర్మూలన, అందరికీ ఉమ్మడి పౌర చట్టం కోసం, అంటరానితనం నిర్మూలన, నార్కోటిక్ డ్రగ్స్ నిర్మూలన వంటి ఐదు అంశాలపై 93 రోజుల పాటు 19 వేల కి.మీ. మేర 'రథయాత్ర'తో బీజేపీ బలోపేతానికి కృషి చేశారు.

భిన్న ఉపాధి

తొలి మహిళా షిప్ సర్వేయర్




స్త్రీలు సముద్రయానంలో పని చేయడానికి వెనుకాడతారు. సముద్రం మీదకు వెళ్లడానికి ధైర్యమున్నా కుటుంబాలు అంగీకరించవు. కాని పూజా ఛతోత్ దేశంలో మొదటి మహిళా షిప్ సర్వేయర్ కాగలిగింది. ఒక షిప్ తయారీ మొదలైనప్పటి నుంచీ అది సముద్రం మీద చేసే ప్రయాణం వరకూ అన్ని ప్రమాణాలు పాటించేలా చూసే ఉద్యోగమే షిప్ సర్వేయర్. పూజా ఛతోత్ పరిచయం.

భారీ నౌక ప్రయాణిస్తూ ఉంటుంది. కనుచూపు మేరా నీలి రంగు సముద్రం తప్ప వేరే ఏమీ ఉండదు. ఉప్పునీటి గాలులు ముఖాన తాకుతుంటాయి. ఆ నౌక సముద్రయానానికి సురక్షితం అనే ఆమోదం తెలిపిన షిప్ సర్వేయర్ డెక్ మీద నిలబడి డ్యూటీ సమర్థంగా చేస్తున్నాననే తృప్తితో చిరునవ్వు చిందిస్తూ ఉంటే ఎలా ఉంటుంది? పూజా ఛతోత్‌ను అడగాలి.

ఆమె ఇప్పుడు బ్రిటన్‌కు చెందిన ప్రఖ్యాత సముద్రయాన సంస్థ 'లాయెడ్స్ రిజిస్టర్'లో షిప్ సర్వేయర్‌గా పని చేస్తోంది. ఇతర దేశాలలో షిప్ సర్వేయర్లుగా మహిళలు ఇదివరకే పని చేస్తున్నా మన దేశంలో పూజా ఛతోత్ మాత్రమే తొలి మహిళా సర్వేయర్ కాగలిగింది.

చిన్నప్పటి ప్రభావం

పూజా ఛతోత్‌ది కేరళలోని కన్నూర్ జిల్లా. అక్కడి 'ఎజిమల' అనే చోట ఆసియాలోనే అతి పెద్దదైన భారత నావెల్ అకాడెమీ ఉంది. నావెల్ కేడెట్‌ల శిక్షణ అక్కడే జరుగుతుంది. బాల్యంలో తల్లిదండ్రులతో కలిసి అకాడెమీని సందర్శించిన పూజా శిక్షణలో ఉన్న నావెల్ కేడెట్‌లను చూసి స్ఫూర్తి పొందింది. ముఖ్యంగా చాలామంది పురుష కేడెట్‌ల మధ్య ఒకే ఒక మహిళా ఆఫీసర్‌ను చూసింది పూజ. అప్పుడే ఆ ఆఫీసర్‌లాగానే తానూ సముద్రం మీద పని చేసే ఉద్యోగం చేయాలని అనుకుంది. 'నేను హైస్కూల్ చదువుతున్నప్పుడే అనుకున్నాను ఆఫీసులో ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు వరకు పని చేసే ఉద్యోగం చేయకూడదని' అంది పూజ.

నావెల్ ఆర్కిటెక్చర్ చదివి...

సముద్రయాన రంగంలో పని చేయాలనుకున్నది పూజ. కొచ్చిలో నావెల్ ఆర్కిటెక్చర్‌ను 2020లో పూర్తి చేసింది. ఆ తర్వాత ఒక మెరైన్ కంపెనీలో ట్రయినీ నావెల్ ఆర్కిటెక్ట్‌గా చేరింది కాని ఆ పని రుచించ లేదు. సముద్రపుగాలి తగలాలి అనుకుంది. ఆ సమయంలోనే తండ్రి స్నేహితుడొకడు షిప్ సర్వేయర్ ఉద్యోగం గురించి తెలిపాడు. అయితే ఆ రంగంలో స్త్రీలు ఇప్పటి దాకా లేరు. 'నువ్వు మొదటిదానివి ఎందుకు కాకూడదు' అన్నాడు తండ్రి. ఆ ప్రోత్సాహంతో లాయెడ్స్ రిజిస్టర్‌లో షిప్ సర్వేయర్‌గా ఉద్యోగం సంపాదించింది పూజ.

రెండేళ్ల శిక్షణ

షిప్ సర్వేయర్ మానసిక బలం, శారీరక సామర్థ్యం అవసరమయ్యే ఉద్యోగం. నౌక తయారవుతున్నప్పటి నుంచి సముద్రం మీదకు చేరే వరకూ చేరాక కూడా అన్ని నిర్మాణ, సాంకేతిక విభాగాలూ నిర్ణీత ప్రమాణాలు పాటిస్తున్నాయా లేదా చూడటమే ఈ ఉద్యోగం. నేల మీదా, సముద్రం మీదా పని ఉంటుంది. ఇందుకు కఠినమైన శిక్షణ అవసరం. లాయెడ్స్ రిజిస్టర్ సంస్థ ఆమెకు రెండేళ్ల శిక్షణ ఇచ్చింది. నౌకను తయారు చేసే మెటీరియల్ సర్వే శిక్షణ ముంబైలో తీసుకుంటే తయారీ విధానం సర్వే శిక్షణ కొచ్చిలో, గోవాలో తీసుకుంది. టెక్నికల్ శిక్షణ అంతా వైజాగ్, సింగపూర్‌లలో జరిగింది. రెండేళ్ల మొత్తం శిక్షణను సమర్థతతో పూర్తి చేయడం వల్ల ఇటీవల ఆమె షిప్ సర్వేయర్‌గా పూర్తిస్థాయి బాధ్యతలు తీసుకుంది.

పూజను చూసి మరెందరో యువతులు ఈ రంగంలోకి వస్తారు. ఏ రంగమూ మగవారి స్వీయసామ్రాజ్యం కాదని నిరూపిస్తారు.

సేవ

పది రూపాయలతో ప్రారంభం..



మనం ఒక్కరమే బాగుంటే సరిపోదు... మనతో పాటు మన చుట్టూ ఉన్నవారూ బాగుండాలి అనే ఆలోచన ఇండోర్‌వాసి కుక్కు ద్వివేదినిది. ఆపదలో ఉన్నవారికి చిన్న సాయమైనా చేయాలి అనే ఆశయంతో బ్యాంకు ఉద్యోగం చేస్తూ, కుటుంబ నిర్వహణను చూస్తూనే పేదలకు కావల్సిన మందులను ఉచితంగా పంపిణీ చేయాలనుకుంది. అందుకోసం 400 మంది సహోద్యోగుల జీతంలో ఒక్కొక్కరి నుంచి పదేసి రూపాయలను సేకరించి, ఆ మొత్తంతో ఉచిత మందుల పంపిణీని మొదలుపెట్టింది. పాతికేళ్లుగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. బ్యాంకు ఉద్యోగం నుంచి వీఆర్‌ఎస్ తీసుకొని గ్రామాలు తిరుగుతూ ఉచిత విద్య, వైద్యసేవలను అందిస్తూ అందరికీ స్ఫూర్తిగా నిలుస్తోంది.

''నా బాల్యం అందమైన జ్ఞాపకాలతో గడిచింది. మా నాన్న డాక్టర్. నలుగురికి సాయం చేసే స్వభావం కావడంతో ఆయన సాయం కోసం, వైద్యం కోసం ఇంటికి ఎప్పుడూ అనేకమంది వస్తూ ఉండేవారు. వారి కోసం అమ్మ ప్రతిరోజూ వంట చేసి ఉంచేది. అది చూస్తూ పెరగడం వల్ల కాబోలు చిన్నప్పటి నుంచి ఎవరైనా సాయం అడిగితే కాదనే గుణం నాకు లేదు. ఇలా ఉచితంగా చేసే సాయాలను సామాజిక సేవ అంటారని కూడా తెలియకుండానే పదిమందికీ చేతనైన సాయం చేసేదాన్ని.

జీవించడానికి తక్కువ వస్తువులు చాలు

డిగ్రీ పూర్తవుతూనే తొలి ప్రయత్నంలోనే బ్యాంకు ఉద్యోగం వచ్చింది. ఉద్యోగంలో చేరినప్పటినుంచి ఇతరులకు నా అంతట నేనే సాయం చేయగలిగే అవకాశం వచ్చిందని సంతోషించాను. పెళ్లయ్యాక నా భర్త మద్దతు లభించింది. నా భర్త కూడా బ్యాంకు ఉద్యోగి. ఇద్దరి సంపాదన ఉన్నా మా ఇంట్లో తక్కువ వస్తువుల వినియోగం ఉండేది. నిరాడంబరంగా జీవించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. మా ఇంటి పరిసరాల్లోని అమ్మాయిల చదువుకు సాయం చేసేదాన్ని.

పేదలకు అందని వైద్యం

ఉద్యోగం చేస్తున్న రోజుల్లోనే నా కూతురు తీవ్ర అనారోగ్యానికి గురైంది. నా కుమార్తెకు చికిత్స జరుగుతున్నప్పుడు వైద్యం ఎంత ఖరీదైనదో తెలుసుకున్నాను. అంతటి ఖర్చు మేం ఎలాగో భరించగలిగాం. కానీ, రెండు పూటలా తిండికే నోచుకోని వారి సంగతేంటి? వారికి చికిత్స అవసరమైతే ఏం చేస్తారు? ఈ విషయం పదే పదే ఆలోచించేదాన్ని. ఒంటరిగా చేయడంలో పెద్ద సాయాన్ని అందివ్వలేనని గ్రహించాను. దీంతో నా సహోద్యోగుల సాయం తీసుకోవాలనుకున్నాను.

పది రూపాయలతో ప్రారంభం...

మా బ్యాంకు యూనియన్ లీడర్‌కు ఈ విషయాన్ని చెప్పాను. 'మా అందరికీ మంచి జీతం ఉంది. పేద ప్రజల కోసం ఏదైనా సహాయం చేయాలి' అని వివరించాను. దాదాపు ముప్పై ఏళ్ల క్రితం ఆలోచన ఇది. ప్రతి ఉద్యోగీ, తన జీతం నుంచి పది రూపాయలను 'సేవ' కోసం కేటాయించాలనే నిర్ణయం తీసుకున్నారు. అలా నెలకు నాలుగు వేల రూపాయలు జమ అయ్యేవి. పాతిక వేలు జమ కాగానే మా యూనియన్ లీడర్ 'ఏం చేయాలో చెప్పమ'ని అడిగారు.

గంట సమయం సద్వినియోగం

అలా జమ అయిన డబ్బుతో పేద ప్రజలకు వైద్యం, విద్యలో సాయం చేయాలనే విషయాన్ని చెప్పాను. సేవా కార్యక్రమాలకు సమయాన్ని ఎలా కేటాయిస్తారు అని అడిగారు. ఎందుకంటే మాది ఉమ్మడి కుటుంబం. పిల్లల సంరక్షణ ఎలా సాధ్యమవుతుందని అడిగి, ఆఫీస్ టైమింగ్స్ నుండి గంట ఆలస్యంగా రావడానికి పర్మిషన్ ఇస్తామన్నారు. ఆఫీసు టైమ్‌కి ఇంటినుండి బయల్దేరి ఇండోర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లడం, అక్కడ అన్ని డిపార్ట్‌మెంట్లు చూసి, ఎక్కడ సాయం అవసరం ఉందో చూసి, సేవా కార్యక్రమాలను మొదలుపెట్టాను. ఈ క్రమంలో జూనియర్ డాక్టర్లతో పరిచయాలు ఏర్పడ్డాయి. మెడికల్ కంపెనీ ప్రతినిధులు వచ్చినప్పుడు వారి దగ్గర నుంచి శాంపిల్స్ సేకరించడం కూడా మొదలైంది. ఏ మందు దేనికి వాడాలో వచ్చిన వారికి చెప్పి ఇవ్వడానికి, అక్కడే ఒక కాంపౌండర్‌ను కూడా నియమించాం.



హఠాత్పరిణామాలు

బ్యాంకు నిధులే కాకుండా విరాళం పేరుతో సాయం చేయడానికి కొంతమంది దాతలు ముందుకు వచ్చారు. పదేళ్ల పాటు ఈ విధమైన సేవాకార్యక్రమాలు బాగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో నా భర్త హఠాత్తుగా చనిపోయాడు. దీంతో నేను చాలా రోజులు డిస్టర్బ్ అయ్యాను. ఆ రోజుల్లో మా సహోద్యోగులు కూడా మరింత సాయం అందించడానికి ముందుకు వచ్చారు. దీంతో రిలీఫ్ సొసైటీగా పేరు మార్చాం. ఎందుకంటే ఇందులో బయటి వ్యక్తులు చేరడం మొదలుపెట్టారు. రూపాయ నుంచి లక్షల రూపాయల విలువైన మందులు వస్తున్నాయి.

పేదలకోసం పాఠశాల

జబ్బులు వచ్చి, చికిత్సలో ఉన్న రోగులకు మందులు ఇవ్వడం ద్వారా సాయం చేస్తున్నాం. కానీ, జబ్బులు రాకుండా అవగాహన కల్పించాలంటే చదువు ఉండాలనుకున్నాం. సరైన చదువు ఉంటే ముందస్తు జాగ్రత్తలు కూడా తీసుకోగలరు. ఈ ఆలోచనతో సైన్యంలో వైద్య సేవలు అందించే మా స్నేహితురాలు డాక్టర్ అనురాధతో కలిసి గిరిజన పిల్లలకు చదువులు చెప్పడం ప్రారంభించాం. ఇండోర్‌కు మూడు గంటల ప్రయాణం దూరంలో ఉన్న ఖర్గోన్‌లో సంస్థకు ధర్మకర్తగా ఉంటూ అనురాధతో పాటు కలిసి కార్యక్రమాలు నిర్వహించేదాన్ని. అక్కడే 12 ఎకరాల్లో పాఠశాల, హాస్టల్ కూడా నిర్మించాం. నా స్నేహితురాలి హఠాన్మరణంతో నేను బ్యాంకు ఉద్యోగం నుంచి వీఆర్‌ఎస్ తీసుకొని స్కూల్ బాధ్యతలు చూసుకోవడానికి వచ్చేశాను.

మొదట ఎనిమిది, పది మంది పిల్లలతో ప్రారంభించిన స్కూల్‌లో ఇప్పుడు 200 మంది పిల్లలు చదువుతున్నారు. వీరిలో 35 మంది వికలాంగులు. ఇప్పటికీ గ్రామంలో బాల్య వివాహాలు చేస్తుంటారు. దీంతో వారు చదువులు మానేసి వ్యవసాయం చేస్తుంటారు. పెద్దలకు అవగాహన కల్పించి, పిల్లలను స్కూల్‌కు తీసుకురావడం పెద్ద యుద్ధమే అవుతుంటుంది' అంటూ తాము చేస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు ద్వివేదిని.

శీతల పంటలు


● కేయా సాలోత్


● ఉష్ణోగ్రతలు తగ్గించే పైకప్పు


● రాస్ప్ బెర్రీ


● బ్లూ బెర్రీ

మన నేలమీద పండిద్దాం

విదేశీయుల వ్యాపార రహస్యం, మార్కెట్ మాయాజాలం ఒకటి ఉంటుంది. ఒక ఉత్పత్తి మార్కెట్‌లోకి విడుదలయ్యే లోపు దాని గురించి ఒక సదభిప్రాయాన్ని కలిగించే ప్రచారం మొదలవుతుంది. ఆ ప్రమోషన్ ఆధారంగా సదరు ఉత్పత్తికి మార్కెట్‌లో విపరీతమైన డిమాండ్ పెరిగిపోతుంది. వాళ్ల బుట్టలో పడేవరకు మనకు ఆ మాయాజాలం అర్థం అయ్యేది కాదు. అర్థమయ్యేలోపు సదరు ఉత్పత్తిని వాడడానికి అలవాటు పడిపోయేవాళ్లం. ఆలా ఆయా ఉత్పత్తుల దిగుమతికి రహదారి పడుతుంటుంది. నిజానికి భారతదేశం నేల మీద పండని పంట ఉంటుందా అనుకుంది కేయా సాలోత్. అమెరికా, రష్యా, మెక్సికో, పోలండ్ దేశాల్లో పండే రాస్ప్‌బెర్రీ, బ్లాక్‌బెర్రీ, బ్లూబెర్రీ, క్రాన్‌బెర్రీ... పంటలను మన నేల మీద పండించి చూపించాలనుకుంది. ఆ పంటలకు అనుగుణమైన ఉష్ణోగ్రతలను మెయింటెయిన్ చేసింది. మంచి దిగుబడిని సాధిస్తోంది.

హై బుష్ కౌన్సిల్ ప్రకటన!

''మన దేశం నుంచి ఇండియా దిగుమతి చేసుకున్న కూరగాయలు, పండ్ల విలువ ఏడాదికి ముప్పై శాతం చొప్పున తగ్గిపోతోంది. మనకిది ఏ మాత్రం అభిలషణీయమైన లావాదేవీ కానేరదు. ఇండియా మార్కెట్ అవసరాలను పెంచడానికి ప్రయత్నించడం వల్ల ప్రయోజనం కూడా ఉండదు. ఎందుకంటే ఇండియా తనంతట తానుగా ఈ పంటలను పండించుకుంటోంది. స్థానికంగా పండించుకోవడం వల్ల బయటి దేశాల నుంచి దిగుమతి చేసుకుంటే అయ్యే ఖర్చుతో పోలిస్తే చాలా తక్కువ ధరకు దొరుకుతున్నాయి'' అని యుఎస్ హైబుష్ బ్లూ బెర్రీ కౌన్సిల్ ప్రతినిధి అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ పంటలను పండించడంలో కేయా సాలోత్, ఆమె బాటలో మరికొంత మంది చిన్నరైతులు విజయవంతమైనట్లు చెప్పడానికి ఈ ప్రకటనే నిదర్శనం.

దిగుబడికి ముందే ఆర్డర్లు!

ఇంతకీ కేయాసాలోత్ అనతికాలంలోనే సక్సెస్ సాధించడానికి ఆమెకు వ్యవసాయ నేపథ్యం ఏ మాత్రం లేదు. ఆమె ముంబయిలో పుట్టి పెరిగింది. న్యాయశాస్త్రం చదివి లాయర్‌గా ప్రాక్టీస్ చేసింది. తన జ్ఞానాన్ని క్లయింట్‌లను కాపాడడం కోసం వినియోగించడం కంటే అంతకంటే మెరుగైన కారణం కోసం పని చేస్తే బావుణ్నని కోరుకుంది. అప్పుడు ఆమె దృష్టి మనదేశంలోకి అమెరికా, రష్యా, పోలండ్, మెక్సికో, సెర్బియా వంటి శీతల దేశాల నుంచి మనదేశానికి వస్తున్న రాస్ప్‌బెర్రీ, బ్లూబెర్రీల మీద కేంద్రీకృతమైంది. మనం తినడానికి ఇష్టపడుతున్న పండ్లను మనం పండించుకోలేమా అని ప్రయోగం మొదలు పెట్టింది. ఇందుకోసం ఆమె మహారాష్ట్రలో ఏ ప్రదేశమైతే ఈ పంటలకు అనువుగా ఉంటుందోనని అధ్యయనం చేసింది. ఈ పంటలు పండే దేశాలకు వెళ్లి వారు అనుసరిస్తున్న పద్ధతులను పరిశీలించింది. తిరిగి ఇండియాకి వచ్చి ఇరవై ఎకరాల పొలంలో వ్యవసాయం మొదలుపెట్టింది. ఎండ, వర్షాలను తట్టుకునే విధంగా తెల్లటి పై కప్పుతో షెడ్ వేసింది. మొదటగా మైక్రోగ్రీన్స్‌తో మార్కెట్‌లోకి ప్రవేశించింది. కొత్తిమీర, మెంతి ఆకు వంటి స్వల్పకాల పంటలను రసాయన ఎరువులు లేకుండా పండించి రెస్టారెంట్‌లకు సప్లయ్ చేయడంతో అనతికాలంలోనే 50 మంది క్లయింట్‌లు వచ్చారు. రాబోయే కాలంలో తమ పొలం నుంచి ఫలానా పంటలు అందుబాటులోకి వస్తాయని క్లయింట్‌లకు సమాచారం ఇవ్వడంతో ఆమెకు అడ్వాన్స్ బుకింగ్‌లు మొదలయ్యాయి. ఈ పండ్లు దిగుబడి సాధించేలోపు ఆమె మార్కెట్ వేదికను ఏర్పాటు చేసుకుందన్నమాట. రైతులందరూ వ్యవసాయం చేస్తారు. పంట పండించి కొనుగోలు దారుల కోసం ఎదురు చూస్తారు. దళారుల చేతిలో మోసపోతుంటారు. 32 ఏళ్ల కేయా సాలోత్ అనుసరించిన సక్సెస్ ఫార్ములా రైతులకు మార్గదర్శనం.



యూత్ ప్లస్

నేడు వరల్డ్ హాపీనెస్ డే

లక్ష్యం ఉన్నచోట ఉత్సాహం... ఉత్సాహం ఉన్నచోట సంతోషం ఉంటాయి

సంతోషం సగం బలం అన్నారుగానీ నిజానికి అది సంపూర్ణ బలం. ఆ బలం ఉన్నచోటే ఆరోగ్యం ఉంటుంది. విజయం ఉంటుంది. డబ్బుతో కొనలేని 'సంతోషం' ఎవరూ చేరుకోలేని కీకారణ్యం కాదు. 'నేను సంతోషంగా ఉండాలనుకుంటున్నాను' అని మనసులో గట్టిగా అనుకొని ఒక అడుగు వేస్తే ఎన్నో దారులు కనిపిస్తాయి. సంతోష సామ్రాజ్యానికి దగ్గర చేస్తాయి. 'సక్సెస్‌తో సంతోషం రాదు. సంతోషంతో సక్సెస్ వస్తుంది' అనే పాతతరం మాటకు కొత్త తరం విలువ ఇస్తోందిప్పుడు. నిరంతరం సంతోషంగా ఉండడానికి ప్రయత్నిస్తోంది. సంతోషంగా ఉండడానికి సంబంధించిన టెక్నిక్స్ గురించి ఆసక్తిగా తెలుసుకుంటోంది...

భోపాల్‌కు చెందిన అనీష ప్రతి రెండు రోజులకు ఒక సంస్కృత శ్లోకాన్ని కంఠస్థం చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకొని ఈ ఏడాది జనవరి మొదటి తేదీ నుంచి ప్రారంభించింది. ఫిబ్రవరి నెల పూర్తయ్యే సరికి తాను అలవోకగా చెప్పగలిగే శ్లోకాల గురించి లెక్క వేసుకుంటే చెప్పలేనంత సంతోషం కలిగింది. ఆ సంతోషం ఇంకా కొనసాగుతూనే ఉంది.

తమిళనాడులోని వెల్లూరుకు చెందిన ఇంజినీరింగ్ స్టూడెంట్ ఐశ్వర్య మోహన్‌కు డ్రైవింగ్ అంటే చెప్పలేనంత భయం. ఆ భయాన్ని వదిలి ఈమధ్యే స్కూటీ నడపడం నేర్చుకుంది. తనకు ఇప్పుడు విమానం నడుపుతున్నంత సంతోషంగా ఉంది. ముంబైకి చెందిన సజన్ ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఎప్పటికప్పుడు కొత్త కొత్త గ్యాడ్జెట్స్ కొనడంలో అతడికి అంతులేనంత సంతోషం దొరుకుతుంది. ఇవి మాత్రమే కాదు...మనం చేసే పనికి ఇతరుల నుంచి లభించే ప్రశంస, అభిమాన హీరో సినిమాకు వెళ్లడం, 'చాలా హ్యాండ్‌సమ్'గా ఉన్నావ్'లాంటి కామెంట్... ఇలాంటివి అప్పటికప్పుడు లభించే తాత్కాలిక సంతోషాలే అయినా తక్కువ చేసి చూసేవి మాత్రం కాదు.

చిన్న చిన్న చినుకులు కలిస్తేనే కదా వర్షం.

చిరు సంతోషాల కలయికే కదా ఆనందమయ జీవితం!

'హాబీల నుంచి వచ్చే హ్యాపీనెస్ అంతా ఇంతా కాదయా' అని చెప్పడానికి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి.

జెన్ జెడ్‌కు సుపరిచితమైన పేరు... విష్ణు కౌశల్. ఇన్‌స్టాగ్రామ్‌లో కామిక్ కంటెంట్ జెనరేట్ చేయడం అతడి హాబీ. ఈ హాబీ కాస్త అతడిని డిజిటల్ స్టార్‌ను చేసింది. ఇన్‌స్టాగ్రామ్‌లో విష్ణు కౌశల్‌కు 2.3 మిలియన్‌ల ఫాలోవర్‌లు ఉన్నారు. 'పెద్ద లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకొని నా ప్రయాణాన్ని ప్రారంభించలేదు. నేను కామిక్ కంటెంట్‌ను క్రియేట్ చేయడానికి కారణం అది నన్ను ఎప్పుడూ సంతోషంగా ఉంచుతుంది' అంటాడు 25 సంవత్సరాల విష్ణు కౌశల్.

'లేదు అనుకుంటే ఏమీ లేదు. ఉంది అనుకుంటే ఎంతో ఉంది' అనే ధోరణిని అనుసరించే యువతరం సూర్యోదయం నుంచి వెండి వెన్నెల వెలుగు వరకు ప్రతి ప్రకృతి అద్భుతాన్ని ఎంజాయ్ చేస్తోంది.

'హ్యాపీనెస్ అనేది ఎమోషన్, ఫీలింగ్ కాదు. అదొక స్కిల్' అంటున్న యువతరం రకరకాల టెక్నిక్‌లపై కూడా దృష్టి సారిస్తోంది. స్థూలంగా చెప్పాలంటే 'సంతోషం' అనే పునాదిని సిద్ధం చేసుకొని 'లక్ష్యాలు' అనే భవనాలపై దృష్టి పెడుతోంది.

ట్రై చేసి చూద్దాం

వ్యాయామాలతో సంతోషాన్ని సొంతం చేసుకునేవారు కొందరైతే, సంతోషం కోసం ప్రత్యేక వ్యాయామాలు చేసేవారు కొందరు. 'హ్యాపీనెస్'ను సొంతం చేసుకోవడం కోసం చిన్నపాటి ఎక్సర్‌సైజ్‌ల మీద దృష్టి పెట్టే ధోరణి యువతరంలో పెరుగుతుంది. వాటిలో కొన్ని...

- టాప్ ఔట్ స్ట్రెస్
- న్యూ బిహేవియర్ జెన్
- యాంకర్ హ్యాపీ అండ్ కామ్ ఫీలింగ్స్
- బ్రీత్ టెక్నిక్
- యాంగర్ రిలీజ్ సీక్రెట్.

నచ్చిన పనిలోనే సంతోషం

చెన్నైలో పుట్టి బెంగళూరులో పెరిగిన నిహారిక ఎన్‌ఎం ఇంజినీరింగ్ చదివే రోజుల్లో హాబీగా యూట్యూబ్ వీడియోలు చేసింది. ఈ ప్రక్రియ తనను ఒత్తిడికి దూరంగా ఉంచడంతో పాటు ఎప్పుడూ సంతోషంగా ఉండేలా చేసింది. 'నచ్చిన పని చేయడంలో అపారమైన ఆనందం సొంతం అవుతుంది' అంటున్న నిహారిక ఎన్‌ఎం 'డిజిటల్ కంటెంట్ క్రియేటర్'గా ప్రపంచవ్యాప్తంగా మంచి పేరు తెచ్చుకుంది.

హ్యాపీనెస్ ఫార్ములా

'హ్యాపీనెస్' అనే మాట వినిపించగానే గుర్తుకు వచ్చే పేర్లలో ఒకటి సైకాలజిస్ట్ మార్టిన్ సెలిగ్మాన్. అమెరికన్ సైకలాజికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా ఎంపికైన సెలిగ్మాన్ సంతోషం అంటే ఏమిటి? మనిషిని సంతోషంగా ఉంచే అంశాలు ఏమిటి? ఫెయిల్యూర్స్‌ను అధిగమించి విజయాలు సొంతం చేసుకున్న వ్యక్తుల గురించి లోతుగా అధ్యయనం చేశాడు. 'అథెంటిక్ హ్యాపీనెస్' పేరుతో పుస్తకం రాశాడు. 'హ్యాపీనెస్'కు సంబంధించి **హెచ్=ఎస్ +సి+వి** అనే ఫార్ములాను రూపొందించాడు.

హెచ్–హ్యాపీనెస్

ఎస్–సెట్ రేంజ్ : మన సంతోషంలో 50 శాతం పూర్తిగా మన నియంత్రణలో ఉండదు. జెనెటిక్ కెపాసిటీ ప్రభావం ఉంటుంది.

సి–సర్‌కమస్టాన్సెస్: దీర్ఘకాలిక సంతోషాన్ని సొంతం చేసుకోవడానికి పరిస్థితులను సరిదిద్దుకుంటూ, స్ట్రాటిజిక్ వర్క్‌తో ప్రయాణించాలి. ఉదా: నెగెటివ్ ఈవెంట్స్, నెగిటివ్ ఎమోషన్స్‌కు దూరంగా ఉండడం.

వి–వాలెంటరీ వేరియబుల్స్: హ్యాపీనెస్ ఫార్ములాలో బెస్ట్ అండ్ మోస్ట్ కంట్రోలబుల్ పార్ట్ ఇది. గత, వర్తమాన, భవిష్యత్తుకు సంబంధించిన పాజిటివ్ ఎమోషన్స్ ద్వారా సంతోషంగా ఉండడం.



హార్వర్డ్ బిజినెస్ స్కూల్ ప్రొఫెసర్, సోషల్ సైంటిస్ట్, రచయిత డా.ఆర్థర్ బ్రూక్స్ 'హ్యాపీనెస్'కు సంబంధించి హెచ్=ఇ+ఎస్+ఎం అనే ఈక్వేషన్‌ను ప్రచారంలోకి తీసుకువచ్చాడు.

హాపీనెస్ (హెచ్) = ఎంజాయ్‌మెంట్ (ఇ)+శాటిస్ఫాక్షన్ (ఎస్)+మీనింగ్ (ఎం)

హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌లో ఆర్థర్ రూపొందించిన 'మేనేజింగ్ హ్యాపీనెస్' అనే కోర్సు అందుబాటులో ఉంది.


● నిహారిక

సమ్మర్‌టిప్స్

- వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఏసీలు ఉన్న ఇళ్లలో ఏసీ కండిషన్‌లో ఉందా లేదా అని చెక్ చేసుకోవడం, అవసరమైతే గ్యాస్ పట్టించడం వంటి జాగ్రత్తలు మొదలయ్యే ఉంటాయి. అయితే ఏసీ గురించి పట్టించుకునే ముందు ఇంటి కిటికీలకు వట్టివేరు తడికలను కర్టెన్‌లుగా వేయడానికి ప్రయత్నించండి. పర్యావరణహితంగా ఇంటిని చల్లబరుచుకుందాం.
- వేసవి రాగానే ఫ్రిజ్‌లో పెట్టే వాటర్ బాటిళ్ల మరో సెట్ కొని సిద్ధం చేయడం ఆనవాయితీ. ఫ్రిజ్ బాటిళ్లతోపాటు మట్టి కుండ కూడా కొని ఇంటికి తెచ్చుకోండి. మట్టి కుండలోని నీటి రుచి ఈ తరం బాల్యానికి పరిచయం చేయండి.

ఇంటిప్



- వెడల్పాటి పాత్రలో నీటిని పోసి పూలు అలంకరించి ముందు గదిలో ఒక మూల పెట్టడం ఇంటీరియర్ డెకరేషన్‌లో భాగమైపోయింది. అలాగే ఈ కాలంలో ప్రతి గదిలో ఒక మూల చిన్న నీటి పాత్రను (మూత పెట్టకుండా) ఉంచితే గది ఉష్ణోగ్రతలు తగ్గుతాయి.

పోరాడి ఓడిన సుమిత్ నగాల్



మయామి ఓపెన్ మాస్టర్స్ సిరీస్–1000 టెన్నిస్ టోర్నీలో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్‌కు నిరాశ ఎదురైంది. ఈ టోర్నీలో ప్రపంచ 97వ ర్యాంకర్ సుమిత్ మెయిన్ 'డ్రా'కు అర్హత పొందలేకపోయాడు. ఫ్లోరిడాలో మంగళవారం జరిగిన క్వాలిఫయింగ్ చివరి రౌండ్ మ్యాచ్‌లో సుమిత్ 6–3, 1–6, 5–7తో ప్రపంచ 212వ ర్యాంకర్ కోల్మన్ వాంగ్ (హాంకాంగ్) చేతిలో ఓడిపోయాడు. సుమిత్‌కు 13,500 డాలర్ల (రూ. 11 లక్షల 20 వేలు) ప్రైజ్‌మనీ, 10 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

54 స్థానాలు ఎగబాకిన శరత్ కమల్



గతవారం సింగపూర్ స్మాష్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్ చేరినందుకు... భారత టేబుల్ టెన్నిస్ (టీటీ) దిగ్గజ ప్లేయర్ ఆచంట శరత్ కమల్ వ్యక్తిగత ర్యాంక్ అమాంతం ఎగబాకింది. అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ సమాఖ్య తాజా ర్యాంకింగ్స్‌లో శరత్ కమల్ 54 స్థానాలు పురోగతి సాధించి 34వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. ప్రస్తుతం భారత నంబర్‌వన్‌గా ఉన్న 41 ఏళ్ల శరత్ మే 16లోపు టాప్–2లో ఉంటే ఒలింపిక్స్‌లో ఐదోసారి సింగిల్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తాడు.

లక్ష్య సేన్ @ 13



న్యూఢిల్లీ: ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో సెమీఫైనల్ చేరిన భారత స్టార్ లక్ష్య సేన్ ర్యాంక్ మెరుగైంది. ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) తాజా ర్యాంకింగ్స్‌లో పురుషుల సింగిల్స్‌లో లక్ష్య సేన్ ఐదు స్థానాలు ఎగబాకి 13వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. ప్రణయ్ ఎనిమిది నుంచి తొమ్మిదో ర్యాంక్‌కు పడిపోయాడు. ఏప్రిల్ 30వ తేదీలోపు టాప్–16లో ఉంటే ప్రణయ్, లక్ష్య సేన్ పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తారు. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు 11వ ర్యాంక్‌లో మార్పు లేదు. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి ద్వయం టాప్ ర్యాంక్‌ను నిలబెట్టుకుంది. మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప–తనీషా క్రాస్టో జోడీ మూడు స్థానాలు ఎగబాకి 20వ ర్యాంక్‌తో భారత నంబర్‌వన్ జోడీగా అవతరించింది. పుల్లెల గాయత్రి–ట్రిసా జాలీ ద్వయం నాలుగు స్థానాలు పడిపోయి 26వ ర్యాంక్‌కు చేరుకుంది.

పెర్త్‌లో తొలి టెస్టు!

ఈ ఏడాది చివర్లో ఆస్ట్రేలియాలో భారత జట్టు పర్యటన



మెల్‌బోర్న్: టెస్టు ఫార్మాట్‌లో ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌లో ఉన్న భారత జట్టు ఈ ఏడాది చివర్లో ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) విజేత ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల సిరీస్‌లో పోటీపడనుంది. ఆస్ట్రేలియా వేదికగా ఈ సిరీస్ జరుగుతుంది. నవంబర్‌లో మొదలయ్యే ఈ సిరీస్‌లో ఐదు టెస్టుల వేదికలను క్రికెట్ ఆస్ట్రేలియా ఖరారు చేసినట్లు సమాచారం. ఈ రెండు మేటి జట్ల మధ్య జరిగే తొలి టెస్టుకు పెర్త్ ఆతిథ్యమివ్వనుంది. అనంతరం రెండో టెస్టు అడిలైడ్‌లో... మూడో టెస్టు బ్రిస్బేన్‌లో... నాలుగో టెస్టు మెల్‌బోర్న్‌లో... చివరిదైన ఐదో టెస్టు సిడ్నీలో జరగనున్నాయి. అడిలైడ్‌లో జరిగే రెండో టెస్టు డే–నైట్‌గా జరుగుతుంది. ఈ సిరీస్ పూర్తి షెడ్యూల్‌ను క్రికెట్ ఆస్ట్రేలియా ఈ నెలాఖరులో అధికారికంగా ప్రకటించనుంది.

ఒక్క టైటిల్ వేటలో...

- ఫైనల్ చేరినా ఐపీఎల్ ట్రోఫీ గెలవని మూడు జట్లు
- ఈ సారైనా బెంగళూరు, ఢిల్లీ, పంజాబ్ జట్ల కల నెరవేరేనా!



ఐపీఎల్‌లో 16 సీజన్లు గడిచిపోయాయి... రెండు టీమ్‌లు చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ ఐదేసిసార్లు విజేతగా నిలిచి తమ స్థాయిని ప్రదర్శిస్తే కోల్‌కతా నైట్‌రైడర్స్ రెండు టైటిల్స్‌తో సత్తా చాటింది. మరో నాలుగు టీమ్‌లు రాజస్తాన్ రాయల్స్, దక్కన్ చార్జర్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, గుజరాత్ టైటాన్స్ ఒక్కో ట్రోఫీతో కొంత సంతృప్తిని మూటగట్టుకున్నాయి. కానీ అన్ని సీజన్లలో భాగంగా ఉండి ఒక్కసారి కూడా కప్‌ను ముద్దాడలేకపోయిన దురదృష్టకర జట్లూ ఉన్నాయి. సీజన్‌లో తొలి మ్యాచ్ నుంచి చెలరేగి అంచనాలు పెంచి అభిమానుల్లో ఆశలు రేపిన తర్వాత చివరి మెట్టుపై చతికిలపడి ఈ టీమ్‌లు తీవ్ర నిరాశను పంచాయి. మూడు సార్లు ఫైనల్ చేరి ఒక్కసారి కూడా గెలవలేకపోయిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) ఈ అన్ లక్కీ బ్యాచ్‌లో అగ్రస్థానంలో ఉండగా... పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ ఒక్కోసారి ఫైనల్ చేరి పరాజయం పక్షాన నిలిచాయి. కొత్త సీజన్‌లో మరోసారి తమ రాతను పరీక్షించుకునేందుకు సిద్ధమైన ఈ మూడు జట్లకు ఈ సారైనా కలిసి వస్తుందా... ట్రోఫీ చెంత చేరుతుందా అనేది ఆసక్తికరం. -సాక్షి క్రీడా విభాగం

'బెంగ'ళూరు తీరుతుందా...

తొలి ఐపీఎల్ సీజన్‌లో చివరి నుంచి రెండో స్థానంలో నిలిచిన ఆర్‌సీబీ తర్వాతి సీజన్‌లో కోలుకొని ఫైనల్ చేరినా 6 పరుగుల స్వల్ప తేడాతో దక్కన్ చార్జర్స్ చేతిలో ఓడింది. అనంతరం 2011లోనూ తుది పోరుకు అర్హత సాధించినా... చెన్నై నిర్దేశించిన 206 పరుగుల లక్ష్యాన్ని ఛేదించలేక చతికిలపడింది. ఇక కోహ్లి ఏకంగా 973 పరుగులు సాధించిన 2016 ఐపీఎల్‌లోనూ ఆఖరి సమరంలో సన్‌రైజర్స్ చేతిలో 8 పరుగులతో ఓటమి పాలైంది. 209 పరుగుల ఛేదనలో ఒక దశలో 114/0తో ఉండి కూడా టీమ్ ఓడింది. ఇక ఆ తర్వాత ఆర్‌సీబీ ఆ స్థాయి ప్రదర్శనను మళ్లీ చూపించలేదు. గత సీజన్‌లో 7 విజయాలు సాధించిన జట్టు ఆరో స్థానంతో ముగించింది.

బలాబలాలు: తాజా వేలంలో ఆసీస్ ఆల్‌రౌండర్ కామెరాన్ గ్రీన్‌ను ఆర్‌సీబీ రూ.17.50 కోట్లకు తీసుకుంది. అతని తాజా ఫామ్‌ను బట్టి చూస్తే అటు బౌలింగ్‌లో, ఇటు బ్యాటింగ్‌లో జట్టుకు కచ్చితంగా మంచి ప్రయోజనం కలగవచ్చు. ఓపెనర్లుగా డుప్లెసిస్, కోహ్లిలపై బ్యాటింగ్ భారం ఉండగా... మ్యాక్స్‌వెల్, గ్రీన్ చెలరేగిపోగలరు. గాయంతో గత సీజన్‌కు దూరమైన రజత్ పటిదార్ ఈసారి సత్తా చాటేందుకు సిద్ధమయ్యాడు. బౌలింగ్‌లో ఫెర్గూసన్, అల్జారీ జోసెఫ్‌లలో ఒకరికి అవకాశం దక్కుతుంది. అయితే వీరిద్దరికంటే సిరాజ్, ఇటీవలే టెస్టుల్లో అరంగేట్రం చేసిన ఆకాశ్‌దీప్‌లు రాణించడం కీలకం. రంజీల్లో రాణించిన వైశాక్ విజయ్ కూడా ఉన్నాడు. జట్టు స్పిన్ విభాగం బలహీనంగా ఉంది. కరణ్ శర్మలో మునుపటి పదును లేదు. జట్టులో ఇతర దేశవాళీ ఆటగాళ్లు ఎవరూ ఎక్కువ ప్రభావం చూపించగల సమర్థులు కాదు. ఓవరాల్‌గా చూస్తే బ్యాటింగ్ బలగంతోనే బెంగళూరు మ్యాచ్‌లు గెలవాల్సి ఉంది.

జట్టు వివరాలు ఆర్‌సీబీ: డుప్లెసిస్ (కెప్టెన్), విల్ జాక్స్, మ్యాక్స్‌వెల్, గ్రీన్, జోసెఫ్, టాప్లీ, టామ్ కరన్, ఫెర్గూసన్ (విదేశీ ఆటగాళ్లు); పటిదార్, కోహ్లి, రావత్, కార్తీక్, సుయశ్, సౌరవ్ చౌహాన్, లోమ్రో ర్, కరణ్ శర్మ, స్వప్నిల్, మయాంక్ డాగర్, మనోజ్, ఆకాశ్‌దీప్, సిరాజ్, యశ్ దయాళ్, హిమాన్షు, రాజన్, వైశాక్ (భారత ఆటగాళ్లు).

మరో 2 రోజుల్లో ఐపీఎల్

పంజాబ్ 'కింగ్స్' అవుతుందా...

2014లో ఒకే ఒక్కసారి ఫైనల్ చేరిన పంజాబ్ తుది పోరులో 199 పరుగులు చేసి కూడా మూడు బంతుల మిగిలి ఉండగానే కోల్‌కతాకు తలవంచింది. ఇతర జట్లతో పోలిస్తే చాలా కాలంగా పంజాబ్ ప్రదర్శన ఘోరంగా ఉంది. 2019–2022 వరకు వరుసగా నాలుగు సీజన్ల పాటు ఆరో స్థానంలో నిలిచిన జట్టు గత ఏడాది ఎనిమిదో స్థానంతో ముగించింది. అసలు 2014 తర్వాత ఇన్నేళ్లలో ఐదో స్థానంలో (2017)లో నిలవడమే ఆ జట్టు అత్యుత్తమ ప్రదర్శన

బలాబలాలు: ఎప్పటిలాగే అగ్రశ్రేణి భారత ఆటగాళ్లు లేకపోవడం జట్టు ప్రధాన బలహీనత. ఎప్పుడో భారత జట్టుకు దూరమైనా మరో ప్రత్యామ్నాయం లేక ఆటగాడిగా, కెప్టెన్‌గా కూడా శిఖర్ ధావన్‌కు అవకాశం దక్కుతోంది. అతను ఏమాత్రం సమర్థంగా జట్టును నడిపించగలడనేది సందేహమే. చూస్తే జట్టులో చాలా మంది ఆల్‌రౌండర్లు ఉన్నట్లు కనిపిస్తోంది కానీ వీరిలో ఎవరూ గతంలో తమ ఆల్‌రౌండ్ నైపుణ్యాన్ని ప్రదర్శించింది లేదు. బ్యాటింగ్‌లో జితేశ్ శర్మ, బెయిర్‌స్టో, లివింగ్‌స్టోన్‌ల పైనే భారం ఉంది. అర్ష్‌దీప్‌తో పాటు కొత్తగా ఈ జట్టులోకి వచ్చిన హర్షల్ పటేల్‌పై బౌలింగ్ భారం ఉండగా, రబడ రాణించడం కీలకం. వోక్స్, స్యామ్ కరన్ ఎంత ప్రభావం చూపిస్తారో చూడాలి.

జట్టు వివరాలు పంజాబ్: బెయిర్‌స్టో, లివింగ్‌స్టోన్, రోసో, వోక్స్, స్యామ్ కరన్, రజా, రబడ, ఎలిస్ (విదేశీ ఆటగాళ్లు); శిఖర్ ధావన్ (కెప్టెన్), జితేశ్, ప్రభ్‌సిమ్రన్, హర్‌ప్రీత్, శశాంక్, విశ్వనాథ్, అశుతోష్, తనయ్ త్యాగరాజన్, అథర్వ, రిషి ధావన్, శివమ్ (భారత ఆటగాళ్లు).

ఢిల్లీ... పంత్ ప్రతాపంపైనే...

సూపర్ ఫామ్‌తో అగ్రస్థానం సాధించి 2020లో ఫైనల్ చేరిన ఢిల్లీ క్యాపిటల్స్ పేలవ బ్యాటింగ్‌తో ముంబై చేతిలో ఓడింది. 2023లోనైతే మరీ పేలవంగా ఆడి 9వ స్థానానికి పరిమితమైంది. రిషభ్ పంత్ పునరాగమనమే ఇప్పుడు అన్నిటికంటే ఎక్కువ ఆసక్తి రేపుతోంది. అయితే తీవ్ర గాయం నుంచి కోలుకొని వస్తున్న అతను ఎలా ఆడతాడు, సారథిగా ఎలా నడిపిస్తాడనేది చర్చనీయాంశం.

బలాబలాలు: ఢిల్లీ బ్యాటింగ్ బలంగా ఉండటం సానుకూలాంశం. వార్నర్, పృథ్వీ షా, మిచెల్ మార్ష్ టాప్–3లో ఆడతారు. దక్షిణాఫ్రికా బ్యాటర్ స్టబ్స్ మెరుపు ఇన్నింగ్స్ ఆడగల సమర్థుడు. లోయర్ ఆర్డర్‌లో అక్షర్ పటేల్ ఆల్‌రౌండర్‌గా ప్రభావం చూపగలడు. కుల్దీప్ యాదవ్ వల్ల స్పిన్ బౌలింగ్‌లో కూడా పదును ఉంది. అయితే పేస్ బలహీనంగా కనిపిస్తోంది. నోర్జే, రిచర్డ్సన్ గాయాలతో బాధపడుతుండగా... జట్టు ఆధారపడుతున్న ఖలీల్, ముకేశ్‌ల ప్రదర్శన టి20ల్లో అంతంత మాత్రమే. బ్యాటింగ్‌లో భారీ స్కోర్లు సాధిస్తేనే గెలుపుపై నమ్మకం ఉంచుకోవచ్చు. పంత్‌కు ఫిట్‌నెస్ సమస్యలు వస్తే దూకుడైన కీపర్ కుమార్ కుషాగ్ర ఆడతాడు.

జట్టు వివరాలు ఢిల్లీ: వార్నర్, హోప్, స్టబ్స్, మార్ష్, నోర్జే, జేక్ ఫ్రేజర్, రిచర్డ్సన్ (విదేశీ ఆటగాళ్లు); పంత్ (కెప్టెన్), పృథ్వీ షా, యశ్ ధుల్, స్వస్తిక్, పొరేల్, రికీ భుయ్, కుశాగ్ర, అక్షర్, లలిత్, సుమీత్, ప్రవీణ్ దూబే, విక్కీ, కుల్దీప్, ఖలీల్, ఇషాంత్, ముకేశ్, రసిక్ (భారత ఆటగాళ్లు)

ప్రిక్వార్టర్స్‌లో శ్రీజ, స్నేహిత్



బీరుట్ (లెబనాన్): ప్రపంచ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) ఫీడర్ లెవెల్ టోర్నీలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ ప్లేయర్లు ఆకుల శ్రీజ, సూరావజ్జుల స్నేహిత్ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో శ్రీజ 11–4, 11–3, 11–8తో అష్తారి మషిద్ (ఇరాన్)పై గెలిచింది. డబుల్స్ తొలి రౌండ్‌లో శ్రీజ–దియా చిటాలె (భారత్) జోడీ 12–10, 11–7, 14–12తో నథాలీ మర్చెటి–లిలూ మసార్ట్ (బెల్జియం) జంటను ఓడించింది. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో స్నేహిత్ 10–12, 11–5, 12–10, 11–3తో ఖాలిద్ ఖాదర్ (జోర్డాన్)పై, తొలి రౌండ్‌లో 11–6, 11–8, 11–6తో బాసిల్ హర్బ్ (లెబనాన్)పై గెలుపొందాడు.

బిలియర్డ్స్ 'హాల్ ఆఫ్ ఫేమ్'లో పంకజ్ అద్వానీ




న్యూఢిల్లీ: భారత క్యూ స్పోర్ట్స్ (స్నూకర్, బిలియర్డ్స్) దిగ్గజం పంకజ్ అద్వానీ తన విజయవంతమైన కెరీర్‌లో మరో మైలురాయిని సొంతం చేసుకున్నాడు. ప్రపంచ బిలియర్డ్స్‌లో విశిష్ట క్రీడాకారుల జాబితాలో చోటు దక్కించుకున్నాడు. బిలియర్డ్స్ 'హాల్ ఆఫ్ ఫేమ్'లో పంకజ్‌కు స్థానం కల్పించారు. చైనాలోని షాంగ్రావొ నగరంలోని ప్రపంచ బిలియర్డ్స్ మ్యూజియంలో హాల్ ఆఫ్ ఫేమ్ జాబితాను పొందుపరిచారు. ప్రపంచ విశిష్ట క్రీడాకారుల సరసన తన పేరు ఉండటం చాలా సంతోషంగా ఉందని పంకజ్ చెప్పాడు. 'అరుదైన గౌరవానికి అర్హుడినైనందుకు ఆనందంగా ఉంది. సుదీర్ఘమైన కెరీర్‌లో అభిమానులు, శ్రేయోభిలాషుల మద్దతు వల్లే అత్యున్నత శిఖరాలను అధిరోహించాను' అని అద్వానీ అన్నాడు. గత నవంబర్లో 38 ఏళ్ల వయసులోనూ భారత విఖ్యాత ఆటగాడు అంతర్జాతీయ బిలియర్డ్స్, స్నూకర్ సమాఖ్య (ఐబీఎస్ఎఫ్) ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఓవరాల్‌గా 26వ టైటిల్‌ను గెలుపొందాడు. ఇందులో పాయింట్ల ఫార్మాట్, లాంగ్ ఫార్మాట్, ప్రపంచ టీమ్ చాంపియన్‌షిప్ విభాగాల్లో టైటిళ్లున్నాయి.

సినిమా

రైటింగ్ పూర్తి చేశాం

- రాజమౌళి



● రాజమౌళి

మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో అంతర్జాతీయ స్థాయిలో ఓ సినిమా('ఎస్ఎస్ఎమ్‌బీ 29' వర్కింగ్ టైటిల్) తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. కేఎల్ నారాయణ ఈ సినిమా నిర్మాత. కాగా 'రౌద్రం.. రణం.. రుధిరం'(ఆర్ఆర్ఆర్) స్క్రీనింగ్‌లో భాగంగా రాజమౌళి జపాన్ వెళ్లారు. అక్కడ మహేశ్‌బాబుతో తాను చేయనున్న మూవీ గురించి మాట్లాడారు రాజమౌళి. ''ఎస్ఎస్ఎమ్‌బీ 29' మూవీకి సంబంధించిన రైటింగ్ పూర్తి చేశాం. ప్రీ విజువలైజేషన్ చేస్తూ, ప్రీ ప్రొడక్షన్ ప్రాసెస్‌లో ఉన్నాం. నటీనటుల పరంగా ఇప్పటివరకు మహేశ్‌బాబు ఒక్కరే ఖరారయ్యారు. మీలో (జపాన్ ప్రేక్షకులను ఉద్దేశిస్తూ..) చాలా మందికి మహేశ్ తెలుసు.. హ్యాండ్‌సమ్‌గా ఉంటాడు. త్వరగా ఈ సినిమాను పూర్తి చేస్తామనే అనుకుంటున్నాం. 'ఎస్ఎస్ఎమ్‌బీ 29' విడుదల సమయంలో మహేశ్‌బాబును నేను ఇక్కడికి (జపాన్) తీసుకుని వస్తాను. మరింత మందికి పరిచయం చేస్తాను'' అన్నారు రాజమౌళి. విజయేంద్ర ప్రసాద్ కథ అందించిన ఈ సినిమాకు ఎమ్ఎమ్ కీరవాణి సంగీతం అందిస్తున్నారు. వేసవి తర్వాత ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిసింది. ఈ సంగతి ఇలా ఉంచితే... ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా డీవీవీ దానయ్య నిర్మించిన 'ఆర్ఆర్ఆర్' చిత్రం 2022 మార్చి 25న విడుదలైన సంగతి తెలిసిందే. ఆ తర్వాత 21 అక్టోబరు 2022న 'ఆర్ఆర్ఆర్' సినిమాను జపాన్‌లో విడుదల చేసిన విషయం గుర్తుండే ఉంటుంది.

యాగంటి క్షేత్రంలో పుష్ప 2



● అల్లు అర్జున్, రష్మిక

ఆంధ్రప్రదేశ్ లోని నంద్యాల జిల్లా బనగానపల్లె మండలంలోని యాగంటి క్షేత్రంలో 'పుష్ప: ది రూల్' సినిమా షూటింగ్ సందడి నెలకొంది. అల్లు అర్జున్, రష్మిక మందన్నా జంటగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతోన్న తాజా చిత్రం 'పుష్ప: ది రూల్'. 2021లో విడుదలై పాన్ ఇండియా స్థాయిలో బ్లాక్ బస్టర్‌గా నిలిచిన 'పుష్ప: ది రైజ్' మూవీకి సీక్వెల్‌గా 'పుష్ప: ది రూల్' రూపొందుతోంది. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ మూవీ చిత్రీకరణ యాగంటి క్షేత్రంలో జరుగుతోంది. యాగంటి క్షేత్రంలోని గుహలో కొలువైన శ్రీ వెంకటేశ్వరస్వామికి హీరోయిన్ రష్మిక మందన్నా బంగారు కిరీటాన్ని బహూకరించే సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారు సుకుమార్. నేడు కూడా ఈ క్షేత్రంలోనే షూటింగ్ జరుగుతుంది. 'పుష్ప: ది రూల్' షూటింగ్‌తో ఆ ప్రాంతమంతా ప్రజలతో సందడిగా మారింది.

పదిభాషల్లో కంగువ



● సూర్య

సూర్య హీరోగా నటించిన పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'కంగువ'. దిశాపటానీ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో బాబీ డియోల్, యోగిబాబు ప్రధాన పాత్రలు పోషించారు. స్టూడియో గ్రీన్, యువీ క్రియేషన్స్‌పై కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మించిన 'కంగువ' టీజర్‌ను మంగళవారం విడుదల చేశారు. ''కంగువ' సినిమా, మేకోవర్ కోసం సూర్య చాలా కష్టపడ్డారు. పది భాషల్లో తెరకెక్కిన 'కంగువ' త్రీడీలోనూ ప్రేక్షకుల ముందుకు వస్తుంది. పలు అంతర్జాతీయ భాషల్లో కూడా రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. కంగువ పాత్రలో సూర్య కనిపించనున్న ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించగా, నేహా జ్ఞానవేల్ రాజా సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ సంగతి ఇలా ఉంచితే...'సూరారైపోట్రు' (తెలుగులో 'ఆకాశం నీ హద్దురా) సినిమా తర్వాత హీరో సూర్య, దర్శకురాలు సుధా కొంగర కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. కాగా ఈ సినిమా చిత్రీకరణ కాస్త ఆలస్యంగా ప్రారంభం కానున్నట్లు సూర్య ఓ నోట్ విడుదల చేశారు.

హనీ–బన్నీ



● సమంత

వరుణ్‌ధావన్, సమంత లీడ్ రోల్స్‌లో నటించిన స్పై యాక్షన్ థ్రిల్లర్ వెబ్‌సిరీస్‌కు 'సిటాడెల్: హనీ–బన్నీ' అనే టైటిల్‌ను అధికారికంగా ఖరారు చేశారు. 'ది ఫ్యామిలీమేన్' వెబ్‌సిరీస్ ఫేమ్ రాజ్ అండ్ డీకే దర్శకత్వం వహించిన ఈ వెబ్ సిరీస్ అమేజాన్ ప్రైమ్ ఓటీటీలో త్వరలో స్ట్రీమింగ్ కానుంది. హాలీవుడ్ వెబ్‌సిరీస్ 'సిటాడెల్' ఇండియన్ వెర్షన్‌గా 'సిటాడెల్: హనీ–బన్నీ' రూపొందింది. మాతృకలో రిచర్డ్ మ్యాడేన్, ప్రియాంకా చోప్రా లీడ్ రోల్స్‌లో నటించారు.

ప్రతీకారం!



● అనుష్క

హీరోయిన్ అనుష్కా శెట్టి, దర్శకుడు క్రిష్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న తాజా సినిమాకు 'ఘాటి' అనే టైటిల్ ఖరారైంది. యువీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్మెంట్స్ ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. చిత్రీకరణ ఇప్పటికే మొదలైంది. వ్యాపార రంగంలో అంచలంచలుగా ఎదుగుతున్న ఓ మహిళను కొందరు కావాలని ఎలా నష్టపరిచారు? ఆ తర్వాత ఆమె ఏ విధంగా వారిపై ప్రతీకారం తీర్చుకుంది? అనే కోణంలో 'ఘాటి' సినిమా కథనం ఉంటుందనే టాక్ ఫిల్మ్‌నగర్‌లో వినిపిస్తోంది.

డబుల్ ధమాకా



● 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' ఫస్ట్‌లుక్

మలయాళ స్టార్ హీరోల్లో ఒకరైన ఫహాద్ ఫాజిల్ రెండు తెలుగు చిత్రాలకు పచ్చజెండా ఊపారు. వాటిలో ఒకటి 'ఆక్సిజన్' కాగా మరొకటి 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్'. అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వం వహించిన 'పుష్ప: ది రైజ్' సినిమాలో ఎస్పీ భన్వర్ సింగ్ షెకావత్ పాత్ర ద్వారా ఫహాద్ తెలుగు ప్రేక్షకులకు సుపరిచితుడే. ప్రస్తుతం 'పుష్ప: ది రూల్' లో నటిస్తున్న ఆయన హీరోగా రెండు తెలుగు చిత్రాల ప్రకటన వచ్చింది. మలయాళ హిట్ మూవీ 'ప్రేమలు' చిత్రాన్ని తెలుగులో రిలీజ్ చేసి, హిట్ కొట్టిన కార్తికేయ (డైరెక్టర్ రాజమౌళి తనయుడు) 'ఆక్సిజన్', 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' సినిమాలతో నిర్మాణ రంగంలోకి అడుగుపెడుతున్నారు. ఆర్కా మీడియా వర్క్స్‌పై 'బాహుబలి' వంటి సెన్సేషనల్ చిత్రాన్ని నిర్మించిన నిర్మాత శోభు యార్లగడ్డతో కలిసి ఈ సినిమాలను నిర్మించనున్నట్లు కార్తికేయ ప్రకటించారు. 'ఆక్సిజన్' చిత్రంతో సిద్ధార్థ్ నాదెళ్ల, 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' మూవీతో శశాంక్ ఏలేటి దర్శకులుగా పరిచయమవుతున్నారు. ఈ రెండు సినిమాలకు ఎస్ఎస్ రాజమౌళి సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు.

డీజే టిల్లుని మించేలా టిల్లు స్క్వేర్ తీశాం

- సిద్ధు జొన్నలగడ్డ



● అనుపమ, సిద్ధు

''డీజే టిల్లు' సినిమాపై ప్రేక్షకుల్లో పెద్దగా అంచనాలు లేవు.. అందుకే ఎలాంటి ఒత్తిడి లేకుండా పనిచేశాం. ఆ మూవీ బ్లాక్‌బస్టర్ కావడంతో 'టిల్లు స్క్వేర్' మూవీపై ప్రేక్షకుల్లో అంచనాలుఉన్నాయి. అందుకే చాలా జాగ్రత్తగా 'డీజే టిల్లు'ని మించేలా 'టిల్లు స్క్వేర్' తీశాం'' అని హీరో సిద్ధు జొన్నలగడ్డ అన్నారు. మల్లిక్ రామ్ దర్శకత్వంలో సిద్ధు జొన్నలగడ్డ, అనుపమా పరమేశ్వరన్ నటించిన చిత్రం 'టిల్లు స్క్వేర్'. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 29న విడుదలవుతోంది. తాజాగా ఈ చిత్రం నుంచి 'ఓ మై లిల్లీ..' అనే పాటని అభిమానుల సమక్షంలో విడుదల చేశారు. అచ్చు రాజమణి స్వరపరచిన 'ఓ మై లిల్లీ..' పాటకి సిద్ధు, రవి ఆంటోనీ సాహిత్యం అందించగా, శ్రీరామ్ చంద్ర పాడారు. ''నేను మొదటిసారి 'టిల్లు స్క్వేర్' వేడుకలో పాల్గొన్నాను. మీ ప్రేమ(ఫ్యాన్స్) మాపై ఎప్పుడూ ఇలాగే ఉండాలి'' అన్నారు అనుపమా పరమేశ్వరన్. ''టిల్లు స్క్వేర్' యువతతో పాటు కుటుంబ ప్రేక్షకులను మెప్పించేలా ఉంటుంది'' అన్నారు సూర్యదేవర నాగవంశీ.

ఎమోషనల్ థ్రిల్లర్



● 'సత్యం' రాజేశ్

'సత్యం' రాజేష్ హీరోగా, మేఘా చౌదరి, చందన పయావుల, భరత్ కాంత్ కీలక పాత్రల్లో నటించిన ఫ్యామిలీ ఎమోషనల్ థ్రిల్లర్ 'టెనెంట్'. వై. యుగంధర్ దర్శకత్వంలో మోగుళ్ల చంద్రశేఖర్‌రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ మూడోవారంలో రిలీజ్‌కు సిద్ధం అవుతోంది. ''ప్రస్తుత సమకాలీన పరిస్థితుల్లో మహిళలు ఎంత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందో తెలియజేసేలా మా సినిమా కథనం ఉంటుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

ఇన్ని పాత్రలు నేనే చేశానా అనిపించింది

- లక్ష్మీ మంచు



● లక్ష్మీ మంచు, సంజీవ్, ఎస్తేర్

''ఆదిపర్వం' మూవీ పోస్టర్ చూస్తుంటే ఇన్ని పాత్రలు నేనే చేశానా? అనిపించింది. నవరసాలు, అన్ని రకాల భావోద్వేగాలు ఈ సినిమాలో ఉన్నాయి. తక్కువ సమయంలో మా దర్శకుడు సంజీవ్‌గారు ఈ చిత్రాన్ని అద్భుతంగా తీశారు. మా నిర్మాతలు కోరుకున్న దానికంటే ఈ చిత్రం ఎక్కువ విజయం సాధించాలి'' అని లక్ష్మీ మంచు అన్నారు. సంజీవ్ మేగోటి దర్శకత్వంలో లక్ష్మీ మంచు లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'ఆదిపర్వం'. రావుల వెంకటేశ్వర్ రావు సమర్పణలో ఎమ్ఎస్‌కే నిర్మించారు. ఈ సినిమా తెలుగు ట్రైలర్‌ని తెలంగాణ ఎఫ్‌డీసీ చైర్మన్ ఎస్.గిరిధర్ విడుదల చేయగా, జడ్చర్ల ఎమ్మెల్యే జె.అనిరుధ్ రెడ్డి తమిళ ట్రైలర్, దర్శకుడు నీలకంఠ కన్నడ ట్రైలర్, రియల్టర్ శిల్పా ప్రతాప్ రెడ్డి మలయాళ ట్రైలర్, చిత్ర సమర్పకుడు రావుల వెంకటేశ్వర్ రావు హిందీ ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. ''ఆదిపర్వం' కి బలం లక్ష్మీ గారు. దాదాపు ఏడు పాత్రల్లో నటించారామె'' అన్నారు సంజీవ్ మేగోటి.

ఆర్టికల్ 21 నేపథ్యంలో...



● ఆకాశ్ పూరి, పార్వతీశం

సాయికుమార్, పార్వతీశం, ఐశ్వర్య, హారిక ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మెర్సి కిల్లింగ్'. సూరపల్లి వెంకటరమణ దర్శకుడు. వేదుల బాల కామేశ్వరి సమర్పణలో సిద్ధార్థ్ హరియల, మాధవి తాలబత్తుల నిర్మించారు. ఈ సినిమా ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్‌ను హీరో ఆకాష్ పూరి విడుదల చేసి, ''మంచి కథాంశంతో వస్తున్న 'మెర్సీ కిల్లింగ్' సినిమా తప్పకుండా విజయం సాధించాలి'' అన్నారు. ''భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ఆధారంగా తెరకెక్కిన చిత్రం 'మెర్సీ కిల్లింగ్'. స్వేచ్ఛ అనే ఓ అనాథ బాలిక తనకు జరిగిన అన్యాయంపై ఎలా పోరాటం చేసింది? అనేది ఈ మూవీలో ఆసక్తిగా ఉంటుంది'' అన్నారు సూరపల్లి వెంకటరమణ. ఈ చిత్రానికి కెమెరా: అమర్.జి, సంగీతం: ఎం.ఎల్.రాజ.

సాక్షి బిజినెస్
బుధవారం
20-03-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
736	238
72,012	21,817

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	16,162	△	59
డోజోన్స్	39,058	△	268
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,738	△	16
డాక్స్	17,987	△	55
షాంఘై	3,063	▽	22
నికాయ్	40,004	△	236

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (24 క్యారట్)	65,589	▽	23
బంగారం (22 క్యారట్)	58,646	▽	24
వెండి (కేజీ)	71,576	▽	312

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	81.19	84.48
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	103.88	108.12
€	యూరో	ఎస్‌బీఐ	88.12	91.90
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	47.00	64.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.07	56.58
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.13	64.88
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.12	22.74
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.65	23.43
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.28	12.29

8.3 శాతానికి బీఓఐ గృహ రుణ రేటు

- ఈ నెలాఖరు వరకూ ప్రత్యేక ఆఫర్
- 15 బేసిస్ పాయింట్ల తగ్గింపు



ముంబై: ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) గృహ రుణ రంగంలో తన వాటాను పెంచుకోడానికి కీలక నిర్ణయం తీసుకుంది. మార్చి 31వ తేదీ వరకూ స్వల్ప కాలానికి గృహ రుణ వడ్డీరేటు తగ్గింపు ఆఫర్ ప్రకటించింది. ప్రస్తుతం 8.45 శాతం ఉన్న రుణ రేటును 15 బేసిస్ పాయింట్లు (100 బేసిస్ పాయింట్లు ఒక శాతం) తగ్గించింది. దీనితో ఈ రేటు 8.30 శాతానికి తగ్గింది. దీనితోపాటు ప్రాసెసింగ్ ఫీజులను ఈ నెలాఖరు వరకూ కూడా పూర్తిగా రద్దు చేస్తున్నట్లు బ్యాంక్ ప్రకటన ఒకటి తెలిపింది. మిగిలిన బ్యాంకుల రుణ రేటుతో పోల్చితే తాజా 8.3 శాతం రేటు అత్యంత తక్కువ స్థాయని కూడా బీఓఐ వెల్లడించింది. 8.3 శాతం వద్ద 30 సంవత్సరాల కాల వ్యవధి హోమ్ లోన్‌కు లక్షకు నెలకు రూ. 755 ప్రారంభ ఈఎంఐ ఉంటుందని పేర్కొంది.

జొమాటో 'ప్యూర్ వెజ్'



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: శాకాహారులను దృష్టిలో పెట్టుకుని ఫుడ్ డెలివరీ యాప్ జోమాటో తాజాగా ప్యూర్ వెజ్ మోడ్, ప్యూర్ వెజ్ ఫ్లీట్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. శాకాహారాన్ని మాత్రమే అందించే రెస్టారెంట్లను ప్యూర్ వెజ్ మోడ్ కింద లిస్ట్ చేస్తారు. ఇటువంటి రెస్టారెంట్ల నుంచి మాత్రమే శాకాహార కస్టమర్లకు ఫుడ్ చేరవేసేందుకు ప్రత్యేకంగా డెలివరీ ఎగ్జిక్యూటివ్స్ ఉంటారు. అలాగే ఆకుపచ్చ రంగులో ప్రత్యేక బాక్స్‌లో ఆహారాన్ని సరఫరా చేస్తారు. ఈ బాక్సుల్లో నాన్‌వెజ్ ఫుడ్‌ను ఎట్టిపరిస్థితుల్లోనూ ఉంచరు. ప్యూర్ వెజ్ ఫ్లీట్ మాంసాహార హోటళ్లలో అడుగుపెట్టరు.

ప్రత్యక్ష పన్ను వసూళ్లలో 20 శాతం వృద్ధి

న్యూఢిల్లీ: నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు మార్చి 17వ తేదీ నాటికి 20% పెరిగి రూ.18.90 లక్షల కోట్లకు చేరాయి. ఇందులో కార్పొరేట్ పన్ను పరిమాణం రూ.9.14 లక్షల కోట్లు. వ్యక్తిగత ఆదాయ పన్ను రూ.9,72,224 కోట్లు. రిఫండ్స్ రూ.3.37 లక్షల కోట్లతో కలిపితే స్థూల ప్రత్యక్ష పన్ను వసూళ్ల మొత్తం రూ.22.27 లక్షల కోట్లని ప్రత్యక్ష పన్నుల కేంద్ర బోర్డ్ ఒక ప్రకటనలో పేర్కొంది.

ఆర్ఈసీ డివిడెండ్ రూ. 4.5

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థ ఆర్ఈసీ బోర్డు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మూడో మధ్యంతర డివిడెండ్‌నకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో రూ. 10 ముఖ విలువగల ఒక్కో షేరుకి రూ. 4.5 చొప్పున చెల్లించనుంది. వాటాదారులకు కంపెనీ ఇప్పటికే రెండు విడతల్లో రూ. 6.5 డివిడెండ్ చెల్లించింది. తాజా డివిడెండ్ చెల్లింపునకు ఈ నెల 28 రికార్డ్ డేట్‌గా కంపెనీ ప్రకటించింది. వెరసి ఏప్రిల్ 17కల్లా వాటాదారులకు డివిడెండ్‌ను చెల్లించనుంది.

కార్ల కంపెనీల పల్లె'టూర్'



- చిన్న పట్టణాలకు ఔట్‌లెట్లు
- కస్టమర్లకు మరింత చేరువ
- రూరల్ వాటా 33 శాతం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశవ్యాప్తంగా 2022–23లో 38,90,114 యూనిట్ల ప్యాసింజర్ వెహికల్స్ (పీవీ) రోడ్డెక్కాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 42 లక్షల యూనిట్లు అమ్ముడవుతాయని అంచనా. 2024–25లో ఈ విభాగం 3–5% వృద్ధి చెందుతుందని పరిశ్రమ భావిస్తోంది. అయితే మొత్తం ప్యాసింజర్ వాహనాల అమ్మకాల్లో గ్రామీణ ప్రాంతాలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. ప్రస్తుతం పీవీ సేల్స్‌లో గ్రామీణ ప్రాంతాల వాటా 33% గా ఉంది. మహమ్మారి కాలంలో పట్టణ ప్రాంతాల్లో పీవీ విక్రయాల్లో తిరోగమన వృద్ధి ఉన్నప్పటికీ.. గ్రామీణ ప్రాంతాలు దూసుకుపోవడం గమనార్హం. కలిసి వ చ్చే అంశం ఏమంటే రూరల్ ఏరియాల్లో రోడ్ నెట్ వర్క్ చాలా మెరుగైంది. వృద్ధి పరంగా పట్టణ ప్రాంతా లను కొన్నేళ్లుగా గ్రామీణ మార్కెట్లు వెనక్కి నెట్టాయి. ఈ అంశమే ఇప్పుడు తయారీ కంపెనీలకు రిటైల్ విషయంలో వ్యూహం మార్చుకోక తప్పడం లేదు.

వృద్ధిలోనూ రూరల్ మార్కెట్లే..

అమ్మకాల వృద్ధిరేటు 2023–24 ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ ప్రాంతాల్లో 11.7, పట్టణ ప్రాంతాల్లో 8% ఉండొచ్చని అంచనా. 2022–23లో గ్రామీణ భారతం 20 % దూసుకెళితే, పట్టణ మార్కెట్లు 16 శాతం వృద్ధి సాధించాయి. 2021–22లో అర్బన్ మార్కెట్లు 9% తిరోగమన వృద్ధి చెందితే, రూరల్ మార్కెట్లు 1.5% ఎగశాయి. 2018–19 నుంచి 2023–24 వరకు చూస్తే ఒక్క 2019–20లో మాత్రమే గ్రామీణ భారతం తిరోగమన వృద్ధి చెందింది. అర్బన్ మార్కెట్లు మాత్రం 2021–22 వరకు వరుసగా మూడు ఆర్థిక సంవత్సరాలు తిరోగమన బాట పట్టాయి.

విస్మరించలేని గ్రామీణం..

గ్రామీణ ప్రాంతాలు విస్మరించలేని మార్కెట్లుగా అభివృద్ధి చెందాయని మారుతీ సుజుకీ చెబుతోంది. ఈ సంస్థకు 2018–19లో గ్రామీణ ప్రాంతాల వాటా 38 శాతం. ఇప్పుడు ఇది 45 శాతానికి ఎగబాకింది. దేశవ్యాప్తంగా 6,50,000 గ్రామాలు ఉన్నాయని, ఇందులో 4,10,000 గ్రామాల్లో కనీసం ఒక్క మారుతీ సుజుకీ కారైనా పరుగు తీస్తోందని కంపెనీ ధీమాగా చెబుతోంది. మిగిలిన గ్రామాలు వ్యాపార అవకాశాలు ఉన్నవేనని కంపెనీ అంటోంది. 2019–20తో పోలిస్తే టాటా మోటార్స్ గ్రామీణ ప్రాంతాల అమ్మకాలు అయిదు రెట్లు అధికం అయ్యాయి. మొత్తం విక్రయాల్లో రూరల్ వాటా ఇప్పుడు ఏకంగా 40 శాతానికి చేరిందని కంపెనీ వెల్లడించింది. వినియోగదార్లకు చేరువ అయ్యేందుకు సేల్స్, సర్వీస్ వర్క్‌షాప్స్‌ను విస్తరించినట్టు తెలిపింది. పట్టణాలకు సమీపంలో 800 ఔట్‌లెట్లు నెలకొన్నాయని, ప్రత్యేకంగా ఇవి గ్రామీణ కస్టమర్లకు సేవలు అందిస్తున్నాయని వివరించింది. దేశవ్యాప్తంగా 135 అనుభవ్ వ్యాన్స్ (మొబైల్ షోరూమ్స్) పరిచయం చేశామని తెలిపింది.

గ్రామాల్లో చిన్న కార్లు..

హ్యాచ్‌బ్యాక్స్‌కు గ్రామీణ మార్కెట్లలో విపరీత డిమాండ్ ఉంది. తొలిసారిగా కారు కొనే కస్టమర్లు ఇక్కడ అత్యధికం కూడా. ఎంట్రీ లెవెల్, మిడ్ లెవెల్ హ్యాచ్‌బ్యాక్ విక్రయాల్లో రూరల్ ఏరియాల వాటాయే అధికం. ప్రీమియం హ్యాచ్‌బ్యాక్స్ అధికంగా అర్బన్ ప్రాంతాల్లో రోడ్డెక్కుతున్నాయి. సెడాన్స్ విషయంలో ఇరు మార్కెట్లు చెరి సగం పంచుకున్నాయి. ఎస్‌యూవీల్లో అయితే అర్బన్‌దే హవా. ఇక గ్రామీణ మార్కెట్లకు విక్రయశాలలు, సర్వీసింగ్ కేంద్రాలను విస్తరించే విషయంలో కంపెనీలు డీలర్ పార్ట్‌నర్స్‌ను ప్రోత్సహిస్తున్నాయి. మానవ వనరుల సంఖ్య పెంచేందుకు సాయం చేస్తున్నాయి. టెస్ట్ డ్రైవ్ కోసం వాహనాలను సమకూరుస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ నెట్‌వర్క్ మెరుగుపడింది. దీంతో వినియోగదార్లకు చేరువ కావడంలో భాగంగా సేల్స్ నెట్‌వర్క్ పెంచేందుకు కసరత్తు చేస్తున్నట్టు మహీంద్రా తెలిపింది. రూరల్ మార్కెట్లలోనూ తమ ఎస్‌యూవీలకు డిమాండ్ కొనసాగుతోందని వెల్లడించింది. ప్రజలను ప్రభావితం చేసే సర్పంచ్‌ల వంటి ముఖ్యులతో కలిసి కంపెనీలు విభిన్న కార్యక్రమాలు చేస్తున్నాయి.

తెలుగు రాష్ట్రాల్లోకి మహీంద్రా ఓజా ట్రాక్టర్లు ఎంట్రీ



హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల రైతుల కోసం మహీంద్రా ట్రాక్టర్స్ తన ఓజా 3140 మోడల్ ట్రాక్టర్లను ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో ప్రవేశపెట్టింది. ఖరీఫ్ సీజన్‌లో విడుదలైన ఈ తేలికపాటి ట్రాక్టర్లు దుక్కి దున్నే కార్యక్రమాలతో రైతులకు అనేక ప్రయోజనాలు చేకూర్చింది. దీంతో రానున్న రబీ సీజన్‌లో వీటికి డిమాండ్ పెరుగుతుందని కంపెనీ ఆశిస్తోంది. అత్యాధునిక సాంకేతిక కలిగిన ఈ ట్రాక్టర్ల ధర రూ.7.35 లక్షలుగా ఉంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

20-2-2024	
విశాఖ	430–00
చిత్తూరు	478–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	425–00
విజయవాడ	425–00
19-3-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	415–00
వరంగల్	417–00

22,000 దిగువకు నిఫ్టీ

- నెల కనిష్టానికి సూచీలు
- ప్రపంచ ప్రతికూలతల ప్రభావం

ముంబై: బ్యాంక్ ఆఫ్ జపాన్ కీలక వడ్డీ రేట్లను 17 ఏళ్ల తర్వాత పెంచడంతో ద్రవ్యోల్బణ భయాలు భారత్ ఈక్విటీ మార్కెట్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఫెడరల్ రిజర్వ్ ద్రవ్య పాలసీ నిర్ణయాల వెల్లడి(నేడు)కి ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించారు. బ్రెండ్ క్రూడాయిల్ బ్యారెల్ ఫ్యూచర్స్ ధర అయిదు నెలల గరిష్టం 85 డాలర్లపైకి ఎగిసింది. జపాన్ వడ్డీ రేట్ల పెంపుతో డాలర్ ఇండెక్స్ బలపడింది. ఈ పరిణామాలతో మంగళవారం సెన్సెక్స్ 736 పాయింట్లు నష్టపోయి 72,012 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 238 పాయింట్లు పతనమై 22,000 స్థాయిని కోల్పోయి 21,817 వద్ద నిలిచింది. ముగింపు స్థాయిలు ఇరు సూచీలకు నెల కనిష్టం. ఆసియా మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు అందుకున్న దేశీయ మార్కెట్ ఉదయం బలహీనంగా మొదలైంది. అన్ని రంగాల షేర్లూ అమ్మకాల ఒత్తిడికి లోనడంతో సూచీలు ట్రేడింగ్ ఆద్యంతం నష్టాల్లోనే ట్రేడయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 815 పా యింట్లు క్షీణించి 72,000 స్థాయి దిగువన 71,933 వద్ద, నిఫ్టీ 263 పాయింట్లు నష్టపోయి 21,793 వద్ద ఇంట్రాడే కనిష్టాలను చూశాయి. చిన్న, మధ్య తరహా షేర్లలో విక్రయాలు కొనసాగాయి.



జపాన్ ఎకానమీకి జోష్!

ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ జపాన్ పురోగమన బాటన పడుతున్నట్లు కనిపిస్తోంది. 17 సంవత్సరాల నెగటివ్ రుణ రేటు వ్యవస్థకు 4.2 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ ముగింపు పలికింది. బ్యాంకులకు బ్యాంక్ ఆఫ్ జపాన్ ఇచ్చే ఓవర్‌నైట్ రుణ రేటు మైనస్ 0.1 శాతం నుంచి ప్లస్ 0–0.1 శాతం శ్రేణికి పెరిగింది.

రూ. 4.86 లక్షల కోట్లు ఆవిరి

సెన్సెక్స్ ఒక శాతానికి పైగా నష్టపోవడంతో బీఎస్ఈలో రూ.4.86 లక్షల కోట్లు ఆవిరయ్యాయి. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈలోని లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.373 లక్షల కోట్లకు దిగివచ్చింది. ఈ సూచీలో 30 షేర్లకు గానూ ఏడు మాత్రమే లాభపడ్డాయి.



టీసీఎస్ నిరాశ..

టీసీఎస్ షేరు రెండేళ్లలో అతిపెద్ద పతనాన్ని చవిచూసింది. ప్రమోటర్ సంస్థ టాటా సన్స్ బ్లాక్ డీల్ ద్వారా 2.3 కోట్ల ఈక్విటీ షేర్ల విక్రయంతో ఈ షేరు అమ్మకాల ఒత్తిడికి లోనైంది. ట్రేడింగ్‌లో నాలుగున్నర శాతం క్షీణించి రూ. 3,967 వద్ద రెండేళ్ల కనిష్టాన్ని తాకింది. చివరికి 4% నష్టంతో రూ.3,978 వద్ద ముగిసింది.

పాపులర్ వెహికల్స్ పేలవం

పాపులర్ వెహికల్స్ అండ్ సర్వీసెస్ లిస్టింగ్ మెప్పించలేకపోయింది. ఇష్యూ ధర(రూ.295)తో పోలిస్తే బీఎస్ఈలో 1% డిస్కౌంట్‌తో రూ.292 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 11% క్షీణించి రూ.263 వద్ద కనిష్టాన్ని తాకింది. చివరికి 6% నష్టంతో రూ.276 వద్ద ముగిసింది. మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.1,967 కోట్లుగా నమోదైంది.

జాబ్ పాయింట్

నవోదయ విద్యాలయ సమితిలో 1377 నాన్‌టీచింగ్ పోస్టులు

నోయిడాలోని నవోదయ విద్యాలయ సమితి(ఎన్‌వీఎస్)దేశవ్యాప్తంగా ఉన్న ఎన్‌వీఎస్‌లు, ఎన్‌ఎల్‌ఐలు, జవహర్ నవోదయ విద్యాలయాల్లో నాన్ టీచింగ్ స్టాఫ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 1377
- **పోస్టుల వివరాలు:** ఫిమేల్ స్టాఫ్ నర్స్–121, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్–05, ఆడిట్ అసిస్టెంట్–12, జూనియర్ ట్రాన్స్‌లేషన్ ఆఫీసర్–04, లీగల్ అసిస్టెంట్–01, స్టెనోగ్రాఫర్–23, కంప్యూటర్ ఆపరేటర్–02, క్యాటరింగ్ సూపర్‌వైజర్–78, జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్–381, ఎలక్ట్రీషియన్ కమ్ ప్లంబర్–128, ల్యాబ్ అటెండెంట్–161, మెస్ హెల్పర్–442, మల్టీ టాస్కింగ్ స్టాఫ్–19.
- **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, 12వతరగతి, సంబంధిత విభాగంలో డిప్లొమా, బ్యాచిలర్స్ డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ట్రేడ్/స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** అనంతపురం, కాకినాడ, నెల్లూరు, గుంటూరు, కర్నూలు, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, మహబూబ్‌నగర్, నిజామాబాద్,ఖమ్మం, కరీంనగర్.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://navodaya.gov.in/

సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్, హైదరాబాద్‌లో 96 పోస్టులు

హైదరాబాద్‌లోని సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్(ఎస్‌పీపీ).. వివిధ విభాగాల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 96
- **పోస్టుల వివరాలు:** సూపర్‌వైజర్(టీవో–ప్రింటింగ్)–02, సూపర్‌వైజర్ (టెక్-కంట్రోల్)–05, సూపర్‌వైజర్(ఓఎల్)–01, జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్–12, జూనియర్ టెక్నీషియన్(ప్రింటింగ్/కంట్రోల్)–68, జూనియర్ టెక్నీషియన్ (ఫిట్టర్)–03, జూనియర్ టెక్నీషియన్(వెల్డర్)–01, జూనియర్ టెక్నీషియన్ (ఎలక్ట్రానిక్స్/ఇన్‌స్ట్రుమెంటేషన్)–03, ఫైర్‌మ్యాన్–01.
- **విభాగాలు:** ప్రింటింగ్/కంట్రోల్, ఇంజనీరింగ్, రిసోర్స్ మేనేజ్‌మెంట్.
- **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, బీఈ/బీటెక్, బీఎస్సీ, మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** సూపర్‌వైజర్/సూపర్‌వైజర్ (టెక్నికల్ కంట్రోల్) పోస్టులకు 18 నుంచి 30 ఏళ్లు, జూనియర్ టెక్నీషియన్(ప్రింటింగ్/కంట్రోల్)/జూనియర్ టెక్నీషియన్ (ఫిట్టర్)/జూనియర్ టెక్నీషియన్(వెల్డర్)/జూనియర్ టెక్నీషియన్ (ఎలక్ట్రానిక్స్ /ఇన్‌స్ట్రుమెంటేషన్)పోస్టులకు 18 నుంచి 25 ఏళ్లు, జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్ పోస్టులకు 18 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **పరీక్ష:** ఆన్‌లైన్ విధానంలో పరీక్ష జరుగుతుంది. మొత్తం 150 మార్కులకు ప్రశ్నాపత్రం ఉంటుంది. తప్పు సమాధానానికి నెగిటివ్ మార్కింగ్ ఉంటుంది.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**15.04.2024
- **పరీక్ష తేది:** మే/జూన్–2024.
- **వెబ్‌సైట్:** https://spphyderabad.spmcil.com/en

కోల్ ఇండియా లిమిటెడ్, కోల్‌కతాలో 72 పోస్టులు

కోల్‌కతాలోని కోల్ ఇండియా లిమిటెడ్ వివిధ విభాగాల్లో మెడికల్ స్పెషలిస్ట్ (ఈ4) /మెడికల్ స్పెషలిస్ట్(ఈ3), సీనియర్ మెడికల్ ఆఫీసర్(ఈ3) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 72
- **స్పెషాలిటీ:** సర్జరీ, జనరల్ ఫిజిషియన్/మెడిసిన్, జి–ఒ, అనెస్థీషియా, ఆర్థోపెడిక్స్, పీడియాట్రిక్స్, సైకియాట్రీ, పాథాలజీ, డెర్మటాలజీ, పల్మనాలజీ/చెస్ట్ స్పెషాలిటీ, ఆఫ్తాల్మాలజీ, రేడియాలజీ, ఈఎన్‌టీ.
- **అర్హత:** ఎంబీబీఎస్, సంబంధిత విభాగంలో మెడికల్ పీజీ/డీఎన్‌బీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** సీనియర్ మెడికల్ స్పెషలిస్ట్(ఈ4) పోస్టులకు 42 ఏళ్లు, సీనియర్ మెడికల్ ఆఫీసర్/మెడికల్ స్పెషలిస్ట్(ఈ3) గ్రేడ్ 35 ఏళ్లు మించకూడదు.
- **వేతనం:** నెలకు సీనియర్ మెడికల్ స్పెషలిస్ట్(ఈ4)కు రూ.70,000 నుంచి రూ.2,00,000, మెడికల్ స్పెషలిస్ట్(ఈ3)కు రూ.60,000 నుంచి రూ.1,80,000, సీనియర్ మెడికల్ ఆఫీసర్(ఈ3)కు రూ.60,000 నుంచి రూ.1,80,000.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జనరల్ మేనేజర్(పర్సనల్)/హెచ్‌వోడీ(ఈఈ), ఎగ్జిక్యూటివ్ ఎస్టాబ్లిష్‌మెంట్ డిపార్ట్‌మెంట్, రెండో అంతస్తు, కోల్ ఎస్టేట్, వెస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్, సివిల్ లైన్స్, నాగ్‌పూర్, మహారాష్ట్ర చిరునామకు పంపించాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 11.04.2024.
- **వెబ్‌సైట్:** www.coalindia.in/careercil/jobscoalindia

రైల్వేలో పోలీస్ కొలువులు

- రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్‌లో 4,660 ఎస్‌ఐ, కానిస్టేబుల్ పోస్టులు
- ఏప్రిల్ 15 నుంచి మొదలు కానున్న దరఖాస్తు ప్రక్రియ
- మూడు దశల ఎంపిక విధానం
- నిర్దిష్ట వ్యూహంతో విజయానికి అవకాశం

రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్.. సంక్షిప్తంగా ఆర్‌పీఎఫ్! భారతీయ రైల్వేలకు సంబంధించి.. రక్షణ, భద్రత వ్యవహారాలను పర్యవేక్షించే విభాగం! తాజాగా రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, రైల్వే ప్రొటెక్షన్ స్పెషల్ పోర్స్ విభాగాల్లో.. సబ్ ఇన్‌స్పెక్టర్(ఎస్‌ఐ), కానిస్టేబుల్ పోస్టల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది. వచ్చే నెల (ఏప్రిల్) 15 నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం కానుంది!! ఈ నేపథ్యంలో.. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్‌లో.. పోలీస్ ఉద్యోగాలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ తదితర వివరాలు..

కోవిడ్ కారణంగా గత మూడేళ్లుగా రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్‌లో నియామకాలు చేపట్టలేదు. ఈ నేపథ్యంలోనే ఈ ఏడాది భారీగా నియామకాలకు భారత రైల్వే శాఖ సిద్ధమవుతోంది. ఇందులో భాగంగానే నాలుగు వేలకుపైగా పోస్టల భర్తీకి సన్నాహకాలు చేపడుతోంది. అభ్యర్థులు పటిష్ట ప్రణాళికతో ప్రిపరేషన్ సాగిస్తే విజయావకాశాలు మెరుగుపరచుకోవచ్చు.

ఎస్‌ఐ, కానిస్టేబుల్.. 4,660 పోస్టులు

రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ తాజా నోటిఫికేషన్ ద్వారా సబ్ ఇన్‌స్పెక్టర్, కానిస్టేబుల్ హోదాలలో మొత్తం 4,660 పోస్టులకు నియామకం చేపట్టనుంది. వీటిలో ఎస్‌ఐ పోస్టులు 452, కానిస్టేబుల్ పోస్టులు 4,208 ఉన్నాయి.

అర్హతలు

- ఆర్‌పీఎఫ్ నియామకాలకు సంబంధించి డిగ్రీ, పదో తరగతి అర్హతతో పోటీ పడే అవకాశం ఉంది. ఎస్‌ఐ పోస్టులకు బ్యాచిలర్ డిగ్రీ, కానిస్టేబుల్ పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** జూలై 1, 2024 నాటికి 20–28 ఏళ్ల మధ్య ఉండాలి(రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు నిబంధనల మేరకు గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది)

వేతనం

ఎస్‌ఐ పోస్టులకు పే లెవల్–6తో (రూ.35,400 -రూ.1,12,400); కానిస్టేబుల్ పోస్టులకు పే లెవల్ -3తో(రూ.21,700-రూ.69,100) ప్రారంభ వేతనం లభిస్తుంది.



మూడు దశల ఎంపిక ప్రక్రియ

ఆర్‌పీఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్, కానిస్టేబుల్ పోస్టులకు మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. తొలి దశలో కంప్యూటర్ బేస్డ్ విధానంలో రాత పరీక్ష; రెండో దశలో ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, మూడో దశలో ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్‌లు ఉంటాయి. వీటన్నిటిలోనూ విజయం సాధిస్తే.. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేసి నియామకాలు ఖరారు చేస్తారు.

120 మార్కులకు రాత పరీక్ష

ఎంపిక ప్రక్రియలో తొలిదశ రాత పరీక్షను మూడు విభాగాల్లో 120 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో జనరల్ అవేర్‌నెస్ 50 ప్రశ్నలు–50 మార్కులకు, అర్థమెటిక్ 35 ప్రశ్నలు–35 మార్కులకు, జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ 35 ప్రశ్నలు–35 మార్కులకు ఉంటాయి. నెగిటివ్ మార్కింగ్ నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 1/3వ వంతు మార్కును తగ్గిస్తారు. పరీక్షకు లభించే సమయం 90 నిమిషాలు.

రెండో దశ పీఈటీ, పీఎంటీ

రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా ఒక్కో పోస్టుకు పది మందిని చొప్పున (1:10 నిష్పత్తిలో) ఎంపిక చేసి.. వారికి తదుపరి దశలో ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్‌లు నిర్వహిస్తారు.

ఉన్నత హోదాలు

ఆర్‌పీఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్, కానిస్టేబుల్‌గా ఎంపికైన వారు సర్వీసు నిబంధనలను అనుసరించి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకునే అవకాశం ఉంది. ఎస్‌ఐగా నియమితులైన వారు అసిస్టెంట్ సూపరింటెండెంట్ స్థాయికి చేరుకోవచ్చు. కానిస్టేబుల్‌గా ఎంపికైన వారు సబ్ ఇన్‌స్పెక్టర్/ఇన్‌స్పెక్టర్ స్థాయికి చేరుకునే వీలుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** 2024, ఏప్రిల్ 15 – మే 14
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://rpf.indianrailways.gov.in/RPF/, https://rrbsecunderabad.gov.in

రాత పరీక్షలో రాణించేలా

జనరల్ అవేర్‌నెస్

ఈ విభాగానికి సంబంధించి.. సమకాలీన అంశాలతోపాటు చరిత్ర, రాజ్యాంగం, ఎకానమీ, జాగ్రఫీ, సైన్స్ అండ్ టెక్నాలజీ, కరెంట్ అఫైర్స్ అంశాలపై పూర్తి అవగాహన పొందాలి. అదే విధంగా..భారత చరిత్రకు సంబంధించి ముఖ్యమైన ఘట్టాలు, చరిత్ర గతిని మార్చిన సంఘటనలు, భారత స్వాతంత్ర్య ఉద్యమంలోని ప్రధాన ఘట్టాలపై పట్టు సాధించాలి. జాగ్రఫీలో భారత, ఏపీ భౌగోళిక స్వరూపం, సహజ వనరులు, నదులు, సముద్రతీర ప్రాంతాలు, అడవులు, పంటలు, సాగు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఎకానమీలో కోర్ ఎకనామీ అంశాలతో పాటు సమకాలీన పరిణామాలు, దేశ ఆర్థిక రంగంలో అమలవుతున్న కొత్త విధానాలపై స్పష్టత ఏర్పరచుకోవాలి. పాలిటీకి సంబంధించి రాజ్యాంగం, రాజ్యాంగ రూపకర్తలు, రాజ్యాంగంలోని ముఖ్యమైన అధికరణలు, ప్రకరణలు వంటి వాటితో పాటు తాజా రాజ్యాంగ సవరణలు, వాటి ఉద్దేశం , ప్రభావం గురించి తెలుసుకోవాలి.

అర్థమెటిక్

అభ్యర్థులు అప్రమత్తంగా వ్యవహరించాల్సిన విభాగం.. అర్థమెటిక్ అండ్ టెస్ట్ ఆఫ్ రీజనింగ్. అర్థమెటిక్‌లోని సగటు, కసాగు, గసాభా, సంఖ్యలు, వర్గ మూలాలు, ఘన మూలాలు, నిష్పత్తులు, భాగస్వామ్యం, వయసు, శాతాలు, లాభ-నష్టాలు, చక్రవడ్డీ, సరళ వడ్డీ, కాలం–దూరం, కాలం–పని వంటి వాటిపై పట్టు సాధించాలి. అదే విధంగా మ్యాథమెటిక్స్‌లోని ప్రాథమిక అంశాలపైనా అవగాహన ఏర్పరచుకోవాలి. జామెట్రీ, ట్రిగ్నోమెట్రీ, మ్యాట్రిసెస్, సెట్స్–రిలేషన్స్‌ను ప్రత్యేకంగా ప్రాక్టీస్ చేయాలి.

జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్

విశ్లేషణాత్మక దృక్పథంతో మంచి మార్కులు సొంతం చేసుకునే అవకాశం ఉన్న విభాగం రీజనింగ్. ఇందులో నంబర్ సిరీస్, మిస్సింగ్ నెంబర్స్, కోడింగ్–డీకోడింగ్, సీటింగ్ అరేంజ్‌మెంట్, బ్లడ్ రిలేషన్స్ వంటి వాటిపై పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలి. వెన్ డయాగ్రమ్స్, అసెంప్షన్ అండ్ రీజన్, ఆర్గ్యుమెంట్, సిలాజిజమ్, డేటా సఫిషియన్సీ విభాగాల్లో పట్టుతో వెర్బల్ రీజనింగ్‌లో రాణించే అవకాశం ఉంది. దీంతోపాటు ఆడ్ మన్ ఔట్, డైస్ అండ్ క్యూబ్స్, వెన్ డయాగ్రమ్స్‌లపై అవగాహన పెంచుకోవాలి. ఫలితంగా నాన్ వెర్బల్ రీజనింగ్‌లో వీలైనన్ని ఎక్కువ ప్రశ్నలకు సమాధానం ఇచ్చే నైపుణ్యం లభిస్తుంది. మెంటల్ ఎబిలిటీ విభాగంలో రాణించేందుకు టాబ్యులేషన్, డేటా సమీకరణ, డేటా విశ్లేషణలపై అవగాహన పెంచుకోవాలి.

క్లిష్టత స్థాయిలో వ్యత్యాసం

ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ, కానిస్టేబుల్ రెండు పోస్టులకు సిలబస్ అంశాలు ఒకే విధంగా ఉన్నాయి. కాని పరీక్షలో ప్రశ్నల క్లిష్టత స్థాయిలో వ్యత్యాసం ఉంటుంది. ఎస్‌ఐ పోస్టల పరీక్షలో క్లిష్టత ఎక్కువ ఉన్న ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. కానిస్టేబుల్ పోస్టులకు మాత్రం పదో తరగతి స్థాయిలో ప్రశ్నలు అడిగే వీలుంది. దీనికి అనుగుణంగా అభ్యర్థులు ఆయా అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.

ఉచితంగా వెబ్ డిజైన్ కోర్సు

- 5వ తేదీ వరకు రిజిస్ట్రేషన్‌కు గడువు
- ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ వెల్లడి

సాక్షి, అమరావతి: విద్యార్థులకు మెరుగైన కెరీర్ అవకాశాల కోసం ఉచితంగా వెబ్ డిజైన్ కోర్సులను అందిస్తున్నట్టు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఐఐటీ మద్రాస్, ఐఐఎం అహ్మదాబాద్ ఇంక్యుబేట్ చేసిన హెచ్‌సీఎల్ గ్రూప్ ఎడ్‌టెక్ కంపెనీ 'గువి', ఏపీఎస్ఎస్‌డీసీ భాగస్వామ్యంతో స్కిల్-ఏ-థాన్ కోర్సులను ప్రారంభించినట్టు పేర్కొంది. ఆన్‌లైన్లో ఉచితంగా వెబ్ డిజైన్ కోర్సును తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో బోధించడంతో పాటు కోర్సు పూర్తి చేసిన వారికి గువి, ఏపీఎస్ఎస్‌డీసీ ఉమ్మడి సర్టిఫికెట్ అందిస్తున్నట్లు తెలిపింది. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఏప్రిల్ 5వ తేదీలోగా https://bit.ly/APSSDC-Team వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించింది. మరిన్ని వివరాలకు https:// skilluniverse. apssdc.in/ వెబ్‌సైట్‌తో పాటు 99888 53335 నంబర్‌ను అందుబాటులోకి ఉంచింది. ఈ కోర్సులు పూర్తి చేసిన కళాశాల విద్యార్థులకు అదనపు విద్యా క్రెడిట్లు కూడా వర్తిస్తాయంది.

లాభం ఆశించని సహాయమే సేవ

ఏఎన్‌యూ వీసీ ఆచార్య రాజశేఖర్



ఏఎన్‌యూ: లాభాపేక్ష లేకుండా ఎదుటివారికి సహాయం చేయడమే నిజమైన సేవ అని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ (ఏఎన్‌యూ) వైస్ చాన్సలర్ ఆచార్య పి.రాజశేఖర్ అన్నారు. ఏఎన్‌యూలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యాన 'స్పార్క్ అండ్ చేంజ్ హౌ ఎన్ఎస్ఎస్ యూటూ సర్వ్ అండ్ లీడ్' అనే అంశంపై మంగళవారం రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య పి.రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా వ్యక్తిత్వ వికాసం పెంపొందుతుందని చెప్పారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు అందరూ సమాజంలో మంచి మార్పునకు నాందిపలకాలని, తద్వారా దేశాభివృద్ధికి పాటుపడాలన్నారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఏఎన్‌యూను ప్లాస్టిక్ రహిత విశ్వవిద్యాలయంగా మార్చేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ పి.అశోక్‌రెడ్డి మాట్లాడుతూ సమాజంలోని రుగ్మతలను రూపుమాపడానికి విద్యార్థుల ద్వారా అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ఏఎన్‌యూ రెక్టార్ ఆచార్య పి.వరప్రసాద్‌మూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, సదస్సు కన్వీనర్, యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ రవిశంకర్‌రెడ్డి ప్రసంగించారు. యూనివర్సిటీ అధికారులు, ప్రొఫెసర్లు, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల నుంచి 200 మంది ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు, రేపు కోస్తాంధ్రలో వానలకు ఆస్కారం

రాయలసీమలో పెరగనున్న ఉష్ణోగ్రతలు

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో రానున్న రెండు రోజులు వర్షాలు కురవడానికి పరిస్థితులు అనుకూలంగా మారాయి. దక్షిణ తమిళనాడు నుంచి పశ్చిమ విదర్భ వరకు ఉన్న ద్రోణి సముద్రమట్టం నుంచి 1.5 కి.మీల ఎత్తు వరకు విస్తరించి ఉంది. ఇది దక్షిణ అంతర్గత కర్ణాటక నుంచి పశ్చిమ విదర్భ పరిసర ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం వరకు కొనసాగుతోంది. జార్ఖండ్ నుంచి ఒడిశా మీదుగా ఉత్తర కోస్తాంధ్ర వరకు ఉన్న ద్రోణి బలహీనపడింది. వీటి ప్రభావంతో బుధ, గురువారాల్లో ఉత్తర కోస్తాంధ్రలో కొన్నిచోట్ల, దక్షిణ కోస్తాంధ్రలో ఒకట్రెండు చోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) మంగళవారం తెలిపింది. బుధవారం అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలకు ఆస్కారం ఉందని పేర్కొంది. రాయలసీమ జిల్లాల్లో వేడి, ఉక్కపోతతో అసౌకర్య వాతావరణం ఉంటుందని తెలిపింది. ఉత్తర, దక్షిణ కోస్తాంధ్రల్లో రానున్న 2 రోజులు వర్షాలకు ఆస్కారం ఉంటుందని వెల్లడించింది. కొన్నిచోట్ల పిడుగులు పడే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.